ఈనాడు

కరీంనగర్ 18-8-2017 శుక్రవారం సిటీ సంపుటి 44 సంచిక 9

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Anantapur, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ఊరట..



టోలు గోస తీరింది

వాహనదారులు ఇకమీదట ప్రతీ టోల్ గేట్ వద్ద రుసుములు చెల్లించుకుంటూ వెళ్లాల్సిన పని లేదు. రుసుము చెల్లింపులో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించడానికి భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) రెండు యాప్‌లను ప్రారంభిస్తోంది. అక్టోబరు 1 నుంచి దేశంలోని 371 టోల్ ప్లాజాల వద్ద దీన్ని అమలు చేయనుంది. - 2లో

ఉగ్ర బీభత్సం

బార్సిలోనాలో పాదచారులపైకి **దూసుకొచ్చిన వ్యాను**





ఉగ్రదాడి ప్రాంతం నుంచి ప్రాణభయంతో పరుగులు పెడుతున్న ప్రజలు

గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స అందిస్తున్న సహాయక సిబ్బంది

13 మంది మృతి

50 మందికి పైగా గాయాలు

దాడికి పాల్పడిన వారిలో ఒకరు పోలీసు కాల్పుల్లో హతం

బార్సిలోనా: స్పెయిన్‌లోని బార్సిలోనా నగరంలో అత్యంత రద్దీగా ఉండే రహదారిలో పాదచారులపైకి వ్యానుతో దూసుకెళ్లిన ఘటనలో 13 మంది మరణించారు. గురువారం బార్సిలోనాలోని లస్ రంబ్లస్ రహదారిలో జరిగిన ఈ ఉదంతంలో 50 మందికిపైగా గాయపడ్డారు. ఈ దాడి తామే చేసినట్లు ఉగ్రవాద సంస్థ ఐఎస్ ప్రకటించింది. దాడికి పాల్పడినట్లుగా అనుమానిస్తున్న వారిలో ఒక వ్యక్తి పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లో (మిగతా 2లో)



గురువారం దిల్లీలో నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో జరిగిన 'ఛాంపియన్స్ ఆఫ్ ఛేంజ్' కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

సామాన్యుడి సమస్యలకు చెల్లుచీటీ

- వ్యవస్థీకృత అవినీతిని పెకిలిస్తా
- సాంకేతికత, నవకల్పనలతో పరిపాలనలో మార్పులు
- ప్రధాని నరేంద్ర మోదీ -11లో

వేదన..



రాబందుల్ని పెంచితే రూ.100 కోట్లు!

కళేబరాలను ఆరగించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడే రాబందులకు ఆపద ముంచుకొచ్చింది.. ఇవి అంతరించిపోయే దశకు చేరాయి. దీని వలన ప్రత్యక్షంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నది పార్సీలు. వీరు తమ కుటుంబంలో ఎవరైనా మరణిస్తే మృతదేహాన్ని తీసుకువెళ్లి ఎత్తయిన ప్రదేశంలో వదిలేస్తారు. రాబందులు వాటిని ఆరగిస్తే మంచిదని భావిస్తారు. ఇప్పుడవి అంతరించడం పార్సీలకు తీవ్ర సమస్యగా మారింది. దీంతో వాటి సంతతిని పెంచే కార్యక్రమానికి రూ. వంద కోట్ల వరకూ ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు. - 2లో

అమ్మాయిలకే అందలం

సాఫ్ట్‌వేర్ నియామకాల్లో వారికే పెద్దపీట ● కనీసం 25% ఉండేలా చర్యలు

- ఇతర రాష్ట్రాలు, భిన్న సంస్కృతుల వారికి చోటు
- ప్రాంగణ నియామకాల్లో ఐటీ కంపెనీల వ్యూహం

ఈనాడు - హైదరాబాద్

ఈ ఏడాది ప్రాంగణ నియామకాల్లో సాఫ్ట్‌వేర్ కంపెనీలు మహిళా అభ్యర్థులకు పెద్దపీట వేస్తున్నాయి. ప్రాంగణ నియామకాల్లో ఎంపిక చేసుకునే అభ్యర్థుల్లో కనీసం నాలుగోవంతు మహిళలు ఉండేలా సాఫ్ట్‌వేర్ కంపెనీలు చర్యలు తీసుకుంటున్నాయి. కొన్ని కంపెనీలు 40 శాతం నియామకాలు యువతులకే ఇస్తున్నాయి. పలు రాష్ట్రాల, భిన్న సంస్కృతుల మహిళలు ఉండాలని యాజమాన్యాలు పట్టుబడుతున్నాయి. ఇంజినీరింగ్ కళాశాలల్లో జులై రెండు లేదా మూడో వారంలో ప్రాంగణ నియామకాలు మొదలవుతాయి. ఈసారీ మొదలయ్యాయి. దేశవ్యాప్తంగా ఏటా కొత్తగా 2 లక్షల మంది ఇంజినీరింగ్ విద్యార్థులను ఐటీ పరిశ్రమలు తీసుకుంటున్నాయి. మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యమిస్తూ ఉండటం ఈసారి కనిపిస్తున్న కొత్త వ్యూహం.



ఎందుకీ ప్రాధాన్యం?

ఇటీవల ఐటీ పరిశ్రమల్లోని సీనియర్ అధికారుల నోట వెంట తరచూ వినిపిస్తున్న మాట లింగ వైవిధ్యం (జెండర్ డైవర్సిటీ). మహిళా సాధికారిత కోసం మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇచ్చినట్లుగానే ఐటీరంగంలోనూ ఇవ్వాలని కంపెనీలు భావిస్తున్నాయి. అందుకే ఉద్యోగాల్లో వారికి కనీసం 25 శాతం కేటాయిస్తున్నారు. పురుషులతో పోలిస్తే మహిళల్లో ఇతర కంపెనీలకు మారే ధోరణి కూడా తక్కువ. బాధ్యతగా పనిచేయడంలోనూ వారికే ఎక్కువ మార్కులు లభిస్తాయని (మిగతా 2లో)

అన్ని స్థాయుల్లో స్థానం

సుధీర్ పోతుమంచి, సంచాలకుడు, టాలెంట్ అక్విజిషన్ విభాగం, కోని ఇండియా

ప్రాంగణ నియామకాల్లో మేం 25 శాతం యువతులు ఉండేలా చూస్తున్నాం. అందుకే గత ఏడాది మహిళా ఇంజినీరింగ్ కళాశాలలకు వెళ్లాం. కేవలం ప్రాంగణ నియామకాల్లోనే కాదు.. వివిధ హోదాల్లో, బోర్డు ఆఫ్ డైరెక్టర్లలో కూడా మహిళలు ఉండేలా కంపెనీలు చర్యలు తీసుకుంటున్నాయి.

మట్టి గణపతే.. మహాగణపతి



పర్యావరణవేత్తల కృషి ఫలిస్తోంది.. రసాయనాలతో తయారుచేసే రంగురంగుల వినాయక విగ్రహాలను వదిలిపెట్టి మట్టి గణపతి వైపు మొగ్గుచూపుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. గురువారం హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు మట్టి గణపతి విగ్రహాలను అందజేసిన రాష్ట్రమంత్రి కె.తారకరామారావు ఈసారి వినాయక పండుగ వేడుకలను పర్యావరణహితంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.. స్వచ్ఛంద సంస్థల సహకారంతో 2 లక్షల మట్టి విగ్రహాలను పంపిణీ చేయాలని నిర్ణయించామన్నారు. - వివరాలు 6లో



239 ఏఈ పోస్టుల భర్తీకి సుప్రీం పచ్చజెండా

- తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పాత మెరిట్ లిస్ట్ ప్రకారమే నియామకాలు
- జీవో 81లోని నిబంధనలు వీటికి వర్తించవని స్పష్టీకరణ - 6లో

ఓబీసీలకూ చౌకలో వ్యాపార రుణాలు



- గరిష్ఠంగా రూ.5 కోట్ల ఆర్థికసాయం -13లో
- పెట్టుబడుల నిధి విస్తరణకు కేంద్రం యోచన

పరిశ్రమ ఫలిస్తోంది

- తెలంగాణలో పరిశ్రమలకు సానుకూల వాతావరణం
- దేశంలో 5వ ర్యాంక్
- ఏడాదిలో 8 ర్యాంకులు ఎగబాకిన రాష్ట్రం
- అతి తక్కువ అవినీతి ఉన్న రాష్ట్రాల్లో రెండోస్థానం
- ఏడాదిలోనే గణనీయమైన మార్పు
- ఎన్‌సీఏఈఆర్ సర్వేలో వెల్లడి

ఈనాడు - దిల్లీ

పారిశ్రామికంగా తెలంగాణ రాష్ట్రం పుంజుకుంటోంది. ఈ రంగంలో అవినీతి గణనీయంగా తగ్గింది. ఏడాది కాలంలోనే తెలంగాణ పారిశ్రామిక వాతావరణంలో ఎన్నో మార్పులొచ్చాయి. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనమిక్ రీసెర్చ్(ఎన్‌సీఏఈఆర్) సంస్థ నిర్వహించిన 'స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ పొటెన్షియల్ ఇండెక్స్' సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. అవినీతి కారణంగా తక్కువ సమస్యలు ఎదుర్కొంటున్న రాష్ట్రాల్లో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. 2016లో నిర్వహించిన సర్వేలో- తెలంగాణలో అవినీతి తీవ్రస్థాయిలో ఉందని 26.5%మంది చెప్పగా.. ఇప్పుడు ఆ సంఖ్య 5.6%కి పడిపోయింది. ఈ విషయంలో గుజరాత్ తర్వాత స్థానంలో తెలంగాణ నిలిచింది. ఇక పెట్టుబడుల అనుకూల వాతావరణ కల్పనలో తెలంగాణ ప్రభుత్వం తన పనితీరు మెరుగుపరచుకొని ఏడాది కాలంలో ఏకంగా 13 నుంచి అయిదో ర్యాంకుకు ఎగబాకింది. ముఖ్యంగా భూమి, కార్మికుల లభ్యత విషయంలో అగ్రస్థానంలో నిలిచింది. వాణిజ్య వాతావరణం లాంటి విషయాల్లో పెట్టుబడిదారుల నమ్మకాన్ని బాగా పెంచుకోగలిగింది. నైపుణ్యమైన కార్మికుల లభ్యత, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో డీపీపీ ఇచ్చిన ర్యాంక్, భూ సేకరణలో చూపుతున్న చొరవ తెలంగాణ బలాలుగా నిలిచాయి. పరిపాలన అంశాలు, మౌలిక వసతులు, ఆర్థిక పరిస్థితుల్లో కొంత వెనుకబడింది. పరిపాలనాపరమైన అంశాల్లో గత ఏడాదితో పోల్చుకున్నప్పుడు కొంత మెరుగైనప్పటికీ.. ఇతర రాష్ట్రాలతో పోల్చిచూసినపుడు మాత్రం వెనుకబడి ఉంది.



సర్వేలోని కీలకాంశాలివీ...

- పారిశ్రామిక పెట్టుబడుల అనుకూల వాతావరణ కల్పనలో తెలంగాణ ఒక ఏడాదిలో ఒకేసారి 13 నుంచి 5వ ర్యాంకుకు ఎగబాకింది.
- భూ కేటాయింపుల విషయంలో మధ్యప్రదేశ్ తర్వాత తెలంగాణ రెండోస్థానంలో నిలిచింది.
- కార్మికుల లభ్యత అంశంలో (మిగతా 2లో)

ఇదీ సంగతి!



ఇవి తాగటానికీ, ఇవి బాత్‌రూంకు సరిపోతాయా డియర్?!

మళ్లీ స్వైన్‌ఫ్లూ

- ఈ ఏడాదిలో 1520 కేసులు
- గడిచిన 14 రోజుల్లోనే 42 మందిలో గుర్తింపు
- ఇప్పటికే 17మంది మృత్యువాత
- హైదరాబాద్‌లోనే అధికం
- చలి తీవ్రతకు మరింత విజృంభించే అవకాశం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో స్వైన్‌ఫ్లూ ముప్పు మళ్లీ ముంచుకొస్తోంది. ఈ ఏడాదిలో ఇప్పటికే 1,520 స్వైన్‌ఫ్లూ కేసులు నమోదవగా.. గత 14రోజుల్లోనే 42 మందిలో ఈ వైరస్ ఉన్నట్లు గుర్తించారు. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకూ 17 మంది మృత్యువాతపడ్డారు. రాష్ట్రంలో అత్యధికంగా 716 కేసులు హైదరాబాద్‌లో నమోదవగా, అత్యధిక మరణాలు కూడా(ఆరు) ఇక్కడే చోటుచేసుకున్నాయి. తర్వాత రంగారెడ్డి జిల్లాలో 309, మేడ్చల్ జిల్లాలో 285 స్వైన్‌ఫ్లూ కేసులు నమోదయ్యాయి. మొత్తమ్మీద హైదరాబాద్ మహానగరం, పరిసరాల్లోనే హెచ్1ఎన్1 వైరస్ స్వైరవిహారం చేస్తున్నట్లు వెల్లడవుతోంది. వర్షాలతో వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు కూడా వైరస్ విజృంభణకు కారణమవుతున్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. రోజుకు కనీసం 41 నమూనాలను పరీక్షిస్తుండగా.. సగటున 13.2శాతం కేసులు నమోదవుతున్నాయి. మున్ముందు వైరస్ మరింత విజృంభించే అవకాశాలుండడంతో తెలంగాణ వైద్యఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. బుధ, గురువారాల్లో వైద్యఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి రాజేశ్వర్ తివారీ అత్యవసరంగా ఉన్నతస్థాయి సమీక్ష (మిగతా 2లో)

TG



హైదరాబాద్ పర్యటనలో ఉన్న అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ గురువారం రామోజీ ఫిలింసిటీని సందర్శించారు. రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సీఎం ఖండూతో పాటు ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి చౌనామైన్, హోం శాఖ మంత్రి కుమార్ వీవీ, భాజపా తెలంగాణ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామోజీ ఫిలింసిటీ విశేషాలను రామోజీరావును అడిగి ఖండూ తెలుసుకున్నారు. పర్యాటక రంగ అభివృద్ధికి అరుణాచల్‌ప్రదేశ్ ఇస్తున్న ప్రాధాన్యత, ఈశాన్య రాష్ట్రాల్లో పర్యాటక అభివృద్ధి అవకాశాలపై కూడా ఈ భేటీలో చర్చించారు. రామోజీ ఫిలింసిటీ సీఈవో రాజీవ్ జాల్నాపుర్కర్ కూడా పాల్గొన్నారు. –ఈనాడు, హైదరాబాద్



అమ్మాయిలకే అందలం

(మొదటి పేజీ తరువాయి)

యాజమాన్యాలు భావిస్తున్నాయి. సమస్యలను పరిష్కరించడంలో, ప్రత్యామ్నాయ మార్గాలు వెతకడంలో మహిళలు మగవారికి తీసిపోరని కంపెనీలు నిర్వహించిన అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే పలు సంస్థలు కీలక హోదాల్లో వారిని నియమిస్తున్నాయి.

అభ్యర్థులకోసం వెతుకులాట: హైదరాబాద్‌లో దాదాపు 4 లక్షల మంది ఐటీ ఉద్యోగులున్నారు. వారిలో ఇప్పటికే 40 శాతం మహిళలు ఉన్నట్లు అంచనా. ప్రస్తుతం నియామకాల్లో కనీసం 25 శాతం ఉండేలా కంపెనీలు చూసుకుంటున్నాయి. కొద్దిగా ప్రతిభ ఉన్నా ఎంపిక చేస్తున్నాయి. 'ఇటీవల ఓ ఐఐటీకి వెళ్లాం. ఎనిమిది మందిని ఎంపిక చేశాం. అందులో ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. నేను మా విభాగాధిపతికి నివేదిక ఇచ్చేటపుడు ఎంపికైన వారిలో ఇద్దరు అమ్మాయిలు కూడా ఉన్నారని ప్రత్యేకంగా పేర్కొన్నాను' అని మైక్రోసాఫ్ట్ కంపెనీకి చెందిన ఓ సీనియర్ అధికారి చెప్పారు. సన్‌టెక్ కార్ప్ సీఈఓ వెంకట్ కంచనపల్లి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలకు, భిన్న సంస్కృతులకు చెందిన వారు ఉండేలా పలు రాష్ట్రాల నుంచి కంపెనీలు ఉద్యోగులను ఎంపిక చేసుకుంటున్నాయని చెప్పారు.

మళ్లీ స్వైన్‌ఫ్లూ

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. నిమ్స్ సంచాలకుడు మనోహర్‌ను స్వైన్‌ఫ్లూపై ప్రత్యేక నోడల్ అధికారిగా నియమించారు. స్వైన్‌ఫ్లూ నివారణచర్యలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ఇప్పటి వరకూ 'కాలిఫోర్నియా స్ట్రెయిన్'గా వ్యాప్తిలో ఉన్న ఈ వైరస్ ఇప్పుడు(2017లో) 'మిషిగాన్ స్ట్రెయిన్'గా కొత్త అవతారమెత్తడంతో దీన్ని ఎలా ఎదుర్కోవాలనే అంశంపై చర్చించారు. 2009లో మొదటిసారిగా 'హెచ్1ఎన్1' అనే 'ఇన్‌ఫ్లూయెంజా ఏ' వైరస్ మొదటిసారిగా వెలుగులోకి వచ్చినప్పుడు ప్రాణనష్టం భారీగా జరిగింది. తాజాగా 'మిషిగాన్ స్ట్రెయిన్' రావడంతో ప్రజలపై ఎలాంటి దుష్ప్రభావాన్ని చూపుతుందనేది వైద్యవర్గాల్లో ఆందోళన కలిగిస్తోంది. చలి వాతావరణంలో వైరస్ ఎక్కువ కాలం జీవించే అవకాశాలుండడంతో అక్టోబరు నుంచి ఫిబ్రవరి వరకు తీసుకోవాల్సిన చర్యలపై ఆరోగ్యశాఖ ఇప్పట్నుంచే సన్నద్ధమవుతోంది.

ఆదివారాలూ నిర్ధారణ పరీక్షలు

– డాక్టర్ మనోహర్, నిమ్స్ సంచాలకుడు

స్వైన్‌ఫ్లూ నివారణపై ప్రధానంగా దృష్టిపెట్టాం. వ్యాధి లక్షణాలున్నవారికి మెరుగైన వైద్యమందించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాం. ఇప్పటికే గాంధీ ఆసుపత్రిలో 20 పడకల ప్రత్యేక వార్డు సేవలందిస్తోంది. దీనికి తోడుగా అత్యవసర పరిస్థితుల్లో ఉస్మానియాలో 14 పడకలు, ఫీవర్ ఆసుపత్రిలో 26 పడకలు, నిలోఫర్, ఎంజీఎం(వరంగల్), నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో 10 పడకల చొప్పున ప్రత్యేక స్వైన్‌ఫ్లూ వార్డులను సిద్ధం చేశాం. అన్ని జిల్లా కేంద్రాల్లో ఔషధాలను సిద్ధంగా ఉంచాం.

లక్షణాలు

- దగ్గు, జలుబు, గొంతునొప్పి
- జ్వరం 101, 102 డిగ్రీల వరకూ ఉంటుంది
- ఒళ్లు నొప్పులు, బాగా నీరసం, నిస్సత్తువ, తలనొప్పి

స్వీయ జాగ్రత్తలు

- వ్యాధి లక్షణాలున్నవారు సాధ్యమైనంత వరకూ ఇంట్లోనే ఉండాలి
- వీరు వాడిన రుమాలు, టవల్ వంటివి ఇతరులు ఉపయోగించొద్దు
- దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు ముఖానికి అడ్డంగా వస్త్రం పెట్టుకోవాలి
- ఎప్పటికప్పుడు చేతులను శుభ్రంగా కడుక్కోవాలి

'గాంధీ'లో పెరుగుతున్న స్వైన్‌ఫ్లూ రోగులు

గాంధీ ఆసుపత్రిలో గడిచిన పదిరోజుల్లో ఏడు కేసులు నమోదయ్యాయి. ఇప్పటికే ఒకరు చికిత్స పొందుతుండగా.. కామారెడ్డి జిల్లా జుక్కల్‌కు చెందిన యువకుడు(16), బాలానగర్‌కు చెందిన వ్యక్తి(57), యూసఫ్‌గూడకు చెందిన బాలిక(6), మల్కాజిగిరికి చెందిన వృద్ధుడు(65), రాజేంద్రనగర్‌కు చెందిన మహిళ(47), వనపర్తికి చెందిన వ్యక్తి(67), ముషీరాబాద్‌కు చెందిన వ్యక్తి (50) చేరారు. మరో ఆరుగురి నమూనాలు పరీక్షలకు పంపినట్లు వైద్యులు తెలిపారు.


పరిశ్రమ ఫలిస్తోంది


(మొదటి పేజీ తరువాయి)


తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ తర్వాతి స్థానాన్ని తెలంగాణ ఆక్రమించింది.

- 2016తో పోలిస్తే 2017 నాటికి కింది నుంచి పైకి వచ్చిన రాష్ట్రాల్లో హరియాణ, తెలంగాణ ముందున్నాయి. హరియాణ 12, తెలంగాణ ఎనిమిది ర్యాంకులు ఎగబాకాయి.
- పరిశ్రమలకు భూ సేకరణ విషయంలో తెలంగాణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావడంలేదని 80% మంది అభిప్రాయపడ్డారు.
- విద్యుత్ సరఫరాలో గుజరాత్, హరియాణ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, జార్ఖండ్ అద్భుతమైన పనితీరు కనబరుస్తున్నాయి.
- శాంతిభద్రతల విషయంలో గుజరాత్ తర్వాతి స్థానంలో తెలంగాణ నిలిచింది.
- భూ రికార్డుల డిజిటలీకరణ, శ్రామికశక్తి పెద్దఎత్తున అందుబాటులో ఉండటం, తయారీ రంగంలో పోటీతత్వంతో కూడిన వేతనాల అమలు తెలంగాణ ప్రధాన బలాలని సర్వేలో తేలింది. పది లక్షలకు పైబడిన జనాభాగల నగరాల జాబితాలో తొలి అయిదు స్థానాల్లో తెలంగాణ నిలిచింది. అనుకూలమైన పెట్టుబడి వాతావరణం ఉందన్న భావన పారిశ్రామికవేత్తల్లో నెలకొంది.
- మౌలిక వసతులు, పరిపాలన లేమి ప్రధాన బలహీనతలుగా తయారయ్యాయి. రోడ్డు, రైలుమార్గం సాంద్రత, భూగర్భ జలాల లభ్యత తక్కువగా ఉండటం కూడా ఇబ్బందికరంగా తయారైంది.
- ఈ శాంపుల్ సర్వేలో తెలంగాణలో 38 మంది ద్వారా వివరాలు సేకరించారు. ఇందులో 37 మంది హైదరాబాద్ నుంచి, ఒకరు రంగారెడ్డి జిల్లా నుంచి ఉన్నారు. ఈ ఏడాది ఏప్రిల్-మే నెలల్లో ఈ సర్వే నిర్వహించారు. 21 రాష్ట్రాల్లో 1,030 పారిశ్రామిక యూనిట్ల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఎండీ, సీఈఓ, హెచ్ఆర్ హెడ్, మేనేజర్ స్థాయి వారి నుంచి ప్రశ్నలు, ముఖాముఖి ఇంటర్వ్యూల ద్వారా వివరాలు సేకరించారు.

ఏపీకి దేశంలో మూడో ర్యాంక్: పారిశ్రామిక రంగానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో అవినీతి ఛాయలు సగానికిపైగా తగ్గినట్లు ఈ సర్వేలో వెల్లడైంది. 2016 సర్వేలో అవినీతిలో తొలిస్థానంలో నిలిచింది. 74.3% మంది పారిశ్రామికవేత్తలు అవినీతి తీవ్రస్థాయిలో ఉన్నట్లు గత ఏడాది అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది అలా చెప్పిన వారిసంఖ్య 13.3%కి పరిమితమైంది. కొన్ని విభాగాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన పనితీరును మెరుగు పరచుకుని నాలుగు నుంచి మూడో ర్యాంకుకు ఎగబాకింది.







టోలు గోస తీరింది

దిల్లీ: టోల్ గేట్ల వద్ద రుసుము చెల్లింపులో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించడానికి భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) గురువారం రెండు యాప్‌లను ప్రారంభించింది. 'మై ఫాస్ట్‌ట్యాగ్', 'ఫాస్ట్‌ట్యాగ్ పార్ట్‌నర్'ల పేరుతో ఈ మొబైల్ యాప్‌లను ఆవిష్కరించింది. అక్టోబరు ఒకటో తేదీ నుంచి దేశంలోని మొత్తం 371 టోల్ ప్లాజాల వద్ద దీన్ని అమలు చేయాలని భావిస్తోంది.

ఫాస్ట్‌ట్యాగ్ అంటే..: వాహనాల ముందు అద్దాలకు ఫాస్ట్‌ట్యాగ్‌ను అమరుస్తారు. దీనికి రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ టెక్నాలజీ (ఆర్ఎఫ్ఐడి) ఉంటుంది. సెల్‌ఫోన్‌కు డబ్బులు వేసుకున్నట్టుగా దీంట్లోనూ సొమ్ములు వేసుకోవచ్చు. ఈ సౌకర్యం ఉంటే టోల్‌గేట్ వద్దకు వాహనం రాగానే అక్కడ చెల్లించవలసిన సొమ్ము దానంతట అదే అక్కడి వారికి జమ అవుతుంది. వాహనం ఆపాల్సిన అవసరం లేకుండానే ఇదంతా జరిగిపోతుంది. దాంట్లో బ్యాలెన్స్ అయిపోతే మళ్లీ వేసుకోవాల్సి ఉంటుంది. ఫాస్ట్‌ట్యాగ్‌లో సొమ్ము వేసే విధానం కొంత కష్టతరంగా ఉండడంతో, ఆ ఇబ్బందులను తొలగించడానికే యాప్‌లు ప్రారంభించామని ఎన్‌హెచ్ఏఐ ఛైర్మన్ దీపక్ కుమార్ చెప్పారు. 'మై ఫాస్ట్‌ట్యాగ్'ను వినియోగదారుడే తన ఆండ్రాయిడ్, ఐఓఎస్ యాప్ స్టోర్స్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అంటే మొబైల్ ద్వారానే సొమ్మును ఛార్జింగ్ చేసుకోవచ్చు. ఫాస్ట్‌ట్యాగ్ పార్ట్‌నర్ వ్యాపార సంస్థలకు సంబంధించినది. ఉమ్మడి సేవా కేంద్రాలు, బ్యాంకుల భాగస్వాములు, వాహనాల డీలర్లు వీటిని డౌన్‌లోడు చేసుకోవచ్చు. వీటిని వారు విక్రయించే వీలు కూడా ఉంది. టోల్‌గేట్ల వద్ద ఈ సౌకర్యం ఉన్న వాహనాల కోసం ప్రత్యేకంగా ఒక వరుసను కేటాయిస్తారు. ఈ వరుసలో ఇతర తరహా చెల్లింపులు ఉండవు. ఈ ట్యాగ్‌లను ఆన్‌లైన్‌లోను, టోల్‌గేట్ల సమీపంలో ఉండే ఉమ్మడి సేవా కేంద్రాల్లోనూ విక్రయిస్తారు.

ఉగ్ర బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)





గురువారం స్పెయిన్‌లోని బార్సిలోనాలో పాదచారుల మార్గంపైకి వ్యాను దూసుకొచ్చిన ప్రాంతంలో భయాందోళనలో జనం ★ తీవ్రంగా గాయపడిన వృద్ధులు

హతమయ్యారు. ఈ ఘటనలో ఎంతమంది పాల్గొన్నారనేది తెలియరాలేదు. ఒకరిని అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో 13 మంది మరణించగా, 50 మందికిపైగా గాయపడినట్లు అంతర్గత మంత్రి జోయాక్విమ్ ఫార్న్ ట్వీట్ చేశారు. ఘటన జరిగిన ప్రదేశాన్ని పోలీసులు చుట్టుముట్టారు. పలు అంబులెన్సులు, పోలీసు వాహనాలు అక్కడికి చేరాయి. పర్యాటకులు, వీధి ప్రదర్శనకారులతో రాత్రివేళదాకా కిక్కిరిసి ఉండే ఈ రోడ్డుపైకి వేగంగా వచ్చిన వ్యాను అడ్డదిడ్డంగా జనంపైకి దూసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఘటన జరిగిన సమయంలో అరుపులు, కేకలు వినిపించాయనీ, జనం చెల్లాచెదురయ్యారనీ, అది ఉగ్రదాడిగానే భావించానని ప్రత్యక్షసాక్షి ఒకరు పేర్కొన్నారు. తెల్లని వ్యాను జనాన్ని ఢీకొట్టడం తాము చూశామనీ, ప్రజలు ఎగిరిపడ్డారని మరో ప్రత్యక్షసాక్షి వివరించారు. పలువురు రహదారిపై పడి ఉన్నట్లు ట్విటర్‌లో ఉంచిన ఓ మొబైల్ ఫోన్ వీడియోలో నమోదైంది. రహదారి పూర్తిగా ఖాళీగా, నిశ్శబ్దంగా మారిపోగా, పలురకాల వస్తువులు చెల్లాచెదురుగా పడిఉన్నాయి. వ్యాను డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయినట్లు ఓ పత్రిక పేర్కొంది. బార్సిలోనానగరం మధ్యలోని ఓ బార్‌లో ఇద్దరు సాయుధులు కనిపించారనీ, ఆ ప్రాంతంలో కాల్పులు జరిగినట్లు ఓ పత్రిక పేర్కొన్నా.. ఆ ఘటనను పోలీసులు ఖండించారు. ఈ దాడితో సంబంధమున్న రెండో వ్యానును కాటలోనియాలోని విక్ పట్టణంలో గుర్తించినట్లు సమాచారం.

- ఘటనను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఖండించారు. బార్సిలోనా బాధితుల్లో భారతీయులెవరూ లేరని విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి సుష్మాస్వరాజ్ ప్రకటించారు.
- స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో 2004 మార్చిలో అల్‌ఖైదా ప్రేరేపిత ఉగ్రవాదులు ప్రయాణికుల రైళ్లలో పేలుళ్లకు పాల్పడటం ద్వారా 191 మంది ప్రాణాల్ని బలితీసుకున్నారు. ఇటీవలి కాలంలో ఐరోపాలో ఉగ్రదాడుల కోసం వాహనాల్ని ఉపయోగించడం అలవాటుగా మారింది. ఫ్రాన్స్ నైస్ నగరంలో ఇదే తరహాలో జరిగిన ఊచకోతలో 86 మంది మరణించారు.

హైదరాబాద్‌లో దిల్లీ యువతిపై అత్యాచారం

హైదరాబాద్, న్యూస్‌టుడే: హైదరాబాద్ నగర పర్యటనకు వచ్చిన దిల్లీ యువతి ఒకరు అత్యాచారానికి గురయ్యారు. బంజారాహిల్స్‌లోని ఓ అతిథి గృహంలో జరిగిన ఈ ఘటనపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. దిల్లీకి చెందిన 18 ఏళ్ల యువతి ఐదు రోజుల క్రితం నగరానికి వచ్చింది. బంజారాహిల్స్ రోడ్డు నెం.10లో ఓ ప్రైవేటు అతిథి గృహంలోని నాలుగో అంతస్తులో అద్దెకు దిగింది. అదే అంతస్తులో మరో గదిలో నలుగురు వ్యక్తులున్నారు. ఒంటరిగా ఉన్న ఆ యువతిని గమనించిన వారు గురువారం ఆమె గదిలోకి వెళ్లి బెదిరించి అత్యాచారానికి యత్నించారు. ఆమె ప్రతిఘటించడంతో తీవ్రంగా కొట్టారు. తర్వాత అందులో ఒకడు అత్యాచారం చేస్తుండగా మిగతా ముగ్గురు బయట కాపలా ఉన్నారు. అనంతరం వారు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితురాలు గురువారం బంజారాహిల్స్ ఠాణాలో ఫిర్యాదు చేసింది.

అత్యాచారానికి గురైన పదేళ్ల బాలిక ప్రసవం

చండీగఢ్: అభం శుభం తెలియని వయసులో అత్యాచారానికి గురైన ఓ పదేళ్ల బాలిక గురువారం శిశువుకు జన్మనిచ్చింది. శిశువు తక్కువ బరువు(2.2కిలోల)తో పుట్టింది. బంధువు అత్యాచారం చేయడంతో బాలిక గర్భం దాల్చింది. కడుపు నొప్పితో బాధపడుతుండగా తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లగా 30 వారాల గర్భవతి అని తెలిసింది. ఆమె భవిష్యత్తు దృష్ట్యా గర్భస్రావానికి అనుమతి ఇవ్వాల్సిందిగా తల్లిదండ్రులు సుప్రీం కోర్టుకు విజ్ఞప్తి చేశారు. గర్భస్రావం సాధ్యాసాధ్యాలను పరిశీలించాల్సిందిగా చండీగఢ్ వైద్య పరిశోధన సంస్థను సుప్రీంకోర్టు ఆదేశించింది. 32 వారాల గర్భం తొలగిస్తే ఆమె ప్రాణాలకే ప్రమాదమని వైద్యులు కోర్టుకు నివేదించారు. దీంతో గర్భస్రావానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. తప్పనిసరి స్థితిలో ఆ బాలిక శిశువుకు జన్మనివ్వాల్సి వచ్చింది. అయితే తను గర్భవతి అన్న సంగతి ఆమెకు తెలియదు. కడుపులో రాయి ఉంది వైద్యులు తీసేస్తారు అని తల్లిదండ్రులు చెప్పారు.

రాలిపోతున్న రాబందు

- తెలుగు రాష్ట్రాల్లో మిగిలినవి మూడు పదులే!
- ఆదిలాబాద్ జిల్లా బెజ్జూరులోనే వాటి ఉనికి
- దేశవ్యాప్తంగా 97% కనుమరుగు
- వాటి పెంపకానికి ఎన్ని నిధులైనా ఇస్తామంటున్న పార్సీలు

ఈనాడు – హైదరాబాద్



పార్సీలకు తీవ్ర సమస్య

ఎవరైనా మరణిస్తే మృతదేహాన్ని దహనం చేస్తుంటారు. లేదంటే పూడుస్తారు. పార్సీలు మాత్రం ఎత్తైన ప్రదేశాల్లో వాటిని వదిలివెళతారు. రాబందులు వచ్చి వాటిని తినాలన్నది వారి అభిమతం. వీటి సంతతిని పెంచాలనీ, తమకు అవసరమైన ప్రదేశాలకు రాబందులు వచ్చేలాచేస్తే.. రూ.వంద కోట్ల వరకూ ఇచ్చేందుకు ముందుకొచ్చినట్లు అటవీశాఖ అధికారి ఒకరు తెలిపారు.

వచ్చే ఐదు, పదేళ్లు కీలకం

రాబందుల సంఖ్యను పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రస్తుతమివి 30కి పైగా ఉన్నాయి. కనీసం వందకు పెరిగితేగాని ఊపిరి పీల్చుకోలేం. వచ్చే ఐదు, పదేళ్లు కీలకం. పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుతాయివి. నాలుగైదు వందల కిలోల మాంసాన్నయినా ఒకట్రెండు గంటల్లోనే ఆరగిస్తాయి.

– శంకరన్, వన్యప్రాణిసంరక్షణ నిపుణుడు

చనిపోయిన పశువుల్ని ఊరిబయట పడేస్తే, రాబందులు వచ్చి తినేసేవి. కళేబరం కుళ్లిపోయి దుర్వాసన రాకుండా, బ్యాక్టీరియా వ్యాపించకుండా పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచేందుకు దోహదపడేవి. అలాంటి రాబందులు ఇప్పుడు అంతరించే దశలో ఉన్నాయి. ఒకప్పుడు లక్షల్లో ఉన్న వీటి సంఖ్య... ఇప్పుడు దేశవ్యాప్తంగా రెండు, మూడు వేలు కూడా లేదు!

దేశంలో రాబందులు 97 శాతానికిపైగా అంతరించాయని, మిగిలినవి రెండు మూడు శాతమేనని పరిశోధకులు, వన్యప్రాణి నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇదే పరిస్థితి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాబందులు జాడ చెప్పినా, ఫొటో పంపినా రూ.లక్ష బహుమతి ఇస్తామంటూ ప్రకటించడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. పరిస్థితి తీవ్రతను కొన్నేళ్ల క్రితమే గుర్తించిన కేంద్ర ప్రభుత్వం, వీటి సంరక్షణకు కొన్ని చర్యలు చేపట్టింది. తెలంగాణ అటవీశాఖ బెజ్జూరులోని రాబందుల సంరక్షణపై దృష్టి సారించింది.

కారణాలేంటి?

పశువులకు జబ్బు చేసినప్పుడు 'డైక్లోఫినాక్' ఔషధం వాడేవారు. ఈ జంతువులు చనిపోతే, వాటిని తిన్న రాబందులపై తీవ్ర ప్రభావం పడేది. సంతానోత్పత్తి నిలిచిపోవడం, కిడ్నీలు పాడవడం, మెడ వంగిపోవడం... ఇలా శరీరభాగాలు కృశించి మృత్యువాతపడేవి. కేంద్రం డైక్లోఫినాక్‌ను నిషేధించినా, అప్పటికే తీవ్రనష్టం వాటిల్లింది. వాతావరణ కాలుష్యం, రసాయనాలు కూడా రాబందులు అంతరించిపోవడానికి కారణాలయ్యాయి.

అంతరించాయి అనుకున్న సమయంలో..

కేంద్ర ప్రభుత్వం హరియాణాలోని 'పింజోర్', పశ్చిమ్‌బంగలో రాబందుల సంరక్షణ పునరుత్పత్తి కేంద్రాలను ఏర్పాటుచేసింది. ఉమ్మడి రాష్ట్రంలో రాబందులు అంతరించాయని కొన్నేళ్ల క్రితం నిర్ధారణకు వచ్చారు. కానీ, 2011లో కుమురం భీం జిల్లా బెజ్జూరు మండలం పాలరాపుగుట్టలో వాటి ఉనికి కన్పించడంతో ఆశలు చిగురించాయి. అప్పుడక్కడ పది వరకు ఉన్నట్లు గుర్తించారు. వీటిని సంరక్షణపై దృష్టి పెట్టడంతో ఇప్పుడవి 30కి పైగా ఉన్నాయి. ఈజిప్షియన్ జాతికి చెందిన రెండు రాబందులు కూడా ఇక్కడ కనిపించాయి.

- రాబందుల సంరక్షణ, ప్రత్యుత్పత్తి, పెరుగుదలపై అటవీశాఖ జాగ్రత్తలు తీసుకుంటోంది. ఆహారం నిమిత్తం ఆవులు, ఎద్దులను ప్రత్యేకంగా తీసుకొస్తున్నారు. 'డైక్లోఫినాక్' వాడకుండా చుట్టుపక్కల ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తున్నారు.
- నెలలో రెండు, మూడుసార్లే రాబందులు ఆహారం తీసుకుంటాయి. పాలరాపుగుట్టలో ఇప్పటివరకు 30 సార్లు పశువుల ఆహారాన్ని అందించినా, తొమ్మిదిసార్లే అవి ఆహారం తీసుకున్నాయని బయాలజిస్ట్ రవికాంత్ తెలిపారు. పక్కనే ప్రాణహిత నది అవతల మహారాష్ట్రలోని గడ్చిరౌలి జిల్లా ఉంది. రాబందులు కొన్నిసార్లు అటువైపు కూడా వెళ్లి ఆహారం తీసుకుంటున్నట్లు గుర్తించారు.
- దేశంలో తొమ్మిది రకాల రాబందులున్నాయి. పొడవు ముక్కు రాబందులు బెజ్జూరు ప్రాంతంలో ఉన్నాయి. నేపాల్‌లోనూ వీటి జాడ కనిపిస్తోంది.

ఫలితమివ్వని హైదరాబాద్ 'జూ' ప్రయోగం

హైదరాబాద్ జూలో 11 రాబందులున్నాయి. పునరుత్పత్తితో వీటి సంతతిని పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఏటా నవంబరు-డిసెంబరు సంతానోత్పత్తి సమయం. ఆడ రాబందులు ఏటా ఒక గుడ్డు పెడతాయి. పొదిగే సమయంలో జూలో కొన్ని గుడ్లు మురిగిపోతున్నాయి. కొన్నింటి నుంచి పిల్లలు జన్మించినా, కొన్ని రోజులకే మరణిస్తున్నాయి. సహజ వాతావరణ పరిస్థితులు కాకపోవడం, రాబందులు వయసు మీరినవి కావడం వల్లే ఇక్కడి ప్రయోగాలు ఫలితాలివ్వడం లేదని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు.

గ్రహం అనుగ్రహం

18–8–2017 శుక్రవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం వర్ష రుతువు; శ్రావణ మాసం; బహుళ పక్షం
ఏకాదశి: ఉ. 8-35 తదుపరి ద్వాదశి
ఆర్ద్ర నక్షత్రం: రా. 8-52 తదుపరి పునర్వసు
అమృతఘడియలు: ఉ. 11-32 నుంచి 1-02 వరకు
వర్జ్యం: ఉ. 6-19 నుంచి 7-49 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-18 నుంచి 9-08 వరకు
తిరిగి మ. 12-30 నుంచి 1-20 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ. 5-46; సూర్యాస్తమయం: సా. 6-22

చిన్నారికి పునర్జన్మ

- 12 ఏళ్ల 'డిస్ప్నీయా' బాధిత బాలికకు గుండె మార్పిడి
- అరుదైన శస్త్రచికిత్సను విజయవంతం చేసిన కాంటినెంటల్ వైద్యులు

ఈనాడు, హైదరాబాద్: రెండు నెలల కిందటి వరకు అందరిలాగే ఆడుకుంది. ఎన్నో ముచ్చట్లు చెప్పింది. ఉన్నట్టుండి కనీసం అడుగుతీసి అడుగు వేయలేకపోయింది! శ్వాస తీసుకోవడమూ కష్టమైంది. లక్ష మందిలో ఒకరిద్దరికి వచ్చే అత్యంత అరుదైన 'డిస్ప్నీయా' బారినపడి నరకం చూసింది... ఆదిలాబాద్‌కు చెందిన 12 ఏళ్ల త్రిష మండల్. కాంటినెంటల్ వైద్యులు ఆ చిన్నారికి అత్యంత క్లిష్టమైన గుండె మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా చేసి పునర్జన్మ ప్రసాదించారు.

ఆరోగ్యవంతమైన పిల్లల్లో గుండె పంపింగ్ సామర్థ్యం 60-70% ఉంటుంది. త్రిషకు మాత్రం 10-15 శాతానికి పడిపోయింది. చిన్నారి తల్లిదండ్రులు తమ తాహతుకు మించి వైద్యం చేయించినా, ఫలితం లేకపోయింది. చివరకు కాంటినెంటల్ ఆసుపత్రి వైద్యులను సంప్రదించగా.. బాలిక 'డిస్ప్నీయా' అనే గుండె వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. గుండె మార్పిడి ఒక్కటే పరిష్కారమని ఆమె తల్లిదండ్రులకు స్పష్టంచేశారు. 'ఆరోగ్యశ్రీ' పథకం కింద శస్త్రచికిత్స చేసేందుకు వైద్యులు సమ్మతించి, చిన్నారి పేరును జీవన్‌దాన్‌లో నమోదు చేయించారు. కానీ, ఆ చిట్టితల్లికి సరిపోయే గుండె కొన్నిరోజుల వరకు దొరకలేదు. కాంటినెంటల్ వైద్యులే చొరవ తీసుకుని.. . ఎల్బీనగర్‌లోని అవేర్ గ్లోబల్ ఆసుపత్రి నుంచి 14 ఏళ్ల బాలిక గుండెను త్రిషకు అమర్చేందుకు దాత తల్లిదండ్రులను ఒప్పించారు. జులై 19న ట్రాఫిక్ పోలీసుల సహకారంతో గ్రీన్ ఛానెల్ ద్వారా గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆసుపత్రికి 50 నిమిషాల్లో గుండెను చేర్చారు. ట్రాన్స్‌ప్లాంట్ ఫిజిషియన్ డాక్టర్ సందీప్ అతవర్ నేతృత్వంలో వైద్యులు సమీర్, సునీల్ స్వాయిన్, ప్రశాంత్ పాటిల్, అంజు దయాల్, రమేష్‌బాబు, అనిల్ కుమార్‌రెడ్డి తదితరుల బృందం నాలుగైదు గంటలు శ్రమించి, గుండె మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం ఆ చిన్నారి పూర్తిగా కోలుకుంది. ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో రెండ్రోజుల్లో డిశ్చార్జి చేయనున్నారు. "గుండె పంపింగ్ సామర్థ్యం తక్కువగా ఉండటం వల్ల 30 కిలోల బరువున్న త్రిష శరీరానికి పూర్తిస్థాయిలో రక్తం సరఫరా కాలేదు. దీంతో గుండెలో క్లాట్ ఏర్పడింది. సరైన సమయానికి దాత దొరకడం వల్ల ఈ క్లాట్‌ను కూడా తొలగించాం. భవిష్యత్తులోనూ నాడీసంబంధ సమస్యలుండవు. రూ.15-20 లక్షలు ఖర్చయ్యే శస్త్రచికిత్సను ఆరోగ్యశ్రీ కింద చేశాం. ఇలా చిన్నారికి గుండె మార్పిడి చేయడం మనదగ్గర రెండోసారి" అని పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ సునీల్ స్వాయిన్ వివరించారు. 'నా పాప కష్టం చూసి తట్టుకోలేకపోయా. కాంటినెంటల్ వైద్యులు పునర్జన్మను ప్రసాదించారు. భవిష్యత్తులో ఎలాంటి సమస్య తలెత్తినా మేమున్నామంటూ భరోసా కల్పించారు' అని త్రిష తండ్రి వికాస్ అన్నారు.


గుండె మార్పిడి చేయించుకుని పూర్తిగా కోలుకున్న చిన్నారి త్రిష మండల్. చిత్రంలో ఆమె తల్లిదండ్రులు, కాంటినెంటల్ వైద్యుల బృందం

దేవుడు రిజిస్ట్రేషన్ చేస్తేనే చెల్లుతాయి

దేవాదాయ స్థలాలపై మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వ్యాఖ్య

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: దేవాలయ భూములకు దేవుడు స్వయంగా రిజిస్ట్రేషన్ చేస్తేనే అవి చెల్లుబాటవుతాయని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్ అత్తాపూర్‌లోని పురాతన అనంతపద్మనాభ స్వామి ఆలయాన్ని మంత్రి గురువారం సందర్శించారు. ఈ ఆలయానికి సుమారు 41 ఎకరాలు ఉండగా భారీగా కబ్జాలకు గురయ్యింది. ఆలయానికి చెందిన 523 సర్వే నంబర్‌లో ఖాళీగా ఉన్న 6 ఎకరాల స్థలంలోని కల్పవృక్షానికి ఇటీవల స్థానికులు పూజలు చేయడానికి వెళ్లగా ఆ స్థలం తమదంటూ కొందరు వారిపై దాడికి యత్నించారు. ఈ విషయాన్ని ఇంద్రకరణ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాగా మంత్రి గురువారం ఆకస్మికంగా వచ్చి ఆలయాన్ని, దానికి సంబంధించిన స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీకాంత్‌రావు అక్కడ స్థలం కబ్జాదారుల చేతిలో ఉందని మంత్రికి వివరించారు. ఆలయానికి చెందిన స్థలాన్ని లారీల పార్కింగ్‌కు వాడుతూ అద్దెలు వసూలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ...దేవాలయాలకు సంబంధించిన భూములను కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయ స్థలాలను కొందరు ఇతరులకు రిజిస్ట్రేషన్‌లు చేశారని మంత్రిని ప్రశ్నించగా.. ఎవరు రిజిస్ట్రేషన్లు చేసినా చెల్లవన్నారు. దేవుడి మాన్యాలను దేవుడు రిజిస్ట్రేషన్ చేస్తేనే చెల్లుతాయని పేర్కొన్నారు.

విదేశీవిద్యకు 31 మంది ఎంపిక

ఎస్సీ సంక్షేమశాఖ కమిషనర్ కరుణాకర్

ఈనాడు, హైదరాబాద్: అంబేడ్కర్ విదేశీ విద్యా పథకానికి 31 మంది విద్యార్థులను ఎంపిక చేశామని ఎస్సీ సంక్షేమశాఖ కమిషనర్ కరుణాకర్ తెలిపారు. గురువారం జరిగిన మౌఖిక పరీక్షలకు 37 మంది దరఖాస్తు చేసుకోగా... 31 మంది మాత్రమే వచ్చారన్నారు. ఎస్సీ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా నేతృత్వంలోని ఎంపిక కమిటీ విద్యార్థులకు మౌఖికపరీక్షలు నిర్వహించిందని వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్ దేశాల్లో పీజీ కోర్సులు చేసేందుకు ప్రభుత్వం రూ.20 లక్షల ఉపకారవేతనం, విమాన ప్రయాణ, వీసా ఖర్చులు మంజూరు చేయనుందని ఆయన చెప్పారు.

సుప్రీంకోర్టులో విమానాశ్రయాల ఆపరేటర్లకు ఊరట

స్థల వినియోగానికి వారికి అనుమతి

దిల్లీ: ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్య(పీపీపీ) విధానంలో అభివృద్ధి పరచిన విమానాశ్రయాలు, వాటి నిర్వాహకులు సంబంధిత స్థలాన్ని వినియోగించుకోవచ్చునని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పీపీపీ పద్ధతిలో అభివృద్ధి పరచి ప్రస్తుతం పనిచేస్తున్న కొన్ని విమానాశ్రయాలు... వాటి నిర్వాహకులు సంబంధిత స్థలాన్ని 'నూతన పౌర విమానయాన విధానం' కింద వినియోగించుకోకుండా మినహాయించడం రాజ్యాంగ విరుద్ధమంటూ దిల్లీ హైకోర్టు ఈ ఏడాది ఏప్రిల్ 10వ తేదీన వ్యక్తం చేసిన అభిప్రాయాలను జస్టిస్ జె.చలమేశ్వర్, జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం సమర్థించింది.

ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డా.ధేనువకొండ శ్రీరామమూర్తి కన్నుమూత

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, సాహితీవేత్త డా.ధేనువకొండ శ్రీరామమూర్తి(70)గురువారం అపోలో ఆస్పత్రిలో కన్నుమూశారు. కొంతకాలంగా ఆయన గుండెజబ్బుతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా అద్దంకి మండలం ధేనువకొండలో 1947లో జన్మించారు. భారతీయ వైద్యశాఖలో



3 దశాబ్దాలపాటు పనిచేసి 2002లో స్వచ్ఛంద విరమణ చేశారు. ఆయన సిద్దేశ్వరి రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేదం(శ్రియం) ఏర్పాటుచేసి ఆయుర్వేద వైద్యవిధానం విస్తృతికి కృషిచేస్తున్నారు. రాష్ట్రీయ ఆయుర్వేద విద్యాపీఠ్ ఆయన్ను గురువుగా నియమించింది.

ప్రభుత్వ ఉద్యోగుల కోసం.. 14 ఆరోగ్య కేంద్రాలు

టీయూడబ్ల్యూజే 'ముఖాముఖి'లో ఈజేహెచ్‌ఎస్ సీఈఓ డాక్టర్ పద్మ


ముఖాముఖిలో మాట్లాడుతున్న డాక్టర్ పద్మ

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులు, పాత్రికేయుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య పథకానికి సంబంధించి రానున్న రోజుల్లో రాష్ట్రంలో 14 ఆరోగ్య (వెల్‌నెస్) కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఈజేహెచ్‌ఎస్ సీఈఓ డాక్టర్ కె.పద్మ వెల్లడించారు. దసరా నాటికి కొన్నింటిని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అత్యవసర వైద్య కేసులలో నేరుగా ఆసుపత్రులకు వెళ్లి ఆరోగ్య కార్డులు చూపెట్టి సేవలు పొందవచ్చన్నారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో 'పాత్రికేయుల ఆరోగ్య కార్డులు-అవగాహన' అంశంపై గురువారం డాక్టర్ పద్మతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా తొలుత వెల్‌నెస్ కేంద్రంలో ఓపీ సేవలు పొంది... వారి సూచన మేరకు కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్సలు పొందవచ్చన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 26,883 అక్రిడేషన్ కార్డులున్నాయని, వీటి వల్ల సుమారు 80 వేల నుంచి లక్ష మంది వరకు ఆరోగ్య సేవలు పొందేందుకు అవకాశముందన్నారు. త్వరలో 9 పూర్వ జిల్లాలలోను, అలానే హైదరాబాద్‌లో 5 వెల్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. అన్ని రకాల వ్యాధులకు ఉపకరించేలా కార్పొరేట్ ఆసుపత్రులతో ఒప్పందాలు చేసుకున్నామన్నారు. టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలీ మాట్లాడుతూ.. అక్రిడేషన్ లేని పాత్రికేయులు ఈ నెల 28లోపు ఆరోగ్య కార్డులు పొందేందుకు అవకాశముందన్నారు. టీయూడబ్ల్యూజే సలహాదారు కె.శ్రీనివాస్‌రెడ్డి, ఐజేయూ కార్యదర్శి వై.నరేందర్‌రెడ్డి, జాతీయ కార్యవర్గసభ్యులు కె.సత్యనారాయణ, హెచ్‌యూజే అధ్యక్షులు మహ్మద్ రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'బ్లూవేల్' ఆత్మహత్యలపై దిల్లీ హైకోర్టు ఆందోళన

దిల్లీ: వివాదాస్పద అంతర్జాల ఆత్మహత్యల క్రీడ.. 'బ్లూవేల్ సవాల్' ఆడుతూ చిన్నారులు ఆత్మహత్యలకు పాల్పడుతుండటంపై దిల్లీ హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రీడకు చిన్నపిల్లలంటే ప్రభావితమయ్యారనుకోవచ్చు. వయోజనులెందుకు దీనిమోజులో పడుతున్నారంటూ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గీతామిత్తల్, జస్టిస్ సి.హరిశంకర్‌లతో కూడిన ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఓ లక్ష్యాన్ని నిర్దేశించగానే దాని ప్రకారం భవనం పైనుంచి ఎందుకు దూకుతున్నారని వ్యాఖ్యానించింది. అయితే.. బ్లూవేల్ అనుసంధానాల్ని తొలగించాలని గూగుల్, ఫేస్‌బుక్, యాహూ వంటి అంతర్జాలల కంపెనీలను ఆదేశించాలన్న పిటిషన్ వినతిపై ఆదేశాలు జారీ చేసేందుకు ధర్మాసనం విముఖత చూపింది. బ్లూవేల్ క్రీడను డౌన్‌లోడ్ చేసుకోకుండా ప్రభుత్వ నిషేధ ఉత్తర్వుల గురించి తెలుసుకోవాలనుకుంటున్నట్లు పేర్కొంది. తదుపరి విచారణను 22కు వాయిదా వేసింది. ప్రాణాంతక క్రీడైన బ్లూవేల్ సవాల్‌కు సంబంధించిన అనుసంధానాల్ని తొలగించాలని రెండు రోజుల క్రితం కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ అంతర్జాల దిగ్గజాలు గూగుల్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, మైక్రోసాఫ్ట్, యాహూలను ఆదేశించింది.

- ❑ బ్లూవేల్ క్రీడ కారణంగా అసంబద్ధ ప్రవర్తనతో ఉండే చిన్నారులపై అప్రమత్తంగా ఉండాలంటూ జాతీయ చిన్నారుల హక్కుల పరిరక్షణ కమిషన్(ఎన్‌సీపీసీఆర్) తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు సూచించింది.
- ❑ బ్లూవేల్ క్రీడకు సంబంధించిన సమాచారాన్ని గుర్తించేందుకు హాట్‌లైన్‌నుగానీ, వెబ్‌పోర్టల్‌నుగానీ ఏర్పాటు చేయాలని నాస్కామ్, భారత డేటా భద్రత మండలి పేర్కొన్నాయి. తల్లిదండ్రులు, పాఠశాలలు, కళాశాలల్ని అప్రమత్తం చేయాలని మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖకూ సూచించినట్లు తెలిపాయి.

ఏమిటీ బ్లూవేల్..

బ్లూవేల్.. ఆటను ఆడేవారికి 50 రోజుల వ్యవధిలో శరీరంపై స్వీయగాయాల్ని చేసుకోవడం వంటి రకరకాల ప్రమాదకరం లక్ష్యాలను నిర్దేశిస్తారు. చివరి లక్ష్యంగా ఆత్మహత్యకు పాల్పడాల్సి ఉంటుంది. వివిధ స్థాయిల్లో సవాళ్లను పూర్తిచేసినప్పుడల్లా సంబంధిత చిత్రాలను పంపాల్సి ఉంటుంది. భారత్‌లో రెండువారాల వ్యవధిలో 12 నుంచి 19 ఏళ్ల వయసువారు ఆరుగురికిపైగా ఈ ఆట ఆడుతూ ఆత్మహత్యకు పాల్పడ్డారు. రష్యా, చైనా, సౌదీఅరేబియా, బ్రెజిల్, అర్జెంటీనా, బల్గేరియా, చిలీ, ఇటలీ వంటి దేశాల్లోనూ యుక్తవయస్కుల మరణాలు నమోదయ్యాయి. సామాజిక మాధ్యమాల ద్వారా ఈ క్రీడ విస్తృతంగా వ్యాపించింది.

ఈనాడు

సిక్కులకు దక్కేనా న్యాయం?

ముప్పై మూడేళ్లనాటి సిక్కుల అమానుష ఊచకోతకు సంబంధించి వందల సంఖ్యలో కేసులు ఎందుకని మూసేయాల్సి వచ్చిందో సర్వోన్నత న్యాయస్థానం తాజాగా తెలుసుకోగోరడం, అసంఖ్యాక బాధిత హృదయాలకు చందన లేపనం వంటిది. ఆ ఘోరకలితో ముడివడిన 241 కేసుల మూసివేతలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ణయ ఔచిత్యం ఏపాటిదో ఇద్దరు మాజీ న్యాయమూర్తుల బృందం మూడు నెలల గడువులో నిగ్గు తేల్చాల్సిందిగా సుప్రీంకోర్టు నిర్దేశించింది. ఇందిరాగాంధీ హత్యానంతరం 1984 నవంబరు తొలివారంలో పెచ్చరిల్లిన కిరాతక నరమేధం వేలాది సిక్కు సోదరుల గుండెల్లో ఆరని చిచ్చు రగిలించింది. అప్పట్లో దేశ రాజధానితోపాటు ఉత్తర్ ప్రదేశ్, హరియాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర లాంటిచోట్ల 3300కుపైగా నిండుప్రాణాలు తెగటారిపోయాయి. ఒక్క దిల్లీలోనే 2733 మరణాలు వెలుగుచూశాయి. దారుణ మారణకాండపై దాదాపు 650కేసులు నమోదు చేసిన దిల్లీ పోలీసులు దరిమిలా 241 పైగా అర్ధాంతరంగా మూసేశారు. వాటిని తిరగదోడాలంటూ జస్టిస్ జీపీ మాథుర్ కమిటీ చేసిన సిఫార్సు అనుసారం మోదీ ప్రభుత్వం 2015 ఫిబ్రవరిలో ప్రత్యేక దర్యాప్తు సంఘాన్ని కొలువు తీర్చింది. 'అందుబాటులో ఉన్న సమాచారమంతా పరిశీలించి', 'తగినన్ని సాక్ష్యాధారాలు కొరవడ్డాయంటూ' టోకున కేసుల మూసివేతకు 'సిట్' చేసిన సిఫార్సు హేతుబద్ధతను ఇప్పుడు సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నిస్తోంది. 2006, 2013 సంవత్సరాల్లో నాలుగు కేసుల పునర్విచారణ 35మంది దోషుల నిర్ధారణకు దారి తీయడం తెలిసిందే. తక్షణమే వాటి లోతైన విచారణ సుసాధ్యమైతే, ఇన్నేళ్లుగా న్యాయంకోసం గుండెలవిసేలా రోదిస్తూ బాధితులు సాగిస్తున్న పోరాటం సార్థకమైనట్లు!

అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి గుండెకాయలాంటి రాజధాని నగరం నడిబొడ్డున ముష్కర మూకలు యథేచ్ఛగా చెలరేగి వేల సంఖ్యలో నిస్సహాయ పౌరుల్ని నరికి పోగులుపెట్టిన దురంతాన్ని సభ్యసమాజం ఎన్నటికీ మరువలేదు. అంతటి పైశాచిక హింసాకాండ ప్రణాళికాబద్ధంగా జరిగిందన్న కఠోర యథార్థం బాధిత కుటుంబీకుల్ని నేటికీ క్షోభిల్లజేస్తూనే ఉంది. ఎవర్ని ఏం చేసినా తమకేమీ కాదన్న భరోసా ఉన్నట్లుగా దుండగులు చెలరేగిపోయారంటూ ఆనాటి విషాద వృష్టి నేపథ్యాన్ని జస్టిస్ నానావతి కమిషన్ అక్షరీకరించింది. సిక్కుల దుకాణాల్ని గుర్తించి, లూటీ చేసి, నిప్పుపెట్టారు. మనుషుల్ని ఇళ్లలోంచి బయటకు ఈడ్చుకొచ్చి, మూకుమ్మడిగా దాడిచేసి, మెడలో టైర్లు తగిలించి, పెట్రోలు పోసి అగ్గిపుల్ల గీశారన్న నివేదికాంశాలు నిర్ఘాంతపరచేవే. కాంగ్రెస్ పార్టీకి బలం ఉన్న ప్రాంతాల్లోనే అల్లర్లు చెలరేగాయని, సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎస్ఎం సిక్రీ ప్రభృతులతో కూడిన విచారణ కమిటీలు నిర్ధారించాయి. జగదీష్ టైట్లర్, సజ్జన్ కుమార్ వంటి కాంగ్రెస్ నేతలు, అప్పటి దిల్లీ లెఫ్టినెంట్ గవర్నరు, పోలీస్ కమిషనర్ల ప్రత్యక్ష పాత్రపై గగ్గోలు పుట్టినా- మసిపూసి మారేడు చేసే యత్నాలు జోరెత్తాయి. వివిధ కమిటీలు, విచారణ సంఘాలు ఎవరెవరిపై చర్యలు చేపట్టాలో సూటిగా సూచించినా, ఎవరి మీదా ఈగైనా వాలకుండా మునుపటి యూపీఏ నేతాగణం వ్యవస్థల్ని కప్పిపుచ్చడంలో అహరహం శ్రమించి తరించిపోయింది. రాజకీయ నాయకుల్ని నిందితులుగా పేర్కొంటూ బాధితులు దాఖలు చేసిన ప్రమాణ పత్రాల్ని ప్రభుత్వం తొక్కిపట్టిందని, ఈ కేసుల్ని విచారించిన దిల్లీ అదనపు సెషన్స్ న్యాయమూర్తి 1996లోనే వ్యాఖ్యానించారు. ఆ అసలు నేరగాళ్ల ముసుగులు తొలగాలిప్పుడు!

న్యాయ నిర్ణయంలో జాప్యం న్యాయ నిరాకరణేనని గతంలో న్యాయపాలికే స్పష్టీకరించింది. గల్లీ గల్లీ వెదికి కనిపించిన సిక్కు నల్లా పొట్టన పెట్టుకునేలా అసాంఘిక శక్తుల్ని రెచ్చగొట్టి ఉసిగొల్పిన కర్కశ తండాలకు శిక్ష పడేదెప్పుడని తడి ఆరని కళ్లు భారతీయ శిక్షాస్మృతిని ఇప్పటికీ ప్రశ్నిస్తున్నాయి. గడచిన 33ఏళ్లలో సుమారు 22ఏళ్లు కేంద్రంలో గుత్తపెత్తనం చలాయించిన కాంగ్రెస్, సాక్ష్యాల్ని చాపచుట్టేసింది. 1984 మారణకాండను దేశ విభజన నాటి మత ఘర్షణలతో సరిపోల్చి సమస్యను పక్కదారి పట్టించడానికి, దాడులు దొమ్మీల వెనక ఉన్నది రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అంటూ బురద జల్లడానికి సైతం యూపీఏ నేతలు పోటీపడ్డారు. మూసిపెడితే మాసి పోయేదా నాటి ఘోరం? తనవంతుగా జస్టిస్ నానావతి కమిషన్ రెండు వందల మంది సాక్షుల్ని విచారించి, పదివేల ప్రమాణ పత్రాల్ని క్షుణ్నంగా పరిశీలించి విశ్వసనీయ రుజువులున్నట్లు ధ్రువీకరించింది. ఇప్పుడు అనేకమంది సాక్షులు, నిందితులు భౌతికంగా కనుమరుగయ్యారు, దశాబ్దాల క్రితం నాటి పత్రాలు ఛిద్రమయ్యే దశలో పునర్విచారణ ఎలా గాడిన పడుతుందోనన్న సందేహాలు వేధిస్తున్నాయి. తమవాళ్ల ధన మాన ప్రాణాలు కర్కశంగా కబళించిన నరరూప రాక్షసులు కళ్లముందే బోర విరుచుకు తిరుగుతున్నారని బాధితులెందరో ఆక్రోశిస్తున్నారు. 1984 అల్లర్లలో మరణించిన సిక్కు కుటుంబాలకు అదనపు పరిహారం ప్రకటిస్తూ కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పినట్లు- బాధ్యుల్ని శిక్షిస్తేనేగాని బాధితులకు ఊరట లభించదు. 'హమే ఇన్సాఫ్ కబ్ మిలేగా (మాకు న్యాయమెప్పుడు దక్కుతుంది?)' అని ఆర్తిగా ప్రశ్నిస్తున్న బాధాతప్త హృదయాలను సాంత్వనపరచడమే నేడు న్యాయపాలిక ఎదుట ఉన్న గడ్డు సవాలు. సుప్రీం చొరవతో ఇద్దరు మాజీ న్యాయమూర్తుల పర్యవేక్షణ కమిటీ అందుకు బాటలు పరుస్తుందా? న్యాయం ఎండమావి కాదని నిరూపితమవుతుందా?

రాజుకుంటున్న కుంపటి!

'నేను కన్నెర్ర చేస్తే అమెరికా భస్మీపటలమైపోతుంది' అంటూ ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ అన్ బీరాలు పలకడం వెనక అభద్రతా భావన దాగి ఉంది. అమెరికా, దక్షిణ కొరియాలు తమపై ఎప్పుడు దాడిచేస్తాయోనని అనుక్షణం ఆందోళన చెందే కిమ్- దాన్ని కప్పిపుచ్చుకోవడానికి అణ్వస్త్ర పరీక్షలు, క్షిపణి పరీక్షలు జరుపుతుంటారు. దక్షిణ కొరియాను మంటల్లో ముంచెత్తుతానని, అమెరికాను అణ్వస్త్రాలతో మసి చేస్తానని హెచ్చరిస్తూ ఉంటారు. కానీ, ఇంతవరకు ఎన్నడూ అమెరికా యుద్ధవిమానం మీద కానీ, సైనిక స్థావరం మీద కానీ ఒక్క తూటా కూడా పేల్చలేదు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌ను హత్య చేయడానికి అమెరికా, దక్షిణ కొరియా గూఢచారి సంస్థలు కుట్ర పన్నుతున్నాయని ఐక్యరాజ్యసమితిలోని ఆ దేశ ప్రతినిధి వర్గం మే 11న ఆరోపించింది. అప్పటినుంచి పరిస్థితి వేడెక్కి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వరస హెచ్చరికలు జారీచేయసాగారు. దానికి ప్రతిగా అణ్వస్త్ర సహిత ఖండాంతర క్షిపణిని సిద్ధంచేయనున్నట్లు కిమ్ సర్కారు ప్రకటించింది.

ఏటా ఆగస్టు 21న తన సరిహద్దుల్లో అమెరికా, దక్షిణ కొరియాలు జరిపే సంయుక్త సైనిక విన్యాసాలను; గ్వామ్ దీవి నుంచి తన సరిహద్దు సమీపంలోకి తరచూ అమెరికా బాంబర్ విమానాలు రావడాన్ని కవ్వింపు చర్యలుగా ఉత్తర కొరియా పరిగణిస్తోంది. వీటిని కట్టిపెట్టకపోతే అమెరికా అధీనంలోని గ్వామ్ దీవి సమీపంలోకి క్షిపణులను ప్రయోగిస్తానని హెచ్చరించింది. దానితో ఆగస్టు అయిదున ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఉత్తర కొరియాపై కఠిన ఆంక్షలు విధించగా- అందుకు చైనా, రష్యాలు మద్దతు తెలిపాయి. ఆ తరవాత నుంచి అమెరికా, ఉత్తర కొరియాల మధ్య వాగ్యుద్ధం తీవ్రతరమైంది. ఉత్తర కొరియా విమోచన దినమైన ఆగస్టు 15నాడు క్షిపణి ప్రయోగం జరుగుతుందేమోనని ప్రపంచం ఊపిరి బిగపట్టి చూసింది. కానీ ఐరాస ఆంక్షలను అనుసరించి ఉత్తర కొరియా నుంచి దిగుమతులను చైనా నిలిపివేయడంతో, కిమ్ దిగిరాక తప్పలేదు. అంతమాత్రాన కిమ్ పూర్తిగా వెనక్కి తగ్గినట్లు భావించలేం. మరోవైపు క్షిపణి ప్రయోగాలను కిమ్ విరమించడం తన ఘనతేనని ట్రంప్ గర్వంగా 'ట్వీట్' చేశారు. కానీ ఇది మూన్నాళ్ల ముచ్చటగా మిగిలే ప్రమాదం లేకపోలేదు.

చైనా పాత్ర అత్యంత ప్రధానం

రేపు ఏం జరుగుతుందో అంచనా వేయాలంటే అధికార స్థానాల్లో ఉన్నవారి వ్యక్తిగత లక్షణాలతోపాటు భౌగోళిక-రాజకీయ పరిస్థితులనూ పరిగణనలోకి తీసుకోవాలి. రంగంలో ఉన్న ఇతర పాత్రధారులు, సూత్రధారులను- ముఖ్యంగా చైనాను విస్మరించరాదు. ఇప్పటికే ప్రపంచం దృష్టి దక్షిణ చైనా సముద్రంలో చైనా నిర్మించిన కృత్రిమ దీవులపై నుంచి ఉత్తర కొరియా సంక్షోభం మీదకు మళ్లింది. దాంతో సందట్లో సడేమియాలా డోక్లామ్‌లో తిష్ఠ వేయడానికి చైనా ప్రయత్నించగా, భారత్ వెంటనే అడ్డుకట్ట వేసింది. అమెరికా ఒకవైపు ఉత్తర కొరియాను దారికి తీసుకురావాలంటూ చైనాను కోరుతూనే, భారత్‌ను కూడా ఒక పాత్రధారిని చేయాలని యోచిస్తోంది. భారత్ చెబితే కిమ్ ప్రభుత్వం వింటుందని అమెరికా నౌకాదళ పసిఫిక్ విభాగాధిపతి అడ్మిరల్ హ్యారీ హ్యారిస్ సూచించడంలో ఆంతర్యమిదే. కిమ్ దుష్టబాలుడి పాత్రను రక్తి కట్టించడంలో ఉద్దేశం, తమ జోలికి ఎవరూ రావద్దని ఇతరులను బెదిరించడమే! ఉత్తర కొరియా ఎంతో కాలంగా దక్షిణ కొరియా, జపాన్‌లపై వేలాది ఫిరంగులను మోహరించినా వాటికి ఎన్నడూ పనిచెప్పలేదు. కిమ్ చీటికిమాటికి చేసే దబాయింపులను గతంలో అమెరికా అధ్యక్షులు గంభీరంగా తీసుకొనకపోవడం వల్ల పరిస్థితి ఎన్నడూ చేయిదాటిపోలేదు. తనపై అంతర్జాతీయ ఒత్తిళ్లను తగ్గించుకొని ఏవైనా రాయితీలు పొందాలన్న ఆశతోనే కిమ్ తొడ కొడతారని పూర్వ అమెరికా అధ్యక్షులకు తెలుసు. అందువల్ల వారు ఎన్నడూ కిమ్‌పై మాట తూలలేదు. పైగా 2006లో ఉత్తర కొరియా తొలి అణ్వస్త్ర పరీక్ష జరిపినప్పుడు, అణు రియాక్టర్‌ను మూసివేసే షరతుపై అమెరికా 40 కోట్ల డాలర్ల ఆర్థిక సహాయం అందించింది. కిమ్ దాన్ని గుటకాయ స్వాహా చేసి యథాప్రకారం అణు కార్యక్రమం కొనసాగించారు. బుజ్జగింపులు పనిచేయవని గ్రహించిన అమెరికా అధ్యక్షులు అప్పటినుంచి ఐక్యరాజ్యసమితి ద్వారా ఆర్థిక ఆంక్షలు విధించి ఉత్తర కొరియాను దారికి తీసుకురావాలని చూసేవారు. కానీ ట్రంప్ తీరు వేరు. కిమ్ పట్ల పూర్వ అధ్యక్షుల విధానాలు పనిచేయలేదని భావిస్తూ, కిమ్ సర్కారుకు హెచ్చరికగా ట్వీట్లు సంధిస్తున్నారు.

దానికి ప్రతిగా కిమ్ ప్రభుత్వం- అమెరికా శత్రు వైఖరిని మానుకోనంతవరకు అణు, క్షిపణి కార్యక్రమాల గురించి చర్చించబోమని తెగేసి చెప్పింది. ఆగస్టు 21 నాడు అమెరికా-దక్షిణ కొరియాలు సైనిక విన్యాసాలను నిలిపివేస్తే ఉత్తర కొరియా తన అణ్వస్త్ర కార్యక్రమాన్ని ఆపేస్తుందని చైనా ప్రతిపాదించింది. రష్యా కూడా దాన్ని సమర్థించింది. కానీ మాట తప్పడం కిమ్ సర్కారుకు అలవాటు అంటూ అమెరికా ససేమిరా అన్నది. 'కిమ్ నోట మళ్లీ ఒక్క బెదిరింపు వచ్చినా, గ్వామ్ లేదా మరే అమెరికా భూభాగంపై కానీ, అమెరికా మిత్రరాజ్య భూభాగంపై కానీ కవ్వింపునకు దిగినా ఆయన చింతించాల్సి వస్తుంది' అని ట్రంప్ హెచ్చరించారు. అవసరమైతే ఉత్తర కొరియాపై సైనిక చర్యకు సిద్ధమనీ స్పష్టీకరించారు. స్వదేశంలో పలు రకాలుగా ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న ట్రంప్ నిజంగా ఆ పనిచేస్తారేమోనని ఆందోళన ముప్పిరిగొంటోంది. అమెరికా అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన ఈ ఏడు నెలల్లో ట్రంప్ సొంత మంత్రులను, సొంత పార్టీవారినీ బహిరంగంగా అవమానించారు. స్వదేశ గూఢచారి సంస్థలను చులకన చేశారు. అమెరికా-నాటో సంబంధాలను బహిరంగంగా ప్రశ్నించారు. పశ్చిమాసియాలో అమెరికా అనుచర దేశమైన ఖతార్‌ను శిక్షిస్తానని బెదిరించారు. 'టీపీపీ' నుంచి వైదొలగి జపాన్, ఆస్ట్రేలియా, వియత్నామ్‌లను నట్టేట వదిలారు. సన్నిహిత మిత్రదేశాలైన కెనడా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, జర్మనీలను అవమానించారు. అలాంటి వ్యక్తి ఉత్తర కొరియా మీద దుందుడుకు చర్యకు వెనకాడకపోవచ్చునన్న భయాలున్నాయి.



కిమ్ కవ్వింపులు - ట్రంప్ తెంపరితనం

దేశాధ్యక్షుడు కావడానికి ముందు ట్రంప్ 'ది అప్రెంటిస్' అనే రియాలిటీ టీవీ షో ద్వారా ప్రసిద్ధులయ్యారు. ఆ షోలో ఓడిపోయిన పోటీదారుడి వంక పిస్తోలు మాదిరిగా చేతి వేళ్లు మడిచి ట్రిగ్గర్ నొక్కినట్లు అభినయిస్తూ 'యూ ఆర్ ఫైర్డ్' (నీకు ఉద్వాసన చెబుతున్నా) అని ప్రకటించేవారు. అధ్యక్షుడయ్యాక ఆ చేతి తుపాకీని అటార్నీ జనరల్ శాలీ యేట్స్, అటార్నీ ప్రీత్ భరారా, ఎఫ్‌బీఐ డైరెక్టర్ జేమ్స్ కోమేలపై గురిపెట్టి పదవుల నుంచి సాగనంపారు. తన గెలుపు వెనక చాణక్యుడిలా నిలిచిన స్టీవ్ బ్యానన్‌ను జాతీయ భద్రతా మండలి పదవి నుంచి తొలగించారు. అధ్యక్ష భవన సిబ్బంది అధికారి రీన్స్ ప్రీబస్‌ను, పత్రికా వ్యవహారాల ప్రతినిధి షాన్ స్పైసర్‌లనూ వదిలించుకున్నారు. అమెరికా ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందనే ఆరోపణలపై విచారణ జరపడానికి నియుక్తుడైన రాబర్ట్ ముల్లర్‌కు ఉద్వాసన చెప్పాలని యోచించారు. అటార్నీ జనరల్ జెఫ్ సెషన్స్ మీద కూడా కోపం వ్యక్తం చేశారు. ఇక ఇప్పుడు ట్రంప్ నోటి తుపాకిని ఉత్తర కొరియా మీదకు తిప్పారు. కిమ్ ప్రభుత్వం అవివేకంగా ప్రవర్తిస్తే దానికి బుద్ధి చెప్పడానికి తుపాకీ గుళ్లు దట్టించి సిద్ధంగా ఉన్నామని ట్వీట్ చేశారు. కానీ, అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిలర్ సన్, రక్షణ మంత్రి జిమ్ మ్యాటిస్‌లు రాజకీయ, ఆర్థిక ఒత్తిళ్లతో ఉత్తర కొరియాను దారికి తెచ్చి, పరిస్థితి చేయిదాటిపోకుండా చూడాలని ప్రయత్నిస్తున్నారు. కిమ్ ప్రభుత్వంతో అమెరికన్లు తెరచాటు మంతనాలూ జరుపుతున్నారు. కానీ, ట్రంప్ వైఖరితో ఈ యత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరవుతాయని భయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగని ప్రస్తుత కల్లోల స్థితికి ఒక్క ట్రంప్‌నే నిందించడం సరికాదు. రెండు చేతులూ కలిస్తేనే చప్పట్లు. అణ్వస్త్రాలు సమకూర్చుకోకుండా ఉత్తర కొరియాను నిరోధించడానికి గతంలోనూ ఆర్థిక ఆంక్షలు విధించినా, దౌత్య ప్రయత్నాలు చేసినా ఉపయోగం లేకుండా పోయిందని ట్రంప్ విమర్శించడం సబబే. ఇప్పటికే వాషింగ్టన్, న్యూయార్క్‌లను తాకగల ఖండాతర క్షిపణులను ఉత్తర కొరియా పరీక్షించింది. వీటికి అమర్చడానికి చిన్న సైజు అణుబాంబులను ఒక్క ఏడాదిలోనే తయారు చేయగల సత్తా దానికి ఉంది. అంతేకాకుండా కిమ్ ప్రభుత్వం ఏ క్షణమైనా ఆరో అణ్వస్త్ర పరీక్ష జరపవచ్చునని నిపుణులు భావిస్తున్నారు.

అంతర్జాతీయ సమాజం ఆందోళన

ఈ ప్రయత్నాలను అడ్డుకోవడానికే ఐక్యరాజ్య సమితి ఆంక్షలు విధించింది. వీటికి తోడు సంక్షోభ పరిష్కారానికి చైనా మధ్యవర్తిత్వం వహించాలని ట్రంప్ కోరారు. కానీ, కిమ్ తన మాట వినే స్థితిలో లేరంటోంది చైనా. ట్రంప్‌కు ఈ మాటలు నమ్మశక్యంగా లేనట్లుంది. అందునేమో చైనా అనుచిత వ్యాపార విధానాలపై దర్యాప్తు జరపాలని ఆదేశించి ఒత్తిడి పెంచుతున్నారు. నేడు ప్రపంచంలో చైనాకు అనుంగు అనుచరులు- ఉత్తర కొరియా, పాకిస్థాన్‌లు మాత్రమే. ఉత్తర కొరియా అణ్వస్త్రానికి పాకిస్థాన్ అండదండలు ఉన్నాయన్నది బహిరంగ రహస్యం. గతంలో అంతర్జాతీయ ఆంక్షల నుంచి ఉత్తర కొరియాను ఆర్థికంగా ఆదుకున్నదీ చైనాయే! ఇప్పుడు కిమ్ తన మాట వినడంలేదని చైనా చెబుతున్నా, కిమ్ దూకుడు వల్ల అమెరికా దృష్టి దక్షిణ చైనా సముద్రం నుంచి మళ్లడం చైనాకే ప్రయోజనకరం. ఉత్తర కొరియా క్షిపణులను అడ్డుకోవడానికి దక్షిణ కొరియాలో అమెరికా మోహరించిన థాడ్ వ్యవస్థ తనకు ప్రమాదకరమని చైనా అభ్యంతరపెడుతోంది. ఉత్తర కొరియాతో వ్యాపార సంబంధాలున్న చైనా కంపెనీలపై అమెరికా ఆంక్షలు విధించడాన్ని తప్పుపడుతోంది. తైవాన్‌తో అమెరికా సైనిక సంబంధాలు విస్తరించడంపై రుసరుసలాడుతోంది. ఉత్తర కొరియా సంక్షోభ పరిష్కారంలో చైనా తోడ్పడాలంటే, అమెరికా భారీ ప్రతిఫలం చెల్లించుకోవాలన్న మాట. అయినా కిమ్ సర్కారుపై ఐరాస ఆంక్షలకు చైనా మద్దతు తెలపడం సానుకూల సూచన. అమెరికా, ఉత్తర కొరియా ఘర్షణ పంథా విడనాడి సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలని చైనాతో పాటు జర్మనీ కూడా హితవు చెప్పింది. ఈ మాటలను ట్రంప్ తలకెక్కించుకోవడం లేదు. స్వదేశంలో సవాళ్లు, ఒత్తిళ్ల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి ట్రంప్, కిమ్‌లు ఏదైనా దుస్సాహసానికి పాల్పడతారేమోనని అంతర్జాతీయ సమాజం ఆందోళన చెందుతోంది. ఉత్తర కొరియా కాని అమెరికాపై క్షిపణి ప్రయోగానికి దిగితే దానికి తమ మద్దతు ఉండదని; అదే అమెరికా, దక్షిణ కొరియాలు దాడి చేస్తే ఉత్తర కొరియాకు తాము అండగా వస్తామని చైనా అధికార పత్రిక 'గ్లోబల్ టైమ్స్' హెచ్చరించింది. ఉత్తర కొరియాపై అన్యాయంగా దాడి జరిగితే చైనా ఆదుకోవాలని రెండు దేశాల మధ్య 1961లో కుదిరిన ఒప్పందం నిర్దేశిస్తోంది. కాబట్టి ట్రంప్ దుందుడుకు చర్యలకు పాల్పడితే పెను ప్రమాదం వచ్చిపడవచ్చు. దీన్ని నివారించడానికి ఐక్యరాజ్యసమితి వేదికగా ఉభయుల మధ్య సామరస్య సాధనకు కృషి జరగాలి.

- కైజర్ అడపా

పత్తి రైతుకు కొత్త చిక్కు



డాక్టర్ పరిటాల పురుషోత్తం

భారత్‌తో పాటు ప్రధాన పత్తి ఉత్పత్తి దేశాలైన అమెరికా, చైనా, బ్రెజిల్, పాకిస్థాన్‌లలోనూ 2017-18లో పత్తి విరగపండనుంది. ఇటీవల వాతావరణం అనుకూలించడమే దీనికి కారణం. దీనితో ప్రపంచ విపణిలోకి పత్తి ఊహించిన దానికన్నా ఎక్కువగా ప్రవేశించనుంది. భారత్‌లో గత సంవత్సరం 96.40 లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేయగా, ఈ ఏడాది పంట విస్తీర్ణం 1.14 కోట్ల హెక్టార్లకు పెరిగింది. ఇది ఏకంగా 18.51 శాతం పెరుగుదల. తెలంగాణలో పత్తి విస్తీర్ణం గత ఏడాది 14.1 లక్షల హెక్టార్ల నుంచి ఈ ఏడాది 17.5 లక్షల హెక్టార్లకు పెరిగింది. తదనుగుణంగా తెలంగాణలో పత్తి ఉత్పత్తి 50 లక్షల బేళ్ల నుంచి ఈ ఏడాది 70 లక్షల బేళ్లకు పెరగనున్నది. దేశంలో పత్తి పండించే ఇతర రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి. ఇంతకుముందు కంది, పెసర, వేరుసెనగ పంటలు వేసిన రైతులు గత ఏడాది పత్తికి మంచి ధర రావడంతో ఈ ఏడాది పత్తికి మారారు. అప్పట్లో క్వింటా పత్తి మార్కెట్ ధర, కనీస మద్దతు ధరను మించింది. కనీస మద్దతు ధర రూ. 4000 కాగా విపణిలో రూ. 4,500-రూ. 5,000 ధర పలికింది. అందుకే రైతులు ఈ ఏడాది పత్తి వైపు మళ్లారు. కానీ ప్రపంచంలో ఇప్పటికే పత్తి నిల్వలు కొండలా పేరుకుపోయాయి. ఈ సమయంలో మనదేశంలో పత్తి పంట విస్తీర్ణం అసాధారణంగా పెరగడం ఆందోళనకరం. ఈ పరిణామం ఒక్క భారత్‌కే పరిమితం కాదు. 2017-18లో ప్రపంచ పత్తి ఉత్పత్తి 8 శాతం పెరిగి 2.49 కోట్ల టన్నులకు చేరుతుందని వాషింగ్టన్‌లోని అంతర్జాతీయ పత్తి సలహా సంఘం లెక్కగట్టింది. కానీ, వినియోగం మాత్రం కేవలం 2 శాతం పెరిగి 2.5 కోట్ల టన్నులకు చేరుతుంది. గత ఏడాది పేరుకున్న పత్తి నిల్వలతో కలిపి ఈ ఏడాది మిగులును కలుపుకొంటే గిరాకీ కన్నా పత్తి సరఫరా చాలా ఎక్కువగా ఉండబోతోందని తెలుస్తోంది.

అత్యవసర ప్రణాళికల లేమి

ప్రపంచ పత్తి ఉత్పత్తిలో 62 శాతం భారత్, అమెరికా, చైనాల నుంచే వస్తోంది. చైనాలో గత అయిదు సీజన్ల నుంచి పత్తి పంట విస్తీర్ణం తగ్గుతూ వచ్చినా, ఈ ఏడాది 3 శాతం పెరిగి 29 లక్షల హెక్టార్లకు చేరనున్నది. అమెరికాలో పంట విస్తీర్ణం 12 శాతం పెరిగి 43 లక్షల హెక్టార్లకు చేరుతుంది. అక్కడ పత్తి ఉత్పత్తి 8 శాతం పెరిగి 40 లక్షల టన్నుల స్థాయిని అందుకొంటుందని అమెరికా వ్యవసాయ శాఖ తెలిపింది. అధిక పంట చేతికి రావడం వల్ల 2017-18లో బ్రెజిల్, అమెరికా, పాకిస్థాన్‌లలో పత్తి నిల్వలు పెరుగుతాయి. ఈ కారణాల వల్ల 2017-18లో పత్తి ధరలు కనీసం 18 శాతం తగ్గుతాయని అంతర్జాతీయ పత్తి సలహా సంఘం అంచనా. పంట ఉత్పత్తి, నిల్వలు పేరుకుపోయినప్పుడల్లా ధరలు తగ్గడం సహజం. భారతీయ పత్తి మార్కెట్‌లో కూడా భారీగా పత్తి నిల్వలు పోగుపడనున్నాయి. దీనివల్ల ధరలు పతనం కాకుండా ఆపడం రైతుల వల్ల కాదు. కాబట్టి వారిని ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యవసర ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలి.

తక్కువ ధరలకు పుష్కలంగా పత్తి లభిస్తే జౌళి మిల్లులకు సహజంగానే లాభాలు పండుతాయి. జీఎస్టీ వల్ల కలిగే ప్రయోజనం అదనం. మిల్లులు కేవలం లాభం కోసమే పాకులాడకుండా రైతుల మేలునూ దృష్టిలో ఉంచుకోవాలి. ముఖ్యంగా కౌలు రైతుల ప్రయోజనాలను కాపాడాలి. పత్తి ధర క్వింటాకు రూ. 5,000 పలికినా కౌలు రైతులకు నష్టమే మిగులుతుంది. విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులకు కౌలు మొత్తాన్ని కూడా కలుపుకొంటే ఎకరాకు రూ. 41,000 ఖర్చు లెక్కతేలుతుంది. పంట దిగుబడి ఎంత దండిగా వచ్చినా, కౌలు రైతులకు ప్రతి ఎకరాకు గిట్టుబాటయ్యే మొత్తం రూ. 40,000కు మించదు.



కొండలా నిల్వలు... కొనేదెవరు?

రైతులు నష్టానికి తెగనమ్ముకోవలసిన పరిస్థితి ఏర్పడకుండా చూడటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీ పత్తి సేకరణ విధానాన్ని చేపట్టాలి. కనీస మద్దతు ధర చెల్లించడానికి కావలసిన నిధులను సిద్ధం చేసుకోవాలి. పత్తి సేకరణ, మార్కెటింగ్‌లకు తగు ఏర్పాట్లు చేయాలి. కేంద్రం అవసరమైన సంఖ్యలో పత్తి పరీక్షా కేంద్రాలను నెలకొల్పాలి. నాణ్యత దెబ్బతినకుండా పంటను మార్కెట్ యార్డుకు తీసుకెళ్లడానికి సబ్సిడీపై సంచులు అందించాలి. ఇప్పుడు పత్తి కొనుగోలు కేంద్రాలు వారంలో అయిదు రోజులే పనిచేస్తున్నాయి. భారీగా పంట వచ్చే కేంద్రాల్లోనైనా అవి ఆరు రోజులు పనిచేయాలి. భారత పత్తి సంస్థ (సీసీఐ) కావలసిన సంఖ్యలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. కనీస మద్దతు ధరను, ప్రభుత్వ సంస్థల కొనుగోలు ధరను స్వల్పంగానైనా పెంచడం ద్వారా ప్రభుత్వం రైతులకు ఊరట కలిగించాలి. చైనా వంటి దేశాలు భారత విపణిలో చౌక పత్తిని గుమ్మరించకుండా దిగుమతులపై ఆంక్షలు విధించాలి.

సీసీఐ బాధ్యతలెన్నో!

వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్ కమిటీ(ఏపీఎంసీ)లు నిర్దేశిత మార్కెట్ యార్డుల్లో నిర్వహించే బహిరంగ వేలంలో భారత పత్తి సంస్థ (సీసీఐ) పాల్గొని ముడి పత్తి (కపాస్)ని సరైన ధరకు కొనుగోలు చేస్తూ ఉండాలి. పత్తి పంట మార్కెట్‌కు వచ్చే రోజు మొదలుకొని చివరిరోజు వరకు సీసీఐ అధికారులు యార్డుల్లోనే ఉండాలి. ఏపీఎంసీ అధికారుల సమక్షంలో వ్యాపారులు, మిల్లులు పోటీపడి తక్కువ ధరలకు ముడి పత్తిని కొనేట్లు ఏర్పాట్లు చేయాలి. పత్తి విస్తారంగా పండే రాష్ట్రాలు, జిల్లాల్లో తగినన్ని సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు భరోసా ఇవ్వడం ఎంతో అవసరం. ముడి పత్తి ధర- కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కి దగ్గరగా వచ్చినప్పుడల్లా సీసీఐ తక్షణం రంగంలో దిగి ఎంఎస్‌పీకి కొనుగోళ్లు జరపాలి. ఈ కొనుగోళ్లకు ఒక పరిమితి పెట్టుకోకూడదు. రైతులు తమ ఉత్పత్తిని తెగనమ్ముకోవలసిన దుస్థితి రాకుండా అడ్డుకోవడానికి ఈ పద్ధతి తోడ్పడుతుంది. దీనంతటికీ సీసీఐ పటిష్ఠమైన మౌలిక వసతులను ఏర్పరచాలి. రైతులు ముడి పత్తిని అమ్మడానికి దూరాభారం ప్రయాణించనక్కర్లేకుండా ఎక్కడికక్కడ శాశ్వత ప్రాతిపదికపై ప్రధాన సేకరణ కేంద్రాలను నెలకొల్పి, పత్తి 'ప్రాసెసింగ్' కేంద్రాలకు దగ్గర్లో ఉప కేంద్రాలను ప్రారంభించాలి. ముడి పత్తిని ఎంఎస్‌పీపై కొనడమే కాదు, రైతులకు నగదును సకాలంలో చెల్లించినప్పుడే వారు పత్తి సాగుపై ఆసక్తి చూపుతారు. అవినీతికి తావు లేకుండా అన్ని చెల్లింపులనూ నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేయాలి. ఆ సొమ్మును తీసుకోవాలంటే రైతులు ఏపీఎంసీ యార్డుల్లో తాము అమ్మిన పత్తికి రసీదులను, పంట దిగుబడి అంచనాలు, ఇతర యాజమాన్య పత్రాలను చూపాలని నిబంధన విధించాలి. గతంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో సీసీఐ పత్తి సేకరణలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. సీసీఐ అధికారులు వ్యాపారులతో కలిసి ధరలు తగ్గించి రైతులను లూటీ చేసిన ఉదంతాలు గతంలో చాలానే జరిగాయి. పత్తి సేకరణ కేంద్రాలను తెరవడంలో ఆలస్యం చేయడం, రైతుల నుంచి నేరుగా కొనకుండా దళారుల నుంచి కొనుగోలు చేయడం వంటి ఎత్తుగడలు పాటించేవారు. గత ఏడాది వ్యాపారులు రైతుల నుంచి క్వింటా పత్తిని రూ. 3,500-రూ. 3,700 మధ్యన కొని సీసీఐకి రూ. 4,050కి అమ్ముకున్నారు. మార్కెట్‌యార్డు, సీసీఐ అధికారులు కుమ్మక్కై పత్తి సేకరణ ధరను బాగా తగ్గించేశారు. ఇలాంటివి మళ్లీ జరగకుండా జాగ్రత్త తీసుకోవాలి.

(రచయిత- 'సెస్'లో ఆచార్యులు)

చకోర పక్షి

కొందరు సాధకులు పలు సందేహాలతో సతమతమవుతుంటారు. 'భగవంతుడు నా అర్చనాది ఆరాధనల్ని, భక్తి సాధనల్ని స్వీకరిస్తున్నాడా- కనీసం గమనిస్తున్నాడా' అని సందేహిస్తుంటారు. 'నేనంటే ఒక అర్భకుణ్ని. తన కోసం తపిస్తున్నానన్న విషయమైనా దైవం దృష్టికి వెళ్లిందా, మళ్లిందా' అని ఊగిసలాడుతుంటారు. ఆ సందేహాల్లోని అంశాలు సబబే అయినా- అనంతమంత భగవంతుణ్ని అణువంత భక్తుడు మెప్పించడమా? ఆ మాట అటుంచి, భగవంతుడి దృష్టికి వెళ్లేంత స్థాయి సైతం భక్తుడి పరిమాణానికి లేదే! అర్భకుడైన ఆ సాధకుడికి అటువంటి సందేహాలు కలగడం సహజమే, సమంజసమే!

భగవంతుడు సర్వాంతర్యామి. సర్వద్రష్ట. అణువు నుంచి అనంతం వరకు అన్నీ తానే అయిన ఆయన దృష్టిలో- కానిదేదీ లేదు, లేనిదేదీ లేదు. అది భక్తి సాధన కావచ్చు, మరేదైనా కావచ్చు. భక్తుడు సాధన చేస్తే, అది దైవం పరిధిలోని వ్యవహారమే తప్ప అన్యం కాదు. ధ్యేయం దైవమే అయినప్పుడు, ఆయనకు సంబంధం లేకుండా ధ్యానం చేయడం ఎవరికైనా ఎలా కుదురుతుంది?

పరిధి, పరిమితి లేని భగవంతుడు; అనంతమే తానైన భగవంతుడు తనను తాను వెతుక్కునే పని ఉండదు. మరి దేన్నో గుర్తించాల్సిన అగత్యమూ ఆయనకు లేదు. తనను గుర్తించేందుకు తాను కాక అక్కడ మరొకరు ఎవరున్నారు? కనురెప్ప కంటిని వెతుక్కోదు. కన్ను, రెప్ప- ఆ రెండూ వేరు కాదు. రెండూ కలిసే కన్ను అవుతుంది. భక్తుడైనా, భగవంతుడైనా అంతే!

కోటీశ్వరుడైనప్పటికీ, తండ్రి తన బిడ్డ తాలూకు చిల్లిగవ్వను కూడా భద్రపరుస్తాడు. అదేవిధంగా భగవంతుడూ వ్యవహరిస్తాడు. భక్తుడి అణుమాత్రపు ప్రేమ సాధననైనా ఆయన ప్రీతితో స్వీకరిస్తాడు. కుచేలుడి అటుకుల్ని కృష్ణుడు స్వీకరించినట్లు, తానూ అందుకొని గుండెలో పదిలపరచుకుంటాడు.

భక్తుడి ప్రేమ సూక్ష్మాంకురంలా ఉదయించడమే ఆలస్యం- దాన్ని మారాకు కూడా వేయనివ్వనంత ఆతృత దైవానిది! పాదు, నీళ్లు, ఎరువు, కంచెతో సహా చూసుకుంటాడు. భక్తి తోటకు వనమాలి తానే అవుతాడు.

భక్తుడు రెండు చేతులెత్తి నమస్కరించగానే, సందేహ రహితంగా వెంటనే దాన్ని స్వీకరించేందుకు భగవంతుడు సిద్ధంగా ఉంటాడు.



అంతర్యామి

అప్పటికే అక్కడ ఆయన సంసిద్ధమయ్యాడని దీని అర్థం. మరో అద్భుతమైన, నమ్మశక్యం కాని విషయం ఒకటుంది. ఆ భక్తి తనదే అని సాధకుడు అనుకుంటాడు. తన వైపు నుంచే అది ప్రారంభమైందని భావిస్తాడు. అతడు 'రామా!' అంటే- ఆ శబ్దం ముందుగా ఆయనను చేరనిదే, భక్తుడి నోట పలకదు. ఆ హృదయంలో ఉదయించదు. భక్తి, దాని సేకరణ- ఏకకాలంలో జరిగే ఐక్య ప్రక్రియ.

సాధకుడి పిలుపు భగవంతుణ్ని చేరడానికి క్షణకాలమే! కాంతి, మనోవేగాల కన్నా అది ఎక్కువ. ప్రతిధ్వనిలా ఆ పిలుపు చేరుతుంది. భక్తుడి పిలుపు వెంటే భగవానుడి పలుకు... అదీ ఏక కాలంలో, ఏక నాదంలో! ఇక ఆరాధనను ఆయన అందుకోనిది ఎప్పుడు?

దైవం అనుగ్రహం లేనిదే- భక్తుడు శివనామాన్ని జపించలేడు. రామ నామాన్ని స్మరించలేడు. సదా స్మరణలు, తీవ్ర సాధనలు ఇంకెక్కడ? భక్తుడి సాధనను భగవానుడు అంగీకరించడమో, అనుగ్రహించడమో కాదు. మొదట అది లభిస్తే కానీ, భక్తుడు తన సాధన ప్రారంభించలేడు.

సందేహ రహితమైనది, పూర్తి భరోసా కలిగించేది- భక్తిసాధన ఒక్కటే! భక్తి, దాని స్వీకరణ ఫలితం... అవి ఒకటి తరవాత ఒకటి కావు. ఒకే సరళరేఖ మీద వరసగా ఉండే బిందువులు అవి. అందుకే రామనామాన్ని జపించవచ్చు. గోవిందుణ్నీ భజించవచ్చు. అప్పుడు భగవానుడు కరుణిస్తాడు. వర్షపు చినుకులు కిందకు పడకముందే వాటిని అందుకొనే చకోరపక్షిలా మారతాడు. భక్తుల ప్రేమ బిందువుల్ని భగవానుడు ఎంతో ఆర్తిగా స్వీకరిస్తాడు!

- చక్కిలం విజయలక్ష్మి

'కర్ణాటకలో వ్యవసాయం'పై అధ్యయనానికి రాష్ట్ర బృందం

ఈనాడు, హైదరాబాద్: వ్యవసాయంలో కర్ణాటక అవలంబిస్తున్న విధానాలు, పద్ధతులను అధ్యయనం చేసేందుకు రాష్ట్రం నుంచి ఓ ప్రత్యేక బృందం గురువారం బయలుదేరి ఆ రాష్ట్రం వెళ్లింది. అక్కడ సాగులో వినియోగిస్తున్న ఆధునిక యంత్రాలు, సాగునీటి వినియోగం తీరును బృందం పరిశీలించనుంది. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు, తక్కువ పెట్టుబడి, తక్కువ సంఖ్యలో కూలీలతో వ్యవసాయంలో ఎలా రాణిస్తున్నారనే అంశాలపై దృష్టిసారించనుంది. ఐడీసీ ఛైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, ఆగ్రోస్ ఛైర్మన్ కిషన్‌రావు, గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ భూమ్‌రెడ్డితోపాటు వ్యవసాయ, నీటిపారుదల శాఖలకు చెందిన అధికారులు ఈ బృందంలో ఉన్నారు. వీరు మూడు రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితుల అధ్యయనం, రైతులు, అధికారులతో ముఖాముఖి, పద్ధతుల సాధ్యాసాధ్యాలపై పరిశీలన నిర్వహించి ఓ నివేదికను ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందజేస్తారు.

నవంబరు 13న జాతీయ సాధన సర్వే

ఈనాడు, హైదరాబాద్: విద్యార్థులు ఎంత వరకు నేర్చుకున్నారో తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన జాతీయ సాధన సర్వే(న్యాస్)ను దేశవ్యాప్తంగా నవంబరు 13న జరపనున్నారు. దేశంలోని ప్రతి జిల్లాలో కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి మొత్తం 30 లక్షల మందికి పరీక్షలు నిర్వహిస్తారు. ఇది ప్రపంచంలోని అతిపెద్ద సర్వే అని కేంద్రం చెబుతోంది. ఈ పరీక్ష 3, 5, 8వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తారు. తెలుగు/ఉర్దూ, ఆంగ్లం, గణితం, సామాన్యశాస్త్రం, సాంఘికశాస్త్రం సబ్జెక్టుల్లో విద్యార్థులను పరీక్షిస్తారు. దీనికి సంబంధించిన ప్రశ్నపత్రాన్ని కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తుంది. పరీక్ష అనంతరం వాటిని మూల్యాంకనం చేసి జిల్లాల వారీగా పరిస్థితిపై నివేదికను పంపిస్తారు.

ఔషధ ప్రయోగాల్లో పైపై పరీక్షలే

- యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన
- తూతూమంత్రంగా ముందస్తు ఆరోగ్య పరీక్షలు
- పొట్ట స్కానింగ్ చేయకుండానే ప్రయోగాలు
- ఒకే మూత్రపిండం ఉన్నా స్వచ్ఛంద స్వీకర్తలుగా ఎంపిక
- డబ్బు కోసం ప్రయోగాలకు సిద్ధం
- ఔషధ నియంత్రణాధికారుల పర్యవేక్షణ లోపభూయిష్ఠం

ఈనాడు, హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలానికి చెందిన యువకుడు(38) పద్నాగేళ్ల కిందట తండ్రి కోసం తన మూత్రపిండాన్ని దానమిచ్చాడు. ఆ నిరుపేద కుటుంబానికి ఇతని కూలి డబ్బులే ఆధారం. అయిదేళ్ల కిందట ఔషధాల ప్రయోగాల గురించి తెలుసుకున్నాడు. వారం, పదిరోజులు సహకరిస్తే రూ.10 వేల నుంచి రూ.25వేలు ముడుతుందని అటువైపుగా అడుగులేశాడు. హైదరాబాద్, విశాఖపట్నం, చెన్నై, బెంగళూరు, ముంబయి ప్రాంతాల్లోని 20కిపైగా ప్రయోగశాలల్లో వందకు పైగా ఔషధ పరీక్షల్లో పాల్గొన్నాడు. చెన్నై, బెంగళూరుల్లోని అతనికి రెండింటిలో మాత్రమే పొట్ట స్కానింగ్ చేశారు. యువకుడికి ఒకటే మూత్రపిండం ఉందని గుర్తించి, తమ ప్రయోగాల్లో పాల్గొనకుండా నిషేధించారు. హైదరాబాద్‌లోని నాలుగు ప్రయోగశాలలు సహా మిగిలినచోట్ల ఒక్కదాంట్లోనూ పొట్ట స్కానింగ్ చేయకపోవడం గమనార్హం. కుటుంబీలకు తెలియకుండా ఇన్నాళ్లుగా ఔషధ ప్రయోగాల్లో పాల్గొంటున్న యువకుడికి రెండో మూత్రపిండం దెబ్బతినడం దురదృష్టకరం. తనకు ఒకే మూత్రపిండం ఉందనే విషయం చెప్పకపోవడం అతని స్వయంకృతమే అయినా.. పేదరికం ఆ నిజాన్ని కప్పేసింది. ఔషధ ప్రయోగ స్వీకర్త సంపూర్ణ ఆరోగ్యవంతుడని నిర్ధారించుకున్నాక ప్రయోగాలకు స్వీకరించాలనే నిబంధనలను ఉల్లంఘించడం ప్రయోగశాలల చర్యలకు పరాకాష్ఠ. ఆ యువకుడు ప్రస్తుతం తన ఆరోగ్యంపై ఆందోళన చెందుతున్నాడు.

అంతా గోప్యం: కొత్త ఔషధాలు విపణిలోకి అందుబాటులోకి రావాలంటే మందులపై ప్రయోగాలు జరగాల్సిందే. కానీ ప్రయోగాలన్నీ ఆద్యంతం రహస్య కార్యక్రమంలా సాగుతున్నాయి. ఆసమయంలో కొన్ని సంస్థలు నిబంధనలు పాటిస్తున్నా.. అధికశాతం నిబంధనలకు నీళ్లొదులుతున్నాయి. లోనికెళ్లగానే స్వీకర్తకు సంబంధించిన ఫోన్ సహా అన్నింటినీ స్వాధీనం చేసుకుంటున్నాయి. ఔషధ ప్రయోగాల్లో 99 శాతం కుటుంబీకులకు తెలియకుండానే పాల్గొంటున్నారు. నిబంధనల ప్రకారం ఔషధ ప్రయోగాలకు కుటుంబ సభ్యుల ఆమోదముండాలి. కానీ ప్రయోగశాలలేవీ ఇవేమీ పాటించడంలేదు.

పైపై పరీక్షలే: అత్యధిక ప్రయోగశాలల్లో చిన్నచిన్నవి తప్పితే పూర్తిస్థాయి నిర్ధారణ పరీక్షలు చేయడంలేదు. పొట్టకు అల్ట్రాసౌండ్, తలకు సీటీ స్కాన్ వంటి ముఖ్యమైన పరీక్షలను నిర్వహించడంలేదు. ఔషధ స్వీకర్తకు పైకి కనిపించకుండా పొట్ట, తలలో తీవ్రమైన అనారోగ్య సమస్య ఉంటే, దాన్ని గుర్తించకుండానే ఔషధ ప్రయోగాలను కొనసాగిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా ఔషధ నియంత్రణాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కేంద్ర ఔషధ నాణ్యత ప్రమాణాల నియంత్రణ సంస్థ హైదరాబాద్‌లోనే ఉన్నా అధికారులు వీటిపై దృష్టి పెట్టడంలేదు. ఏటా లక్షల ప్రయోగాలు జరుగుతున్నా వాటిని తనిఖీ చేయడంలో ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నారు. ప్రయోగశాలలు తీసుకొచ్చి సమర్పించే పత్రాలపై అనుమతి సంతకాలు చేయడంతోనే ఔషధ నియంత్రణాధికారులు సరిపెడుతున్నారనే విమర్శలున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలనలు జరపకుండా.. ప్రయోగశాలలతో లోపాయికారిగా ఒప్పందాలు కుదుర్చుకొని ముడుపులు పొందుతున్నారనే ఆరోపణలున్నాయి. నెలకొక్కసారైనా ప్రయోగశాలల్లో తనిఖీలు చేపట్టిన దాఖలాలు లేకపోవడం గమనార్హం. తెలంగాణ ప్రభుత్వం ఔషధ ప్రయోగాల్లో జరుగుతున్న అవకతవకలను నిరోధించడానికి అవసరమైన మార్గదర్శకాలను రూపొందించడానికి ఇటీవల నిపుణుల కమిటీని నియమించింది. 30 రోజుల్లోగా దీనికి సంబంధించిన ప్రాథమిక నివేదికను ఇవ్వాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికి 45 రోజులు గడిచినా ఇప్పటివరకూ ఈకమిటీ ఒక్కసారీ సమావేశమవ్వలేదు.

మూత్రపిండాలకు ప్రమాదం

మన శరీరంలోకి వెళ్లిన ఔషధాల్లో 99 శాతం మూత్రపిండాల ద్వారా వడబోతకు గురవుతాయి. ఒకే మూత్రపిండం ఉన్నపుడు విషతుల్యాలను వెలుపలికి పంపించే ప్రక్రియ వేగం మందగిస్తుంది. అంటే 100 మి.గ్రా.లను బయటకు పంపించాల్సిన చోట.. 50-60 మి.గ్రా.లనే పంపించే సామర్థ్యముంటుంది. ఒకే మూత్రపిండమున్న వ్యక్తుల్లో ఔషధ ప్రయోగాలు మరింత ప్రమాదకరం. కనీసం అల్ట్రాసౌండ్ స్కానింగ్ తప్పనిసరి.

–డాక్టర్ గంగాధర్, నెఫ్రాలజిస్టు, నిమ్స్



చిత్తూరు జిల్లా కాణిపాకంలోని స్వయంభు శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ తూర్పు, పశ్చిమ, విమాన, శ్రీవీరాంజనేయస్వామి ఆలయాలకు గురువారం నూతన స్వర్ణ కలశాలు అమర్చారు.

- కాణిపాకం, న్యూస్‌టుడే

రోగుల విషయంలో వైద్య సమాచారం కీలకం

హైమా అధ్యక్షుడు జీడీమొగ్లీ



కార్యశాల ప్రారంభోత్సవంలో హైమా అధ్యక్షుడు ప్రొ.జి.డి.మొగ్లీ, అపోలో సీఈవో వై.సుబ్రహ్మణ్యం తదితరులు

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: ఒక సంస్థ పొందుపరిచే ఆర్థిక రికార్డులు భద్రపరచడం ఎంత ముఖ్యమో.. ఓవ్యక్తికి సంబంధించిన వైద్య సమాచారం (మెడికల్ రికార్డులు) అంతే ముఖ్యమని దీనిపై ప్రస్తుత వైద్యరంగం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని హైమా ఇండియా (హెల్త్ ఇన్‌ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) అధ్యక్షుడు, దేశంలోనే మెడికల్ రికార్డ్స్ పితామహుడిగా పేరొందిన డా.జీడీ.మొగ్లీ అభిప్రాయపడ్డారు. హైమా ఇండియా సహకారంతో 'మెడికల్ ఆడిట్'పై జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో గురువారం ఒకరోజు కార్యశాల నిర్వహించారు. జీడీ.మొగ్లీ, అపోలో సీఈవో వై.సుబ్రహ్మణ్యంలు కార్యశాలను ప్రారంభించారు. మొగ్లీ మాట్లాడుతూ మెడికల్ ఆడిట్ అనేది రోగి సంరక్షణకే కాదు.. వైద్య ఫలితాల్ని మెరుగుపర్చుకోవాల్సిన అవసరాన్నీ తెలియజేసే ప్రక్రియగా పేర్కొన్నారు. సీఈవో వై.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వైద్య సమాచారానికి సంబంధించిన అంశాలను ఎప్పటికప్పుడు తాజాగా ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ అకాడమీ కార్యదర్శి డా.రాజు ఎన్.మంతెన, అపోలో మెడికల్ సూపరింటెండెంట్ డా.రవీంద్ర బాబు, ప్రొ.సత్యనారాయణ, లెఫ్టినెంట్ కల్నల్ డా.కె.కమలాకర్ పాల్గొన్నారు.

రొమ్ము క్యాన్సర్ నిర్మూలనే లక్ష్యం: డాక్టర్ రఘురాం

ఈనాడు, హైదరాబాద్: భారత్‌లో రొమ్ముక్యాన్సర్‌ను నిర్మూలించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఉషాలక్ష్మి రొమ్ము వ్యాధుల ఆసుపత్రి సంచాలకుడు, భారత రొమ్ము శస్త్రచికిత్స నిపుణుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రఘురాం తెలిపారు. రొమ్ముక్యాన్సర్‌పై అవగాహన పెంపొందించి క్యాన్సర్‌ను గుర్తించడంపై తెలుగు రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గురువారం ఆయన శ్రీలంకలో క్యాన్సర్ శస్త్రచికిత్స పితామహుడిగా పేరుగాంచిన టోనీ గేబ్రియేల్ స్మారకోపన్యాసం చేశారు.



హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో నూతన ద్విచక్రవాహనాలను అందుకున్న షీ టీమ్ పోలీసులు

'షీ' టీం సభ్యులకు ద్విచక్రవాహనాలు

హైదరాబాద్, న్యూస్‌టుడే: విశ్వనగరికి అడుగులు వేస్తున్న హైదరాబాద్ మహానగరంలో శాంతి భద్రతలు పటిష్టంగా ఉండవలసిన అవసరం ఉందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ మహేందర్‌రెడ్డి అన్నారు. అందుకోసం పోలీసుశాఖ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ముందడుగు వేస్తోందన్నారు. గురువారం మారియట్ హోటల్‌లో హీరో మోటో కార్ప్ సౌజన్యంతో షీ టీమ్స్ సభ్యులకు 150 ద్విచక్రవాహనాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నేరాలను అదుపు చేసేందుకు రూ.10కోట్లతో 75000 సీసీ కెమెరాలను బిగించామని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలనే షరతుతో ఆగస్టు నుంచి వేస్తున్న పాయింట్ల విధానం సత్ఫలితాలను ఇస్తోందన్నారు. షీ టీమ్స్ కమిషనర్ స్వాతి లక్రా మాట్లాడుతూ..మహిళా రక్షణ బృందాలు (షీ టీమ్స్) నిఘా వల్ల నగరంలో మహిళలు, యువతులు స్వేచ్ఛగా ఉండగలుగుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో హీరో మోటో కార్ప్ లిమిటెడ్ యాజమాన్య ప్రతినిధి విజయ్‌సిత్తి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య, రాచకొండ పోలీస్ కమిషనర్ భగవత్ పాల్గొన్నారు.

కౌలు చట్టం అమలుచేయకనే ఆత్మహత్యలు

- హక్కులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే: కోదండరాం
- న్యాయం చేయాలంటూ 'ప్రజాదర్బారులో' రైతుల ఆవేదన



తన భర్త ఆత్మహత్య చేసుకున్నా పరిహారం ఇవ్వలేదని చెబుతున్న కౌలు రైతు జంగమ్మ. చిత్రంలో కోదండరాం, మల్లారెడ్డి తదితరులు

ఈనాడు, హైదరాబాద్, బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే : రాష్ట్రంలో కౌలు రైతుల హక్కుల చట్టం అమల్లో నిర్లక్ష్యం కారణంగా ఆత్మహత్యలు చోటుచేసుకుంటున్నాయని తెలంగాణ ఐకాస ఛైర్మన్ కోదండరాం పేర్కొన్నారు. గురువారమిక్కడ రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా దర్బారును ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వ్యవసాయంలో భూ యాజమాన్య హక్కులు కీలకమని.. సాదాబైనామాల రిజిస్ట్రేషన్, కౌలు రైతుల హక్కుల చట్టాన్ని విస్మరిస్తున్నారని విమర్శించారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయడంలో జాప్యం జరుగుతోందన్నారు. దీని వల్ల సాగుచేసుకుంటున్నా రుణాలు, నష్టపరిహారం పొందలేని స్థితిలో ఆ రైతులు ఉన్నారని తెలిపారు. ప్రైవేటు అప్పులు తీసుకుంటే వ్యాపారులు 36 శాతానికి పైగా వడ్డీ భారం వేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వమే సాగు సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. ప్రజాదర్బారులో రైతుల నుంచి వచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అఖిల భారత రైతు సంఘం నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ.. రైతులు ఆత్మహత్య చేసుకుంటే వాటిని నిర్ధరించేందుకు బాధితులను 13 రకాల దస్త్రాలు అడుగుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మూడేళ్లలో మూడువేల మంది ఆత్మహత్య చేసుకుంటే 600 మందికే పరిహారం ఇచ్చారని.. రూ.6 లక్షలు ఇస్తామని చెప్పి రూ.1.50 లక్షలే చేతిలో పెడుతున్నారన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి గోపాలరావు మాట్లాడుతూ ..కౌలు రైతుల హక్కులు తెలుగు రాష్ట్రాల్లో సక్రమంగా అమలు కావడం లేదన్నారు. మానవహక్కుల వేదిక తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు జీవన్‌కుమార్ మాట్లాడుతూ.. సాగుచేసేవారి హక్కులు అమలు చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమేనన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన మహిళా రైతులు తమ కష్టాలను దర్బారులో వెల్లడించారు.

ఇద్దరు గుజరాత్ పోలీసు అధికారుల రాజీనామా

అహ్మదాబాద్: బోగస్ ఎదురుకాల్పుల కేసుల్లో అభియోగాలు నమోదైన గుజరాత్ పోలీసు అధికారులు ఎన్.కె.అమిన్, తరుణ్ బరోత్‌లు గురువారం రాజీనామా చేశారు. పదవీవిరమణ అనంతరం వీరిని విధుల్లోకి తీసుకోగా.. సవాల్ చేస్తూ ఓ మాజీ ఐపీఎస్‌అధికారి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో తాము వైదొలుగుతామని ఇద్దరూ వాగ్దానం సమర్పించారు.

పర్యావరణ హితంగా వినాయక వేడుకలు

- మంత్రి కేటీఆర్ పిలుపు
- పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం
- అనంతరం మట్టి విగ్రహాల పంపిణీ

మాదాపూర్ న్యూస్‌టుడే: చెరువులు, కొలనులను కాపాడుకుంటూ, కాలుష్యానికి అడ్డుకట్ట వేస్తూ మనకు ఇష్టమైన వినాయక పండుగ వేడుకలను పర్యావరణహితంగా జరుపుకోవాలని రాష్ట్రమంత్రి కె.తారకరామారావు పేర్కొన్నారు. గురువారం మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో 'ఎకో గణేశ' పేరిట మట్టి విగ్రహాలపై పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై పలువురు విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించి పూజించే సంస్కృతిని అలవాటు చేసుకోవాల్సిన అవసరముందన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఈసారి 2లక్షల మట్టి విగ్రహాలను పంపిణీ చేయాలని నిర్ణయించామన్నారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పీసీబీల సంయుక్తాధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీకి ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మట్టి వినాయకులు కావాలనుకునేవారికి అవసరమైన సమాచారం అందించేందుకు ప్రత్యేక ఫోన్‌నెంబర్లు, వెబ్‌సైట్ సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు.



విద్యార్థులకు మట్టి గణపతి ప్రతిమలను అందిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తదితరులు

మట్టి వినాయకులనే పూజించాలి: మహేందర్‌రెడ్డి

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ చెరువులు, కుంటలు కాలుష్యం కాకుండా ఉండేందుకు మట్టి వినాయకులనే ప్రతిష్ఠించి పూజించాలని సూచించారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ నవరాత్రులు పూజలు చేసిన వినాయకుడి విగ్రహాన్ని మురికికూపంగా మారిన చెరువుల్లో నిమజ్జనం చేయడం సరికాదన్నారు. మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించి, పూజించేలా అందరితో జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. అంతకుముందు ఆనందశంకర్ జయంతి శిష్య బృందం శాస్త్రీయ నృత్య ప్రదర్శనతో అలరించారు. నగర మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ చిరంజీవులు, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ కమిషనర్ హరిచందన, శేరిలింగంపల్లి సర్కిల్ ఉపకమిషనర్ మమత పాల్గొన్నారు.

సరళతర వాణిజ్యంలో మళ్లీ మనమే ముందుండాలి

- నిర్ణీత గడువులోగా ప్రాజెక్టులు పూర్తి కావాలి
- వైమానిక రంగంలో మరిన్ని పెట్టుబడులు: కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: సరళతర వాణిజ్య నిర్వహణలో మళ్లీ తెలంగాణనే అగ్రస్థానంలో నిలవాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ఆకాంక్షించారు. ఇందుకోసం అన్నిశాఖల అధికారులు కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో చేపట్టిన పారిశ్రామిక ప్రాజెక్టులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. పరిశ్రమలు, ఐటీ శాఖలపై గురువారం మర్రి చెన్నారెడ్డి మానవవనరుల సంస్థలో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, కమిషనర్ నదీం అహ్మద్, టీఎస్ఐఐసీ ఎండీ వెంకటనర్సింహారెడ్డి, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు.

"గత మూడేళ్లలో అనేక అద్భుతమైన విధానాలను తెచ్చాం. వచ్చే రెండేళ్లు వీటిని మరింత సమర్థంగా అమలు చేయాలి. కొత్త పెట్టుబడులు, పరిశ్రమలే లక్ష్యాలుగా కొనసాగాలి. అధికారులు ప్రతి మూణ్నెల్లకోసారి లక్ష్యాలను నిర్దేశించుకొని అమలుచేయాలి. సరిగా పనిచేయని అధికారులపై కఠిన చర్యలుంటాయి. హైదరాబాద్ ఔషధనగరి ద్వారా స్థానికులకు లాభాలు, ఉద్యోగాల గురించి అవగాహన కల్పించాలి. కొత్తగా అంతర్జాతీయ స్థాయి సంస్థల ద్వారా పరిశ్రమలస్థాపన, వైమానికరంగంలో మరిన్ని పెట్టుబడులు తీసుకొని వచ్చేందుకు కృషిచేయాలి. కొత్త పరిశ్రమల్లో కాలుష్యం లేకుండా చర్యలు తీసుకోవాలి.

జిల్లాలకు టాస్ కేంద్రాలు: తెలంగాణ ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టు, మిషన్ భగీరథతో కలిసి సమన్వయం చేయాలి. రెండు ఒకేసారి పూర్తికావాలి. టాస్క్ ద్వారా ఇప్పటి వరకూ ఇంజినీరింగు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం, త్వరలో ఆరోగ్య, ఔషధ, ఆటోమోటివ్స్ రంగాలకు వాటిని విస్తరిస్తాం. టాస్క్ కేంద్రాలను అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేస్తాం." అని మంత్రి తెలిపారు.

ఆయేషా కేసులో పునః దర్యాప్తునకు పిటిషన్

ఈనాడు, అమరావతి: ఆయేషా మీరా హత్యకేసును పునఃదర్యాప్తు చేసేందుకు అనుమతి కోరుతూ ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విజయవాడ నాలుగో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ న్యాయస్థానంలో గురువారం పిటిషన్ దాఖలు చేసింది. న్యాయమూర్తి తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. ఆయేషా హత్య కేసులో సత్యంబాబును నిర్దోషిగా ప్రకటిస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చిన సంగతి విదితమే. కేసును పునఃదర్యాప్తు చేసి, అసలైన దోషులను గుర్తించాలని ఆయేషా తల్లిదండ్రులు డిమాండు చేయడంతో సిట్‌ను నియమించారు.

బీఎడ్ ప్రవేశాలకు కొత్త నిబంధనలు

- ఫలితాలు విడుదలై 20 రోజులైనా ప్రారంభంకాని కౌన్సెలింగ్
- కళాశాలలు అఫిడవిట్ సమర్పణకు 31 వరకు గడువు
- ఈసారీ గాడినపడని విద్యా సంవత్సరం

ఈనాడు, హైదరాబాద్: జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సీటీఈ) నిర్దేశించిన కొత్త నిబంధనలను పాటించడంలో నిర్లక్ష్యం కారణంగా బీఎడ్, వ్యాయామ ఉపాధ్యాయ విద్య కౌన్సెలింగ్ తీవ్ర జాప్యం కానుంది. ఈసారి ప్రవేశపరీక్ష ఆలస్యమైనా... కౌన్సెలింగ్, తరగతులు సకాలంలో జరుగుతాయనుకున్నారు. ఎన్‌సీటీఈకి రుసుం చెల్లింపు, అఫిడవిట్ల సమర్పణలో తాత్సారం కారణంగా ఈ విద్యా సంవత్సరమూ సకాలంలో ప్రారంభమయ్యే సూచనలు కనిపించట్లేదు. బీఎడ్ ప్రవేశాలకు తెలంగాణ ఉన్నత విద్యామండలి 'ఎడ్‌సెట్' నిర్వహించి, జులై 27న ఫలితాలను విడుదల చేసింది. 57,413 మంది అర్హత సాధించారు. కళాశాలలు అఫిడవిట్లను సమర్పించేందుకు జులై 31 వరకూ గడువుందని, ఆగస్టు తొలివారంలో కౌన్సెలింగ్ చేపట్టే అవకాశముందని అధికారులు తెలిపారు. కానీ, ఆగస్టు మూడోవారం గడుస్తున్నా ఆ ఊసేలేదు.

ఆ కళాశాలల్ని ఏరివేసేందుకే

బోగస్ కాలేజీలను ఏరివేసేందుకే ఎన్‌సీటీఈ అఫిడవిట్ నిబంధన విధించింది. దీని గడువును తాజాగా ఆగస్టు 31 వరకు పొడిగించారు. పైగా తనిఖీలు, ర్యాంకింగ్ కోసం కళాశాలలు రూ.లక్షన్నర రుసుం, 18% జీఎస్‌టీ చెల్లించాలి. ప్రభుత్వ, విశ్వవిద్యాలయాలకు చెందిన కొన్ని బీఎడ్ కాలేజీలు ఇప్పటివరకు అఫిడవిట్లు దాఖలు చేయలేదు. రుసుమూ చెల్లించలేదు. వీటికి ఎన్‌సీటీఈ నుంచి అనుమతులు రాక, కౌన్సెలింగ్ ప్రారంభమవ్వలేదు. గతంలో ప్రైవేట్ కళాశాలలకు అనుమతులు దక్కకున్నా, రెండో కౌన్సెలింగ్‌లో వాటికి అవకాశమిస్తామంటూ ప్రవేశాలు కల్పించేవారు. ఇప్పుడు సర్కారు కళాశాలలకే అనుమతులు లేకపోవడంతో, ఉన్నత విద్యామండలి అధికారులు కలవరం చెందుతున్నారు.

బీపీఈడీ, డీపీఈడీ కౌన్సెలింగ్‌దీ ఇదే తీరు...

వ్యాయామ ఉపాధ్యాయవిద్యకు సంబంధించిన బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల కౌన్సెలింగ్ పరిస్థితీ ఇలాగే ఉంది. రాష్ట్రంలో ప్రైవేట్, ప్రభుత్వ వ్యాయామ కళాశాలలు 21 ఉన్నాయి. హైదరాబాద్‌లోని ప్రభుత్వ కళాశాల ఇప్పటివరకు అఫిడవిట్ సమర్పించలేదు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేసి 20 రోజులవుతున్నా సీట్ల కేటాయింపు జరగలేదు.

విద్యుదాఘాత మరణాలను నిరోధించాలి: చాడ

ఈనాడు, హైదరాబాద్: పొలాలపై నుంచి వెళ్లే విద్యుత్తు తీగలు వదులు కావడం, ఒక తీగ మరో తీగకు తాకడం లాంటి పరిణామాలతో అనేక మంది రైతులు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడుతున్నారని, ఇలాంటి మరణాలను నిరోధించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని గురువారం ఓ ప్రకటనలో కోరారు. అన్నదాతలే కాకుండా వందలాది పశువులు సైతం మృతి చెందుతున్నాయన్నారు. వీటిపై ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, వారి నిర్లక్ష్యం కారణంగా ప్రాణాపాయం సంభవిస్తోందని ఆయన పేర్కొన్నారు. సర్కారు ఇప్పటికైనా స్పందించి యుద్ధప్రాతిపదికన విద్యుత్ తీగలను సరిచేయాలని, క్షేత్రస్థాయిలో ఖాళీగా ఉన్న విద్యుత్ సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యుదాఘాతంతో మృతిచెందిన రైతులకు రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలన్నారు.

సూపర్ స్పెషాలిటీ కోర్సుల కౌన్సెలింగ్ నిలిపివేయండి

- తెలుగురాష్ట్రాల్లో సీట్ల భర్తీపై 23లోగా కౌంటరు దాఖలు చేయాలి: హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: ఎన్టీఆర్, కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయాల పరిధిలో డీఎం, ఎంసీహెచ్ సూపర్ స్పెషాలిటీ కోర్సుల సీట్ల భర్తీ కౌన్సెలింగ్ నిలిపివేయాలని గురువారం ఉమ్మడి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. 371-డి అమల్లో ఉన్న నేపథ్యంలో కౌన్సెలింగ్ చేపట్టరాదని జాతీయ ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్‌తోపాటు ప్రతివాదులను ఆదేశించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో 23లోగా కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పరిధిలోని ఎన్టీఆర్, కాళోజీ యూనివర్సిటీల్లో సూపర్ స్పెషాలిటీ కోర్సుల సీట్ల భర్తీని జాతీయ కౌన్సెలింగ్ (నీట్)ద్వారా చేపట్టాలంటూ కేంద్ర ఆరోగ్య శాఖ మే 4న జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ డాక్టర్ బి.సతీష్‌కుమార్ మరో 12 మంది పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ టి.రజనిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది ఎస్.సత్యంరెడ్డి వాదనలు వినిపిస్తూ రాజ్యాంగంలోని అధికరణ 371-డి ప్రకారం 85 శాతం సీట్లను స్థానిక అభ్యర్థులతోను, మిగిలిన 15 శాతం సీట్లను ఇతర రాష్ట్రాల అభ్యర్థులతో భర్తీ చేయాల్సి ఉందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని యూనివర్సిటీల సీట్లను జాతీయ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయడానికి వీల్లేదని వివరించారు. ప్రస్తుతం కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులు 371-డి కి విరుద్ధమన్నారు. వాదనలను విన్న ధర్మాసనం.. కాళోజీ, ఎన్టీఆర్ యూనివర్సిటీల పరిధిలోని కాలేజీల్లో ఎండీ, ఎంసీహెచ్ సూపర్ స్పెషాలిటీ కోర్సుల సీట్ల భర్తీకి కౌన్సెలింగ్‌ను నిలిపివేయాలని కేంద్ర ఆరోగ్యశాఖ, ఆరోగ్య సర్వీసుల డైరెక్టర్ జనరల్, పరీక్షల జాతీయ బోర్డులను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీం కోర్టు అడ్మిషన్లకు నిర్దేశించిన తుది గడువులోగా కేసును తేల్చి వేస్తామంటూ విచారణను 23కు వాయిదా వేసింది.



సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా భీముని మల్లారెడ్డికి చెందిన చింతకింది స్రవంతి అనే మహిళ దుబ్బాక ఆసుపత్రిలో 5.5 కిలోల మగ శిశువుకు జన్మనిచ్చింది. తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.
-దుబ్బాక, న్యూస్‌టుడే

విచారణకు గైర్హాజరు క్రిమినల్ నేరమే: సుప్రీం

దిల్లీ: నగదు అక్రమ చెలామణి కేసులో దర్యాప్తు సంస్థ ఇచ్చే సమన్లను పట్టించుకోకపోవడం క్రిమినల్ నేరం కిందకే వస్తుందని గురువారం సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. సమన్లకు అనుగుణంగా విచారణకు హాజరుకాకపోవడం విదేశీ ద్రవ్య నియంత్రణ చట్టం (ఫెరా)-1963 నిబంధనలను ఉల్లంఘించినట్టు కాదంటూ గతంలో కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును పక్కనపెట్టింది. హైకోర్టు ఇచ్చిన తీర్పు..సుప్రీం కోర్టు విధించిన నిబంధనలకు విరుద్ధంగా ఉందని జస్టిస్ ఎస్.ఎ.బోబ్డే, జస్టిస్ ఎల్.నాగేశ్వరరావులతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. బెంగళూరుకు చెందిన మెస్సర్స్ ఫిరోజ్ ఫ్రామ్‌రోజ్ అనే అధీకృత ద్రవ్య సరఫరా సంస్థకు చెందిన మహమ్మద్ అక్రంపై ఎన్‌ఫోర్సుమెంటు డైరెక్టరేట్ దాఖలు చేసిన వ్యాజ్యం మేరకు సుప్రీంకోర్టు పై తీర్పు ఇచ్చింది. నకిలీ పత్రాల ఆధారంగా రూ.50 కోట్ల విదేశీ ద్రవ్యాన్ని అక్రమంగా చెల్లించారన్న ఆరోపణలపై విచారణకు హాజరుకావాలని ఫెరా చట్టంలోని 40వ సెక్షన్ ప్రకారం 1997 అక్టోబరులో సమన్లు పంపినా పట్టించుకోలేదని ఈడీ ఆరోపించింది.

239 ఏఈ పోస్టుల భర్తీకి సుప్రీం పచ్చజెండా

- తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పాత మెరిట్ లిస్ట్ ప్రకారమే నియామకాలు

ఈనాడు – దిల్లీ

తెలంగాణ విద్యుత్ సంస్థల్లోని అసిస్టెంట్ ఇంజినీర్ల పోస్టులను- 2015లో నిర్వహించిన పోటీ పరీక్ష ఆధారంగానే భర్తీ చేయడానికి సుప్రీంకోర్టు అనుమతించింది. గత ఏడాది జూన్ ఒకటో తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన లేఖ ఆధారంగా వీటిని భర్తీ చేసుకోవచ్చునని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ మదన్ బి.లోకూర్, జస్టిస్ దీపక్‌గుప్తాలతో కూడిన ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది. దీనివల్ల పాత నియామక ప్రక్రియ ఆధారంగానే 239 అసిస్టెంట్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి మార్గం సుగమమైంది. టీఎస్‌ట్రాన్స్‌కో, టీఎస్ఎన్‌పీడీసీఎల్, టీఎస్ఎస్‌పీడీసీఎల్, టీఎస్‌జెన్‌కోలు తమ పరిధిలోని సివిల్, ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజినీర్ల పోస్టుల భర్తీకి 2015లో ఒకేసారి ప్రకటనలు ఇచ్చి నెలరోజుల వ్యవధిలో పోటీ పరీక్షలు నిర్వహించాయి. అందులో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ఒకటికి మించిన సంస్థల్లో ఉద్యోగాలు రావడంతో తమకు ఇష్టమైన దాంట్లో చేరి, మిగిలినవి వదిలిపెట్టుకున్నారు. అయితే జీఓ నెంబర్ 81 ప్రకారం మెరిట్ లిస్ట్‌లో ముందున్న వారు వదిలిపెట్టిన ఆ పోస్టులను తర్వాతి స్థానంలో ఉన్న వారితో భర్తీచేయడానికి వీల్లేదంటూ కొందరు అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లడంతో ఆ న్యాయస్థానం వారి వాదనను సమర్థిస్తూ గత ఏడాది ఆగస్టు 29న తీర్పునిచ్చింది. ఈ పోస్టుల భర్తీకోసం ఇచ్చిన ఉద్యోగ ప్రకటనలో జీవోఎంఎస్ నెం.81 ప్రకారం వెయిటింగ్ లిస్ట్ ఉండదని చెప్పినందున మెరిట్ అభ్యర్థులు చేరని పోస్టులను తర్వాతి స్థానంలో ఉన్న వారితో భర్తీచేయడం కుదరదని హైకోర్టు తన తీర్పులో పేర్కొంది. దానిని బాధిత అభ్యర్థులు సుప్రీంకోర్టులో సవాల్ చేయగా సర్వోన్నత న్యాయస్థానం అన్నింటినీ కూలంకషంగా పరిశీలించి.. జీవోఎంఎస్ నెం.81లో చెప్పిన వెయిటింగ్ లిస్ట్ నిబంధనలు ఈ పోస్టులకు వర్తించవని స్పష్టంచేసింది. ఆ జీవో కొన్ని ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని విడుదల చేసిందని పేర్కొంది. ఏదైనా పోస్టుకోసం అభ్యర్థిని ఎంపికచేసి అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చిన తర్వాత నిర్దిష్ట సమయంలోపు అతను చేరకపోయినప్పుడు మాత్రమే సదరు ఖాళీని మళ్లీ ప్రకటించాలి తప్పితే వెయిటింగ్ లిస్ట్ ప్రకారం భర్తీచేయడానికి వీల్లేదని ఆ జీవో చెబుతున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. అయితే విద్యుత్ సంస్థల ఉద్యోగాల భర్తీలో అసలు నియామకపు లేఖలే ఇవ్వకపోతే ఉద్యోగంలో చేరడం, ఉద్యోగాన్ని వదులుకోవడం అన్న సమస్యే ఉత్పన్నం కాదని పేర్కొంది. విద్యుత్ సంస్థలు నిర్వహించిన పరీక్షల్లో ఒకటికి మించిన సంస్థలకు ఎంపికైన అభ్యర్థులను సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం పిలిచారు తప్పితే అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వలేదని తెలిపింది. మెరిట్‌లిస్ట్‌లో తర్వాతి స్థానంలో ఉన్న అభ్యర్థులతో ఈ పోస్టులను భర్తీచేయకపోతే అవన్నీ ఖాళీగా ఉండిపోతాయని, మళ్లీ నియామక పరీక్ష నిర్వహించాలంటే చాలా సమయం పడుతుందని ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు కూడా చెప్పాయని కోర్టు స్పష్టంచేసింది. జీఓ 81 ఏక నియామక ప్రక్రియ (సింగిల్ సెలెక్షన్ ప్రాసెస్)కు వర్తిస్తుందని, కానీ ఇక్కడ విభిన్న విద్యుత్ సంస్థలు చేపట్టిన బహుళ నియామక ప్రక్రియలు(మల్టిపుల్ సెలెక్షన్ ప్రాసెస్) ఉన్నాయని కోర్టు పేర్కొంది. నాలుగు సంస్థల్లో తొలి నాలుగుస్థానాల్లో నిలిచిన ప్రతిభావంతులు ఏదో ఒక సంస్థను మాత్రమే ఎంచుకుంటారని తెలిపింది. ఉమ్మడి హైకోర్టు చెప్పిన తీర్పును ఆమోదిస్తే మిగిలిన 12 పోస్టులు ఖాళీగానే ఉండిపోవాల్సి వస్తుందని వ్యాఖ్యానించింది. దానివల్ల పెద్ద సంఖ్యలో పోస్టులు భర్తీకాకుండా మిగిలిపోతాయని పేర్కొంది. 81వ జీవోలోని నిబంధనలు అపాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చిన తర్వాతే అమల్లోకి వస్తాయని, ఇక్కడ ఆ పరిస్థితి ఉత్పన్నంకాలేదని స్పష్టత ఇచ్చింది.

నాలుగు కార్పొరేషన్లు నిర్వహించిన పరీక్షల్లో మొదటి స్థానంలో నిలిచిన వ్యక్తి ఒక సంస్థలో మాత్రమే చేరుతారని, మిగిలిన సంస్థలకు కనీసం సర్టిఫికెట్ల తనిఖీ కోసం కూడా వెళ్లరని ఉదహరించింది. దానర్థం మిగిలిన మూడు సంస్థల్లోని పోస్టులు ఖాళీగా ఉంచాలని కాదని వ్యాఖ్యానించింది. అందువల్ల ఈ నాలుగు సంస్థలు ఇదివరకు నిర్వహించిన పరీక్షల్లోని ప్రతిభావంతులతోనే మిగిలిపోయిన పోస్టులను భర్తీ చేయొచ్చని స్పష్టంచేస్తూ.. ఇదివరకు ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేసింది.

తమిళనాడులో వైద్య కోర్సుల కౌన్సెలింగ్ 22 వరకూ నిలుపుదల

దిల్లీ: తమిళనాడులో ఎంబీబీఎస్, బీడీఎస్ వైద్యకోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియను ఈనెల 22వరకూ నిలుపుదల చేయాలంటూ సుప్రీంకోర్టు పేర్కొంది. నీట్ పరీక్ష ఉత్తీర్ణులు, రాష్ట్ర బోర్డు విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణలో సమతౌల్య పరిష్కారం సాధించాలని ఎంసీఐ, రాష్ట్రప్రభుత్వానికి స్పష్టం చేసింది. నీట్ మార్కుల ఆధారంగా సిద్ధం చేసిన మెరిట్ జాబితాతోనే వైద్య సీట్ల కౌన్సెలింగ్ నిర్వహించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించాల్సిందిగా ఆరుగురు విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ దీపక్‌మిశ్ర నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ప్రస్తుతమున్న యథాతథ స్థితినే కొనసాగించాలంది. నీట్ అర్హులు, రాష్ట్ర బోర్డు నుంచి పన్నెండో తరగతి ఉత్తీర్ణులైన వారి వివరాలు సమర్పించాలంది.

రాష్ట్రంలో సమర్థంగా పోలీసుల సేవలు

- హోంమంత్రిగా పనిచేయడం గర్వంగా ఉంది: నాయిని

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: తెలంగాణ పోలీసులు సమర్థంగా పనిచేస్తున్నారని, రాష్ట్రంలో దొంగతనాలు, నేరాలు తగ్గిపోయాయని రాష్ట్ర హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి పేర్కొన్నారు. శాంతి భద్రతలు సవ్యంగా ఉండటంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెరిగి కంపెనీలు, ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో కొత్తగా నిర్మించిన గచ్చిబౌలి నూతన పోలీస్‌స్టేషన్ భవనం, మహిళా పోలీస్‌స్టేషన్, షీటీమ్స్, మాదాపూర్ ఏసీపీ, డీసీపీ కార్యాలయాలను గురువారం నాయిని ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు విభాగాన్ని ఆధునికీకరించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పోలీస్‌స్టేషన్ల కోసం అధునాతన భవనాలను నిర్మిస్తుండటంతో పాటు పాత భవనాలకు మరమ్మతులు చేసి సరికొత్తగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అన్ని జిల్లాల్లో షీటీమ్స్‌తోపాటు మహిళా భరోసా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ పోలీసులు దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచినట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అభినందించారని, అలాంటి పోలీసులకు తాను హోంమంత్రిగా ఉండటం ఎంతో గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ తదితరులు పాల్గొన్నారు.



గచ్చిబౌలిలో పోలీసు స్టేషన్, ఏసీపీ, డీసీపీ కార్యాలయాల భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న హోంమంత్రి నాయిని మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీర్‌పూర్ రాజు, పోలీసు ఉన్నతాధికారులు

వస్త్ర పరిశ్రమ భూములను పరిశీలించిన దక్షిణ కొరియా ప్రతినిధులు

సంగెం, గీసుకొండ, న్యూస్‌టుడే: వరంగల్ గ్రామీణ జిల్లా పరిధిలో ఏర్పాటు చేయనున్న కాకతీయ వస్త్ర పరిశ్రమ భూములను దక్షిణ కొరియాకు చెందిన జౌళి పరిశ్రమల సమాఖ్య(కొఫోటి) ఛైర్మన్ కిహాక్ సంగ్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం గురువారం పరిశీలించింది. టీఎస్ఐఐసీ ఎండీ వెంకట నరసింహారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌లు వస్త్ర పరిశ్రమ కోసం ప్రభుత్వం సేకరించిన భూముల్లో అనుకూలతలను వారికి వివరించారు. జిల్లా పరిసర ప్రాంతాల్లో వస్త్ర పరిశ్రమకు ఉపయోగపడే ముడిసరుకైన పత్తి ఉత్పత్తి అధికంగా ఉంటుందని వెల్లడించారు. పరిశ్రమ ఏర్పాటుతో తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి సూరత్, బీమండి, గుజరాత్ తదితర ప్రాంతాలకు వలస వెళ్లిన వేలాది మంది కార్మికులు తిరిగి సొంత గ్రామాలకు వచ్చే అవకాశముందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికంగా చేనేత కార్మికులు తయారు చేసిన కలంకారితోపాటు వివిధ రకాల వస్త్రాలను దక్షిణకొరియా ప్రతినిధులు తిలకించారు.



చేనేత కార్మికులు నేసిన వస్త్రాన్ని పరిశీలిస్తున్న దక్షిణ కొరియా ప్రతినిధుల బృందం

హిజ్‌బుల్‌పై అమెరికా నిర్ణయం భేష్: భారత్

మాకు సమ్మతం కాదు: పాకిస్థాన్

దిల్లీ, ఇస్లామాబాద్: కశ్మీర్‌కు చెందిన హిజ్‌బుల్ ముజాహిదీన్‌ను 'అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ'గా అమెరికా పేర్కొనడంపై భారత్, పాక్ భిన్న రీతుల్లో స్పందించాయి. ఈ నిర్ణయాన్ని భారత్ స్వాగతించగా, పాకిస్థాన్ మాత్రం ఎప్పటిమాదిరిగానే అభ్యంతరం తెలిపింది. తామెప్పటి నుంచో కోరుతున్న రీతిలో ఇన్నాళ్లకు అమెరికా నిర్ణయం తీసుకొందని భారత హోం మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి స్పందించారు. ఇది ఎంతైనా సమర్థనీయమన్నారు. అమెరికా నిర్ణయం తమకు ఎంతమాత్రం సమ్మతం కాదనీ, ఇదెంతో నిరుత్సాహాన్ని కలిగించిందనీ పాక్ పేర్కొంది. 'కశ్మీరీల స్వీయ నిర్ణయాధిక హక్కుకు మద్దతుగా నిలుస్తున్న వ్యక్తులు, సంస్థల్ని ఉగ్రవాదులుగా ముద్ర వేయడం ఏమాత్రం న్యాయం కాదు' అని పాక్ విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి నఫీజ్ జకారియా గురువారం విలేకరుల సమావేశంలో చెప్పారు. 70 ఏళ్ల కశ్మీరీల పోరాటాన్ని పరిగణనలో తీసుకోకుండానే అమెరికా ఒక నిర్ణయానికి వచ్చిందన్నారు. కశ్మీర్ ప్రజల పోరాటానికి పాక్ నైతికంగా, దౌత్యపరంగా, రాజకీయంగా మద్దతునిస్తుందని చెప్పారు. అమెరికాతో ఎప్పుడు సమావేశం జరిగినా తమ ఆందోళనను వినిపిస్తామని తెలిపారు.

వసుంధర

ఆహ్లాదకరంగా... ఆకట్టుకునేలా

ఫ్యాషన్ ఫ్యాషన్

ఆధునిక వస్త్రశ్రేణి ఆహ్లాదకరమైన రంగుల్లో, ప్రకృతిని తలపించే సోయగాలతో కనువిందు చేస్తే మెచ్చని వారెవరుంటారు... ఈ కాలంలో కురిసే చిరుజల్లులకు హొయలొలికే ఈ అందాలూ ఎంచుకుని చూడండి... ఆహా అనిపించడం ఖాయం. మరింకెందుకాలస్యం కళాంజలి పెటీట్ - బ్లాసమ్ కలెక్షన్‌ని ఓ సారి చూసేయండి.



మంగళగిరి కాటన్ లాంగ్ స్ట్రెయిట్ కుర్తా అంతటా పరుచుకున్న బ్లాక్‌ప్రింట్ పూల అందాలూ... మెడ దగర చేసిన బీడ్‌వర్క్‌తో మెప్పిస్తోంది కదూ!

ఎంబ్రాయిడరీ చేసిన చందేరీ కుర్తా.. అన్ని సందర్భాలకూ నప్పుతుంది.

మంగళగిరి కుర్తీపై జరీ టిష్యూ ఆడంబరంగా అనిపిస్తే... జతగా చేసిన చేతి ఎంబ్రాయిడరీ, హ్యాండ్‌బ్లాక్ ప్రింటు అదరహోనే!

ప్యూర్ మల్ కాటన్ డ్రెస్ ఓంబ్రీ డ్రైయింగ్‌తో కంటికింపుగా కనిపించేలా చేస్తుంటే, పక్షుల ప్రింట్లతో స్కర్ట్ అంచు కళ తేవడం ఖాయం.

నగలు, దుస్తులు:
www.kalanjali.com
www.facebook.com/kalanjaliworld
040-23231147, సైఫాబాద్, కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్, (హైదరాబాద్) , విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి.

మూడేళ్లలో.. మరింత ముప్పు!




రొమ్ము క్యాన్సర్‌పై వినిపిస్తున్న హెచ్చరికలివి! 2020కల్లా ఈ సమస్యతో చనిపోయేవారి సంఖ్య ఏటా 76 వేలకి చేరుతుందట. దీనిపై మనకున్న సాధికార గణాంకాల ప్రకారం ఈ సంఖ్య ప్రస్తుతం ఏటా 46 వేలల్లోనే ఉంది. ఆ లెక్కన చూస్తే, వచ్చే మూడేళ్లలో ఈ మహమ్మారి మరింత వికృత రూపం దాలుస్తుందన్నమాట. అంతేకాదు, ఇదివరకు 50 ఏళ్లవారిలోనే కనిపించే ఈ సమస్య ఇప్పుడు 30 ఏళ్ల వయసు స్త్రీలలోనూ ఎక్కువగానే కనిపిస్తోంది. ఆలస్యంగా పెళ్లిళ్లు చేసుకోవడం, చనుబాలు ఇవ్వకపోవడం వంటివీ కారణమవుతున్నాయని భావిస్తున్నారు. దుబాయ్‌కి చెందిన వలాన్‌గాంగ్ విశ్వవిద్యాలయం భారత్‌లో రొమ్ముక్యాన్సర్ వ్యాప్తిపై నిర్వహించిన అధ్యయనం వెల్లడించిన విషయాలివి. అమ్మాయిల్లో చదువులూ, ఉద్యోగాల కంటూ బయటకు రాగలుగుతున్నా.. శరీరానికి సంబంధించిన ఎన్నో విషయాలు బిడియం వదిలి బయటకు చెప్పుకోలేకపోవడమే ఇందుకు కారణమని అభిప్రాయపడ్డారు అధ్యయనకర్తలు. ఏవైనా అనుమానాస్పద లక్షణాలు కనిపించినప్పుడు కనీసం భర్తతోనైనా ఆ విషయాలు చెప్పుకోవడానికి సంకోచిస్తున్నారని అంటున్నారు. అందువల్లే సమస్యలు ముదిరాకగానీ రొమ్ము క్యాన్సర్ బయటపడట్లేదని విశ్లేషించారు. ఈ తీరు మారకపోతే పరిస్థితి ప్రమాదకరంగా మారొచ్చని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

బంగారం వెండి

17న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,776	2,769
వెండి (గ్రా)	42.10	42.20



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమండ్రి		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	-------	-------	30,100	29,840	29,950	29,750	29,690	29,400	30,150	29,950
ఆర్నమెంట్	-------	-------	28,000	27,700	27,730	27,590	27,760	27,480	27,740	27,550
వెండి(కిలో)	-------	-------	40,500	40,000	40,300	39,500	39,400	38,700	40,500	40,500

నజరానా

పొట్టుతీసిన వెల్లుల్లి ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే.. వాటిపై కాస్త ఉప్పు వేసి ఫ్రిజ్‌లో పెట్టండి.

చాక్లెట్.. మోతాదు మించనివ్వొద్దు!

ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూపుల పుణ్యమాని ఈ రోజుల్లో ఎవరికివారే పోషకాహార నిపుణుల అవతారం ఎత్తేస్తున్నారు. ఎక్కడెక్కడో చదివినవాటిని కలిపి తమ సొంతమే అన్నట్టు రాసి పోస్టులు పడేస్తున్నారు. ఇలా హల్‌చల్ చేసే సందేశాలు చాలావాటిల్లో కనిపిస్తున్న విషయం.. చాక్లెట్ చాలా మంచిది అని. దీనివల్ల అమ్మాయిలు స్థూలకాయం కూడా తగ్గించుకుని నాజూగ్గా మారొచ్చనే స్థాయిలో ఉంటున్నాయా సూక్తులు. ఇందులో నిజాలేమిటీ? అన్ని చాక్లెట్‌లలో కాదుకానీ కోకో ఎక్కువగా ఉండే ముడి(రా) చాక్లెట్‌లలో కొంతవరకూ పోషకాలుంటాయి. ముఖ్యంగా ఇందులోని మెగ్నీషియంలాంటివి మనకు కొంతవరకూ ఉపయోగపడతాయి. కానీ మిగతా కాయగూరలూ, పండ్లతో పోల్చుకుంటే వీటి పోషకాల విలువ చాలా పరిమితం! ఇక్కడ మనం చెప్పుకునేది కోకో శాతం ఎక్కువగా ఉన్నవాటి గురించి! మరి మిగతావి? వాటిల్లో ఆ మాత్రం కూడా పోషకాలుండవు. ఆ విషయం పక్కనపెడితే ఏ రకం చాక్లెట్‌లోనైనా కెఫిన్, చక్కెర్లు ఎక్కువగానే ఉంటాయి. కెఫిన్ చాక్లెట్ తినడాన్ని ఓ వ్యసనంలా మారుస్తుంది. ఒకసారి అలవాటై తినకపోతే చికాకు తెప్పిస్తుంది. మరోవైపు.. ఇందులోని చక్కెర్లు ఫ్యాట్ విపరీతంగా పెంచేస్తాయి. కొన్ని చాక్లెట్‌లలో 'కేవలం కొబ్బరి చక్కెరే వాడాం, బ్రౌన్ షుగరే వేశాం..!' అని ప్రచారాలు చేస్తుంటారు. చక్కెర ఏ రూపంలో ఉన్నా ఒక్కటేననే విషయం మరిచిపోకూడదంటున్నారు నిపుణులు! అవి తెచ్చే దుష్ఫలితాల్లో పెద్ద తేడా ఉండదనీ చెబుతున్నారు.



మట్టివిగ్రహాల కోసం.. వీధులన్నీ తిరిగా!

> కొంతమంది ఎవరైనా సహాయం చేస్తారా అని ఎదురుచూస్తారు.. ఇంకొంతమంది ఎవరికి సహాయం చేయాలో తెలియక ఆలోచిస్తారు.. ఈ ఇద్దరినీ ఒక్కటి చేయడమే మా పని అంటున్నారు షేర్ ఎ సర్వీస్ స్వచ్ఛంద సంస్థకు చెందిన విశాలా గుమ్మలూరు.. సామాజిక సేవ చేయడంలో మందుంటూనే, పర్యావరణహితం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారామె. దానిలో భాగంగానే ట్రీ గణేశ్ ఆలోచనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తన వంతుగా ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రయాణంలో ఎదురైన అనుభవాలు ఆమె మాటల్లోనే..

ఒకవైపు ఈవెంట్ ఆర్గనైజర్‌గా సొంత కంపెనీ నడుపుతూనే షేర్ ఎ సర్వీస్ స్వచ్ఛంద సంస్థలో పది సంవత్సరాల నుంచి వలంటీరుగా ఉన్నాను. హైదరాబాదులో పదిహేను సంవత్సరాల నుంచీ ఉంటున్నా నా స్వస్థలం విజయనగరం. మానాన్న నరసింహంగారి కారణంగా చిన్నప్పటి నుంచి సమాజం కోసం ఏదో చేయాలన్న కోరిక నాలో బలంగా నాటుకుపోయింది. నా తపనకు షేర్ ఎ సర్వీస్ సంస్థ సమాధానం చెప్పింది. దాంట్లో భాగమైన తర్వాత పర్యావరణహితం కోసం వివిధ కార్యక్రమాలు చేయటం మొదలుపెట్టాను. సహజరంగులతో హోళీ పండగ జరుపుకోవడం, పర్యావరణహిత దీపావళికి సంబంధించిన అవగాహన కల్పించే సదస్సుల్లో పాల్గొనేదాన్ని. అలాగే ప్రతి సంవత్సరం మే 31 న క్లాత్ డిస్ట్రిబ్యూషన్ డే పేరుతో మా సంస్థ ఆధ్వర్యంలో మన దేశంలోని చాలా ప్రాంతాల్లో సేకరణ కేంద్రాలు ఏర్పాటుచేసి, వాటిని అవసరమైన వారికి అందిస్తున్నాం. మహిళలకు పోషకాహారం, ఇంటినుంచే వ్యాపారం చేసుకునేలా మెలకువలు నేరుగా వెళ్లి చెబుతుంటా. దీనిలో భాగంగానే అందరికీ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీఓపీ) వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలు వివరించాను. మట్టి వినాయక విగ్రహాలకే ప్రాధాన్యమివ్వమని చెప్పేదాన్ని...దానికి సమాధానంగా అందరూ నన్ను అడిగిన ఒకే ప్రశ్న..'అవి ఎక్కడి దొరుకుతాయి..?' అని. నాకు ఆ వివరాలు తెలియక అలాగే ఊరుకునేదాన్ని. అయితే దీనికి జవాబు మాత్రం నేనే చెప్పాలనుకున్నాను. దానికోసం హైదరాబాదులో దాదాపు ప్రతిచోట మట్టివినాయక విగ్రహాలు తయారుచేసేవారి వివరాలు వీధి వీధి తిరిగి సేకరించాను. ఎక్కడెక్కడ వాటిని తయారు చేసేవారుంటారో ఆ వివరాలు ఇప్పుడు నా దగ్గరున్నాయి.

సమస్యలు తప్పలేదు... మొదట్లో వారందరినీ కాస్త తక్కువ సంఖ్యలోనే విగ్రహాలు తయారు చేయమని చెప్పేదాన్ని. ఎవరైనా అడిగితే తయారీదారుల వివరాలు నేరుగా ఇచ్చేసేదాన్ని. అయితే తీసుకుంటారో లేదో అన్న సందేహంతో తయారు చేయడానికి భయపడేవారు. కానీ ఆ పరిస్థితి ఎన్నో రోజులు లేదు. ఆ తర్వాతి సంవత్సరం వాళ్లే నాకు ఫోన్ చేసి.. 'మేడమ్ మా వివరాలు ఎవరికీ ఇవ్వొద్దండీ. మా దగ్గర విగ్రహాలు అయిపోయాయి' అనేవారు. కార్యక్రమానికి మరింత ప్రచారం కల్పించాలన్న ఉద్దేశంతో నేను ప్రస్తుతం ఉంటున్న మోతీనగర్‌లోనే గ్రీన్‌గణేశా పేరుతో స్టాల్ పెట్టి ఉచితంగా మట్టివినాయక విగ్రహాలని ఇచ్చేదాన్ని. ఆ సమయంలో నేను ఊహించని విధంగా అక్కడ పీఓపీ విగ్రహాలమ్మే వ్యాపారుల నుంచి వ్యతిరేకత మొదలైంది. మీరు ఉచితంగా ఇచ్చేస్తే మా వ్యాపారం ఎలా సాగుతుందనేవారు. అయినా భయపడకుండా ప్రతి సంవత్సరం అలాగే చేశాను. అలా రెండు సంవత్సరాల తర్వాత నాతో గొడవపడ్డ వ్యక్తే నా దగ్గరికి వచ్చి 'చూడండి మేడమ్.. నా దుకాణంలో కూడా మట్టి వినాయక విగ్రహాలు పెట్టాను' అన్నాడు. నేనుంటున్న ప్రాంతంలో మార్పు వచ్చిందన్న సంతృప్తితో స్టాల్ పెట్టడం ఆపేశా. ఎవరైనా గణేశ్ చందా కోసం ఇంటికొచ్చి డబ్బులడిగినా విగ్రహమే ఉచితంగా ఇస్తానని చెబుతాను!

అపోహలు.. భారీ ఎత్తున విగ్రహాలు పెట్టే వారి దగ్గరికి వెళ్లి మట్టి విగ్రహాల గురించి చెబితే.. బరువు ఎక్కువుంటుందని కొంతమందంటే.. జాగ్రత్తగా చూసుకోవాల్సి వస్తుందని ఇంకొంతమంది చెప్పేవారు. దీని గురించి అవగాహన కల్పించడం కోసం మా సంస్థ తరఫున ఒక సంవత్సరం దుర్గంచెరువు దగ్గర యాభై అడుగుల మట్టి విగ్రహాన్ని పెట్టాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిమజ్జనం చేశాం. ఆ తయారీలో రంగులు కూడా సహజమైనవే వాడతాం. వాటిని దాదాపుగా హైదరాబాద్ హోమ్ సైన్స్ కాలేజీ నుంచి, ఇంకా కొన్ని సంస్థల దగ్గర తీసుకుంటాం.



ట్రీ గణేశ్ ఆలోచన ఎలా? ఇంతకముందు మామూలు విగ్రహాలనే తయారుచేయించేవాళ్లం. అయితే పచ్చదనం కూడా ముఖ్యమే అనిపించి ప్రతి విగ్రహానికి ఒక మొక్క ఉండేలా వెనకాల ఒక చిన్న ఏర్పాటు చేశాం. దీంతో నిమజ్జనం తర్వాత మట్టి నీటిలో కరిగిపోయి మొక్క మిగులుతుంది. అపార్ట్‌మెంట్లలో ఉండే వారు ఒక చిన్న కుండీలోనో, గుంతలోనో నిమజ్జనం చేస్తే ఆ మొక్క పెరిగి ఒక గుర్తులా ఉండిపోతుంది. గత సంవత్సరం తక్కువ స్థాయిలో ఈ విగ్రహాలను తయారుచేయించాం. అయితే కేటీఆర్ గారు మేము తయారుచేసిన ట్రీ గణేశా ఫొటోనే ట్వీట్ చేసి, అందరూ పర్యావరణం కోసం ఇలా చేయాలన్నారు. దాంతో ఇప్పుడు మరిన్ని తయారు చేసే పనిలో ఉన్నాం. నామమాత్రంగా డబ్బు తీసుకుని విగ్రహాలను ఇస్తాం.

షేర్ ఎ సర్వీస్.. మాది ఒక 'ఈ' ఎన్జీవో. అంటే మా కార్యకలాపాలన్నీ ఎక్కువగా ఫేస్‌బుక్, వెబ్‌సైట్ ద్వారా నిర్వహిస్తాం. సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నవారిని, సహాయం కోసం ఎదురుచూస్తున్నవారికి పరిచయం చేయడమే మా సంస్థ ముఖ్య ఉద్దేశం. దానికోసం దాదాపు చాలా ఎన్జీవోల వివరాలు సేకరించాం. ఎవరికైనా ఫలానా సమస్య ఉందని చెబితే అది ఎంతవరకూ నిజమో తెలుసుకుని ఎన్జీవోకు వివరాలు అందిస్తాం.



మెడపై నలుపు.. ఎలా పోతుంది?

డియర్ వసుంధర

డా॥ శైలజ సూరపనేని
కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజీషియన్


? నేను తెల్లగా ఉంటా. కానీ ఆరునెలలుగా నా మెడ మాత్రం నల్లగా మారిపోయింది. గొలుసు వేసుకోవడం వల్ల ఇలా జరుగుతోందనుకుని చిన్నచిన్న పూతలు వేసుకున్నా. కానీ ప్రయోజనం లేదు. ఏం చేయాలో తెలియడంలేదు. - ఓ సోదరి

✔ మెడపై నల్లగా ఉండటం చాలామందిలో సర్వసాధారణంగా కనిపిస్తుంది. లావుగా ఉన్నవారిలో ఈ సమస్య కాస్త ఎక్కువగా ఉంటుంది. ఇలా నల్లగా మారడానికి కారణాలనేకం. అకాంథోసిస్ నైగ్రికాన్స్ అనే సమస్య వల్ల మెడ చుట్టూ నలుపు ఉంటుంది. చర్మం మందంగానూ మారుతుంది. నలుపుతోపాటూ మెడ చుట్టూ దురద కూడా ఉండొచ్చు. పాలిసిస్టిక్ ఓవరీస్ సిండ్రోమ్ (పీసీఓఎస్) ఉన్నవారిలో కూడా ఇది కనిపిస్తుంది. ఎగ్జిమా ఉన్నవారిలో కూడా మెడపై నలుపు సాధారణమే. కాలేయ సమస్యలు ఉన్నా మెడ నల్లగా మారుతుంది. కాండిడియాసిస్ వంటి ఫంగల్ ఇన్ఫెక్షన్ ఉన్నవారిలోనూ ఇలా కావచ్చు. ఎండలో ఎక్కువగా తిరిగే వారిలోనూ మెడ నల్లగా మారొచ్చు. ఇలాంటివారు ఎండలోకి వెళ్లినప్పుడు పొక్కుల్లాంటివి రావడం, దురదా లాంటివి పెరుగుతాయి. అకాంథోసిస్ నైగ్రికాన్స్ ఉన్నవారిలో సమస్య శాశ్వతంగా ఉంటుంది. మిగతా సమస్యలయితే.. కొంతవరకూ తగ్గించుకోవచ్చు. ఈ నలుపు తగ్గాలంటే ముందుగా చేయాల్సింది బరువు తగ్గడమే. అదేవిధంగా చక్కెరను వీలైనంతవరకు తగ్గించాలి. పోషకాహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. వ్యాయామం తప్పనిసరిగా చేయాలి. ఆ నలుపు ప్రాంతాన్ని శుభ్రంగా, పొడిగా ఉంచుకోవాలి. సన్‌స్క్రీన్ వాడాలి. ఫంగల్ సమస్యలున్నవారు వైద్యుల పర్యవేక్షణలో యాంటీ ఫంగల్ చికిత్స తీసుకోవాలి. మధుమేహం, పీసీఓఎస్ లాంటి ఆరోగ్య సమస్యలుంటే వైద్యులను సంప్రదించి దానికీ చికిత్స తీసుకోవాలి. ఒకవేళ మీ సమస్య అకాంథోసిస్ నైగ్రికాన్స్ అయితే చర్మరంగును మార్చే స్కిన్ లైట్నింగ్ క్రీములను వైద్యుల సలహాతో వాడాల్సి ఉంటుంది. ముఖ్యంగా హైడ్రోక్వినాన్, రెటినాయిడ్, లాక్టిక్ యాసిడ్, సాలిసిలిక్ యాసిడ్ ఉన్న క్రీంలు వాడాలి. చేపనూనె మాత్రలను నిపుణుల సలహాతో వేసుకుంటే మంచిది. అయినా తగ్గకపోతే మైక్రోడెర్మాబ్రేజన్, లేజర్, కెమికల్ పీల్స్ లాంటివి చేస్తారు. ప్రతి రోజూ ఒక్కో చెంచా చొప్పున తేనె, నిమ్మరసం కలిపి మెడ ప్రాంతంలో రాసి... ఇరవై నిమిషాలయ్యాక కడిగేయాలి. కీరదోస ముక్కను నలుపు ఉండే ప్రాంతాల్లో రాసి నెమ్మదిగా మర్దన చేయాలి. చెంచా పాలపొడిలో తేనె కలిపి మెడపై రాసుకుని బాగా ఆరాక కడిగేయాలి. ఆలివ్‌నూనె, నిమ్మరసం కలిపి రాసుకున్నా కొంత ఫలితం ఉంటుంది.

- sailajaskaza@gmail.com

హాయి నిద్రకు... ఎండలో కాసేపు!

ప్రతిరోజూ నిద్రపోవడానికి మీరు రకరకాల కసరత్తులు చేస్తున్నారా! అదేనండి నిద్రపట్టక అటూ ఇటూ దొర్లుతున్నారా? అయితే ఇది మీ కోసమే.



- ప్రతిరోజూ ఓ ఇరవై నిమిషాలపాటు ఎండ మీపై పడేలా చూసుకోండి. ఈ కిరణాలు మీ శరీరంపై పడటం వల్ల మెలటోనిన్ అనే హార్మోను ఉత్పత్తి బాగా జరుగుతుంది. ఈ హార్మోను రాత్రిపూట విడుదలై హాయిగా నిద్రపట్టేందుకు ఉపయోగపడుతుంది.
- మీ పడకగదిలో వెలుతురు వీలైనంత తక్కువగా ఉండేలా చూసుకోవాలి. అలాగే టీవీ, ఫోను, ట్యాబ్, కంప్యూటరు లాంటివాటిని రెండుగంటల ముందు కట్టేయండి. బదులుగా మంచి సంగీతం వినడం లేదా ఓ పుస్తకం చదవడం అలవాటుగా మార్చుకోండి.
- మెగ్నీషియం కండరాలు, మెదడుకీ సాంత్వన అందిస్తుంది. కాబట్టి ఈ ఖనిజం లభించే ఆహార పదార్థాలను మీ భోజనంలో చేర్చుకోవడం మంచిది. ముఖ్యంగా బాదం, జీడిపప్పు, గుమ్మడి గింజలూ, ఆకుకూరలూ, అరటిపండ్లలో ఇది ఎక్కువగా ఉంటుంది.
- ఒత్తిడి కూడా నిద్రను ఆటంకపరుస్తుంది. కాబట్టి దాన్ని కూడా వీలైనంతవరకూ తగ్గించుకోవడం మంచిది.

సెన్సెక్స్ ▲ 25 **31795**

నిఫ్టీ ▲ 07 **9904**

రూపాయి 64.15 ▼ (ఒక అమెరికా డాలరుకు)

బంగారం 29,110 ▲ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 305

వెండి 39,000 ▲ ముంబయిలో కిలో రూ.లలో 745

ముడి చమురు 51.01 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)


ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	21,850	−175
నాస్‌డాక్	6,267	−78
నిక్కీ 225 (జపాన్)	19,703	−27
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,269	−10
షాంఘై(చైనా)	3,269	+22
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,388	−45
డాక్స్ (జర్మనీ)	12,203	−60

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.37	67.68
పౌండ్ స్టెర్లింగ్	75.32	87.35
యూరో	68.74	79.73
జపనీస్ యెన్/100	53.11	61.60
ఆస్ట్రేలియా డాలరు	46.31	53.59
సింగపూర్ డాలరు	42.82	50.72
థాయ్ బాత్/100	175.51	209.91
బ్రహెయిన్ దీనార్	158.16	181.15
కువైట్ దీనార్	175.58	218.72
ఒమన్ రియాల్	154.76	177.11
సౌదీ రియాల్	15.52	18.40
యూఏఈ దిర్హమ్	15.89	18.57
మలేషియా రింగిట్	13.31	16.36

గురువారం నిఫ్టీ కదలికలు



ఇన్ఫీ ముహూర్తం రేపే

- రూ.13,000 కోట్ల షేర్ల బైబ్యాక్ పరిశీలన
- కంపెనీ చరిత్రలోనే ఇది తొలిసారి

బెంగళూరు

ముప్పై ఆరేళ్ల చరిత్రలోనే తొలిసారిగా ఇన్ఫోసిస్ షేర్ల తిరిగి కొనుగోలు(బైబ్యాక్)కు సమాయత్తం అవుతోంది. ఆగస్టు 19న అంటే రేపు జరగబోయే బోర్డు డైరెక్టర్ల సమావేశంలో ఈ విషయాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకోనుంది. కొంత మంది వ్యవస్థాపకులు, మాజీ అత్యున్నతాధికారులు ఎప్పటి నుంచో బైబ్యాక్‌ను కోరుతూనే ఉన్నారు. అదనపు నగదును వాటాదార్లకు ఇవ్వడం మంచిదని సూచిస్తూ వచ్చారు. ఈ సూచనలకు ఎట్టకేలకు ఇన్ఫోసిస్ తలొగ్గింది. కంపెనీ కార్పొరేట్ పాలన విషయంలో సరైన విధానాలను అనుసరించడం లేదని ఎన్.ఆర్. నారాయణ మూర్తి సహా ఇతర వ్యవస్థాపకుల నుంచి విమర్శలు వచ్చిన నేపథ్యంలో తాజా పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే డివిడెండ్‌తో పాటు షేర్ల బైబ్యాక్ లేదా షేర్ల బైబ్యాక్ ద్వారా రూ.13,000 కోట్లను వాటాదార్లకు చెల్లించనున్నట్లు ఏప్రిల్‌లో ప్రకటించింది. తాజాగా ఆగస్టు 19, 2017న జరగబోయే సమావేశంలో షేర్ల తిరిగి కొనుగోలు ప్రతిపాదనను పరి



శీలించనున్నట్లు ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. అయితే పూర్తి వివరాలను మాత్రం తెలపలేదు.

జూన్ 30, 2017 నాటికి ఇన్ఫోసిస్ వద్ద 3.5 బిలియన్ డాలర్ల(రూ.22,750 కోట్లు) అదనపు నగదు ఉంది. కాగా, ఇన్ఫోసిస్ పలు దేశాల్లో నమోదైన కారణంగా వాటాదార్లకు నగదు నిల్వలను పంచాలంటే.. పలు చట్టపరిధుల్లోనే నిబంధనలను పాటించాల్సి ఉంటుంది.

షేర్ల బైబ్యాక్ చేస్తే ఏమవుతుంది

వాటాదార్లకిచ్చిన షేర్లను తిరిగి వారి నుంచే సదరు కంపెనీ కొనుగోలు చేయడాన్ని బైబ్యాక్ అంటారు. దీని వల్ల షేరు వారీ ఆర్జన(ఈపీఎస్) పెరుగుతుంది. అంతే కాదు.. వాటాదార్లకు కంపెనీ వద్ద ఉన్న అదనపు నగదును ఇవ్వడానికి వీలవుతుంది. మార్కెట్లు స్తబ్దుగా ఉన్న సమయంలో షేర్ల బైబ్యాక్ వల్ల షేరు ధరకు మద్దతు లభిస్తుంది. ఇన్ఫీ తాజా ప్రకటనలో కంపెనీ షేర్లు స్పందించడమే ఇందుకు ఉదాహరణ. బీఎస్ఈలో 4.54 శాతం (రూ.44.35) లాభంతో రూ.1021.15 వద్ద స్థిరపడ్డాయి.

ఇతర దిగ్గజాలూ..

ఇన్ఫోసిస్ ఈ నిర్ణయాన్ని తీసుకోవడానికి ముందే పలు ఐటీ కంపెనీలు సైతం షేర్ల బైబ్యాక్‌ను ప్రకటించాయి. టీసీఎస్ రూ.16,000 కోట్ల మెగా బైబ్యాక్‌ను ఇది వరకే ఆఫర్ చేసింది. విప్రో(రూ.2500 కోట్లు), హెచ్‌సీఎల్ టెక్నాలజీస్(రూ.3,500కోట్లు)లు కూడా ఇదే తరహాలో బైబ్యాక్‌లను ప్రకటించిన విషయం విదితమే.



నాస్‌డాక్‌లో భారత స్వాతంత్ర్య వేడుకలు: న్యూయార్క్‌లోని టైమ్ స్క్వేర్‌లోగల నాస్‌డాక్ స్టాక్ ఎక్స్ఛేంజీలో భారత స్వాతంత్ర్య వేడుకలను నిర్వహించారు. గత ఎనిమిది సంవత్సరాలుగా ఈ ఉత్సవాలను ఇక్కడ జరుపుతుండటం విశేషం. ట్రేడింగ్ ప్రారంభ గంటను మోగించడం ద్వారా భారత కాన్సుల్ జనరల్ సందీప్ చక్రవర్తి స్వాతంత్ర్య వేడుకలను ప్రారంభించారు. నాస్‌డాక్ ఉపాధ్యక్షుడు జో బ్రాంటక్‌తోపాటు ప్రముఖ ప్రవాస భారతీయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపైర్ స్టేట్ భవనాన్ని త్రివర్ణ విద్యుత్ దీపాలతో అలంకరించడం గమనార్హం.

నాలుగు నెలలు.. రూ.40,000 కోట్లు

స్టాక్‌మార్కెట్‌లో ఎంఎఫ్‌ల కొనుగోళ్ల జోరు

దిల్లీ: స్టాక్ మార్కెట్‌లో మ్యూచువల్ ఫండ్‌ల (ఎంఎఫ్‌లు) కొనుగోళ్ల పరంపర కొనసాగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18) మొదటి నాలుగు నెలల్లో (ఏప్రిల్- జులై) ఎంఎఫ్‌లు రూ.40,000 కోట్లకు పైగా విలువైన షేర్లను కొనుగోలు చేశారు. ముఖ్యంగా చిన్న మదుపర్ల నుంచి పెట్టుబడులు వెల్లువెత్తడం ఇందుకు కలిసొచ్చింది. ఇక ఇదే సమయంలో విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్‌పీఐలు) రూ.21,000 కోట్ల విలువైన షేర్లు మాత్రమే కొనుగోలు చేయడం గమనార్హం. 'ప్రస్తుతం స్థిరాస్తి, పసిడి వంటి పెట్టుబడి సాధనాలు మెరుగైన ప్రతిఫలాన్ని అందించలేకపోతున్నాయి. దీంతో పెట్టుబడులు ఈక్విటీల వైపు మళ్లుతున్నాయి' అని ఫండ్స్‌ఇండియా డాట్ కామ్‌కు చెందిన మ్యూచువల్ ఫండ్ రీసెర్చ్ అధిపతి విద్యా బాలా తెలిపారు. సెబీ తాజా గణాంకాల ప్రకారం.. ఏప్రిల్-జులై మధ్యలో ఫండ్ మేనేజర్లు రూ.41,508 కోట్లను పెట్టుబడిగా పెట్టారు. నెలల వారీగా చూస్తే.. ఏప్రిల్‌లో రూ.11,244 కోట్లు, మేలో రూ.9,358 కోట్లు, జూన్‌లో రూ.9,106 కోట్లు, జులైలో రూ.11,800 కోట్లు చొప్పున మార్కెట్లలో కుమ్మరించారు. ఇక ఏప్రిల్-జులై మధ్యలో బీఎస్ఈ ప్రామాణిక సూచీ సెన్సెక్స్ దాదాపు 10 శాతం పెరగ్గా.. అదే స్థాయిలో పెట్టుబడులు వచ్చిచేరాయి.

విమ్టా ల్యాబ్స్ ఆదాయం రూ.39 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి విమ్టా ల్యాబ్స్ నికర లాభం తగ్గింది. వ్యాపార కార్యకలాపాల నికర లాభం ఏడాది క్రితంతో పోలిస్తే రూ.2.84 కోట్ల నుంచి రూ.1.06 కోట్లకు పరిమితమైందని కంపెనీ వెల్లడించింది. ఇదే కాలానికి ఆదాయం రూ.37.65 కోట్ల నుంచి రూ.39.36 కోట్లకు పెరిగింది.

ఆరంభ లాభాలు స్వాహా

- రోజంతా తీవ్ర ఊగిసలాట

సమీక్ష

స్టాక్‌మార్కెట్లు గురువారం ఒడుదొడుకుల మధ్య చలించాయి. సమీప కాలంలో వడ్డీ రేట్ల పెంపుపై అనిశ్చితి నెలకొన్నట్లు అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశంలో వెల్లడయిన నేపథ్యంలో సానుకూలంగానే సూచీలు మొదలయ్యాయి. అయితే ఈ జోరును ఎక్కువ సేపు కొనసాగించలేకపోయాయి. ఇటీవల జరిగిన ఆర్‌బీఐ సమీక్ష నిర్ణయాలు మదుపర్లపై ప్రభావం చూపాయి. బ్యాంకింగ్, వాహన షేర్లు కౌంటర్లలో అమ్మకాలు చోటు చేసుకోవడంతో మార్కెట్లు ఒకానొక సమయంలో నష్టాలను చవిచూశాయి. చివరకు స్వల్ప లాభాలతో సూచీలు ముగిశాయి. నిఫ్టీ 9,900 స్థాయిని మళ్లీ నిలబెట్టుకుంది.

ఉదయం సానుకూలమే.. ఉదయం సెన్సెక్స్ 31919.17 వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. ఆ తరువాత 31714.10 - 31937.51 మధ్య చలించి చివరకు 24.57 పాయింట్ల లాభంతో 31,795.46 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 9,883.75-9,947.80 మధ్య కదలాడి చివరకు 6.85 పాయింట్ల లాభంతో 9,904.15 వద్ద ముగిసింది.

వెలిగిన ఇన్ఫోసిస్ షేరు.. రేపు జరిగే బోర్డు సమావేశంలో షేర్ల బైబ్యాక్‌కు ఆమోదం తెలుపనున్నట్లు ఇన్ఫోసిస్ వెల్లడించడంతో ఆ సంస్థ షేరు ధర మెరిసింది. ఇంట్రాడేలో 5 శాతానికి పైగా దూసుకెళ్లిన షేరు ధర చివరకు బీఎస్ఈలో 4.54 శాతం లాభంతో రూ.1,021.15 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 4.68 శాతం లాభంతో రూ.1,020.85 వద్ద స్థిరపడింది.

- కోల్ ఇండియా షేరు ధర బీఎస్ఈలో 4.22 శాతం పెరిగి రూ.247.05 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈలో 3.78% లాభంతో రూ.246.95 వద్ద స్థిరపడింది.
- బ్యాంకింగ్ షేర్లలో ఇండస్‌ఇండ్ బ్యాంక్ (1.35%), యెస్ బ్యాంక్ (1.26%), కోటక్ మహీంద్రా బ్యాంక్ (1.17%), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (0.76%), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (0.74%) వంటి షేర్లు నష్టపోయాయి.

మార్కెట్ కబుర్లు

- **పెన్నార్ ఇండస్ట్రీస్,** దాని అనుబంధ సంస్థలైన పెబ్స్, పెన్నార్ ఎన్విరోలకు రూ.252 కోట్ల విలువైన ఆర్డర్లు లభించాయి.
- నాడీ వ్యవస్థ రుగ్మతల చికిత్సకు ఉపయోగపడే కొత్త రసాయన సమ్మేళనాలకు ఐరోపా, జపాన్, న్యూజిలాండ్‌లలో ఒక్కొక్కటి చొప్పున మేధోసంపత్తి హక్కులు పొందినట్లు **సువెన్ లైఫ్‌సైన్సెస్** వెల్లడించింది.
- సముద్ర తీర మార్గాల్లో గస్తీ కాసేందుకు వినియోగించడానికి అత్యంత వేగవంతమైన రెండు ఇంటర్‌సెప్టర్ నౌకలను భారత తీరరక్షక దళాలకు నిర్మించి ఇచ్చినట్లు **ఎల్&టీ** తెలిపింది. వీటి విలువ రూ.1,424 కోట్లు.
- దేశంలోని దక్షిణ, పశ్చిమ ప్రాంతాల మధ్య అత్యధిక వోల్టేజ్ ఉండే విద్యుత్ సరఫరాకు **పవర్ గ్రిడ్** రూ.1,931.19 కోట్లు పెట్టుబడులు పెట్టనుంది.
- ఐపీఓ ద్వారా దాదాపు 25 శాతం వాటాను విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు **శ్రేయీ ఎక్విప్‌మెంట్ ఫైనాన్స్** వెల్లడించింది.
- ఆరోగ్యసంరక్షణ రంగంలో డేటా విశ్లేషణ, సాంకేతిక సేవలు అందించే అమెరికా సంస్థ డేటా టెక్నాలజీని తమ అనుబంధ సంస్థ డెసిజన్ రిసోర్స్ గ్రూప్ కొనుగోలు చేసినట్లు **పిరమాల్ ఎంటర్‌ప్రైజెస్** తెలిపింది.

డిష్ టీవీ నష్టం రూ.14 కోట్లు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో డీటీహెచ్ సేవల సంస్థ డిష్ టీవీ ఏకీకృత ప్రాతిపదికన రూ.13.94 కోట్ల నికర నష్టాన్ని చవిచూసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.36.15 కోట్ల నికర లాభాన్ని ఆర్జించిందని బీఎస్ఈకి వెల్లడించింది. ఇక మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.748.68 కోట్లు నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.790.09 కోట్ల ఆదాయంతో పోలిస్తే ఇది 5.24 శాతం తక్కువ. ఇక మొత్తం వ్యయాలు రూ.735.66 కోట్ల నుంచి 5.87% పెరిగి..రూ.778.85 కోట్లకు చేరాయి.

2018-19లో సీవేస్ షిప్పింగ్ ఐపీఓ!

ఐడీఎఫ్‌సీ పీఈ నుంచి 24% వాటా కొనుగోలు


ఈనాడు, హైదరాబాద్: ప్రైవేట్ ఈక్విటీ సంస్థ ఐడీఎఫ్‌సీ పీఈ వద్ద ఉన్న 24 శాతం వాటాను సీవేస్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ ప్రమోటర్లు కొనుగోలు చేశారు. దీని విలువను మాత్రం కంపెనీ వెల్లడించలేదు. కంపెనీలో వాటాను విక్రయించుకుని బయటపడేందుకు ప్రైవేటు ఈక్విటీ సంస్థకు అవకాశం కల్పించే విధంగా సీవేస్ షిప్పింగ్ ప్రమోటర్లు ఐడీఎఫ్‌సీ పీఈ వద్ద ఉన్న మొత్తం వాటాను కొనుగోలు చేశారు. సీవేస్ షిప్పింగ్ పబ్లిక్ ఇష్యూలో జాప్యం జరుగుతున్న నేపథ్యంలో తొమ్మిదేళ్ల అనుబంధం నుంచి ఐడీఎఫ్‌సీ పూర్తిగా బయటపడింది. పబ్లిక్ ఇష్యూకు వచ్చే ఉద్దేశంతో సీవేస్ షిప్పింగ్ ప్రమోటర్లు 2016, మార్చిలో విషయ వివరణ పత్రాన్ని (డీఆర్‌హెచ్‌పీ) దాఖలు చేశారు. అయితే.. మార్కెట్, షిప్పింగ్ వ్యాపార పరిస్థితులు బాగా లేకపోవడంతో ఇష్యూను వాయిదా వేసుకున్నారు. దీంతో సీవేస్ షిప్పింగ్ నుంచి బయటపడేందుకు మరో మార్గం కోసం పీఈ సంస్థ చూస్తోంది. తొమ్మిదేళ్ల ఐడీఎఫ్‌సీ పీఈ, సీవేస్ షిప్పింగ్ అనుబంధం 2 కంపెనీలకు ప్రతిఫలాన్ని ఇచ్చాయని సీవేస్ గ్రూప్ ఛైర్మన్, ఎండీ పి.వి.కె.మోహన్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో మంచి పనితీరు నమోదు చేయడంతోపాటు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా ఫలితాలు బాగా ఉండే వీలున్నందున 2018-19లో ఇష్యూకు రావాలని భావిస్తున్నట్లు తెలిపారు.

ఇన్ఫోసిస్



రూ.1005 వద్ద ప్రారంభమై రూ.998.05- 1029.25 మధ్య కదలాడి క్రితం ముగింపు రూ.975.20తో పోలిస్తే రూ.45.65 (4.68%) లాభంతో రూ.1020.85 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 1,28,92,130.

సిప్లా



రూ.593.40 వద్ద మొదలై రూ.569.90- 594 మధ్య చలించి క్రితం ముగింపు రూ.590.45తో పోలిస్తే రూ.17.25 (2.92%) నష్టంతో రూ.573.20 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 14,22,631 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)

బ్రిటానియా ఇండస్ట్రీస్	4339.85
బీఈఎంఎల్	1892.80
కంటైనర్ కార్పొరేషన్	1267.70
టాటా స్టీల్	637.00
ఫ్యూచర్ రిటైల్	503.45
వేదాంతా	310.25
హెక్సావేర్ టెక్నాలజీస్	281.90
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	239.30

52 వారాల కనిష్ఠం (రూ.లలో)

అపోలో హాస్పిటల్స్	1067.00
ఐనాక్స్ విండ్	107.00
పెన్నార్ ఇంజినీర్డ్ బిల్డింగ్	85.50

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు)			దేశీయ మదుపర్లు (డీఐఐలు)		
తేదీ	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
17/08	3,453	4,434	−981	2,765	1,936	829
16/08	5,400	6,490	−1,090	3,570	2,233	1,337
14/08	3,231	4,870	−1,639	3,653	2,033	1,619
11/08	4,120	6,063	−1,943	5,086	3,069	2,017
10/08	4,385	5,556	−1171	4,085	3,263	822

17వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు

హైదరాబాద్	355	వరంగల్	357
చిల్లరగా(ఒక గుడ్డు)	4.15	విశాఖపట్నం	362
బెంగళూరు	380	చెన్నై	397
18న		చిత్తూరు	390
విజయవాడ/గోదావరి	359	నమక్కల్	387

ఎన్ఎస్ఈ

గురువారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ACC 1780.10 (1811.20) 360577
ADANI PORT & 389.30 (397.55) 2502761
AMBUJA CEMEN 270.90 (270.05) 2464131
ASIAN PAINTS 1134.95 (1141.30) 494638
AUROBIND PHA 703.50 (713.90) 2144376
AXIS BANK LT 497.15 (499.50) 3948664
BAJAJ AUTO L 2825.85 (2849.20) 152160
BANK OFBAROD 148.25 (147.15) 20122929
BHARTI AIRTE 416.35 (407.75) 2958725
BHARTI INFRA 379.35 (382.90) 1591863
BOSCH LTD 22037.95 (22309.90) 20311
BPCL 493.70 (483.95) 4640313
CIPLA 573.20 (590.45) 1422631
COAL INDIA L 246.95 (237.95) 20945037
DR. REDDYS 2011.25 (2005.25) 540131
EICHER MOTOR 30928.00 (30617.00) 34762
GAIL 376.20 (371.20) 1450232
HCL TECH 871.40 (864.50) 801175
HDFC 1759.25 (1741.75) 2408279
HDFC BANK 1765.40 (1781.25) 1363717
HERO MOTOCOR 3997.85 (4022.10) 351635
HINDALCO IND 230.30 (233.60) 10310147
HINDUSTAN UN 1177.30 (1186.35) 961319
ICICI BANK 293.15 (294.95) 8168684
INDIABULLS H 1200.45 (1209.10) 753155
INDIAN OIL 426.30 (422.30) 3013849
INDUSINDBANK 1628.50 (1647.20) 619082
INFOSYS LTD 1020.85 (975.20) 12892130
ITC 280.00 (279.20) 13703999
KOTAK MAHIND 989.00 (1000.55) 1076077
LARSEN & TOU 1134.00 (1142.25) 1508949
LUPIN 953.95 (961.00) 1127740
M&M 1367.00 (1371.20) 611537
MARUTI SUZIK 7582.45 (7701.15) 321296
NTPC LTD 176.80 (170.10) 5165177
ONGC 160.60 (160.95) 5184915
POWER GRID C 219.45 (220.70) 1596199
RELIANCE IND 1567.10 (1566.10) 3618179
SBI 280.85 (283.10) 12134114
SUN PHARMA 488.25 (485.70) 4484873
TATA CONSULT 2485.65 (2492.35) 876187
TATA MOT DVR 228.60 (231.60) 1487470
TATA MOTORS 385.30 (389.25) 5971420
TATA POWER 81.65 (82.05) 3774599
TATA STEEL L 625.40 (631.20) 4616610
TECH MAHINDR 424.40 (419.95) 3175256
ULTRATECH 3932.90 (3941.30) 123889
VEDANTA LIMI 304.80 (297.20) 19018787
WIPRO 288.35 (289.95) 2637344
YES BANK LTD 1738.10 (1761.85) 1913591
ZEE ENTERTAI 526.75 (518.70) 2086690

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1365.60 (1357.60) 40252
ASHOK LEYLAN 105.30 (104.75) 6252193
BAJAJ FINANC 1728.75 (1721.35) 729269
BAJAJ FINSER 5304.45 (5356.80) 182299
BEL 183.15 (175.30) 8068673
BHEL 129.25 (129.95) 3296113
BRITANNIA 4250.50 (4299.95) 170706
CADILA HEALT 481.60 (483.25) 619739
COLGATE PALM 1059.65 (1066.80) 95935
CONTAINER 1241.75 (1230.40) 543798
CUMMINS INDI 901.50 (921.00) 198242
DABUR INDIA 307.95 (309.05) 741281
DIVIS LAB 645.70 (657.25) 398334
DLF LIMITED 185.20 (180.80) 16958436
EMAMI LIMITE 1090.70 (1124.55) 68420
GLAXOSMI CON 5296.00 (5344.15) 2058
GLAXOSMI PHA 2392.55 (2381.55) 5830
GLENMARK PHA 619.40 (621.60) 770213
GODREJ CONSU 919.60 (921.90) 245715
HAVELLS INDI 472.85 (464.65) 1425374
HINDUSTAN ZI 294.80 (290.90) 3428249
HPCL 433.95 (436.40) 3787274
ICICI PRU LI 425.25 (434.85) 909768
IDEA CELLULR 89.35 (86.95) 8881668
INTERGLOBE A 1312.40 (1313.20) 407645
JSW STEEL LT 234.60 (237.75) 2586445
LIC HOUS.FIN 661.40 (659.55) 1473758
MARICO LIMIT 319.85 (315.95) 1557457
MCDOWELL 2601.40 (2548.45) 517454
MOTHERSON 323.75 (331.75) 2466709
NHPC LTD 30.85 (31.10) 1905510
NMDC LTD 122.90 (121.15) 2777013
OIL INDIA 282.75 (286.45) 407760
ORACLE FIN S 3508.40 (3562.75) 19835
P&G HYG&HEAL 8198.35 (8191.85) 1317
PETRONET LNG 228.15 (229.60) 7317445
PIDILITE IND 818.20 (817.90) 264118
PIRAMAL ENTE 2713.85 (2748.85) 151132
PNB 146.30 (147.55) 8384523
POWER FIN CO 125.60 (118.50) 12306883
RURAL ELEC C 169.10 (164.15) 6627455
SAIL 59.05 (59.25) 5109015
SHREE CEMENT 17296.45 (17494.10) 13511
SHRIRAM TRAN 976.75 (978.10) 618487
SIEMENS 1322.90 (1308.55) 125447
SUN TV LTD 752.80 (748.45) 1000983
TITAN IND 621.50 (627.70) 938044
TORRENT PHAR 1311.70 (1323.95) 216066
UNITED BREWE 805.90 (808.65) 101493
UPL LIMITED 855.25 (852.10) 886995

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 185.30 (163.15) 4870632
ADANI ENTERP 113.40 (115.20) 3746529
ADANI POWER 28.70 (29.55) 5285095
ALL BANK 67.25 (66.90) 2584744
AMARA RAJA 806.00 (813.00) 114501
ANANT RAJIND 55.75 (54.60) 1660108
ANDHRA BANK 51.25 (51.15) 2067573
APOLLO HOSPI 1101.45 (1159.45) 1613900
APOLLO TYRES 269.25 (272.70) 3452974
APTECH 220.00 (218.90) 719054
BAJAJ ELECT. 328.90 (315.45) 179575
BAJAJ HIND 15.15 (15.20) 4018414
BAJAJ HOLDIN 2583.85 (2584.25) 76854
BALAJI TELE 161.70 (158.60) 443020
BALLARPUR IN 14.40 (14.90) 1099154
BALRAMPUR CH 165.70 (167.15) 1145614
BANK OF MAHA 26.90 (27.00) 89537
BANK OFINDIA 145.75 (147.05) 4468028
BATA INDIA 676.00 (673.50) 935987
BGR ENERGY S 133.70 (132.90) 101335
BHARAT FORGE 1185.85 (1187.30) 371390
BHUSHAN STEE 71.15 (73.25) 886576
BIOCON LTD 328.40 (328.40) 6874084
BOMBAY DYE 78.80 (76.00) 1523277
CANARA BANK 335.10 (336.85) 1553747
CEAT LIMITED 1731.30 (1712.30) 624529
CENTRAL BANK 72.05 (74.65) 952491
CHAMBAL FERT 141.25 (140.45) 1073332
CHENNAI PETR 392.60 (390.75) 614785
CITY UNIBANK 159.80 (158.30) 280239
CORPO BANK 46.40 (45.95) 235480
COX & KINGS 267.25 (266.05) 313611
D B REALTY L 37.35 (37.00) 386884
DELTA CORP L 170.40 (169.75) 1322365
DENA BANK 31.35 (31.25) 552202
DHANALAKBANK 34.65 (34.90) 659731
EDELWEISS CA 254.90 (248.35) 4395170
EDUCOMP SOLU 8.30 (8.35) 162033
EID PARRY 336.65 (322.90) 411036
EIH 131.60 (130.80) 45798
ESSAR SHIPPI 26.35 (26.30) 16647
ESTER INDUST 33.70 (32.35) 15346
EXIDE INDUST 213.30 (206.95) 1691212
FEDERAL BANK 110.05 (110.15) 4981114
FINOLEX CABL 530.05 (527.30) 110830
G E SHIP LTD 389.85 (377.00) 425500
GAMMON INDIA 8.85 (8.75) 383838
GAMMON INFRA 4.20 (3.95) 3704603
GATI LIMITED 112.45 (112.90) 340232
GAYATRI PROJ 163.20 (164.05) 37129
GITANJALIGEM 62.40 (62.70) 345170
GMR INFRASTR 18.55 (16.50) 151869401
GODREJ IND 605.25 (610.95) 294925
GRASIM IND 1100.70 (1106.50) 739496
GUJ ALK&CHEM 405.00 (393.70) 85202
HCL INFOSYS 45.00 (44.65) 674175
HEXA TECH 278.25 (264.45) 3283152
HIMACHAL FUT 16.55 (15.85) 4350213
HINDU MOTORS 7.85 (7.90) 95349
HOUSING DEV 61.40 (62.60) 20326771
IDBI 53.80 (53.25) 3613142
IDFC 56.45 (56.75) 9076767
IFCI 22.95 (23.05) 4151678
IL&FS TRANS 79.55 (79.40) 230582
IND SWIFTLAB 34.30 (34.35) 19339
INDBULLS REL 237.00 (230.00) 10291535
INDIA CEM 184.80 (185.00) 4709553
INDIAN BANK 304.65 (295.30) 1423081
INDO RAMA SY 27.80 (28.10) 62813
INDRAPRASTHA 1274.35 (1274.35) 315664
IND-SWIFTLTD 8.50 (8.10) 27401
INGERSOLL-R 810.05 (806.45) 7842
IOB 22.75 (22.75) 606988
IPCA LAB 415.95 (416.95) 74939
IRB INFRA DE 211.05 (212.10) 1104663
J&K BANK 80.70 (81.25) 191525
JAI CORP 79.50 (75.05) 1219665
JAIN IRRIGAT 97.95 (94.95) 8480352
JAYPEE INFRA 17.10 (17.95) 6823654
JAYSHREE TEA 103.20 (104.75) 39832
JET AIRWAYS 591.20 (587.05) 1407443
JINDAL SAW 91.15 (93.45) 698621
JINDAL STEEL 139.85 (138.40) 11091385
JK LAKSHMI C 418.65 (418.55) 42742
JK PAPER LIM 93.25 (92.20) 319238
JM FINANCIAL 126.60 (124.65) 969519
JP ASSOCIATS 23.50 (23.90) 79255653
JSW ENERGY L 64.25 (64.60) 4261970
JUBILANT FOO 1399.40 (1392.90) 1254835
JUBILANT ORG 722.10 (697.95) 400355
JYOTHY LABS 374.00 (381.55) 51935

ఘనం (+)

నిఫ్టీ	17న	మార్పు %
INFOSYS	1020.85	4.68
NTPC	176.80	3.94
COAL INDIA	246.95	3.78
VEDANTA	304.80	2.56
BHARTI AIRTEL	416.35	2.11
BPCL	493.70	2.01
ZEE ENTERTAINMENT	526.75	1.55

గ్రహణం (-)

నిఫ్టీ	17న	మార్పు %
CIPLA	573.20	-2.92
ADANI PORT	389.30	-2.08
ACC	1780.10	-1.72
MARUTI SUZUKI	7582.45	-1.54
AUROBINDO PHA	703.50	-1.46
HINDALCO	230.30	-1.41
YES BANK	1738.10	-1.35

KARNATA BANK 148.50 (145.65) 2986919
KEC INTL LTD 302.00 (286.55) 1134245
KOLTE PATIL 165.60 (166.85) 69701
KPIT CUMMINS 115.10 (112.70) 1356117
L&TFIN.HOLD 175.70 (176.50) 3368022
LAK VIL BANK 177.65 (177.50) 588833
M & M FINANC 420.90 (424.20) 2510605
MANAPPURAM G 87.80 (90.30) 4817991
MMTC LIMITED 57.05 (56.45) 497369
MOSER-BEAR 4.70 (4.75) 233418
MPHASIS LTD 590.50 (585.60) 8487
MRPL 121.15 (124.45) 961882
MTNL 18.40 (18.60) 551176
NCC LIMITED 87.80 (87.55) 2570708
NETWORK18 FI 52.65 (53.40) 202222
NEULAND LAB 1297.85 (1278.95) 3232
NIIT LTD 92.40 (91.35) 1508483
NIIT TECHNOL 499.10 (490.85) 630944
OMAXE LTD 203.80 (200.95) 571156
ONMOBILE GLO 59.50 (60.80) 189394
ORIENT PAPER 96.40 (97.50) 202618
ORIENTALBANK 125.40 (124.00) 4985987
PARSVNATH DE 21.75 (20.00) 1621864
PATEL ENGG 73.65 (71.55) 297275
PFIZER 1789.15 (1787.25) 4806
POLARIS SOFT 237.90 (240.80) 116718
POWERTRADING 116.95 (115.90) 1421162
PRAJ IND 70.25 (71.50) 355317
PRISM CEMENT 112.45 (112.65) 64505
PROVOGUE (IN 4.05 (4.10) 143701
PUNJ LLOYD 19.95 (19.85) 801708
PUNJAB & SIN 49.65 (49.15) 80801
PURAVANKARA 73.60 (72.20) 134428
PVP VENTURES 4.95 (4.90) 181375
PVR LIMITED 1301.25 (1329.20) 183800
RADICO KHAIT 168.70 (161.50) 2257062
RAJ OIL MILL 1.35 (1.30) 80487
RAJESH EXPOR 719.80 (718.85) 366762
RALLIS INDIA 228.85 (225.95) 78171
RAMCO IND 232.80 (232.00) 59721
RAMCO SYS 343.45 (358.20) 114558
RAMKY INFRA 79.80 (80.40) 86538
RAYMOND 746.00 (738.55) 306903
RELIANCE CAP 783.25 (791.20) 3393364
RELIANCE COM 23.20 (23.35) 16257814
RELIANCE INF 491.40 (494.35) 1485534
RELIANCE POW 40.65 (40.65) 2144488
ROLTA INDIA 55.10 (54.75) 340171
SAGAR CEMENT 820.25 (816.65) 9240
SAREGAMA 403.55 (374.40) 333515
SHANTHI GEAR 134.35 (131.30) 38381
SHIPPNG CORP 87.60 (84.40) 902708
SHREE RENUKA 17.15 (16.70) 3598339
SINTEX IND 34.70 (33.95) 35247474
SOBHA DEVELO 392.45 (394.65) 110203
SOUTHINDBANK 27.85 (28.00) 7924745
STERLITE TEC 227.90 (226.70) 737493
SUJANA METAL 1.65 (1.70) 95925
SUN PHARMA 379.30 (369.55) 1144669
SUND FASTNER 390.35 (385.40) 69622
SUZLON ENERG 17.20 (17.50) 29942543
SYND. BANK 64.90 (64.70) 1337524
TATA CHEM 591.35 (601.10) 377020
TATA COFFEE 133.85 (132.65) 1164517
TATA COMMUN 641.20 (628.55) 381289
TATA GLOBAL 190.60 (193.85) 10381703
TATA METALIK 662.75 (668.25) 110315
TATA TELESER 6.90 (6.80) 1350575
THE INDIAN H 126.50 (125.95) 659092
TORRENT POWE 211.25 (211.10) 1665613
TRIVENI ENGG 92.30 (93.85) 989937
TTK PRESTIGE 6234.35 (6260.60) 4300
TV TODAY NET 245.15 (244.45) 95385
TV18 BROADCA 36.45 (36.75) 2374798
TVS MOTOR 580.05 (585.30) 692157
UCO BANK 30.80 (30.35) 417610
UNION BANK 133.40 (133.25) 2867662
UNITECH 7.70 (8.05) 19518109
UNITED BANK 18.45 (18.55) 301244
USHA MARTIN 19.55 (19.60) 417431
VADILAL INDU 839.70 (844.90) 29040
VENKYS 2112.95 (2126.30) 285028
V-GUARD IND 179.60 (178.60) 432180
VIJAYA BANK 68.35 (67.85) 713025
VIP 195.45 (196.10) 262211
VOLTAS 543.35 (542.50) 1255237
ZEE LEARN LI 43.10 (42.40) 226914
ZUARI GLOBAL 119.05 (118.95) 15628
ZYDUS WELLNE 860.35 (867.40) 2565

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 815.25 (802.70) 9665
AMAR RAJA BA 807.45 (813.35) 10236
ANDHRA BANK 51.20 (51.20) 150179
ANDHRA CEMEN 8.91 (8.95) 17053
ANDHRA PAPER 296.85 (299.60) 4112
ANDHRA PETRO 27.60 (27.65) 64321
ANDHRA SUGAR 325.05 (325.45) 4087
ASTRA MICROW 124 (126) 47102
AUROBINDO PH 703.50 (714.20) 170611
AVANTEL SOFT 222.05 (220) 458
AVANTI FEEDS 1906.05 (1941.05) 14391
AVON ORG 5.24 (4.93) 5155
BALAJI AMIN 312.05 (313.65) 1558
BARTRONICS 14.10 (14) 9524
BHAGIRA CHEM 195.05 (170) 91534
BHAGYA NAG 23.45 (23.10) 2688
BRILLIANT SE 7.25 (7.16) 132501
CAMBRIDGE TE 69.35 (68) 5972
CONT COFFEE 280.20 (279) 2370
COROMAN FERT 443.90 (448.40) 43391
CYIENT LIMIT 507.40 (499.85) 12846
DECCAN CEMEN 1148.25 (1133) 249
DIVI'S LAB 645.50 (656.40) 65196
DR REDDY 2010 (1998.80) 45207
GATI CORPN 112.80 (112.90) 97191
GAYATRI PROJ 163.20 (164.60) 12227
GMR INFRASTR 18.60 (16.40) 18188353
GOLDST INFRA 124.15 (118.25) 7181
GOLDSTONE EN 11.48 (11.01) 18003
GRANULES (I) 126.80 (126.55) 231272
GVK POWER 13.24 (12.76) 4028673
HBL NIFE POW 45.60 (45.70) 43264
HERITAGE FOO 1294.70 (1335.45) 5296
HYD INDUS 1154.55 (1157) 4187
IDL INDUSTRS 546.90 (521.45) 3659
ILFS ENGINEE 42.80 (41.45) 4971
INNAREDY COM 2.75 (2.80) 2030
IVRCL INFRAS 5.24 (5.23) 152186
KAKATIYA CEM 346.75 (343.45) 3116
KAVERI SEED 548.60 (563.05) 88644
KCP LTD 105.15 (102.30) 39543
LANCO INDUS 363.20 (363.55) 7023
LANCO INFRAT 0.91 (0.87) 17469645
LAURUS LABS 545.45 (548.55) 3576
MADHUCON PRO 30.20 (28.90) 80209
MIC ELECTRON 8.14 (7.39) 204693
MOLD-TEK.TEC 49.25 (49.30) 1645
MOLDTK PLA 283.25 (282.95) 2459
NAGARJAGRICH 37.05 (36.05) 47894
NATCO PHARMA 772.60 (765.70) 44014
NAVA BH VENT 128.85 (127.95) 15408
NCC 87.70 (87.75) 368429
NCL IND 221.20 (221.75) 33140
NEHA INTER 4.98 (5.37) 389064
NETTLINX 97.60 (100.85) 3468
NIHAR INFO 15.05 (15.60) 1707
NILE 621.85 (583.45) 16932
OIL COUNTRY 43.45 (42.05) 8303
PANYAM CEMEN 60.60 (62.15) 7465
PENNER IND 58.70 (56.70) 548864
PIONEER DIST 209.70 (220.70) 2016
PITTI LAMIN 53.60 (51.85) 6051
PREMIER EXPL 481.45 (468.95) 3177
PRISM CEMENT 111.90 (112.50) 35817
PRUDENTL PHA 3.87 (3.94) 117833
RAIN INDUSTR 130 (126.75) 261917
SAMKRG PIST 263.20 (264.50) 7537
SATVAH. ISPA 39.35 (38.15) 33365
SMS PHARMA 75.70 (71.95) 4932
SPHERE GLOBA 47.45 (50.30) 30643
SREE RAYAL A 28.35 (29.05) 171414
SRINIVASA SH 57.30 (55.80) 3448
STEEL EXCHAN 84.15 (83.95) 97932
SUJANA METAL 1.66 (1.74) 3628
SUJANA TOWER 4.15 (4.32) 20000
SURYALAKSH.C 100.25 (101.70) 8838
SUVEN PHARMA 163.80 (157.55) 114190
TAJ GVK HOTE 162.70 (160.15) 14999
TANLA 31.50 (32.20) 92951
TERA SOFTWAR 65.20 (66) 7335
VICEROY HOTE 17.05 (17) 16359
VIJAY TEXTIL 59.85 (58.80) 52330
VIMTA LABS 131 (133.35) 44635
VISAKA IND 506 (510.30) 10729
VIVIMED LABS 106.50 (104) 133073
YBRANT DIGIT 6.82 (6.77) 81840
ZENTECH 52.45 (50.90) 57588

22న దేశవ్యాప్త బ్యాంకుల సమ్మె

కోల్‌కతా: బ్యాంకింగ్ సంఘాల ఐక్య వేదిక (యూఎఫ్‌బీయూ) ఈ నెల 22న దేశవ్యాప్తంగా బ్యాంకుల సమ్మెకు పిలుపునిచ్చింది. బ్యాంకింగ్ రంగంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టదలచిన నూతన సంస్కరణలకు వ్యతిరేకంగా ఈ సమ్మె చేపట్టనున్నారు. సంస్కరణల నెపంతో బ్యాంకింగ్ రంగాన్ని ప్రైవేటుపరం చేయాలని భావిస్తోందని పశ్చిమ బంగా యూఎఫ్‌బీయూ కన్వీనర్ సిద్ధార్థ్ ఖాన్ ఆరోపించారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను ఒకే బ్యాంకింగ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ కిందకు తేవడానికి బ్యాంక్ బోర్డు బ్యూరోని ఏర్పాటు చేసిందని, తద్వారా ప్రభుత్వ వాటాను 50% లోపు తీసుకురావాలన్నది దాని ఉద్దేశమని విమర్శించారు.



యాక్సిస్ బ్యాంక్ కొత్త గృహ రుణ పథకం

ముంబయి: రుణాలను పెంచుకోవడం కోసం యాక్సిస్ బ్యాంక్ సరికొత్త గృహ రుణ పథకంతో ముందుకొచ్చింది. రుణం మొత్తాన్ని తీర్చే వ్యవధిలో కొన్ని నెలవారీ వాయిదా(ఈఎమ్ఐ)లను రద్దు చేయడం ఈ పథకం ప్రత్యేకత. 20 ఏళ్ల కాలవ్యవధి ఉన్న రుణంలో ప్రతీ నాలుగో, ఎనిమిదో, పన్నెండవ ఏడాదుల్లో నాలుగు చొప్పున ఈఎమ్ఐలను రద్దు చేస్తుంది. అంటే ఎవరైనా ఒకరు 20 ఏళ్ల కాలావ్యవధికి రుణం తీసుకుంటే 12 ఈఎమ్ఐలను కట్టక్కర్లేదన్నమాట. రూ.30 లక్షల రుణంపై రుణ స్వీకర్త రూ.3.09 లక్షలను ఆదా చేసుకోవచ్చు. రూ.30 లక్షల వరకు రుణాలపై ఈ పథకం వర్తిస్తుంది.

ఆడి నుంచి డిజైన్ కార్లు

దిల్లీ: జర్మనీ లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడి 2 కొత్త రకాల కార్లను 'డిజైన్' ఎడిషన్స్ విభాగంలో విపణిలోకి విడుదల చేసింది. ఎస్‌యూవీ వాహనమైన క్యూ7, పెద్ద కార్ల విభాగంలో ఏ6 రకాలు వీటిలో ఉన్నాయి. మూడు లీటర్ల డీజిల్ ఇంజిన్ కలిగిన క్యూ7 కారు 249 అశ్విక సామర్థ్యంతో దూసుకెళ్తుంది. ఇది కేవలం 7.1 సెకన్లలోనే గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. గరిష్ఠంగా గంటకు 244 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదని కంపెనీ పేర్కొంది. దీని ధర రూ.81.99 లక్షలు (ఎక్స్‌షోరూమ్). అదేవిధంగా రెండు లీటర్ల డీజిల్ ఇంజిన్, 190 అశ్విక సామర్థ్యం కలిగిన సెడాన్ ఏ6 ధర రూ.56.78 లక్షలు (ఎక్స్‌షోరూమ్). ఈ సందర్భంగా ఆడీ ఇండియా అధిపతి రాహిల్ అన్సారీ మాట్లాడుతూ 'భారత మార్కెట్‌లోకి వచ్చి పదేళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా గతంలో విడుదల చేసిన ఆడి ఏ6 ఆదరణను దృష్టిలో ఉంచుకుని తాజాగా ఆడి ఏ6 డిజైన్ ఎడిషన్‌ను విడుదల చేశామన్నారు. లగ్జరీ ఎస్‌యూవీ విభాగంలో ఆడి క్యూ7 భారత మార్కెట్లో రాణిస్తుంది' అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



మళ్లీ రూ.30,000కు బంగారం

రూ.40,000కి చేరిన వెండి

దిల్లీ: పండగ సీజను ప్రారంభం కానున్న వేళ పసిడి ప్రియం అయ్యింది. 10 గ్రాముల బంగారం ధర మళ్లీ రూ.30,000 ఎగువకు వెళ్లింది. దేశీయంగా, అంతర్జాతీయంగా గిరాకీ పెరగడం ఇందుకు కారణం. మరోవైపు వెండి ధర కూడా రూ.40,000ను మించింది. అమెరికా వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచేందుకు ఫెడ్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలపడంతో డాలరు విలువ తగ్గింది. దీంతో పసిడిపై పెట్టుబడులను మదుపర్లు పెంచారు. ఈ పరిణామం పసిడి ధర పెరగడానికి దారి తీసింది. దేశీయంగా చూస్తే.. పండగ సీజను దగ్గర పడటంతో పెరిగే గిరాకీని దృష్టిలో ఉంచుకొని ఆభరణ వర్తకులు పసిడి కొనుగోళ్లను పెంచడం కూడా ధర పెరిగేందుకు కారణమైంది.



భారత్‌లో..: గురువారం దిల్లీలో 10 గ్రాముల 99.9 స్వచ్ఛత బంగారం రూ.300 పెరిగి రూ.30,050కు చేరింది. 99.5 స్వచ్ఛత బంగారం కూడా రూ.300 అధికమై రూ.29,900 వద్ద ముగిసింది. బుధవారం పసిడి ధర రూ.300 తగ్గడం గమనార్హం. ఇక వెండి ధర కిలోకి రూ.900 పెరిగి రూ.40,200 చేరింది.

అంతర్జాతీయంగా: ఔన్సు బంగారం ధర 0.43% పెరిగి 1,228.30 డాలర్లకు చేరింది. సింగపూరులో ఔన్సు వెండి ధర 0.12% అధికమై 17.12 డాలర్లుగా నమోదైంది.

నీళ్లు లేకుండా కారును కడిగేస్తాం

- ప్రత్యేక ద్రావణాలతో సేవలు
- నిస్సాన్ మోటార్ ఇండియా

దిల్లీ: నిస్సాన్ మోటార్ ఇండియా నీటిని పొదుపు చేసేందుకు మరిన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా కార్లను నీళ్లు లేకుండానే శుభ్రం చేయనుంది. ఇందుకోసం ప్రత్యేక ద్రావణాలను సంస్థ వినియోగించనుంది. వీటి సహాయంతో చుక్క నీరు కూడా అవసరం లేకుండా కారును శుభ్రం చేయొచ్చని సంస్థ వెల్లడించింది. గురువారం ప్రారంభమైన 'హ్యాపీ విత్ నిస్సాన్' ప్రచారంలో భాగంగా ఈ సేవలను సంస్థ ప్రారంభించింది. ఈ నెల 24 వరకు ఈ ప్రచారాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా వాహనాన్ని ఉచితంగా పరీక్షించడంతోపాటు విడిభాగాల ధరలపై రాయితీలు ఇవ్వనున్నట్లు సంస్థ వెల్లడించింది. ఉచితంగా 'టాప్ వాష్' చేయనున్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్నా 148 నిస్సాన్, డాట్సన్ సేవా కేంద్రాలలో ఈ సేవలు లభించనున్నాయని నిస్సాన్ మోటార్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) అరుణ్ మల్హోత్రా అన్నారు. ప్రత్యేక ద్రావణాలతో కార్లను శుభ్రం చేయడం ద్వారా ఏడాదికి దాదాపు 13 కోట్ల లీటర్ల నీటిని ఆదా చేయనున్నట్లు పేర్కొన్నారు.



ప్రత్యేక ద్రావణాలతో కారును శుభ్రం చేయడంపై అవగాహన కల్పిస్తున్న నిస్సాన్ ప్రచారకర్త, బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్

గృహ కొనుగోలుదార్లకు ఊరట



- దివాలా కంపెనీ నుంచి క్లెయిము పొందొచ్చు
- దివాలా చట్ట నిబంధనలకు సవరణలు

దిల్లీ: ఒక దివాలా కంపెనీ నుంచి చెల్లింపు పొందాల్సి ఉంటే.. ఇకపై దివాలా చట్టం కింద క్లెయిము పొందొచ్చు. దివాలా కంపెనీ సదరు కొనుగోలుదారుకు ఫ్లాట్‌ను ఇవ్వని కారణంగా క్లెయిము చేసుకోవడానికి వీలు కల్పిస్తూ ఇన్‌సాల్వెన్సీ, బ్యాంకరప్టసీ స్మృతి(ఐబీసీ) నిబంధనలను సవరించారు. ఇప్పటిదాకా కేవలం ఆర్థిక సహాయం చేసిన వ్యక్తులకు మాత్రమే ఐబీసీ కింద క్లెయిము చేసుకోవడానికి వీలుంది. తాజాగా ఆర్థిక పరంగా, కార్యకలాపాల పరంగా మద్దతు పలికిన వ్యక్తులకే కాకుండా ఇతరులకు కూడా క్లెయిము చేసుకునే అవకాశాన్ని కల్పిస్తూ ద ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంకరప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా(ఐబీబీఐ) ఆమేరకు సవరణలు చేసింది. సదరు వ్యక్తి నిర్దిష్ట రూపంలో ఒక దరఖాస్తును పూర్తి చేసి రెసొల్యూషన్ ప్రొఫెషనల్‌కు సమర్పించాల్సి ఉంటుంది. ఏదైనా దివాలా కేసును నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) చేపట్టిన పక్షంలో ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడానికి రెసొల్యూషన్ ప్రొఫెషనల్‌ను నియమిస్తారు. జేపీ ఇన్‌ఫ్రాటెక్ రూ.526 కోట్ల రుణాన్ని ఎగవేసిన క్రమంలో ఎన్‌సీఎల్‌టీ దివాలా ప్రక్రియను మొదలుపెట్టడంతో వేల కొద్దీ గృహ కొనుగోలుదార్లు ఇబ్బందుల్లో పడిన నేపథ్యంలో తాజా ఆదేశాలు ఊరట కలిగించేవే.

ఇక ఎస్‌పీ గ్రూపుతో తెగతెంపులే!

- టాటా సన్స్ బోర్డు నిర్ణయం
- కంపెనీల ముందుకు ప్రతిపాదన

దిల్లీ: షాపూర్‌జీ పల్లోంజీ (ఎస్‌పీ) గ్రూపుతో ఉన్న వ్యాపార సంబంధాలను తెంచుకునేందుకు టాటా సన్స్ గ్రూపు సిద్ధమైనట్లు తెలుస్తోంది. సైరస్ మిస్త్రీ కుటుంబం ఎస్‌పీ గ్రూపునకు ప్రమోటరుగా ఉంది. ఎస్‌పీ గ్రూపుతో వ్యాపార సంబంధాలకు స్వస్తి పలికేందుకు కంపెనీల అభిప్రాయాన్ని టాటా సన్స్ బోర్డు ఈ నెల ప్రారంభంలో అడిగిందని సంబంధిత వర్గాల సమాచారం. అయితే ఈ వార్తలపై టాటా సన్స్ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. మరోవైపు టాటా సన్స్ ఛైర్మన్‌గా సైరస్ మిస్త్రీ ఉన్న సమయంలో టాటా కంపెనీల నుంచి ఇంజినీరింగ్, నిర్మాణ కాంట్రాక్టులు ఏవీ తీసుకోలేదని ఎస్‌పీ గ్రూపు వెల్లడించింది. తన హయాంలో ఎస్‌పీ గ్రూపునకు ఎలాంటి కొత్త కాంట్రాక్టులు ఇవ్వొద్దని టాటా కంపెనీలకు నవంబరు 2013లో మిస్త్రీ ఆదేశాలు జారీ చేశారని తెలిపింది. 2012-13లో టాటా గ్రూపు నుంచి కాంట్రాక్టుల విలువ రూ.1.125 కోట్లు ఉండగా.. 2015-16కు వచ్చేసరికి శూన్య విలువకు వచ్చేసిందని పేర్కొంది.

అతితక్కువ వడ్డీకే రుణాలిస్తున్నాం

- గృహ రుణాల్లో పోటీ పెరుగుతోంది ● రెరా చట్టంతో పారదర్శకత
- 2017-18లో రూ.50 వేల కోట్ల రుణాలిస్తాం
- పోర్టుఫోలియోలో 15 శాతం వృద్ధి అంచనా



'ఈనాడు' ఇంటర్వ్యూ \ ఎల్ఐసీ హౌసింగ్ ఎండీ వినయ్ సాహ్

గృహ రుణాలను అందిస్తున్న ప్రధాన సంస్థల్లో ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ ఒకటి. ఇటీవల ఎస్‌బీఐ చౌక గృహ రుణాలపై వడ్డీ రేటును తగ్గించడంతో.. మార్కెట్‌లో పోటీకి అనుగుణంగా ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ 'గృహ సిద్ధి' పేరుతో ఒక ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద అతి తక్కువ వడ్డీ రేటుకు రుణం ఇస్తున్నట్లు ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ ఎండీ, సీఈఓ వినయ్ సాహ్ తెలిపారు. ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన ఆయన స్థిరాస్తి (నియంత్రణ-అభివృద్ధి) చట్టం-2016 (రెరా), వడ్డీరేట్లు, కంపెనీ పనితీరు మొదలైన అంశాలపై 'ఈనాడు'తో మాట్లాడారు. ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు..

– ఈనాడు, హైదరాబాద్

? ఇటీవల రిజర్వు బ్యాంకు రెపో రేటును పావు శాతం తగ్గించింది. ఇందుకు అనుగుణంగా ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ రుణ రేటు ఇంకా తగ్గించే అవకాశం ఉందా

గృహ సిద్ధి ద్వారా ఇప్పటికే తక్కువ వడ్డీరేటుకు రుణాలను ఇస్తున్నాం. ప్రస్తుతానికి వడ్డీరేట్లను తగ్గించే ఆలోచన లేదు.

? 2017-18లో కంపెనీ రుణ పంపిణీ, లాభాల్లో వృద్ధి ఎలా ఉంటుంది

గత ఆర్థిక సంవత్సరంలో రూ.44,000 కోట్ల గృహ రుణాలను పంపిణీ చేశాం. ఇందులో రూ.39,000 కోట్లు రిటైల్ రుణాలే. మిగిలిన రూ.5,000 కోట్లు ప్రాజెక్టులకు ఇచ్చాం. 2017-18లో రుణాల పంపిణీ 15 శాతం వరకూ పెరిగే అవకాశం ఉంది. రూ.50-51 వేల కోట్ల రుణాలను పంపిణీ చేయొచ్చు. 2016-17లో దాదాపు రూ.1,700 కోట్ల నికర లాభాన్ని ప్రకటించాం. ఈ సారి నికర లాభంలో 15 శాతం పెరుగుదల ఉండొచ్చు.

? రుణ పోర్టుఫోలియో ఏ మేరకు పెరుగుతుంది

2017, మార్చి చివరి నాటికి రూ.1.44 లక్షల కోట్ల రుణ పోర్టుఫోలియో ఉంది. ఇందులో 96 శాతం వ్యక్తులకు ఇచ్చిన రిటైల్ గృహ రుణాలే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రుణ పంపిణీ, లాభంతోపాటు పోర్టుఫోలియో కూడా 15 శాతం పెరగొచ్చు.

? గృహ రుణాల రంగంపై రెరా చట్టం ప్రభావం ఎలా ఉంది

ఇప్పటి వరకూ 23 రాష్ట్రాలు రెరాను అమలులోకి తెచ్చాయి. అయితే.. అన్ని రాష్ట్రాలూ తమ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చాయి. రాష్ట్రాలు తీసుకు వచ్చిన చట్టాలు పూర్తిగా కేంద్ర చట్టానికి అనుగుణంగా లేవు. గడువు ముగిసినా అనేక రాష్ట్రాల్లో రెరా చట్టానికి అనుగుణంగా నమోదు చేసుకున్న ప్రాజెక్టులు తక్కువే. గృహ కొనుగోలుదారుల కోణంలో పరిశీలిస్తే.. వారు ప్రస్తుతం గృహాల కొనుగోలుపై వేచి చూసే ధోరణిని అనుసరిస్తున్నారు. పూర్తి స్థాయిలో ఈ చట్టం అమలులోకి వస్తే.. పారదర్శకత బాగా పెరిగి కొనుగోలుదారుకు చాలా ప్రయోజనం కలుగుతుంది. ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి సమాచారం వారికి లభిస్తుంది. దీర్ఘకాలంలో గృహ రుణాలపై ఈ చట్టం ప్రభావం సానుకూలంగానే ఉంటుంది.

? తక్కువ ధర గృహాలపై (అఫర్డబుల్ హౌసింగ్) కంపెనీ దృష్టి పెడుతుందా

గత ఆర్థిక సంవత్సరంలో 4,000 చౌక గృహాలకు రుణాలిచ్చాం. ఈ ఏడాది జులై నాటికే 3,000 గృహాలకు రుణాలు సమకూర్చాం. ఈ ఏడాది వీటి వాటా పెరుగుతుందని భావిస్తున్నాం. తక్కువ ధర గృహాలకు రుణ పరిమాణం తక్కువగా ఉంటుంది. అందువల్ల మొత్తం రుణ పంపిణీలో వీటి వాటా తక్కువగా ఉంటుంది. ఇటీవల ప్రవేశపెట్టిన 'గృహ సిద్ధి'పథకం కింద రూ.25 లక్షల వరకూ తీసుకునే రుణాలకు మహిళల నుంచి 8.35% వడ్డీరేటు మాత్రమే వసూలు చేస్తున్నాం. ఇతరులు 8.4% వడ్డీ రేటు చెల్లించాలి. ఇవి అతి తక్కువ వడ్డీ రేట్లు. మా సగటు రుణం రూ.20 లక్షలుంది. రుణాల్లో 48% 15-16 పెద్ద నగరాల్లో ఉన్న వినియోగదారులే తీసుకుంటున్నారు. అయితే.. దేశంలో అన్ని ప్రాంతాలకు విస్తరించి ఉన్నాం.

? కంపెనీ నిరర్థక ఆస్తులు ఏ మేరకు ఉన్నాయి

మా నిరర్థక ఆస్తులు చాలా తక్కువ. 2017, మార్చి నాటికి నికర నిరర్థక ఆస్తులు 0.2 శాతమే. స్థూల నిరర్థక ఆస్తులు 0.43 శాతం. నగదు రూపంలో స్థూల నిరర్థక ఆస్తులు రూ.627 కోట్లు. నిరర్థక ఆస్తుల శాతం సాధారణంగా గత 2-3 ఏళ్లలో చేసిన వ్యాపారంపై ఆధారపడి ఉంటుంది.

? గృహ రుణాల విపణిలో మీ వాటా ఎంత?

ప్రస్తుతం గృహ రుణాల విపణిలో మాకు 11 శాతం ఉంది. భవిష్యత్తులో ఈ వాటా పెరగడం రెండు అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ వ్యాపార వృద్ధి లక్ష్యాన్ని నిర్ణయించుకున్నట్లుగానే ఇతర గృహ ఫైనాన్స్ కంపెనీలు, బ్యాంకులు లక్ష్యాన్ని నిర్ణయించుకుంటాయి. అంతే కాక నియంత్రణ సంస్థ అనేక కొత్త కంపెనీలకు ఈ వ్యాపారంలోకి ప్రవేశించడానికి లైసెన్సులు ఇస్తోంది. గృహ రుణాలపై బ్యాంకులు కూడా దూకుడు పంథాను అనుసరిస్తున్నాయి. అందువల్ల మార్కెట్‌లో పోటీ పెరుగుతోంది. వీటిని పరిగణనలోకి తీసుకుంటే భవిష్యత్తు మార్కెట్ వాటా లక్ష్యాన్ని నిర్ణయించుకోలేం.

? వ్యాపార విస్తరణకు ఈఏడాది ఎంత మంది ఏజెంట్లను నియమించుకోనున్నారు

ఏజెంట్ల నియామకం నిరంతరం సాగే ప్రక్రియ. మాకు ప్రస్తుతం 10,500 మంది ఏజెంట్లు ఉన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దాదాపు 4,000 మందిని నియమించుకోవాలని భావిస్తున్నాం.

టెలికాంలో 30 లక్షల ఉద్యోగాలు

- 2018కల్లా సాధ్యమే
- అసోచామ్-కేపీఎమ్‌జీ సర్వే వెల్లడి



దిల్లీ: 2018 నాటికి టెలికాం రంగం 30 లక్షల ఉద్యోగాలు సృష్టించగలదని అసోచామ్-కేపీఎమ్‌జీ అధ్యయనం పేర్కొంది. నానాటికీ విస్తరిస్తున్న 4జీ సాంకేతికత, స్మార్ట్‌ఫోన్లు, డిజిటల్ వాలెట్ల వాడకం పెరగడం, డేటా వినియోగం ఎక్కువవడం దీనికి కారణాలని తెలిపింది. ఓపక్క టెలికామ్ రంగంలో పోటీ విస్తృతమైన టారిఫ్‌లు దిగజారి, ఆదాయాలు క్షీణించి, లాభదాయకత సన్నగిల్లి ఆర్థికపరమైన ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న తరుణంలో ఈ ఆశావహ ఉద్యోగ అంచనాలు వెలువడటం గమనార్హం. వినియోగదారు నుంచి వచ్చే సగటు ఆదాయం పడిపోయి టెలికామ్ కంపెనీలు ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా కంపెనీలు మౌలిక సదుపాయాలను పెంచుకోవడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకునేందుకు భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. తద్వారా పోటీని ఎదుర్కోవడానికి వీలవుతుందని అధ్యయనం వెల్లడించింది. భవిష్యత్తు గిరాకీని తట్టుకోవాలంటే ఇప్పుడున్న మానవ వనరులు సరిపోవని, అలాగే సాంకేతిక నైపుణ్యాలున్న నిపుణులకు సైతం కొరత ఉందని పేర్కొంది. టెక్నాలజీ పెరిగిపోతుండటంతో సైబర్ భద్రత నిపుణులు, అప్లికేషన్ల డెవలపర్లు, మార్కెటింగ్ సిబ్బంది, మౌలిక సదుపాయాలు, మొబైల్ సాంకేతిక నిపుణులు అవసరమవుతారని తెలిపింది. ఉన్న ఉద్యోగులకు, సిబ్బందికి నూతన నైపుణ్యాలు కూడా అవసరం తెలిపింది. 5జీ, ఎమ్2ఎమ్(మిషన్ టు మిషన్) వంటి నూతన సాంకేతికతలు, సమాచార, కమ్యూనికేషన్స్ టెక్నాలజీ విస్తరిస్తుండటంతో 2021 నాటికి ఈ విభాగాల్లో 8,70,000 ఉద్యోగాలు పుట్టుకొస్తాయని సర్వే తెలిపింది. అలాగే డేటా వినియోగం పెరగడం, వాలెట్లు, ఇతరత్రా సాంకేతిక పరిజ్ఞానాలు, స్మార్ట్‌ఫోన్ల విస్తృతి వంటి అంశాలు వచ్చే ఏడాదికల్లా 30 లక్షల ఉద్యోగాలను సృష్టించే స్థాయికి టెలికామ్ రంగాన్ని తీసుకెళ్తుందని అధ్యయనం వెల్లడించింది. మొబైల్ డేటా వినియోగం 2016 నాటికి 76 శాతం పెరిగిందని పేర్కొంది. ప్రస్తుతం 1.1 బిలియన్(సుమారు 110 కోట్లు) మంది టెలికాం చందాదారులు ఉన్నారని 2020 నాటికి ఈ సంఖ్య 1.4 బిలియన్ (140 కోట్లు)కు చేరగలదని తెలిపింది. మొబైల్ వినియోగదారులు సుమారు 64.6 కోట్లు ఉండగా 2020 నాటికి మరో 30 కోట్ల మంది జత చేరవచ్చని అంచనా వేసింది.

మారుతీ సియాజ్ కొత్త రకం

ధర రూ.9.39 లక్షలు

దిల్లీ: మారుతీ సుజుకీ తమ మధ్య శ్రేణి సెడాన్ సియాజ్‌లో కొత్త స్పోర్టీ వెర్షన్‌ను విపణిలోకి విడుదల చేసింది. కొత్త 'సియాజ్ ఎస్' పెట్రోల్ వేరియంట్ ధర రూ.9.39 లక్షలు (ఎక్స్-షోరూమ్ దిల్లీ)గా కంపెనీ నిర్ణయించింది. ఇక డీజిల్ స్మార్ట్ హైబ్రిడ్ వేరియంట్ ధర రూ.11.55 లక్షలు. గ్రే క్రోమ్‌తో కలగలిపిన ఈ కారు పూర్తి ప్రీమియం బ్లాక్ ఇంటీరియర్స్‌తో లభించనుంది. 'కొత్త సియాజ్ ఎస్, యువ వినియోగదారుల అవసరాలను తగ్గట్టు ఉంటుంది. ఈ వేరియంట్ ద్వారా మార్కెట్‌లో సియాజ్ స్థానం మరింత బలోపేతం కానుంది.' అని మారుతీ సుజుకీ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (మార్కెటింగ్, అమ్మకాలు) ఆర్ఎస్ కల్సీ వెల్లడించారు.

సరైన ఉద్యోగ గణాంకాలు లేని మాట నిజమే

ఇన్ఫోసిస్ మూర్తి

దిల్లీ: దేశంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు సరైన ఉద్యోగ గణాంకాలు లేకపోవడం, కేంద్ర ప్రభుత్వానికి సవాల్‌గా మారిందన్న ముఖ్య ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ వ్యాఖ్యలకు ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి మద్దతుగా నిలిచారు. 'అరవింద్ సుబ్రమణియన్ వ్యాఖ్యలతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. ఉద్యోగ గణాంకాలు కచ్చితంగా లేవన్న విషయాన్ని ఆయన ఇప్పటికే గుర్తించారు. ఈ సమస్య పరిష్కారానికి ఇది చాలా కీలకమైన అడుగు' అని నారాయణ మూర్తి అన్నారు. సిసాకు చెందిన సినర్జిటిక్ సెక్యూరిటీ ఆపరేషన్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. 'సరైన ఉద్యోగ గణాంకాలు లేకపోవడం అన్న సమస్యను పైస్థాయిలో ఉన్న వ్యక్తులు గుర్తించారు. నిరుద్యోగ సమస్యను ప్రభుత్వం పరిష్కరిస్తుందని నేను భావిస్తున్నాను' అని తెలిపారు.

లండన్‌లో కొనండో ఇల్లు

- పౌండు క్షీణతతో గృహాలు చౌక
- ఏడాదిక్రితంతో పోలిస్తే 14% తక్కువకు కొన్న భారతీయులు
- నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక

దిల్లీ

ఇళ్ల ధరలు తగ్గాలంటే సిమెంటు, ఇసుక, ఇటుక, స్టీల్ లాంటివి చౌక అవ్వాలి కదా. అయితే కరెన్సీ మారకపు విలువ బలహీనపడితే కూడా ఇళ్లు చౌక అవుతాయి. ఇందుకు నిదర్శనం లండన్‌లోని స్థిరాస్తుల ధరలే. పౌండుతో పోలిస్తే రూపాయి బలపడటంతో ఈ ఏడాది జనవరి- మార్చిలో 14 శాతం తక్కువకు భారతీయులు ఇక్కడ ఇంటిని కొనుగోలు చేశారట. నైట్ ఫ్రాంక్ ఇండియా ఈ విషయాన్ని తన నివేదికలో వెల్లడించింది. మరి పౌండు ఎందుకు బలహీనపడిందో తెలుసా? ఐరోపా కూటమి నుంచి విడిపోవాలని బ్రిటన్ నిర్ణయం తీసుకోవడం వల్లే. దీనినే 'బ్రెగ్జిట్' అని అంటారని మనకు తెలుసు. 2016 జూన్ 23తో (బ్రెగ్జిట్ రెఫరెండమ్ తేదీ) పోలిస్తే 2017 తొలి త్రైమాసికం నాటికి భారత్ కరెన్సీ 18.7 శాతం బలపడింది. దీంతో భారత కరెన్సీతో లావాదేవీలు నిర్వహించినవారికి దాదాపు ఆ మేరకు ధర దిగివచ్చింది.

రూబుల్ తర్వాత రూపాయే: పౌండు క్షీణత ప్రభావంతో లండన్‌లో స్థిరాస్తుల కొనుగోలు శక్తి విషయంలో రష్యావాసులదే ప్రథమ స్థానం. ఆ తర్వాత భారతీయులే. బ్రెగ్జిట్ అనంతరం పౌండుతో పోలిస్తే రూబుల్ 28.3 శాతం బలపడింది. రూపాయి తర్వాత అత్యధికంగా బలపడిన కరెన్సీల్లో ఆస్ట్రేలియా (11.7%), అమెరికా (11.6%), చైనా (5.8%), ఐరోపా (5.6%) కరెన్సీలు ఉన్నాయి. కరెన్సీ ఒడుదొడుకులను అనుకూలంగా మల్చుకొని ప్రపంచవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో విలాసవంత గృహాలను మదుపర్లు కొనుగోలు చేస్తున్నారని నివేదిక వెల్లడించింది. బ్రెగ్జిట్ అనంతరం భౌగోళిక రాజకీయ పరిస్థితుల కారణంగా లండన్‌లో స్థిరాస్తుల ధరలు 6 శాతం మేర తగ్గాయని నైట్ ఫ్రాంక్ ఇండియా ముఖ్య ఆర్థికవేత్త, నేషనల్ డైరెక్టర్ శమంతక్ దాస్ తెలిపారు.



సెప్టెంబరు 8కల్లా 400 బి.డాలర్లకు విదేశీ మారక నిల్వలు :మోర్గాన్ స్టాన్లీ

ముంబయి: రోజురోజుకీ క్షీణిస్తున్న డాలర్.. ఇదే స్థాయిలో పడిపోతూ ఉంటే వచ్చే నెల 8వ తేదీ నాటికే భారత విదేశీ మారక ద్రవ్య నిల్వలు 400 బిలియన్ డాలర్లను చేరతాయని మోర్గాన్ స్టాన్లీ నివేదిక పేర్కొంది. గత జులై 14 నుంచి 4.389 బిలియన్ డాలర్ల మేర ఈ నిల్వలు పెరిగాయి. ఆగస్టు 4తో ముగిసిన వారానికి ఈ నిల్వలు 581.1 మిలియన్ డాలర్లు పెరిగి 393.448 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇది రికార్డు గరిష్ఠ స్థాయి. గత నాలుగు వారాల్లో పెరిగిన మాదిరిగానే ఇకపై కూడా విదేశీ మారక నిల్వలు పెరుగుతూ వస్తే సెప్టెంబరు 8 నాటికి ఇవి 400 బిలియన్ డాలర్లను చేరడం తథ్యమని నివేదిక చెప్పుకొచ్చింది. వాస్తవానికి డాలరు-రూపాయి ఫార్వర్డ్ పొజిషన్లను సర్దుబాటు చేసి పరిశీలిస్తే ఈ నిల్వలు ఇప్పటికే 407 బిలియన్ డాలర్లకు చేరాయని వివరించింది.

జనరల్ మోటార్స్ ఇండియా అధ్యక్షుడిగా సంజీవ్ గుప్తా

దిల్లీ: అమెరికా కార్ల దిగ్గజం జనరల్ మోటార్స్ తన భారత యాజమాన్యంలో మార్పులు చేసింది. జీఎమ్ ఇండియా ప్రెసిడెంట్, ఎండీగాగా సంజీవ్ గుప్తాను నియమిస్తున్నట్లు గురువారం ప్రకటించింది. సెప్టెంబరు 1 నుంచి ఈ నియామకం అమల్లోకి వస్తుంది. ప్రస్తుతం ఈ స్థానంలో ఉన్న కహర్ కజెమ్ జీఎమ్ కొరియా ప్రెసిడెంట్, సీఈఓగా బాధ్యతలు చేపడతారని కంపెనీ పేర్కొంది. కాగా, సంజీవ్ గుప్తా ప్రస్తుతం జీఎమ్ ఇండియాకు సీఎఫ్ఓగా వ్యవహరిస్తున్నారు. ఈ బాధ్యతలను ఇకపైనా నిర్వహిస్తారు. జీఎమ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్, జీఎమ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ స్టీఫెన్ జాకొబీ మాట్లాడుతూ 'జీఎమ్‌లో సంజీవ్ గుప్తాకు మంచి అనుభవం ఉంది. మా వ్యూహాలకు చోదకంగా పనిచేస్తారు. భారత్‌లో మంచి ఆర్థిక పనితీరును అందుకోవడానికి ఆయన ఆలోచనలను కొనసాగిస్తార'ని పేర్కొన్నారు. కాగా, భారత్‌లో వాహనాల అమ్మకం నిలిపివేయాలని నిర్ణయించుకున్న మూడు నెలల అనంతరం ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం.

ఈనాడు సినిమా




ఎమ్మా స్టోన్

భామల సంపాదన... భలే!

అభిమాన తారలు నటించే సినిమాల గురించే కాదు... వారి సంపాదన గురించి కూడా అభిమానులకు ఎంతో ఆసక్తి ఉంటుంది. సినిమాలకు తీసుకునే పారితోషికాలతో పాటు వాణిజ్య ప్రకటనల్లో నటించినందుకూ కోట్ల రూపాయలు తీసుకునే తారలు కోకొల్లలున్నారు. మరి ప్రపంచంలోనే అందరికన్నా ఎక్కువగా ఆదాయం ఆర్జిస్తున్న తారలెవరో తెలుసా..? దీనికి సంబంధించి ప్రఖ్యాత వార్తా సంస్థ ఫోర్బ్స్ ఏటా ఓ జాబితా విడుదల చేస్తుంటుంది. ఈ ఏడాది సంపాదనలో తొలి పదిస్థానాల్లో నిలిచిన తారల పేర్లను తాజాగా ప్రకటించింది ఫోర్బ్స్.

ఈ ఏడాది అత్యధిక ఆదాయం అందుకున్న తారల్లో తొలిస్థానంలో నిలిచింది అమెరికన్ భామ ఎమ్మా స్టోన్. ఫోర్బ్స్ జాబితాలో తొలి స్థానంలో నిలవడం ఎమ్మాకిదే మొదటిసారి. ఆమె గతేడాది నటించిన 'లా లా ల్యాండ్'తో ఉత్తమ నటిగా ఆస్కార్ పురస్కారం గెలుచుకుంది. ఈ ఏడాదికిగానూ ఎమ్మా సంపాదన రూ.166 కోట్లు (26 మిలియన్ డాలర్లు)గా ఫోర్బ్స్ ప్రకటించింది. 'ఫ్రెండ్స్ విత్ మనీ', 'ది గుడ్ గర్ల్' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న అమెరిన్ నటి జెన్నిఫర్ అనిస్టన్ 25.5 మిలియన్ డాలర్ల ఆదాయంతో రెండో స్థానం సాధించింది. గతంలో రెండేళ్లు వరుసగా ఈ జాబితాలో తొలి స్థానం సంపాదించిన జెన్నిఫర్ లారెన్స్ ఈ ఏడాది మూడో స్థానంతో సరిపెట్టుకుంది. ఆమె ఆదాయం 24 మిలియన్ డాలర్లు. 'సిల్వర్ లైనింగ్స్ ప్లేబుక్'తో ఈమె ఉత్తమ నటిగా ఆస్కార్ అందుకుంది. ఈ జాబితాలో ఎమ్మా వాట్సన్ 6, కేట్ బ్లాంచెట్ 8, జులియా రాబర్ట్స్ 9వ స్థానాల్లో నిలిచారు. కాగా ఈ జాబితాలో ఆసియా నుంచి ఒక్కరు కూడా లేరు. గతేడాది పదో స్థానంలో నిలిచిన దీపికా పదుకొణె ఈసారి జాబితాలో చోటు దక్కించుకోలేకపోయింది.

వీడే 'మహానుభావుడు'



శర్వానంద్

శర్వానంద్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మహానుభావుడు'. మెహరీన్ కథానాయిక. మారుతి దర్శకుడు. యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. వంశీ, ప్రమోద్ నిర్మాతలు. ఓ పాట మినహా చిత్రీకరణ పూర్తయింది. ఈనెల 24న ఫస్ట్‌లుక్‌ని విడుదల చేస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ "భలే భలే మగాడివోయ్' తరవాత అంతగా నచ్చిన కథ ఇది. శర్వానంద్ పాత్ర చిత్రణ కొత్తగా ఉంటుంది. అందులోంచే కావల్సినంత వినోదం పండుతుంది. తమన్ పాటలూ ఆకట్టుకొంటాయ"న్నారు. "ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. దసరాకి ఈ చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు నిర్మాతలు. ఛాయాగ్రహణం: నిజార్ షఫీ



శ్రియ, ఛార్మి, అంబికా కృష్ణ, బోయపాటి శ్రీను, అనూప్ రూబెన్స్, బాలకృష్ణ, ముస్కాన్, కైరా దత్, క్రిష్, నామా నాగేశ్వర రావు, పూరి జగన్నాథ్, ఆనంద్ ప్రసాద్, భాస్కర్ భట్ల తదితరులు

పైసా వసూల్'తో నా ప్రయాణం మళ్లీ మొదలైంది

- నందమూరి బాలకృష్ణ

"ప్రతి నటుడూ ఓ నిత్యావసర వస్తువులా ఉండాలి. ప్రజలకు కావల్సిన వినోదాన్నే కాదు. విజ్ఞానాన్నీ అందివ్వాలి" అన్నారు నందమూరి బాలకృష్ణ. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'పైసా వసూల్'. శ్రియ కథానాయిక. ముస్కాన్, కైరాదత్ ప్రధాన పాత్రలు పోషించారు. పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించారు. ఆనంద్ ప్రసాద్ నిర్మాత. సెప్టెంబరు 1న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. అనూప్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని గీతాలు గురువారం రాత్రి ఖమ్మంలో విడుదలయ్యాయి. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ "నువ్వు ఎవరు? అని నన్నెవరైనా అడిగితే 'నేను భారతీయుణ్ని' అని సమాధానం ఇస్తా. మరోసారి అడిగితే 'తెలుగువాణ్ని' అంటా. మళ్లీ అడిగితే 'ఎన్టీఆర్ కొడుకుని' అని చెబుతా. మళ్లీ మళ్లీ అడిగితే... 'అన్నగారి అభిమానిని' అంటాను. ఆయన స్ఫూర్తితోనే నటుణ్ని అయ్యా. ఆయన బాటలోనే హిందూపురం శాసన సభ్యుడిగా నిలబడ్డాను. హిందూపురం కోసం నా చివరి రక్తపుబొట్టు వరకూ పాటు పడతా. పాత్ర పాత్రకీ ప్రత్యేకత ఉండేలా జాగ్రత్త పడుతున్నా. ఈ విషయంలోనూ నాన్నగారే స్ఫూర్తి. 'పైసా వసూల్' నా 101వ చిత్రం. ఇదే నా తొలి చిత్రం అని భావిస్తున్నా. నా పునః ప్రయాణం ఈ సినిమాతోనే మొదలవుతోంది. నాకు పాటలంటే చాలా ఇష్టం. నాన్నగారి సినిమాలోని పాటలే ఎక్కువ వింటా. తెలుగు జాతి గొప్పదనం తెలిపే పాటలూ వింటుంటా. అయితే... పాటలెప్పుడూ పాడలేదు. 'జగదేక వీరుని కథ'లో 'శివ శంకరీ' పాటంటే నాకు చాలా ఇష్టం. ఆ పాటని వేదికపై పాడాలనుకొనేవాణ్ని. పూరిగారు 'ఈ సినిమాలో ఓ పాట పాడండి' అనగానే... 'ఓకే' అనేశా. ఓ గంటలో ఈ పాట పూర్తయింది. ఈ విషయంలో అనూప్‌ని బాగా ఇబ్బంది పెట్టా. 'పాట బాగా వచ్చిందా? లేదా మళ్లీ పాడాలా' అని అడిగేవాణ్ని. ఆయన 'ఇది చాలు..' అనేవారు. నేనేమో ఈ పాటని 'శివ శంకరీ' పాటలా ఫీలయిపోతున్నా. శ్రియతో ఇది వరకు రెండు సినిమాలు చేశా. 'అవి రెండూ బాగా ఆడాయి. మూడో సినిమా ఎప్పుడు చేస్తామో' అని బెంగపెట్టుకొంది. పూరితో మాట్లాడి వెంటనే ఈ సినిమాలో అవకాశం ఇప్పించా. ముస్కాన్ బాపుగారి బొమ్మలా ఉంది. ఈ సినిమాలో కుర్రాడిలా కనిపిస్తున్నారు అంటున్నారంతా. అది దర్శక నిర్మాతలు కల్పించిన మంచి వాతావరణం వల్లే. ఈ సినిమా కచ్చితంగా పేరుకు తగ్గట్టు భారీ వసూళ్లు సాధిస్తుంద"న్నారు. పూరి జగన్నాథ్ మాట్లాడుతూ "ఇన్నేళ్ల తరవాత బాలయ్యతో కలసి పనిచేసే అవకాశం వచ్చింది. ఆయనతో పనిచేశాక ఈ అవకాశం నాకెందుకు ఆలస్యంగా వచ్చింది? అంటూ చాలా బాధపడ్డా. ప్రేమ, కోపం ఏమొచ్చినా మొహం మీదే చూపిస్తారు. ఇది ఆయన 101వ సినిమా అంటున్నారంతా. నాకైతే... ఒకటో సినిమాలానే ఉంది. అంత ఉత్సాహంగా పనిచేస్తున్నారు. అది చూసి 'మీది మోక్షజ్ఞ వయసు కాదు... కాస్త ఎక్కువే' అని చెబుతుండేవాణ్ని. నాన్నగారు, సినిమా తప్ప... ఆయన మరో మాట మాట్లాడేవారు కాదు. తల్లిదండ్రుల్ని ఇంతగా ప్రేమించే కొడుకుని నేనెక్కడా చూళ్లేదు. తన అభిమానుల్ని ఎలా దారిలో పెట్టుకోవాలో బాలయ్యకు తెలుసు. ఆయన బయటకు వస్తే బౌన్సర్లతో పని లేదు. బాలయ్య తన అభిమానిని కొడితే... అదో లవ్ స్టోరీ. బాలయ్యతో చెంపదెబ్బ కొట్టించుకొన్న అభిమాని ఎంత సంతోషంగా ఉంటాడో మనకు తెలుసా? అదో రకమైన అనుబంధం. బాలయ్య ఎప్పుడు పిలిచినా ఆయనతో మరో సినిమా చేయడానికి నేను సిద్ధమే" అన్నారు. "బాలకృష్ణగారితో మరోసారి పనిచేయడం ఆనందంగా ఉంది. పూరిగారితో ఓ సినిమా చేయాలని ఎప్పటి నుంచో అనుకొంటున్నా. అది ఈ సినిమాతో తీరింది" అంది శ్రియ. "'గౌతమిపుత్ర శాతకర్ణి' బాలయ్య వందో సినిమా. 'పైసా వసూల్'తో రెండొందల మైలు రాయికి శ్రీకారం చుట్టారాయన" అన్నారు క్రిష్. "వెండి తెరపై హీరోయిజాన్ని అద్భుతంగా ఆవిష్కరిస్తారు పూరి. 'సింహా', 'లెజెండ్' కథలు బాలయ్య పాత్ర నుంచే పుట్టాయి. వీరిద్దరి కలయికతో వచ్చిన 'పైసా వసూల్' కచ్చితంగా థియేటర్స్‌లో చప్పట్లు కొట్టిస్తుంద"న్నారు బోయపాటి శ్రీను. "తండ్రి వారసత్వాన్ని అక్షరాలా పుణికి పుచ్చుకొన్న వ్యక్తి బాలయ్య. మాట ఇస్తే సత్యహరిశ్చంద్రుడే. కోపం వస్తే విశ్వామిత్రుడు. ఆయనతో ఈ అనుబంధం మళ్లీ మళ్లీ కొనసాగాల"న్నారు నిర్మాత. ఈ కార్యక్రమంలో ఛార్మి, అలీ, అంబికాకృష్ణ, ముఖేష్, కైరాదత్, ముస్కాన్, నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, విక్రమ్‌జిత్ తదితరులు పాల్గొన్నారు.

గీతోపదేశం

మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు
మచ్చుకైన లేదు చూడు మానవత్వం ఉన్నవాడు
నూటికో కోటికో ఒక్కడే ఒక్కడు
యాడ ఉన్నడో కానీ కంటికి కనరాడు
గీతం: మాయమైపోతున్నడమ్మా...

చిత్రం: ఎర్రసముద్రం
రచన: అందెశ్రీ
- పంపినవారు: తుడమెల శ్రీనివాసులు, శ్రీకాళహస్తి

మీకు నచ్చిన సినిమా పంచ్ డైలాగ్‌లు, పాటల్లోని సందేశాలను మాకు రాసి పంపించండి. వాటిని మీ పేరుతో ప్రచురిస్తాం!
చిరునామా: సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా- 501512
మెయిల్ ఐడీ: cinema@eenadu.net

కథానాయకుల నీడలో నడవాల్సిందే!



తెలుగు చిత్రసీమలో మనం చూసిన తాప్సి వేరు. బాలీవుడ్ వెళ్లాక తాప్సి వేరు. 'బేబి', 'నామ్ షబానా' లాంటి సినిమాల్లో నటనతో ఆశ్చర్యపరిచింది. 'పింక్'లో అయితే అదరగొట్టేసింది. బిగ్‌బీ అమితాబ్ బచ్చన్‌తో దీటుగా నటించి మెప్పించింది. తాప్సిలో ఇంత ప్రతిభ ఉందా? అని ముక్కున వేలేసుకొనేలా చేసింది. బాలీవుడ్‌లో సాధించిన విజయాలు, తెచ్చుకొన్న పేరు.. తెలుగులో తన కొత్త ఇన్నింగ్స్‌కి దోహదం చేస్తాయని నమ్ముతోంది తాప్సి. తను నటించిన 'ఆనందో బ్రహ్మ' శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా తాప్సి చెప్పుకొచ్చిన కబుర్లు ఇవీ.

- "హారర్ సినిమాల్ని చూడడం నాకు పెద్దగా ఆసక్తి ఉండదు. కానీ నాకు వరుసగా అలాంటి కథలే వస్తున్నాయి. 'గంగ' నాకు మంచి పేరు తీసుకొచ్చింది. 'ఆనందో బ్రహ్మ'పైనా నాకు చాలా ఆశలున్నాయి. ఈ కథని, ఇందులో నా పాత్రని చాలా ప్రేమించా. మనుషుల్ని చూసి దెయ్యాలు భయపడడం అనే అంశం నాకు కొత్తగా అనిపించింది. దర్శకుడు మహి నాకు కథ చెప్పిన వెంటనే ఒప్పుకొన్నా. నేను కొన్ని సలహాలు, సూచనలు ఇచ్చా. చిత్రీకరణలో ప్రతి దశలోనూ నా భాగం ఉంది. అందుకే.. 'ఆనందో బ్రహ్మ' నా బిడ్డ లాంటి సినిమా"
- "నాలుగు పాత్రల చుట్టూ తిరిగే కథ ఇది. శ్రీనివాసరెడ్డి, వెన్నెల కిషోర్, షకలక శంకర్, తాగుబోతు రమేష్... ఒకొక్కరికీ ఒక్కో లోపం ఉంటుంది. దాన్నుంచి పండించిన వినోదం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ. ఇదేం కథానాయిక ప్రాధాన్యం ఉన్న చిత్రం కాదు. ప్రతిసారీ ఆస్కార్ స్థాయి నటన ప్రదర్శించే అవకాశం రాదు. నాది రొటీన్ పాత్ర. మా సినిమాలో స్టార్లు లేరు. కానీ.. కథాంశం కొత్తది. మేం నమ్మింది కూడా దాన్నే"
- "మాస్, కమర్షియల్ సినిమాలకు నేనేం వ్యతిరేకం కాదు. ఆ తరహా చిత్రాలు చూస్తూ పెరిగాను. ఇది వరకు నా దగ్గరకు వచ్చిన ప్రతి సినిమా ఒప్పుకొనేదాన్ని. ఇప్పుడు నాకు నచ్చిన సినిమాలే చేస్తున్నా"
- "ఇది వరకు స్టార్ ఇమేజ్, రెమ్యునరేషన్ వీటి గురించి పట్టించుకొనేదాన్ని. ఇప్పుడు అలా కాదు. చేసే పనిలో సంతృప్తి వెదుక్కొంటున్నా. స్టార్ కథానాయికలంటూ ఎవరూ ఉండరు. స్టార్ కథానాయకుల పక్కన నటించే వాళ్లని స్టార్ హీరోయిన్ అనేస్తారంతే. వాళ్లంతా స్టార్ హీరోల నీడలో నడవాల్సిందే. కేవలం కథానాయిక పేరు మీద సినిమా మార్కెట్ జరిగితే, వాళ్లకంటూ ప్రత్యేకమైన గుర్తింపు ఉంటే వాళ్లే స్టార్ కథానాయికలు. అలాంటి ప్రయత్నాలు చేస్తున్న వాళ్లకి ప్రోత్సాహం దొరకాలి"
- "బాలీవుడ్‌లో నటిస్తేనే ఎక్కువ గుర్తింపు వస్తుందనుకోను. టాలీవుడ్, బాలీవుడ్ అనే లెక్కలు చెరిగిపోతున్నాయి. ఈయేడాది హిందీలో విజయవంతమైన సినిమాల సంఖ్య తక్కువ. అగ్ర కథానాయకులకూ పరాజయాలు ఎదురవుతున్నాయి. షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్ కమర్షియల్ బాణీ వదిలి కొత్త తరహా ప్రయత్నాలు మొదలెట్టారు. తెలుగులోనే పరిస్థితి బాగుంది. ఇక్కడ విజయాల శాతం కూడా క్రమంగా పెరుగుతోంది"
- "పెళ్లి చేసుకొనే ఆలోచన ఇప్పట్లో లేదు. ఒకవేళ పెళ్లి చేసుకొన్నా సినిమాలకు దూరం కాను. పెళ్లైన కథానాయికల్ని పట్టించుకోరు అనేది ఒట్టి మాట. విద్యాబాలన్, శ్రీదేవి, ఐశ్వర్యరాయ్ పెళ్లయ్యాకా రాణించారు. ఒకవేళ నేను పెళ్లి చేసుకొంటే 'తాప్సికి అవకాశాలు రావు కాబట్టి పెళ్లి చేసుకొని వెళ్లిపోయింది' అనుకోవాల్సిన అవసరం లేదు"



విజయ్ యలంకంటి, మంచు లక్ష్మీ ప్రసన్న, ఆనంద్, విద్యా నిర్వాణ, మనోజ్, ప్రణతి

కలయా? నిజమా?

మంచు లక్ష్మీ ప్రసన్న కథానాయికగా మంచు ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఓ చిత్రానికి శ్రీకారం చుట్టింది. విజయ్ యలంకంటి దర్శకుడు. గురువారం హైదరాబాద్‌లో ఈ చిత్రం లాంఛనంగా ప్రారంభమైంది. మంచు మనోజ్, ప్రణతి, విద్యా నిర్వాణ స్క్రిప్టుని లక్ష్మీ ప్రసన్న, విజయ్‌లకు అందించారు. లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ "చాలా రోజుల తరవాత మా సంస్థ నుంచి వస్తున్న చిత్రమిది. నిజం కాని విషయాన్ని నిజమని భావించే విచిత్రమైన మనస్తత్వమున్న యువతి కథ ఇది. మానవ సంబంధాలు, నైతిక విలువల చుట్టూ తిరుగుతుంది. విజయ్ ఇది వరకు 'ఈగ', 'బాహుబలి' చిత్రాలకు సహాయకుడిగా పని చేశాడు. త్వరలో ఓ వెబ్ సిరీస్‌ని కూడా మొదలెడుతున్నాం. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో తెలియజేస్తామ"న్నారు.

కొత్త చిత్రం కోసమే స్వదేశానికి!



ప్రియాంక చోప్రా

హాలీవుడ్ సినిమాలతో క్షణం తీరిక లేకుండా గడుపుతోంది ప్రియాంక చోప్రా. ఈ భామ హాలీవుడ్‌లో నటిస్తున్న 'ఎ కిడ్ లైక్ జేక్', 'ఇజింట్ రొమాంటిక్' సినిమాల చిత్రీకరణ ముగించుకొని మనదేశానికి రాబోతుంది. 'బాజీరావ్ మస్తానీ' తర్వాత బాలీవుడ్‌లో మరో చిత్రం చేయలేదు ప్రియాంక. ఇప్పుడు ఇండియాకు రాగానే తన తదుపరి బాలీవుడ్ ప్రాజెక్ట్ ప్రకటించబోతుందని సమాచారం. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో ఆ కొత్త చిత్రం ఉండనుందట. దీనికి 'గుస్తాకియాన్' పేరు ప్రచారంలో ఉంది. ఇందులో ప్రియాంకకు జోడీగా ఇర్ఫాన్‌ఖాన్, అభిషేక్ బచ్చన్ పేర్లు వినిపిస్తున్నాయి. కవి షాహిర్ లుధియాన్వీ, రచయిత్రి అమృత ప్రీతమ్ మధ్య నడిచే కథ అని సమాచారం. ప్రియాంక ఇండియాకు రాగానే సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. సంజయ్ లీలా భన్సాలీ ప్రస్తుతం 'పద్మావతి' చిత్రీకరణలో తలమునకలై ఉన్నారు. ఈ సినిమా పూర్తికాగానే ప్రియాంకతో సినిమా మొదలుపెట్టొచ్చని బాలీవుడ్ వర్గాలు అంటున్నాయి.

పంచ్ డైలాగ్

అన్యాయాన్ని అరికట్టడానికి ఆ దేవుడు గుడిలోంచి పుట్టడు... జనంలోంచి పుడతాడు!
చిత్రం: సింహాద్రి,
- పంపినవారు: సోమయాజుల వెంకట కామేశ్వరరావు, విశాఖపట్నం

సకుటుంబ సపరివార సమేతంగా



రాహుల్ విజయ్

ఫైట్ మాస్టర్ విజయ్ తనయుడు రాహుల్ విజయ్ కథానాయకుడిగా వి.ఎస్.క్రియేషన్స్ సంస్థ ఓ చిత్రానికి శ్రీకారం చుట్టింది. దివ్య విజయ్ నిర్మాత. రాము కొప్పుల దర్శకుడు. గురువారం హైదరాబాద్‌లో ఈ చిత్రం లాంఛనంగా మొదలైంది. తొలి సన్నివేశానికి వి.వి.వినాయక్ క్లాప్‌నిచ్చారు. విజయన్ మాస్టర్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. పూరి జగన్నాథ్ గౌరవ దర్శకత్వం వహించారు. విజయ్ మాట్లాడుతూ "ముప్పై ఏళ్లుగా పరిశ్రమలో ఉంటున్నా. చిత్రసీమ రుణం తీర్చుకోవాలని అనుకొంటున్నా. మా అబ్బాయిని కథానాయకుడిగా, అమ్మాయిని నిర్మాతగా ఈ చిత్రంతో పరిచయం చేస్తున్నామ"న్నారు. "సుకుమార్ గారి దగ్గర సహాయకుడిగా పనిచేశా. చాలా మంచి కథ కుదిరింది. సకుటుంబ సపరవార సమేతంగా చూసేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతా"నని దర్శకుడు చెప్పారు. "ఈనెల 21 నుంచి చిత్రీకరణ మొదలెడతాం. నవంబరు నాటికి షూటింగ్ పూర్తిచేస్తామ"న్నారు నిర్మాత. రాజేంద్ర ప్రసాద్, మురళీ శర్మ, పవిత్ర లోకేష్, పోసాని, రఘుబాబు, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్నారు. సంగీతం: మణిశర్మ, ఛాయాగ్రహణం: చోటా కె.నాయుడు.

ట్రిప్పీ... ట్రిప్పీ స్టెప్పులు..

కమర్షియల్ సినిమాలో ఎన్ని హంగులున్నా ఐటమ్ పాట ప్రత్యేకతే వేరు. ప్రతి చిత్ర పరిశ్రమలోనూ ప్రత్యేక గీతాల హవా కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం ఐటమ్ పాట అనగానే టక్కున చెప్పే పేరు... సన్నీ లియోని. ఈ మధ్యే షారుఖ్‌తో 'రయీస్'లో 'లైలా ఓ లైలా..' అంటూ ఓ ఊపు ఊపేసిందామె. త్వరలో రానున్న 'బాద్‌షాహో'లో 'పియా మోర్..' అంటూ ఇమ్రాన్ హష్మీతో అందాల మోతాదు పెంచి మరీ స్టెప్పు లేసింది. ఇప్పుడు 'ట్రిప్పీ...ట్రిప్పీ..' అంటూ హుషారెత్తిస్తోంది. సంజయ్‌దత్ చాన్నాళ్ల విరామం తర్వాత నటిస్తున్న చిత్రం 'భూమి'. గణేష్ ఆచార్య నృత్య దర్శకత్వంలో 'ట్రిప్పీ...' అంటూ సాగే ప్రత్యేక గీతాన్ని ఇటీవలే తెరకెక్కించారు. ఈ పాటలో చుట్టూ డ్యాన్సర్స్‌తో కలిసి సన్నీ డ్యాన్స్ చేస్తున్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తున్నాయి. ఫొటోలే ఇంత హాట్‌హాట్‌గా ఉంటే పాటలో సన్నీ ఇంకెంత సందడిచేసిందో అంటున్నారు బాలీవుడ్ విమర్శకులు. తెలుగులోనూ అప్పుడప్పుడు ప్రత్యేక గీతాల్లో మెరుస్తోంది సన్నీ.



సన్నీ లియోని

సామాన్యుడి సమస్యలకు చెల్లుచీటీ

● సాంకేతికత, నవకల్పనలతో పరిపాలనలో మార్పులు: మోదీ

దిల్లీ

సామాన్యుడి సమస్యలను సులభంగా పరిష్కరించడానికి, వ్యవస్థీకృతమైపోయిన అవినీతిని నిర్మూలించడానికి మరిన్ని చర్యలు చేపట్టనున్నట్లు ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. దీనిపైనే తాను, సీనియర్ అధికారుల బృందం అన్ని విధాలా కృషి చేస్తున్నామని తెలిపారు. గురువారం దిల్లీలో 200 మంది అంకుర పారిశ్రామికవేత్తలతో నీతిఆయోగ్ ఆధ్వర్యంలో జరిగిన 'ఛాంపియన్స్ ఆఫ్ ఛేంజ్' కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. చిన్నచిన్న మార్పులతో పెద్ద ఫలితాలను రాబడుతున్నామని చెప్పారు. గ్రూపు-3, 4 ఉద్యోగాలకు ముఖాముఖిల్ని రద్దు చేయడం ద్వారా దళారుల వ్యవస్థకు ఇప్పటికే భరతవాక్యం పాడామని ప్రధాని చెప్పారు. గెజిటెడ్ అధికారి చేత సంతకాలు చేయించుకోవాల్సిన పద్ధతి స్థానే స్వీయ ధ్రువీకరణను సామాన్యుడి ఊరట కోసమే ప్రవేశపెట్టినట్లు వివరించారు. 'అవినీతి వ్యవస్థీకృతం కావడం దురదృష్టకరం. దానిని ఎదుర్కొనేందుకు తగిన ఏర్పాటు చేయనిదే లంచగొండితనాన్ని నిలువరించలేం. ఒక స్థాయి ప్రభుత్వోద్యోగాల వరకు ముఖాముఖిలు ఎత్తివేశాక దళారులకు పనిలేకుండా పోయింది. నిరుద్యోగం పెరిగిపోయిందంటూ ఇప్పుడు అరుస్తున్నది వారే. కేవలం ప్రభుత్వం, అది తీసుకునే చొరవలతోనే నవ భారతాన్ని తీర్చిదిద్దలేం. మార్పును సాధించడంలో దేశ పౌరుల్లో ప్రతి ఒక్కరూ భాగం పంచుకోవాలి' అని మోదీ పిలుపునిచ్చారు. గ్రామీణ ఆర్థిక రంగానికి ఊతమివ్వాలంటే వికేంద్రీకృత వ్యవస్థ ముఖ్యమన్నారు. సాంకేతికత, నవకల్పనల మేళవింపుతో పరిపాలనలో మార్పులు తీసుకురావచ్చనీ, దీనిలో యాప్‌లు కీలక పాత్ర వహిస్తాయనీ చెప్పారు.



నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో జరిగిన 'ఛాంపియన్స్ ఆఫ్ ఛేంజ్' కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

పద్మ పురస్కారాలకు సిఫార్సులు అవసరం లేదు

ప్రతిష్ఠాత్మక పద్మ పురస్కారాలు గతంలో కేవలం మంత్రులు సిఫార్సు చేసినవారికే దక్కేవనీ, తమ ప్రభుత్వం మాత్రం దానికి స్వస్తి పలికి...ఎవరైనా వీటిని పొందేలా మార్పు చేసిందని ప్రధాని చెప్పారు. తాము తెచ్చిన చిన్న మార్పుతో ప్రజలు ఎవరిపేరునైనా సిఫార్సు చేయగలుగుతున్నారని తెలిపారు. సరికొత్త దేశాన్ని తీర్చిదిద్దడంలో ప్రతీ పౌరుడితో కలిసి పనిచేయాలని ప్రభుత్వం కోరుకొంటోందనీ, దేశంపై ప్రేమ విషయంలో మన మధ్య ఎలాంటి తారతమ్యాలూ లేవనీ చెప్పారు. వివిధ సమస్యలకు పరిష్కారాలు సూచించడంలో యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు నవకల్పనలతో ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఇలాంటి సలహాలిచ్చే బృందాలు ఆయా మంత్రిత్వశాఖలకు శాశ్వత ప్రాతిపదికన అనుసంధానమై ఉండాలన్నారు. 'ఛాంపియన్స్ ఆఫ్‌ఛేంజ్' కార్యక్రమాన్ని ఏటా నిర్వహించాల్సి ఉందన్నారు.

నరేంద్ర మోదీ సంస్కరణలు భేష్


● మన్మోహన్ పదేళ్లలో కంటే ఎన్డీఏ మూడేళ్లలో సాధించింది ఎక్కువ

● అమెరికా సీనియర్ విశ్లేషకుడి వెల్లడి

వాషింగ్టన్: భారత ప్రధాని మోదీ చేపట్టిన ఆర్థిక సంస్కరణల్లో వేగాన్ని అమెరికాకు చెందిన అనుభవజ్ఞ విశ్లేషకుడు రిచర్డ్ రోసో కొనియాడారు. కేవలం మూడేళ్ల కాలంలో 37 రంగాల్లో మోదీ సంస్కరణలు తీసుకురాగలిగారని చెప్పారు. 'వ్యూహాత్మక-అంతర్జాతీయ అధ్యయనాల కేంద్రం'లో అమెరికా-భారత్ విధాన అధ్యయనంలో ఆయన అనుభవజ్ఞ సలహాదారుగా ఉన్నారు.

ఎవరూ చేయనంత వేగంగా...: 'విదేశీ పెట్టుబడుల విషయంలో మోదీ సర్కారు పారదర్శకత, దేశీయ సంస్కరణలు, ఇతర కారణాలు కలిసి భారత్‌లో విదేశీ పెట్టుబడుల్ని గణనీయంగా పెంచుతున్నాయి. మునుపటి పాలకులు ఎవరూ చేయనంత వేగంగా మోదీ భారత్‌లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విధానాన్ని సరళీకృతం చేస్తున్నారు. 25 ఏళ్లుగా మార్కెట్ అనుకూల విధానాలను అనుసరిస్తూ వస్తూ ఇప్పుడు1990ల తొలినాళ్ల కంటే ఎక్కువగా మార్కెట్లను తెరిచిపెట్టారు. వాజ్‌పేయీ సర్కారు- భారత విదేశీ పెట్టుబడుల విధానంలో ఆరేళ్ల కాలంలో 29 సవరణల్ని చేసింది. మన్మోహన్‌సింగ్ తొలిసారి ప్రధానిగా ఉన్న అయిదేళ్లలో 19 మార్పులు, రెండోసారి అయిదేళ్లలో 18 మార్పులు చేయగలిగారు. మోదీసర్కారు మాత్రం కేవలం మూడేళ్లలో 37 రంగాల్లో సంస్కరణలు తీసుకువచ్చింది. అది చరిత్రాత్మకంగా నిలిచిపోతుంద'ని రోసో పేర్కొన్నారు.

వేగం మాత్రం ఒకే రకంగా లేదు: విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు (ఎఫ్‌పీఐ) హెచ్చుతగ్గులకు లోనైనా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మే-జులై మధ్య పుంజుకున్నాయని రోసో చెప్పారు. సంస్కరణలు భారీగానే చేపట్టినా వాటిలో వేగం ఒకే రకంగా లేదని విశ్లేషించారు. రక్షణ రంగంలో విదేశీ పెట్టుబడులను పెంచడంలో కొద్దిపాటి మార్పులే చేసినప్పటికీ రైల్వే రంగంలో 100% పెట్టుబడులకు అవకాశం కల్పించడం, నిర్మాణ పథకాల్లో పెట్టుబడులకు నిబంధనల్ని గణనీయంగా సడలించడం వంటివి ప్రాధాన్యం సంతరించుకున్నాయని వివరించారు.



చిత్రంలోని వ్యక్తి పేరు మురారి ఆదిత్య. గోళ్లు పెంచడం ఆయనకు సరదా. దాదాపు 30 ఏళ్ల నుంచి ఆయన గోళ్లు పెంచుతూనే ఉన్నాడు. గతంలో ఆయన పేరిట గిన్నిస్ రికార్డు ఉంది. తాజాగా గురువారం కోల్‌కతాలోని తన నివాసంలో 38 అంగుళాల పొడవున్న తన చేతి గోళ్లను ప్రదర్శించారు

ఆర్థిక నేరస్థులపై ఎథికల్ హ్యాకింగ్ అస్త్రం

● మెయిల్స్, వెబ్‌సైట్లపై పోలీసుల కన్ను

● నిందితులను పట్టుకునేందుకు ఐటీ నిపుణుల సహకారం

ఈనాడు - హైదరాబాద్

ఆర్థిక నేరస్థులను పట్టుకునేందుకు హైదరాబాద్ పోలీసులు కొత్త పంథాను అనుసరిస్తున్నారు. 'ముల్లును ముల్లుతోనే తీయాలన్న' చందంగా.. వారిపై ఎథికల్ హ్యాకింగ్‌ను ప్రయోగిస్తున్నారు. ఇలా కేవలం రెణ్నెల్లలోనే నలుగురు నేరస్థులను అరెస్ట్ చేశారు. వీరిలో ఇద్దరు తక్కువ వడ్డీకే రుణాలు, బహుమతులంటూ దిల్లీ కేంద్రంగా కాల్‌సెంటర్లను నిర్వహిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. వీరు రూ.2 కోట్లు స్వాహా చేశారు. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు దిల్లీ వెళ్లగా అప్పటికే వారు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దీంతో వారి వ్యక్తిగత, కంపెనీ మెయిల్ చిరునామాలను సేకరించారు. అనంతరం ఆయా మెయిళ్లను హ్యాక్‌చేసి వ్యాపార అవకాశాల పేరుతో వారి చిరునామాలను గుర్తించారు. నేరస్థుల నుంచి స్పందన రాగానే ప్రత్యేక పోలీస్ బృందాలు వెళ్లి ఇద్దరినీ అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌కు తరలించారు. తప్పించుకు తిరుగుతున్న కొందరు ఘరానా నేరస్థులపైనా ఈ అస్త్రాన్ని ప్రయోగిస్తామని డీసీపీ అవినాష్ మొహంతి తెలిపారు.

ఐటీ నిపుణుల సహకారంతో..

అంతర్జాల ఆధారిత నేరాలు, ఆర్థిక నేరస్థులను పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించగానే నేరగాళ్లు పారిపోతున్నారు. వారి కుటుంబ సభ్యుల కదలికలపై నిఘా ఉంచాలంటే ప్రయాసతో కూడుకున్న పని. ఈ నేపథ్యంలో నేరస్థులను పట్టుకునేందుకు సైబర్‌క్రైమ్ పోలీసులు ఐటీ నిపుణుల సహకారాన్ని తీసుకుంటున్నారు. కార్పొరేట్ కంపెనీలు, ప్రభుత్వ సంస్థల వెబ్‌సైట్లను హ్యాక్ చేసి వాటిలోని లోపాలను బయటపెట్టే ఎథికల్ హ్యాకర్లను సంప్రదించారు. వీరు నేరగాళ్ల గురించి తెలుసుకున్న సమాచారాన్ని పోలీసులకు అందజేస్తున్నారు. అలాగే పోలీస్ ఉన్నతాధికారులతో పాటు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలకు హ్యాకింగ్ పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తున్నారు.

మాదకద్రవ్యాల సమాచారంపైనా..

ఎథికల్ హ్యాకర్ల ద్వారా పోలీసులు అంతర్జాలంలో మాదకద్రవ్యాల సరఫరా, వినియోగంపైనా విషయ పరిజ్ఞానాన్ని పెంచుకుంటున్నారు. డార్క్‌నెట్ వెబ్‌సైట్‌లో డ్రగ్స్ ఎవరు కొంటున్నారు? ఎలా దిగుమతి చేసుకుంటున్నారు? అన్న అంశాలపై ఆధారాలు లభించకపోయినా ఎథికల్ హ్యాకర్ల ద్వారా ఇంటర్నెట్ ఐపీ చిరునామాలు నేరస్థులకు లభించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

బెంగాల్ స్థానిక ఎన్నికల్లో తృణమూల్‌దే హవా

● ద్వితీయ స్థానంలో భాజపా

● వామపక్షాలది తృతీయమే

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏడు చోట్లా తృణమూల్ కాంగ్రెస్ జయకేతనం ఎగరేసింది. అన్నిచోట్లా విజయం సాధించి మరోసారి పట్టు నిరూపించుకొంది. ఎక్కువ చోట్ల భాజపా రెండో స్థానంలో నిలిచి ఉనికి చాటుకొంది. వామపక్షాలు మాత్రం మూడో స్థానంతో సరిపెట్టుకున్నాయి. కాంగ్రెస్‌కి ఈ ఎన్నికల్లో ఒక్కటంటే ఒక్క సీటూ రాలేదు. తృణమూల్‌కు ప్రధాన పోటీదారుగా భాజపా అవతరిస్తున్న విషయాన్ని ఈ ఎన్నికలు చాటిచెప్పాయి. ఈ నెల 13న జరిగిన ఎన్నికల ఫలితాలు గురువారం వెల్లడయ్యాయి. మూడు పురపాలక సంఘాల్లో ఆరు వార్డుల్ని భాజపా గెలుచుకుంది. మొత్తం ఏడు స్థానిక సంస్థల్లో 148 వార్డులకు ఎన్నికలు జరగ్గా 140 చోట్ల తృణమూల్, ఆరు చోట్ల భాజపా, ఒకేఒక్క చోట వామపక్ష కూటమి, మరొకచోట స్వతంత్ర అభ్యర్థి నెగ్గారు.

ఈ ఫలితాలు... తృణమూల్ ప్రభుత్వంపై ప్రజా విశ్వాసానికి నిదర్శనమని ఆ పార్టీ సెక్రటరీ జనరల్ పార్థ ఛటర్జీ పేర్కొన్నారు. డబ్బు, కండబలంతో తృణమూల్ గెలిచిందని రాష్ట్ర భాజపా అధ్యక్షుడు దిలీప్ ఘోష్ ఆరోపించారు. ఈ ఫలితాలు ప్రజాతీర్పును ప్రతిఫలించడం లేదని కాంగ్రెస్, వామపక్షాలు చెప్పాయి.

మిశ్రమ సంస్కృతిని కాపాడుకుందాం!

● శరద్ యాదవ్ నేతృత్వంలో ఉద్యమిద్దాం

● భాజపాకు వ్యతిరేకంగా విపక్షాల ఐక్యతారాగం

● మాకు 'సచ్ భారత్' కావాలి : రాహుల్

దిల్లీ: దేశ మిశ్రమ సంస్కృతి కాపాడుకుందాం (సంఝీ విరాసత్ బచావో) - అన్న పిలుపుతో విపక్షాలు భాజపాకు వ్యతిరేకంగా గురువారం చేతులు కలిపాయి. ఈమేరకు జేడీయూ అసమ్మతినేత శరద్ యాదవ్ నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ సహా సీపీఎం, సీపీఐ, ఎస్పీ, బీఎస్పీ, ఎన్‌సీపీ, ఆర్జేడీ, ఎన్‌సీ, జేడీ-ఎస్, ఆర్ఎల్‌డీల ప్రముఖ నేతలు హాజరయ్యారు. భాజపా, ఆర్ఎస్ఎస్‌లకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపించాలని శరద్ యాదవ్‌ను కోరుతూ.. తామంతా వెంట ఉంటామని సంఘీభావం తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఏకమై పోరాడుదాం: ప్రధాని మోదీ స్వచ్ఛ భారత్‌ను కోరుతున్నారని.. తాము మాత్రం 'సచ్ భారత్'ను కోరుకుంటున్నామని రాహుల్ పేర్కొన్నారు. అయితే దీన్ని వివరిస్తూ ఆయన ఏమీ చెప్పలేదు. "భాజపా, ఆర్ఎస్ఎస్‌లకు వ్యతిరేకంగా మనమంతా ఏకం కావాలి. ఒక్కటై పోరాడితే వాళ్లు ఎక్కడా కనిపించరు. ఇంతవరకు ఆర్ఎస్ఎస్ భారత్‌ను పాలించలేదు. జాతీయ పతాకానికి ఎప్పుడూ వందనం సమర్పించలేదు. దేశాన్ని రెండు విధాలుగా చూడవచ్చు. ఒకటి - ఈ దేశం నాది.. రెండోది - నేను ఈ దేశానికి చెందిన వ్యక్తిని. ఆర్ఎస్ఎస్‌కు మనకు మధ్య అదే తేడా." అని పేర్కొన్నారు. ప్రజలంతా ఒక్కటైతే హిట్లర్ కూడా వారి ముందు నిలవలేకపోయారని శరద్‌యాదవ్ అన్నారు. మన దేశ మిశ్రమ సంస్కృతి ప్రమాదంలో పడిందని.. 'హిందూ రాష్ట్ర'గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఏచూరి (సీపీఎం) ఆరోపించారు. భారత సంస్కృతిని కాపాడేందుకు తామంతా శరద్‌యాదవ్ వెంట ఉంటామన్నారు. ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ మళ్లీ రాకూడదని ప్రధాని మోదీ చెబుతున్నారని..కానీ ఆయన చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. త్రిపుర సీఎం మాణిక్ సర్కార్ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాన్ని దూరదర్శన్, ఆకాశవాణిల్లోరాకుండా చేశారని విమర్శించారు. ప్రతిపక్షాల పోరాటానికి అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కాంగ్రెస్‌నేత అహ్మద్‌పటేల్ శరద్‌యాదవ్‌ను కోరారు. యాదవ్‌దే నిజమైన జేడీయూఅని ఆజాద్ పేర్కొన్నారు. రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్న ఆర్ఎస్ఎస్ ప్రతి విషయంలోనూ ప్రభుత్వానికి ఆదేశాలిస్తోందని రాజా(సీపీఐ) విమర్శించారు. భారత్ పాక్‌ను, చైనానుఎదుర్కోగలదని.. దురదృష్టవశాత్తూ ముప్పు దేశంలోనే పొంచి ఉందని ఫరూక్ అబ్దుల్లా పేర్కొన్నారు. ఎవరినీ ప్రస్తావించకుండానే- "ప్రతిదాన్నీ పాడుచేసే సంకల్పంతో ఒక దొంగ లోపలే కూర్చున్నాడు." అని వ్యాఖ్యానించారు.



'సంఝీ విరాసత్ బచావో సమ్మేళన్'లో పాల్గొన్న మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ, జేడీయూ మాజీ అధ్యక్షుడు శరద్ యాదవ్, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

ప్రతిపక్షాలది కపట సంస్కృతి..భాజపా: ప్రతిపక్షాలు కపట బుద్ధితోనే మిశ్రమ సంస్కృతి గురించి మాట్లాడుతున్నాయని భాజపా నేత రవిశంకర్ ప్రసాద్ ధ్వజమెత్తారు. కేరళలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను హతమార్చారని.. సీపీఎం కార్యకర్తలపైనే ఆరోపణలున్నా ప్రతిపక్షాలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఇదేనా సంస్కృతి? అని నిలదీశారు.

సలహా మండళ్లను రద్దు చేసిన ట్రంప్

● సీఈవోల రాజీనామాల పర్యవసానం

వాషింగ్టన్, న్యూయార్క్: పారిశ్రామికవేత్తలతో ఏర్పాటుచేసిన రెండు సలహా మండళ్లను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం రద్దుచేశారు. వర్జీనియాలో శ్వేతజాతీయులు జరిపిన దాడులకు ట్రంప్ మద్దతు తెలిపారన్న అసంతృప్తితో సభ్యులుగా ఉన్న పలువురు సీఈవోలు రాజీనామా చేయడంతో పాటు విమర్శలు గుప్పించారు. దీంతో ఆ రెండు సలహా మండళ్లను రద్దు చేస్తున్నట్లు అధ్యక్షుడు ప్రకటించారు. అధ్యక్షునిగా ఎన్నికయిన వెంటనే డిసెంబరులో ట్రంప్..16మంది సభ్యులతో వ్యూహాత్మక, విధానాల మండలి (స్ట్రేటజిక్ అండ్ పాలసీ ఫోరం) ఏర్పాటుచేశారు. అధ్యక్షునిగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత జనవరిలో వైట్‌హౌస్ మాన్యుఫాక్చరింగ్ జాబ్ ఇనిషియేటివ్ పేరుతో తయారీరంగం, ఉద్యోగకల్పనపై మరో సలహామండలిని ఏర్పాటు చేశారు.

హింసను ఖండించిన సత్య నాదెళ్ల: వర్జీనియాలోని ఛార్లెస్ట్‌విల్లీలో జరిగిన హింస, ఈ సందర్భంగా జరిగిన దాడుల్లో 32 ఏళ్ల మహిళ మరణించడాన్ని మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల ఖండించారు. బహుళత్వాన్ని మైక్రోసాఫ్ట్ గౌరవిస్తుందని అంటూ మనచుట్టూ జరుగుతున్న బాధలపై సానుభూతి చూపాలని ఉద్యోగులను కోరారు. ఈ మేరకు ఉద్యోగులకు సందేశం పంపించారు. "మన సమాజంలో పక్షపాతం, స్వపక్షదురభిమానం, వర్జీనియాలో శ్వేతజాతీయులు చూపించిన అర్థంలేని హింసలాంటి సంఘటనలకు చోటు లేదు. ప్రజలతో సత్సంబంధాలను కొనసాగించాల్సిన ముఖ్యమైన సందర్భం ఇదే. ఒకరి అనుభవాలను మరొకరు విని తెలుసుకోవాల్సిన సమయమూ ఇదే. మనం నివసిస్తున్న, పనిచేస్తున్న, సేవలు అందిస్తున్న సమాజాల్లో మార్పు కోసం మైక్రోసాఫ్ట్ ఉద్యోగులు కలిసికట్టుగా కృషి చేస్తారు. మనమంతా ఉమ్మడి మానవత్వాన్ని స్వీకరించి; గౌరవం, సానుభూతి, అందరికీ అవకాశాలు ఉన్న సమాజం సృష్టించడానికి ఆకాంక్షించాల"ని కోరారు.



విద్వేషాలకు తావు లేదు.. జుకర్‌బర్గ్: శ్వేత జాతీయులకు మద్దతుగా ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఫేస్‌బుక్ సహ వ్యవస్థాపకుడు జుకర్‌బర్గ్ ఖండించారు. "మన సమాజంలో విద్వేషానికి తావు లేదు. అందుకే నేరాలు, హింసను ప్రోత్సహించే..ఛార్లెట్స్‌విల్లేలో జరిగిన దానితో సహా...ఎలాంటి సమాచారాన్నయినా తక్కువ చేసి చూపుతున్నాం. మరిన్ని ప్రదర్శనలు, భౌతిక దాడులు జరిగే అవకాశం ఉన్నందున పరిస్థితిని జాగ్రత్తగా గమనిస్తున్నాం. మనం అన్ని సార్లూ సక్రమంగా ఉండకపోవచ్చు. కానీ ఫేస్‌బుక్‌లో అందరూ సురక్షితంగా ఉన్నారన్న భావన కలిగించేందుకు కృషి చేస్తున్నామన్న నా మాటను మీరు విశ్వసించవచ్చు" అని పేర్కొన్నారు.

విద్వేషం కేన్సర్‌లాంటిది.. టిమ్ కుక్: ఈ ఉదంతాలపై ఆపిల్ సీఈవో టిమ్ కుక్ తన ఉద్యోగులకు సందేశం పంపిస్తూ విద్వేషం కేన్సర్‌లాంటిదని వ్యాఖ్యానించారు. 'మన దేశంలో అలాంటి విద్వేషాలు, జాత్యహంకారానికి అనుమతించకూడదు. మనం సాక్షులుగా కూడా ఉండకూడదు. ఈ విషయంలో ఏకాభిప్రాయంతో ఉండాలి. ఈ వ్యవహారం వామపక్షమా, ఉదారవాదమా, సంప్రదాయవాదమా అన్న సమస్యకు సంబంధించినది కాదు. ఇది మానవ గౌరవం, నైతికతలకు సంబంధించినది. శ్వేత జాత్యహంకారవాదులు, నాజీలు ఒక్కలాంటివారేనని; వారిని వ్యతిరేకించేవారు మానవహక్కుల తరఫున నిలడేవారన్న వాదనలను నేను అంగీకరించను. వీరిని అలా పోల్చడం అమెరికా సిద్ధాంతాలకు వ్యతిరేకం" అని వ్యాఖ్యానించారు.

మిలటరీ అధికారుల ఖండన: సాధారణంగా అంతర్గత రాజకీయాలకు దూరంగా ఉండే మిలటరీ అధికారులు కూడా వర్జీనియాలో చోటుచేసుకున్న హింసను ఖండించారు. మెరైన్ కార్ప్స్‌ చెందిన జనరల్ రాబర్ట్ బి.నెల్లర్, నేవల్ ఆపరేషన్స్ అధిపతి అడ్మిరల్ జాన్ రిచర్డ్‌సన్, ఆర్మీ చీఫ్ ఆఫ్ ది స్టాఫ్ జనరల్ మార్క్ ఎ మిల్లీ, వైమానిక దళానికి చెందిన జనరల్ డేవ్ గోల్డ్‌ఫిన్‌లు ఈ మేరకు ప్రకటనలు విడుదల చేశారు.

'బ్లూవేల్ సవాల్'పై పోలీసులు అప్రమత్తం

● సామాజిక వెబ్‌సైట్లపై నిఘా

● ముంబయి, మిడ్నాపూర్, ఇండోర్‌లకు ప్రత్యేక బృందాలు

ఈనాడు, హైదరాబాద్: సామాజిక మాధ్యమాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న ప్రాణాంతక క్రీడ 'బ్లూవేల్ సవాల్'పై పోలీసులు అప్రమత్తమయ్యారు. వీకోంటక్టే(వీకే) సామాజిక మాధ్యమం ద్వారా ఈ ఆట పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. చేతులపై బ్లేడు, కత్తులతో తిమింగలం బొమ్మను పచ్చబొట్టులా ముద్రించుకోవడం, ఆటలో పతాకస్థాయికి చేరుకున్నాక ఆత్మహత్య చేసుకోవడం చేస్తున్నారు. కేంద్రం స్పందించి గూగుల్, యాహూ వంటి సెర్చ్ ఇంజిన్లతో పాటు ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో 'బ్లూవేల్ సవాల్' అనుసంధాన లింకులను తొలగించాలని ఆదేశాలిచ్చింది. హైదరాబాద్ నేరపరిశోధన విభాగాధికారులు నగరంలో బ్లూవేల్ సవాల్ వ్యాప్తిచెందకుండా చర్యలు చేపట్టారు. ఈ ఆటను ఆడి ప్రాణాలు కోల్పోయిన ముంబయి, మిడ్నాపూర్ విద్యార్థుల మరణాలపై అధ్యయనానికి ఇండోర్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రాణాలతో ఉన్న కుర్రాడితో మాట్లాడేందుకు ప్రత్యేక బృందాలుగా వెళ్లనున్నారు. వివరాలను సేకరించాక 'బ్లూవేల్‌సవాల్' నియంత్రణకు వేగంగా కార్యాచరణను రూపొందిస్తామని డీసీపీ (నేరపరిశోధన) అవినాష్ మొహంతి తెలిపారు.

అమితాధిక్యం సాధిద్దాం!

● భాజపా నేతలకు సారథి దిశానిర్దేశం

దిల్లీ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో (2019) భాజపా సంపూర్ణ విజయమే లక్ష్యంగా పార్టీ అధ్యక్షుడు అమిత్ షా గురువారం నేతలకు దిశానిర్దేశం చేశారు. 350కిపైగా లోక్‌సభ స్థానాలను గెలుచుకునేలా పార్టీ యంత్రాంగాన్ని రూపొందించేందుకు వ్యూహాత్మక సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రులు రవిశంకర్ ప్రసాద్, అనంత్ కుమార్, జేపీ నడ్డా సహా 31 మంది నేతలు హాజరయ్యారు. దృశ్య శ్రవణ విధానంలో అమిత్ షా పార్టీ ప్రణాళికను విశదీకరించారు. ప్రధానంగా 2014లో పార్టీ కోల్పోయిన 150 స్థానాలపై దృష్టి సారించాలని అధ్యక్షుడు నేతలకు సూచించినట్లు భాజపా వర్గాలు తెలిపాయి. ఈశాన్య ప్రాంతాలతో పాటు పశ్చిమ్ బెంగాల్, ఒడిశా, కర్ణాటక సహా వివిధ రాష్ట్రాల్లో ఈ స్థానాలున్నాయి. పార్టీని బలోపేతం చేయడంతో పాటు, కొత్తగా పలు రాష్ట్రాల్లోనూ విజయకేతనం ఎగురవేసేందుకు 110 రోజుల దేశవ్యాప్త పర్యటన చేస్తున్న అమిత్ షా వచ్చే ఎన్నికల్లోకూడా భాజపా కేంద్రంలో అధికారంలోకి వస్తుందని నమ్ముతున్నారు.

జయలలిత మరణంపై న్యాయ విచారణ

తమిళనాడు సీఎం పళనిస్వామి వెల్లడి

చెన్నై: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత మరణంపై న్యాయ విచారణకు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తితో ఏక సభ్య కమిషన్‌ను నియమిస్తూ... ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి సంచలన నిర్ణయం తీసుకున్నారు. పోయెస్ గార్డెన్‌లోని 'అమ్మ' నివాసం వేద నిలయాన్ని స్మారక మందిరంగా మారుస్తున్నట్లు ప్రకటించారు. గురువారం ముఖ్యమంత్రి ఈ మేరకు వెల్లడించారు. న్యాయ విచారణకు సంబంధించి న్యాయమూర్తి పేరును త్వరలోనే ప్రకటిస్తామన్నారు. మాజీ సీఎం పన్నీర్‌సెల్వం డిమాండ్ మేరకు న్యాయ విచారణకు ఆదేశించినట్లు పేర్కొనకుండా... వివిధ సంస్థల నుంచి వచ్చిన వినతుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పడం గమనార్హం.

తాజ్‌మహల్‌ను నాశనం చేయదలచుకున్నారా?

కేంద్రాన్ని తీవ్రంగా ప్రశ్నించిన సుప్రీంకోర్టు

దిల్లీ: ప్రపంచ ప్రఖ్యాత అద్భుతం అయిన తాజ్‌మహల్‌ను మీరు నాశనం చేయదలచుకున్నారా? అంటూ సుప్రీంకోర్టు గురువారం కేంద్రాన్ని తీవ్రంగా ప్రశ్నించింది. మథుర-దిల్లీల మధ్య అదనపు రైల్వే ట్రాకును వేయడానికి వీలుగా ఆ ప్రాంతంలో సుమారు 80 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న దాదాపు 450 వృక్షాలను కొట్టివేయించడానికి అనుమతి కోరుతూ కేంద్రం దాఖలు చేసిన అభ్యర్థనపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. "తాజ్‌మహల్ అనేది ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అద్భుతం. మీరు దానిని నాశనం చేయదలచుకున్నారా? అసలు తాజ్‌మహల్ చిత్రాలను చూశారా? అంతర్జాలంలోకి వెళ్లి చూడండి!" అంటూ జస్టిస్.ఎంబీ.లోకూర్, జస్టిస్. దీపక్ గుప్తాలతో కూడి ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఒకవేళ మీరు తాజ్‌మహల్‌ను కనుక నాశనం చేయదలచుకుని ఉంటే మాత్రం అఫిడవిట్ లేదా దరఖాస్తు దాఖలు చేయండి... ప్రభుత్వం తాజ్‌ను నాశనం చేయదలచుకున్నదని కూడా చెప్పండి అంటూ ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. ఈకేసులో ఎం.సి.మెహతా అనే పర్యావరణవేత్త దాఖలుచేసిన వ్యాజ్యం నేపథ్యంలో తాజ్‌మహల్ పరిసరాల్లో అభివృద్ధి పనులను సుప్రీంకోర్టు పరిశీలిస్తూనే ఉంది.

2015లో ఆస్తమా, సీఓపీడీలతో 30 లక్షలకుపైగా మరణాలు

దిల్లీ: ఆస్తమా, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీస్ (సీఓపీడీ)ల కారణంగా 2015లో ప్రపంచవ్యాప్తంగా 30 లక్షల మందికిపైగా ప్రాణాలు విడిచినట్లు లాన్సెట్ జర్నల్ నివేదిక పేర్కొంది. సీఓపీడీకి పొగ తాగడం, వాయు కాలుష్యం ప్రధాన కారణాలని పేర్కొంది. 1990తో పోలిస్తే వ్యాధుల వ్యాప్తి, మరణాలరేట్లు తగ్గినప్పటికీ.. జనాభా వృద్ధి కారణంగా మరణాల సంఖ్యలో పెరుగుదల నమోదైంది.

నివేదిక వెల్లడించిన మరిన్ని వివరాలు: భారత్‌తోపాటు పపువా న్యూ గినియా, లెసోతో, నేపాల్‌ల్లో సీఓపీడీ ప్రభావం తీవ్రంగా ఉంది. ■ ఆస్తమా తీవ్రత అఫ్గానిస్థాన్, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, ఫిజీ, కిరిబాటి, లెసోతో తదితర దేశాల్లో ఎక్కువగా కనిపించింది. ■ 2015లో ప్రపంచవ్యాప్తంగా సీఓపీడీ వల్ల 32 లక్షల మంది, ఆస్తమా కారణంగా 4 లక్షల మంది మరణించారు. భారత్‌లో ప్రతీ లక్ష మందిలో 2,775 మంది సీఓపీడీకి, 4,022 మంది ఆస్తమాకు గురయ్యారు.

తగ్గుతోంది వడ్డీ..
ప్రత్యామ్నాయం ఏదీ?



సాయి కృష్ణ పత్రి
సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

రోజురోజుకూ.. అటు బ్యాంకు పొదుపు ఖాతాలపైనా.. ఇటు ఫిక్స్‌డ్ డిపాజిట్లపైనా వడ్డీ రేట్లు తగ్గిపోతున్నాయి. ఇప్పటికే అతి పెద్ద బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పొదుపు ఖాతాలపై అందించే వడ్డీని 4శాతం నుంచి 3.5శాతం చేసింది. యాక్సిస్ బ్యాంకు కూడా ఇదే వడ్డీ రేటులోకి మారింది. కొంత కాలం ఆగితే మరిన్ని బ్యాంకులు ఇదే మార్గాన్ని అనుసరిస్తాయనడంలో సందేహం లేదు. ఇక ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు గత ఏడాది కాలంగా తగ్గుతూనే ఉన్నాయి. మరి, ఇలాంటప్పుడు ఏం చేయాలి? అధిక వడ్డీ కోసం ప్రత్యామ్నాయ మార్గాలేమున్నాయి?

వడ్డీ రేట్లు తగ్గుతున్నప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించడం సర్వసాధారణం. ఈ నేపథ్యంలో ఇప్పుడు డెట్ ఫండ్ల గురించి చాలామంది చర్చించుకుంటున్నారు. నిజానికి వడ్డీ రేట్లు తగ్గుతున్నప్పుడు ఇవి కొంత మంచి ఫలితాలనే అందిస్తుంటాయి. అయితే, వీటిని అర్థం చేసుకోవడం అంత సులభమేమీ కాదు. వీటిలో ఉన్న రకరకాల పథకాల్లో.. ఏ అవసరానికి ఏది సరిపోతుందో ఎంచుకోవడం కొంత ఇబ్బందిగానే ఉంటుంది. డెట్ ఫండ్లను ఎంచుకునేప్పుడు మన లక్ష్యం ఏమిటి? వ్యవధి ఎంత? వాటికి ఏ తరహా పథకాలు సరిపోతాయనేది తెలుసుకోవాలి.

1 రోజు నుంచి 90 రోజుల్లోపు..

స్వల్పకాలానికి పెట్టుబడి పెట్టాలనుకున్నప్పుడు లిక్విడ్ మ్యూచువల్ ఫండ్లు నప్పుతాయి. వీటిని బ్యాంకు పొదుపు ఖాతాలకు ప్రత్యామ్నాయంగా చెప్పుకోవచ్చు. చాలామంది అత్యవసర అవసరాల కోసం.. పెద్ద మొత్తంలో డబ్బును పొదుపు ఖాతాలో జమ చేస్తుంటారు. ఇలాంటప్పుడు లిక్విడ్ ఫండ్లను ఎంచుకోవడం ఉత్తమం. ఇవి బ్యాంకు పొదుపు ఖాతాకన్నా కాస్త అధికంగానే రాబడినిస్తాయి. ప్రస్తుతం చాలా లిక్విడ్ ఫండ్లు సగటున 6శాతం వరకూ రాబడినిస్తున్నాయి. కింద పట్టికను గమనించండి.

	పొదుపు ఖాతా	కరెంటు ఖాతా	లిక్విడ్ ఫండ్
మొత్తం	రూ.2,00,000	రూ.2,00,000	రూ.2,00,000
వ్యవధి	90 రోజులు	90 రోజులు	90 రోజులు
రాబడి	3.5%	0%	6%
భవిష్యత్తు విలువ	రూ.2,01,703.72	రూ.2,00,000	రూ.2,02,894.28
లిక్విడ్ ఫండ్లతో పోలిస్తే రాబడి	రూ.–1,191	రూ.–2,894	

ప్రస్తుతం కొన్ని మ్యూచువల్ ఫండ్ సంస్థలు లిక్విడ్ ఫండ్ల నుంచి వెంటనే నగదును వెనక్కి తీసుకునే సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి. రూ.50వేల వరకూ ఎప్పుడు కావాలంటే అప్పుడు వెనక్కి తీసుకునే అవకాశాన్నిస్తున్నాయి.

90- 270 రోజులకు..

మూడు నెలలకు మించి పెట్టుబడిని కొనసాగించాలనుకునే వారు అల్ట్రా షార్ట్ టర్మ్ ఫండ్లను పరిశీలించవచ్చు. ఈ ఫండ్లలో పెట్టుబడులను ఎక్కువగా 90 రోజుల నుంచి ఏడాది వ్యవధి వరకూ ఉండే డెట్ సెక్యూరిటీల్లో మదుపు చేస్తుంటారు. కాబట్టి, లిక్విడ్ ఫండ్లతో పోలిస్తే ఇవి కాస్త అధిక రాబడిని అందిస్తాయి. చాలామటుకు ఫండ్లు పెట్టుబడి ఉపసంహరణకు సంబంధించి అమ్మకపు రుసుమును విధించడం లేదు. అయినప్పటికీ.. 90 రోజులకు మించి వ్యవధి ఉన్నప్పుడే ఈ తరహా ఫండ్లను ఎంచుకోవడం ఉత్తమం.

రెండున్నర ఏళ్ల వరకూ..

ఇప్పటికిప్పుడు తీసుకోవాల్సిన అవసరం లేదు.. రెండున్నర ఏళ్లదాకా ఆగగలం అనుకున్నప్పుడు షార్ట్ టర్మ్ ఫండ్లు సరిపోతాయి. సమీకరించిన పెట్టుబడి మొత్తాలను ఫండ్ నిర్వాహకులు డిపాజిట్ సర్టిఫికెట్లు, కమర్షియల్ పేపర్లు, నాన్ కన్వెర్టిబుల్ డిబెంచర్లు, స్వల్పకాలిక ప్రభుత్వ సెక్యూరిటీలు తదితర వాటిల్లో మదుపు చేస్తుంటారు. ఇవన్నీ కూడా ఏడాది నుంచి రెండున్నర ఏళ్ల వ్యవధితోనే ఉంటాయి. ఇవి దీర్ఘకాలిక వ్యవధికి సంబంధించినవి కాబట్టి, అల్ట్రాషార్ట్ టర్మ్ ఫండ్లకన్నా కాస్త అధిక రాబడినిస్తాయి. అయితే, వీటిలో మదుపు చేసేప్పుడు తక్కువ క్రెడిట్ రేటింగ్ ఉన్న పథకాల్లో మదుపు చేసే వాటిని నివారించాలి.

మూడేళ్లకు మించి...

పెట్టుబడిని మూడేళ్లకు మించి కొనసాగించే ఆలోచన ఉన్నప్పుడు ఆ మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్లలో జమ చేయడం కన్నా.. డెట్ మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయడం గురించి ఆలోచించవచ్చు. ఎఫ్‌డీలతో పోలిస్తే వీటిలో పన్ను పరమైన ప్రయోజనాలూ ఉంటాయి. దీన్ని సులభంగా అర్థం చేసుకునేందుకు ఇలా పరిశీలిద్దాం!

ఫిక్స్‌డ్ డిపాజిట్లు: మీరు రూ.5లక్షలను మూడేళ్ల కాల వ్యవధికి 7శాతం రాబడి వచ్చేలా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారనుకుందాం. అప్పుడు వ్యవధి తీరాక మీ చేతికి రూ.6,12,521 వస్తాయి. మీరు 30శాతం పన్ను శ్లాబులో ఉంటే.. మీరు చెల్లించాల్సిన పన్ను మొత్తం రూ.33,756. పన్ను మొత్తం పోను మీకు మిగిలేది రూ.5,78,765. అంటే, మీకు వచ్చే 5శాతమే.

డెట్ ఫండ్లలో మదుపు చేస్తే: చాలా సందర్భాల్లో డెట్ మ్యూచువల్ ఫండ్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లకన్నా అధిక రాబడినే అందిస్తాయి. కానీ, పోల్చుకునేందుకు వీలుగా వీటి రాబడి 7శాతమే అనుకుందాం..

రూ.5లక్షలను డెట్ మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేశారనుకుందాం. ఇందులో 7శాతం వార్షిక సగటు రాబడి వస్తుందనుకుందాం. ఇక్కడ కూడా మూడేళ్ల తర్వాత రూ.6,12,521 వస్తుంది. మూడేళ్లకు మించి డెట్ మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేసినప్పుడు 'లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్ టాక్సేషన్' కిందకు వస్తాయి. ద్రవ్యోల్బణ సూచీ 6శాతం ఉందనుకుంటే.. దీనికి సర్దుబాటు చేసిన తర్వాత రూ.5లక్షల విలువ రూ.5,95,508తో సమానం అవుతుంది. అంటే, అధికంగా వచ్చిన మొత్తం రూ.17,013. ఈ మొత్తంపై 20శాతం పన్ను విధిస్తారు. అంటే.. చెల్లించాల్సిన పన్ను మొత్తం రూ.3,402. అంటే, పన్ను పోను అసలు, వడ్డీ కలిపి మీ చేతికి రూ.6,09,118 వస్తాయి. అంటే మీకు ఫిక్స్‌డ్ డిపాజిట్లకన్నా అధికంగా వచ్చే మొత్తం రూ.30,353. (గమనిక: ఈ కథనం కేవలం అవగాహన కోసం మాత్రమే)

మూడేళ్లకు మించి డెట్ ఫండ్లలో మదుపు చేయాలనుకున్నప్పుడు అందులో ఏ రకంలో పెట్టుబడి పెట్టాలన్నది ఎంచుకోవడమూ కీలకమే. ఇందులో ఉన్న రకాలను ఒకసారి గమనిస్తే..

◆ **అక్రూరల్ ఫండ్లు:** వడ్డీ రేట్ల చలనంతో సబంధం లేకుండా ఎలాంటి పరిస్థితుల్లోనైనా పెట్టుబడి పెట్టేందుకు ఈ తరహా ఫండ్లను ఎంచుకోవచ్చు. ఇందులో కార్పొరేట్ బాండ్ ఫండ్లు, క్రెడిట్ ఆపర్చునిటీస్ ఫండ్లు అందుబాటులో ఉంటాయి. ఫండ్ మేనేజర్ పరిస్థితుల ఆధారంగా.. పెట్టుబడులను మారుస్తూ ఉంటారు.

◆ **ఇన్‌కం ఫండ్లు:** వడ్డీ రేట్లు తగ్గుతున్నప్పుడు బాండ్ల ధరలు పెరుగుతుంటాయి. వడ్డీ రేట్లు పెరుగుతుంటే బాండ్ల ధరలు తగ్గుతుంటాయి. ఈ సూత్రాన్ని ఆధారంగా చేసుకొని, వడ్డీ రేట్లు తగ్గుతున్న దశలో ప్రయోజనాన్ని పొందేందుకు ఫండ్ మేనేజర్ ప్రయత్నిస్తారు.

◆ **డైనమిక్ బాండ్ ఫండ్:** డైనమిక్ బాండ్ ఫండ్ల పనితీరు ఇన్‌కం ఫండ్లను పోలి ఉంటుంది. ఫండ్ మేనేజర్లు తగ్గుతున్న వడ్డీ రేట్ల నుంచి ప్రయోజనాన్ని పొందేందుకు ప్రయత్నిస్తూ పెట్టుబడుల్లో మార్పులు చేర్పులు చేస్తుంటారు. వడ్డీ రేట్ల కదలికలను బట్టి, పెట్టుబడులను ఆయా బాండ్లలో తగ్గించడం, పెంచడంలాంటివి చేస్తుంటారు. ఈ తరహా ఫండ్లు తగ్గుతున్న వడ్డీ రేట్ల నుంచి ప్రయోజనాన్ని పొందాలనుకుని, డెట్ మార్కెట్‌ను సరిగా అంచనా వేయలేం అనుకునే వారు ఈ తరహా పథకాలను ఎంచుకోవడం ఉత్తమం.

రకాలెన్నో...

◆ **మంత్లీ ఇన్‌కం ప్లాన్:** ఈ పథకాల్లో ఫండ్ మేనేజర్ 75-80శాతం వరకూ పెట్టుబడులను డెట్ పథకాల్లోనూ.. మిగతా 20-25% వరకూ మొత్తాన్ని ఈక్విటీల్లోనూ మదుపు చేస్తుంటారు. పెట్టుబడి మొత్తం కాస్త సురక్షితంగా ఉంటూ.. ఈక్విటీ లాభాలు కూడా అందుకోవాలని భావించే వారికి ఇవి నప్పుతాయని చెప్పొచ్చు. ఉదాహరణకు మీరు రూ.100 ఈ పథకంలో మదుపు చేశారనుకుందాం.. అప్పుడు రూ.80ని డెట్ సెక్యూరిటీల్లోనూ.. రూ.20ని ఈక్విటీల్లోనూ మదుపు చేస్తారు. మూడేళ్లకాలంలో డెట్ పథకంలో 8శాతం సగటు రాబడి వచ్చిందనుకుంటే.. మీరు పెట్టిన పెట్టుబడి మూడేళ్ల తర్వాత రూ.80 కాస్తా రూ.100 అవుతుంది. ఈక్విటీల్లో పెట్టిన పెట్టుబడి రూ.20తో కలిపి ఇది రూ.120 అవుతుంది. ఈక్విటీ మార్కెట్లు బాగుంటే.. మీరు మదుపు చేసిన రూ.20కూడా మంచి లాభాలను గడిస్తుంది. ఒకవేళ మార్కెట్ బాగాలేక మీరు పెట్టిన రూ.20 సున్నా అయినా.. మీ పెట్టుబడి మొత్తం అలాగే ఉంటుంది.

◆ **ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ ప్లాన్లు:** ఈ తరహా ఫండ్లలో 100 శాతం పెట్టుబడులూ రుణ ఆధారిత పథకాల్లోనే ఉంటాయి. వీటి నుంచి వచ్చే రాబడి స్థిరంగా ఉండేలా చూసుకుంటూ ఫండ్ మేనేజర్లు పెట్టుబడులను కేటాయిస్తుంటారు. వడ్డీ రేట్లు అధికంగా ఉన్నప్పుడు వీటిలో మదుపు చేసేందుకు మంచి సమయం. తర్వాత వడ్డీ రేట్లు తగ్గినా ఆ ప్రభావం మీ పెట్టుబడులపై ఉండదు.

◆ **డ్యూయల్ అడ్వాంటేజ్ ఫండ్లు:** వీటిలో పెట్టుబడి పెట్టినప్పుడు నిర్ణీత వ్యవధి తర్వాత మాత్రమే దానిని వెనక్కి తీసుకునే వీలుంటుంది. వీటి పెట్టుబడుల కేటాయింపు కూడా మంత్లీ ఇన్‌కం ప్లాన్ల మాదిరిగానే ఉంటుంది. కొన్నిసార్లు ఈ ఫండ్ మేనేజర్లు అధిక మొత్తంలో ఈక్విటీ డెరివేటివ్స్‌కు కేటాయించి, అధిక లాభాల కోసం ప్రయత్నిస్తారు.

◆ **గిల్ట్ ఫండ్లు:** ఈ తరహా ఫండ్లు తమ పెట్టుబడులను కేవలం ప్రభుత్వ హామీ ఉన్న పథకాల్లోనే మదుపు చేస్తాయి. అందువల్ల ఈ ఫండ్లలో నష్ట భయం దాదాపు ఉండదనే చెప్పుకోవచ్చు. అయితే, ఈ ప్రభుత్వ సెక్యూరిటీలు దీర్ఘకాలానికి సంబంధించినవై ఉంటాయి. రాబడి విషయంలో ఇన్‌కం ఫండ్లలో ఉండే వడ్డీ రేట్ల నష్టభయం ఇందులోనూ కనిపిస్తుంటుంది.

సొంతిల్లు కోసం పెట్టుబడి?

■ మా పాప వయసు 9నెలలు. తన పేరుపై ఒకేసారి రూ.2లక్షల వరకూ మదుపు చేయాలనుకుంటున్నాను. కనీసం 18ఏళ్ల వరకూ ఈ పెట్టుబడిని వెనక్కి తీసుకోను. ఎక్కడ మదుపు చేస్తే మంచిది? - **రమ్య**

● మీరు పెట్టుబడి పెట్టాలనుకుంటున్న రూ.2లక్షలను తొలుత లిక్విడ్ ఫండ్లలో మదుపు చేయండి. అక్కడ్నుంచి వచ్చే 9నెలల కాలంలో క్రమానుగత బదిలీ విధానంలో ఈక్విటీ ఫండ్లలోకి మళ్లించండి. ఈక్విటీ ఫండ్లలో 18ఏళ్లపాటు పెట్టుబడిని కొనసాగిస్తే.. దాదాపు 13శాతం రాబడి అంచనాతో మీ రూ.2లక్షలు దాదాపు రూ.21,15,033 అయ్యేందుకు అవకాశం ఉంది. మదుపు కోసం ఫ్రాంక్లిన్ ఇండియా ప్రైమా ప్లస్, బిర్లా సన్ లైఫ్ ఈక్విటీ ఫండ్, మిరే అసెట్ ఇండియా ఆపర్చునిటీస్ ఫండ్లను పరిశీలించవచ్చు.

■ మరో మూడేళ్లలో సొంతిల్లు కొనాలన్నది నా ఆలోచన. దీనికి ముందస్తు చెల్లింపు కోసం నెలకు రూ.35వేల వరకూ పెట్టుబడి పెట్టాలనుకుంటున్నాను. ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నాను. అక్కడి నుంచి పెట్టుబడి పెట్టేందుకు ఏ పథకాల్లో అనుమతి ఉంది? - **జగదీశ్**

● అమెరికాలో ఉండే భారతీయుల పెట్టుబడులను కొన్ని మ్యూచువల్ ఫండ్ సంస్థలే అనుమతిస్తున్నాయి. ఇందులో బిర్లా సన్ లైఫ్ మ్యూచువల్ ఫండ్, యూటీఐ మ్యూచువల్ ఫండ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ, ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్, ఎల్‌అండ్‌టీ మ్యూచువల్ తదితర సంస్థలు ఉన్నాయి. మీరు మూడేళ్లపాటే పెట్టుబడి పెడతానంటున్నారు కాబట్టి, తక్కువ నష్టభయం ఉన్న పథకాలనే ఎంచుకోవాలి. దీనికి డెట్ మ్యూచువల్ ఫండ్లను పరిశీలించండి. గమనించాల్సిన విషయం ఏమిటంటే.. మీరు అక్కడి నుంచి భారత్‌లో పెట్టుబడులు పెట్టినప్పుడు.. లాభాలు వస్తే.. మీరు స్వీకరించినా.. తీసుకోకపోయినా వాటి వివరాలను అమెరికాలో దాఖలు చేసే రిటర్నులలో చూపించి, నిబంధనల మేరకు పన్ను చెల్లించాలి. పెట్టుబడి కోసం బిర్లా సన్ లైఫ్ మీడియం టర్మ్ ప్లాన్, యూటీఐ ఇన్‌కం ఆపర్చునిటీస్ ఫండ్లను ప్రయత్నించవచ్చు.

- **తుమ్మ బాల్‌రాజ్,** సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

బంగారం పోయినా బెంగ లేకుండా...


బంగారం.. మానసికంగా దీనితో ఉన్న బంధం అంతాఇంతా కాదు. ఓ వైపు పెట్టుబడిగానూ.. మరోవైపు హోదాకు చిహ్నంగానూ దీన్ని భావిస్తుంటారు. వారసత్వంగా బంగారం ఒకరి నుంచి మరొకరికి బదిలీ అవుతూనే ఉంటుంది. శుభకార్యాల్లోనూ.. పండగల సందర్భాల్లోనూ దీన్ని కొనేందుకు అందరూ ఆసక్తి చూపిస్తారు. అయితే, చాలామంది కలవరపడే విషయం ఏమిటంటే.. బంగారాన్ని ఎలా భద్రంగా ఉంచుకోవడం ఎలా? ఏదైనా జరిగి మన చేజారిపోతే? జరిగిన నష్టానికి పరిహారం దొరుకుతుందా?



గత ఐదేళ్ల కాలాన్ని పరిశీలిస్తే.. ప్రతి రెండు కుటుంబాల్లో ఒకటి బంగారాన్ని కొనుగోలు చేసిందని ఒక సర్వే నివేదిక. అంతే కాదు.. 87శాతం మంది భారతీయులు తమ బంగారాన్ని నగల రూపంలో ఉంచుకునేందుకే ఇష్టపడతారు. పసిడే కాకుండా.. వజ్రాలు, ఇతర విలువైన లోహాలు కూడా ఇప్పుడు నగల్లో భాగం అయ్యాయి. మరి, ఇంత విలువైన సంపదకు సరైన భద్రత కల్పించారా?

లాకర్లలో పెడితే...

విలువైన నగలను భద్రపరిచేందుకు చాలామంది ఆశ్రయించేది బ్యాంకు లాకర్లనే. ఇది అత్యంత సురక్షితమైన ప్రదేశంగా చాలా మంది భావిస్తుంటారు. అయితే, ప్రస్తుతం ఈ ఆలోచన మార్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఇటీవల వచ్చిన వార్తల ప్రకారం చూస్తే.. బ్యాంకు లాకర్లలో పెట్టిన బంగారాన్ని బ్యాంకులు ఏ మాత్రం బాధ్యత వహించవు. అంటే, ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలు తదితరాల వల్ల లాకర్లకు ఏదైనా ప్రమాదం జరిగి.. మన నగలకు ఎలాంటి నష్టం వాటిల్లినా బ్యాంకులు బాధ్యత తీసుకోవు. అంటే, ప్రస్తుతం బ్యాంకు లాకర్లు గతం లోలాగా లాకర్లలో బంగారం పెడితే.. పూర్తి సురక్షితం అనే మాటకు అర్థం మారిపోయింది. అందులోనూ.. బ్యాంకులో దొంగలు పడి, లాకర్లలోని నగలను కొల్లగొట్టినా బ్యాంకు బాధ్యత తీసుకోకపోవచ్చు. మరి, మన నగలకు రక్షణ ఎలా.. ఆభరణాల బీమా (జ్యువెలరీ ఇన్సూరెన్స్) తీసుకోవడమే మార్గం..



ధీమాగా ఉండేందుకు..

ప్రస్తుతం చాలా సాధారణ బీమా సంస్థలు గృహ బీమా పాలసీలో అంతర్గతంగా ఆభరణాల బీమాను కూడా అందిస్తున్నాయి. ఈ పాలసీలను ఎంచుకున్నపప్పుడు.. ఇవి అటు ఇంట్లో ఉన్న నగలకే కాదు.. బ్యాంకు లాకర్లలో పెట్టిన ఆభరణాలకూ ఇది రక్షణ కల్పిస్తుంది. అంతేకాదు.. ధరించినప్పుడు పొరపాటున పోయినా.. కూడా పరిహారం పొందవచ్చు. అంటే, ఒకసారి బీమా పాలసీ తీసుకుంటే.. వాటికి సంబంధించినంత వరకూ ఎల్లవేళలా రక్షణ ఉన్నట్లే. గృహ బీమాలో భాగంగా తీసుకునే ఆభరణాల బీమా పాలసీ.. ప్రమాదవశాత్తూ నగలు పోయినప్పుడే కాకుండా.. అగ్ని ప్రమాదాలు, దొంగతనం తదితరాలతోపాటు, ప్రకృతి వైపరీత్యాల నుంచి ఎదురయ్యే ప్రమాదాల నుంచి కూడా రక్షణ కల్పిస్తుంది.

● గృహ బీమాలో భాగంగానే కాకుండా.. కేవలం ఆభరణాలకు మాత్రమే బీమా తీసుకునే వెసులుబాటును కూడా పలు సాధారణ బీమా సంస్థలు అందిస్తున్నాయి. కొన్ని బీమా పాలసీల్లో విలువైన అరుదైన వస్తువులు, పురాతన వస్తువులకు కూడా ప్రత్యేకంగా బీమా తీసుకోవచ్చు. ఇందులో అన్ని రకాల నష్టాలకూ పరిహారం లభిస్తుంది. దీనికి ప్రీమియం వస్తువుల విలువను బట్టి వసూలు చేస్తారు. అధీకృత నిపుణులు వస్తువులు, ఆభరణాల విలువను గణిస్తారు. క్లెయిం చేసుకోవాల్సిన సందర్భం వచ్చినపుడు పాలసీ కొనుగోలు చేసిన సమయంలో పేర్కొన్న మొత్తాలను బట్టి పరిహారం చెల్లిస్తారు.

విలువైన వస్తువుల విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కుదరదు. ముఖ్యంగా మానసికంగా పెనవేసుకుపోయే బంగారు ఆభరణాలకు సంబంధించి. దురదృష్టవశాత్తూ.. నగలకు నష్టం వాటిల్లినప్పుడు, తద్వారా వచ్చిన ఆర్థిక నష్టాన్ని తిరిగి పొందేందుకు తప్పనిసరిగా ఈ తరహా బీమా పాలసీలు ఉండాలి. పాలసీ తీసుకునేప్పుడు అన్ని వివరాలూ పూర్తిగా తెలుసుకున్నాకే నిర్ణయం తీసుకోవడం తప్పనిసరి.

– **పరాగ్ వేద్,** ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్.

వాయిదా వేస్తే.. కుదరదు!

తర్వాత చూద్దాం! ఈ మాట ప్రతి ఒక్కరూ... ఏదో ఒక సందర్భంలో అనుకునేదే.. మిగతా విషయాల మాట ఎలా ఉన్నా.. ఆర్థిక అంశాల్లో మాత్రం ఇది చాలా ఖరీదైనది.. అవసరం వచ్చినప్పటి కన్నా.. రానున్న అవసరాన్ని గుర్తించి, ఆలోచనను అమలు చేయాలి. ఒక నిర్ణయాన్ని వాయిదా వేయడం వల్ల ఎలాంటి సమస్యలు వస్తాయో ఓసారి చూద్దామా!



కుటుంబానికి రక్షణ దూరం..

కుటుంబంలో ఆర్జించే వ్యక్తి తన పేరుమీద తప్పనిసరిగా బీమా పాలసీ తీసుకోవాలి. అదీ తీసుకున్నామంటే తీసుకున్నామన్నట్లు ఉండకూడదు. వార్షికాదాయానికి కనీసం 10-12 రెట్లు ఉండాలని నిపుణుల సూచన. బాధ్యతలు పెరిగినప్పుడల్లా బీమా పాలసీ మొత్తాన్ని కూడా సమీక్షించుకోవాలి. బీమా పాలసీల విషయంలో 'తర్వాత చూద్దాం' అనే మాట ఉండకూడదు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ రక్షణ ఇచ్చే టర్మ్ పాలసీలను ఎంత చిన్నవయసులో తీసుకుంటే అంత ప్రయోజనం. ఎందుకంటే.. బీమాకు అసలైన నిర్వచనంగా భావించే టర్మ్ పాలసీలకు చెల్లించిన ప్రీమియం వెనక్కి రాదు. వయసు తక్కువగా ఉన్నప్పుడు తీసుకుంటే ప్రీమియం కూడా తక్కువగా ఉంటుంది. వయసు పెరుగుతున్న కొద్దీ ప్రీమియం పెరగడంతోపాటు, రక్తపోటు, మధుమేహం లాంటి జబ్బులు వస్తే దాదాపు 25శాతం అధికంగా ప్రీమియం భరించాలి. పెట్టుబడికీ, బీమాకూ వీలు కల్గించే యులిప్‌ల విషయానికి వచ్చినా దీర్ఘకాలిక పెట్టుబడి ప్రయోజనాన్ని కోల్పోతారు.

■ బీమా తీసుకోవడం వాయిదా వేసినన్ని రోజులు కుటుంబానికి ఆర్థిక రక్షణ ఉండదు. ఆర్జించే కుటుంబ పెద్దను దురదృష్టం కాటేస్తే.. పిల్లల చదువులు, పెళ్లిళ్లకు సంబంధించిన ఖర్చులకు కుటుంబం ఆర్థికంగా కష్టపడాల్సి రావచ్చు.

తట్టుకోలేం...

పెరుగుతున్న వైద్య ఖర్చులను తట్టుకోవాలంటే.. వైద్య బీమా పాలసీలు అనివార్యం అయ్యాయి. లేకుంటే.. ఓ చిన్న అనారోగ్యం వేల రూపాయల కష్టార్జితాన్ని హరించి వేస్తుంది. మరి ఈ పాలసీని తీసుకోవడం ఆలస్యం చేస్తే వచ్చే ఇబ్బందులేమిటి?

■ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఏ రోజు ఏ వ్యాధి మనల్ని పీడిస్తుందో చెప్పడం కష్టం. అందుకే, ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఓ పాలసీని తీసుకోవాలి.

■ ఒకసారి వ్యాధి వచ్చిందంటే ఆ తర్వాత పాలసీ తీసుకున్నా పెద్దగా ఫలితం ఉండదు. ఎందుకంటే.. ముందస్తు వ్యాధుల చికిత్సకు కనీసం 3-4 ఏళ్లు ఆగాల్సిందిగా బీమా కంపెనీ నిబంధన ఉండవచ్చు.

■ పాలసీ తీసుకోవడమే కాకుండా దాన్ని సరైన సమయానికి పునరుద్ధరించుకోవడం కూడా అవసరమే. లేకపోతే.. పాత పాలసీ ప్రయోజనాలు దూరం అయ్యేందుకు అవకాశం ఉంది.

విశ్రాంత జీవితం మాటేమిటి?

ఉద్యోగంలో చేరిన వెంటనే పదవీ విరమణ ప్రణాళికలను కూడా చూసుకోవాలి. అయితే, చాలామంది వీటి గురించి పట్టించుకోరు. పిల్లల చదువులు, వారి వివాహాలు.. సొంతిల్లు.. ఇలా కొన్ని లక్ష్యాలను మాత్రమే కీలకంగా భావిస్తుంటారు. వీటితోపాటు విస్మరించకూడని మరో అంశమే.. విశ్రాంత జీవితంలో ఆర్థిక అవసరాలను తీర్చుకునే మార్గాన్ని అన్వేషించడం. ప్రస్తుతం 30 ఏళ్లున్న వ్యక్తి 58 ఏళ్లకు పదవీ విరమణ పొందుతాడని భావిద్దాం. అంటే, అతనికి ఇంకా 28 ఏళ్ల ఉద్యోగ జీవితం ఉంది. ప్రస్తుతం అతడి అవసరాలకు రూ. 20వేలు సరిపోతాయి. ఇదే తరహా జీవితాన్ని మరో 28 ఏళ్ల తర్వాత కొనసాగించాలంటే.. సగటున 7 శాతం ద్రవ్యోల్బణంతో కలిపి లెక్కిస్తే.. కావాల్సిన మొత్తం ఎంతో తెలుసా? రూ. 1,33,000. పదవీ విరమణ చేసిన తర్వాత మరో 27 ఏళ్లు (75 ఏళ్ల వయసు) కొనసాగుతుందని భావిద్దాం. అంటే కావాల్సిన మొత్తం సొమ్ము రూ. 2,10,68,730. ఈ మొత్తాన్ని సాధించేందుకు 30 ఏళ్ల వయసు నుంచి సగటున 11శాతం వార్షిక రాబడి అంచనాతో.. నెలకు దాదాపు రూ.9,355 వరకూ మదుపు చేయాలి. అదే 35 ఏళ్ల నుంచి పెట్టుబడి ప్రారంభిస్తే.. రూ.16,773 అవసరం. ఇక 40 ఏళ్లు వచ్చాక చూద్దాం అనుకుంటే.. అప్పుడు నెలకు ఏకంగా రూ.30,978 కావాల్సి ఉంటుంది.

ప్రమాదం జరిగితే..

చిన్న మొత్తంతో అధిక రక్షణ లభించే మరో పాలసీ వ్యక్తిగత ప్రమాద బీమా. కేవలం రూ.600 ప్రీమియానికే రూ.3లక్షల వరకూ బీమా పాలసీ వస్తుంది. కానీ, దీనిని ఎంతమంది తీసుకుంటున్నారన్నది సందేహమే. దురదృష్టవశాత్తూ ప్రమాదం జరిగినప్పుడు.. విచారించే బదులు.. ముందే మేలుకొని వ్యక్తిగత ప్రమాద బీమా తీసుకోవడం మేలు. 30-35 ఏళ్ల వయసులో ప్రమాదం జరిగి.. కాళ్లు లేదా చేతులు పోగొట్టుకుంటే.. ఏమిటి పరిస్థితి. ఒకవైపు ఆదాయం పడిపోవడంతోపాటు, కుటుంబానికి ఆర్థికంగా భారంగా మారిన పరిస్థితులకు సంబంధించి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. అందుకే, ఆలస్యం చేయకుండా పూర్తిస్థాయి వ్యక్తిగత ప్రమాద బీమా కూడా తీసుకోవడం ఎంతో అవసరం

పన్ను ప్రణాళికలో..

ఆర్థిక సంవత్సరం చివర్లో తప్ప గుర్తుకు రాని విషయం పన్ను ప్రణాళికలు.. ఇప్పటికే పన్ను కోత మొదలైనా చాలామంది దీన్ని పట్టించుకోరు. చివరి మూడు నెలల్లో హడావుడిగా తోచిన పథకాలను ఎంచుకొని మదుపు చేసేస్తుంటారు. దీనివల్ల అప్పటికప్పుడు పన్ను భారం తగ్గించుకోవచ్చు కానీ, ఆశించిన ఫలితాలు నెరవేరకపోవచ్చు. తొందరపాటు ఎంపికలో ఆర్థిక ప్రణాళికకు ఏమాత్రం ఉపయోగపడని పథకాలను ఎంచుకునే ప్రమాదమూ లేకపోలేదు.

వీలైనంత వరకూ ఆర్థిక సంవత్సరం మొదటి నెల నుంచే పన్ను మినహాయింపు పథకాల్లో పెట్టుబడులు ప్రారంభించాలి. ముఖ్యంగా ఈక్విటీ ఆధారిత పొదుపు పథకం (ఈఎల్ఎస్ఎస్)లను ఎంచుకున్నప్పుడు ముందునుంచే వీటిలో క్రమానుగత పెట్టుబడి విధానంలో మదుపు చేయడం ఉత్తమం. దీని వల్ల దీర్ఘకాలిక మదుపు ప్రయోజనం సిద్ధిస్తుంది. పీపీఎఫ్‌లాంటి వాటిని కూడా ఏప్రిల్ నెలలోనే ప్రారంభించడం ఉత్తమం. ముందునుంచే పన్ను ఆదా కోసం ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఒక్కసారిగా ఆర్థిక భారం ఉండదు.

నెలసరి వాయిదాలు..

క్రెడిట్ కార్డు బిల్లు.. తీసుకున్న రుణాలకు వాయిదాల చెల్లింపు.. ఈ రెండూ ఎప్పుడూ ఆలస్యం చేయకండి. వీటివల్ల అనవసరంగా రుసుముల భారం పడటమే కాకుండా.. క్రెడిట్ స్కోరు, రుణ చరిత్రపై కూడా ప్రభావం పడుతుంది. వీలైనంత వరకూ వీటి చెల్లింపులను ఏ మాత్రం ఆలస్యం చేయకూడదు.

ఆశ్రమాన్ని వీడితే మళ్లీ అనాథలే!

- పదో తరగతి పూర్తయితే కష్టాలు
- వృత్తివిద్య, ఉన్నత చదువులకు దూరం
- జీవితంలో నిలదొక్కుకోవడం భారమే
- చిన్నాచితక పనులతో జీవితాలను వెళ్లదీస్తున్నారు
- విక్టోరియా హోంలో చదివిన విద్యార్థుల దీనస్థితి
- ఇక్కడే ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలంటున్న పూర్వ విద్యార్థులు
- సమస్యలపై సర్కారు దృష్టి సారించాలని విజ్ఞప్తి

తల్లిదండ్రులకు పిల్లలే సర్వస్వం.. వారి ఉజ్జ్వల భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమిస్తారు.. తమ కంటిపాపలకు కష్టమొస్తే తల్లడిల్లిపోతారు.. కొడుకు పెద్దవాడైతే భవిష్యత్తుపై దిగులు.. అమ్మాయి పెరుగుతున్నకొద్దీ వివాహంపై ఆందోళన చెందుతుంటారు. ఇక పిల్లలకు కూడా ఏ సమస్య వచ్చినా అమ్మానాన్నలు ఉన్నారన్న భరోసా ఉంటుంది.. మరి తల్లిదండ్రులే లేని పిల్లల పరిస్థితి ఏమిటి? కష్టసుఖాలు ఎవరికి చెప్పుకోవాలి..? 'నా' అన్న వారెవరూ లేని పిల్లలను అక్కున చేర్చుకుంటోంది విక్టోరియా హోం. ఇక్కడ పదో తరగతి వరకు బాగానే చదువుకుంటున్న పిల్లలు.. తర్వాత విద్యాభ్యాసం కొనసాగించాలంటే మాత్రం ఆశ్రమం బయటకు వెళ్లాల్సిందే. కళాశాలల్లో సీట్లు దొరక్కపోతే చదువులు అటకెక్కినట్లే. పారిశ్రామిక శిక్షణ, ఉన్నతవిద్య, నైపుణ్య శిక్షణ అంశాలను సర్కారు విస్మరించడంతో జీవితంలో స్థిరపడడం ఆ అనాథలకు భారంగా మారుతోంది.

"సికింద్రాబాద్‌లో రెండేళ్ల బాలిక ఏడుస్తూ ఓ ఆటోడ్రైవర్‌కు కనిపించింది. తీసుకెళ్లి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. నాలుగు రోజులు ఎదురు చూసినా ఎవరూ రాకపోవడంతో పోలీసులు విక్టోరియా హోంకు పంపారు. నిర్వాహకులు ఆ పాపను అన్నీ తామై పెంచారు. పదోతరగతిలో ఇంటిపేరు, తల్లి, తండ్రి పేరు రాయాల్సి వచ్చినపుడు 'నాకు తెలిసిన తండ్రి విఘ్నేశ్వరుడు, తల్లి సరస్వతీ దేవి.. వారి పేర్లు రాయండి' అని ఆ అమ్మాయి చెప్పింది. ఇప్పుడామె ఓ హాస్టల్‌లో ఉంటూ ఆర్కిటెక్ చదువుతోంది. సెలవు దొరికినప్పుడల్లా ఇక్కడికొచ్చి బాగోగులు చెప్పుకుంటోంది"

"అల్లారు ముద్దుగా పెంచుకుంటామంటూ పరాయి దేశం నుంచి ఓ ఆడపిల్లను తీసుకొచ్చారిక్కడి దంపతులు. ఇక్కడికి వచ్చాక ఇంట్లో వెట్టి చాకిరీ చేయించడం ప్రారంభించారు. బాలకార్మికులను గుర్తించే అధికారులకు బాలిక లభించింది. ఆ నరకం నుంచి తప్పించి బాలసదన్‌లో చేర్పించారు. ఐదోతరగతిలోకి రాగానే విక్టోరియా హోంకు అప్పగించారు. పదోతరగతి మంచి మార్కులతో పూర్తిచేసింది. తిరిగి బాలసదన్‌కు అప్పగిస్తే.. ఆ అమ్మాయి ఇప్పుడు మరో అనాథాశ్రమంలో ఉంటూ ఇంటర్ చదువుతోంది"

"నిజాం హయాంలో ఆదిలాబాద్‌కు చెందిన ఓ బాలుడికి చదువుకోవాలన్న కోరిక బలంగా ఉండేది. తండ్రేమో పనిలో పెట్టాడు. అక్కడి నుంచి పారిపోయి హైదరాబాద్ వచ్చాడు. చాదర్‌ఘాట్ వద్దకొచ్చి.. 'ఇక్కడ అన్నం పెట్టి చదువు చెప్పేవారెవరైనా ఉన్నారా?' అని అడిగాడు. ఓ పెద్దాయన అక్కడి నుంచే చూపిస్తూ.. 'అదిగో దూరంగా కనిపిస్తున్న రాజభవనమే యతీంఖానా. అక్కడికి వెళ్లు' అన్నారు. ఈ పాఠశాలను అప్పట్లో బ్రిటిష్ దంపతులు అలెక్స్ చూసుకునేవారు. అక్కడికి వచ్చిన బాలుడ్ని అక్కున చేర్చుకున్నారు. అలా చదువు పూర్తిచేసుకుని ఆర్మీలో ఎంపికై పదవీ విరమణ చేశారు. దాదాపు 92 ఏళ్ల వయసులో మళ్లీ అక్కడికి వచ్చిన ఆయన.. పిల్లలకు దుప్పట్లు కొనిచ్చారు. తర్వాత బస్సులో బంధువులను తీసుకొచ్చి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. యతీంఖానా లేకుంటే 'నేను మీ ముందు ఉండేవాడిని కాదు. ఇంత పెద్ద కుటుంబం ఉండకపోయేది' అని కన్నీళ్లు పెట్టుకున్నారు"

ఈనాడు, హైదరాబాద్

విక్టోరియా హోం.. 115 ఏళ్ల నుంచి ఇలా ఎందరికో ఆసరాగా నిలిచింది. అనాథ పిల్లలకు ఒకటి నుంచి పది వరకు ఉచితంగా విద్యనందిస్తోంది. కొందరు ఇక్కడే చదివి ఇక్కడే ఉద్యోగాలు చేసి పదవీ విరమణ చేశారు. మూడు తరాలుగా ఇక్కడి విద్యార్థులకు సేవలు చేస్తున్న సిబ్బంది నేటికీ ఉన్నారు. ఒకప్పుడు నిజాం నవాబు అనాథల సొమ్ము వారికే దక్కాలని వీలు రాయడంతో పాటు ట్రస్టు తరఫున సహాయం చేస్తూ వచ్చారు. గతంలో ఇక్కడ పారిశ్రామిక శిక్షణ కూడా ఇచ్చేవారు. మెరికల్లాంటి యువకులకు పోలీసు, ఆర్మీ ఉద్యోగ ఎంపికలు జరిగేవి. ఇప్పుడా నియామకాలు లేవు.. పారిశ్రామిక శిక్షణా లేదు. పదోతరగతి పూర్తయితే మళ్లీ అనాథలవుతున్నారు. ఇక్కడే ఉన్నత చదువుల కేంద్రాలను ఏర్పాటు చేయాలని పూర్వవిద్యార్థులు కోరుతున్నారు. ఇప్పటికీ అక్కడే ఏడెకరాల్లో వ్యవసాయం చేస్తూ పిల్లల కోసం కూరగాయలు పండిస్తున్నారు.

ఉన్నత చదువులకెళ్లేది 20 శాతమే..

పదో తరగతి పూర్తవగానే విద్యార్థులను సంబంధిత సంస్థలకు అప్పగిస్తున్నారు. విక్టోరియా హోంలో చదివిన వారికి నేరుగా గురుకులాల్లో ప్రవేశాలివ్వాలని ఆదేశాలున్నాయి. గత నాలుగేళ్లుగా ప్రతిభ పేరిట వీటిని అమలు చేయడం లేదు. దీంతో సగం మంది చదువు మధ్యలోనే మానేస్తున్నారు. అక్కడి ఉపాధ్యాయులు తెలిసిన గురుకులాలకు ఫోన్‌చేసి


హోంలో చదివిన పూర్వవిద్యార్థులు సాధించిన బహుమతులు


వసతులు లేక పెట్టెలు, నేలపై నిద్రిస్తున్న చిన్నారులు

సీట్లు ఇవ్వాలంటూ అభ్యర్థిస్తున్న పరిస్థితి. పదో తరగతిలో నూరుశాతం ఫలితాలు సాధిస్తున్నా.. వీరిలో ప్రజ్ఞ తక్కువగా ఉంటోంది. పది పూర్తయిన తర్వాత ఆశ్రమం బాధ్యత తీరిపోతోంది. వీరిలో 20 శాతం మందే ఉన్నత చదువులు చదువుతున్నట్లు తెలిసింది. మిగతా విద్యార్థులు రోజువారీ పనులు చేసుకుంటున్నారు. ఒకప్పుడు విక్టోరియా హోం-పారిశ్రామిక శిక్షణ కేంద్రం కలిసి ఉండేవి. ఏడో తరగతి నుంచి విద్యార్థులకు పారిశ్రామిక కోర్సుల్లో శిక్షణ ఇచ్చేవారు. అప్పట్లో ఇచ్చిన శిక్షణతో చాలా మందికి మంచి ఉద్యోగాలొచ్చాయి. స్వయం ఉపాధి మార్గాలనూ ఎంచుకున్నారు. గురుకుల పాఠశాలగా మారడంతో వృత్తివిద్య, పారిశ్రామిక శిక్షణ మరిచారు.

జూనియర్, డిగ్రీ కళాశాలలుండాలి..

విక్టోరియా హోం నుంచి ఏటా దాదాపు 80 మందికిపైగా విద్యార్థులు పదోతరగతి పూర్తిచేసుకుంటున్నారు. ఇక్కడే గురుకుల ఇంటర్, డిగ్రీ కళాశాలలను బాలబాలికలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని పూర్వ విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఆడపిల్లలకు వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని ఇక్కడ చదివిన విద్యార్థినులు చెబుతున్నారు.

కష్టమొస్తే ఆదుకునేదెవరు.?

పాఠశాలలో ఉన్నంత వరకు ఏ కష్టమొచ్చినా ఉపాధ్యాయులు చూసుకునేవారు. పాఠశాల దాటితే అన్నీ కష్టాలే. ఉన్నత చదవులకు సహాయం చేసేవారూ ఉండట్లేదు. ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్నారు. పుస్తకం కావాలన్నా, పరికరాలు కొనాలన్నా, చివరకు క్యాలిక్యులేటర్ కొనాలన్నా ఎవరైనా దాతల కోసం చూడాల్సిందే. "మా పాఠశాలలో చదివిన ఇద్దరు పిల్లలు ఆర్కిటెక్చర్ కోర్సులు చేస్తున్నారు. వీరికి ల్యాప్‌టాప్‌లు అవసరం. ఒకరికి దాత దొరికారు. మరొకరి కోసం ఎదురుచూస్తున్నాం" అని అక్కడి ఉపాధ్యాయుడు తెలిపారు. పాఠశాలలో నాలుగు జతల యూనిఫామ్ ఇస్తుండగా.. మిగతా దుస్తులకు దాతలపైనే ఆధారపడుతున్నారు.

ఆ బాధ్యత కష్టమే..

పదో తరగతి తర్వాత ఆడపిల్లలు ఎక్కువగా కష్టాలెదుర్కొంటున్నారు. కొందరు ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటుండగా, మరికొందరి బాధ్యతను స్వచ్ఛంద సంస్థలు తీసుకుంటున్నాయి. దాతలు చదివించడం, విరాళాలివ్వడం చేస్తున్నారు. కానీ, వారికి పెళ్లి చేసే బాధ్యతను నిర్వాహకులే తీసుకుంటున్నారు. వివాహాలు చేయడం అంత సులువేమీ కాదని ఓ ప్రైవేటు ఆశ్రమ నిర్వాహకురాలు విజయ తెలిపారు.

ఇద్దామనుకొని.. వెనక్కు తగ్గారు..

విక్టోరియా హోం స్థలంపై ప్రైవేటుసంస్థలు, ప్రజాప్రతినిధులు గతంలో కన్నేశారు. ఏదోరకంగా తమగుప్పిట్లోకి తీసుకోవాలని ప్రయత్నించారు. 2008లో అప్పటి సీఎం ఈ హోంను సందర్శించి ఇక్కడి పనితీరు, సేవాభావం, నిజాం వితరణను చూసి.. స్థలాన్ని ఎవరికీ ఇవ్వడానికి వీల్లేదన్నారు. ఎస్సీ సంక్షేమశాఖతో సమావేశం ఏర్పాటు చేసి ఆదేశాలు జారీ చేశారు. విక్టోరియా హోంను ఆధునిక విద్యాలయం, పునరావాస కేంద్రంగా తీర్చిదిద్ది, హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్ తరహాలో అభివృద్ధిచేయాలని ఆదేశించారు. నాటి నిర్ణయాల్లో కొన్ని..

- 1 నుంచి ఇంటర్ వరకు ఆంగ్లమాధ్యమంలో సీబీఎస్‌ఈ బోధన
- కనీసం 5వేల మంది చదువుకొనేలా ఏర్పాట్లు
- నివాస బ్లాకులు జాతీయ రహదారికి దక్షిణంవైపు, తూర్పు సరిహద్దుకు ఆనుకొని నిర్మాణం
- ఇక్కడి నుంచి రైతుబజారును తరలించాలి
- ఇంటర్ పూర్తి చేసిన బాలికలకు సహాయాన్నందించేందుకు వీలుగా జాతీయ రహదారికి ఉత్తరం వైపున ప్రత్యేక మహిళా బ్లాకులు నిర్మించాలి
- ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలకు విక్టోరియా హోం భూములను కేటాయించడానికి వీల్లేదు. ఈ మేరకు ఎస్సీ సంక్షేమశాఖ కమిషనర్ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలి

లీజుల పేరిట..

రైతుబజార్: 1999లో 2.5 ఎకరాల స్థలం లీజు. నెలకు రూ.1.09 లక్షల అద్దె. దీన్ని కొన్నేళ్లుగా చెల్లించడం లేదు.

బీజేఆర్ భవన్: 1996లో 1.5 ఎకరాలు బాబూ జగ్జీవన్ రామ్ భవనం కోసం కేటాయించారు. విక్టోరియా హోంను ఎస్సీ సంక్షేమ శాఖ నిర్వహిస్తుండడంతో లీజు నిర్ణయించలేదు.

రిలయన్స్: 150 చ.మీ స్థలాన్ని 2002లో, 2500 చ.మీ స్థలాన్ని 2003లో పెట్రోలు బంకు కోసం ఇచ్చారు. ప్రతినెలా అద్దె రూ.1,27,645 చెల్లిస్తున్నారు.

రాచకొండ కమిషనరేట్: రాచకొండ పోలీసు కమిషనరేట్‌కు 10 ఎకరాల స్థలం లీజు. 2017 ఏప్రిల్ 10న ఉత్తర్వులు జారీ.



ఇదీ చరిత్ర..

విక్టోరియా మెమోరియల్ హోం
ప్రారంభం: **1903, జనవరి 1**
ఎవరు: **మీర్ మహబూబ్‌అలీఖాన్ (ఆరో నిజాం)**
ఎక్కడ: **సరూర్‌నగర్ ప్యాలెస్**
విస్తీర్ణం: **73.33 ఎకరాలు**
రెవెన్యూ రికార్డుల్లో నేటికీ ఈ స్థలం యతీంఖానాదే.

ఇదీ ప్రభుత్వాల బాధ్యత..

తల్లిదండ్రుల్లేని పిల్లల విషయంలో ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలను అంతర్జాతీయ సేవా సంస్థలు ఖరారు చేశాయి. జీవితంలో స్థిరపడేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నాయి.

- బోర్డింగ్ పాఠశాలలు, క్యాంపుల ద్వారా 18 ఏళ్ల వరకు ఉచిత నిర్బంధ విద్య అందించాలి.
- పౌష్టికాహారం, రక్షిత తాగునీరు, ఉచితంగా వైద్యసేవలు అందించాలి.
- నైపుణ్య, పారిశ్రామిక శిక్షణ ఇచ్చి స్వల్పకాలిక రుణాలు ఇవ్వాలి.
- సామాజిక భాగస్వామ్యమూ కీలకం. పిల్లల్ని దత్తత తీసుకుని తీర్చిదిద్దవచ్చు.

ఐటీఐఆర్ ఆలస్యానికి రాష్ట్ర ప్రభుత్వ వైఖరే కారణం

- 2019లో తెలంగాణలో మాదే అధికారం: లక్ష్మణ్

ఈనాడు, హైదరాబాద్: కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఇస్తున్న నిధుల్ని, పథకాలను అందిపుచ్చుకోవడంలో తెలంగాణ ప్రభుత్వం వెనుకబడిందని.. తన తప్పిదాల్ని కప్పిపుచ్చుకునేందుకు నెపాన్ని కేంద్రంపై నెడుతోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ విమర్శించారు. ఐటీఐఆర్ ప్రాజెక్టులో ఆలస్యానికి తెరాస ప్రభుత్వ వైఖరే కారణమని.. రాష్ట్రానికి మేలు కలిగేలా, యువతకు ఉపాధి కలిగేలా కేంద్రం పునరాకృతి చేస్తే, ఆ ప్రాజెక్టుకు అవసరమైన భూమి కేటాయించకుండా రాజకీయ విమర్శలు చేస్తోందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయ భవనంలో వీడియో, ఆడియో కాన్ఫరెన్స్ వంటి ఆధునిక హంగులతో ఆధునికీకరించిన కార్యాలయాలు, వసతిగదుల్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రైల్వేశాఖ సహాయమంత్రి రాజేన్ గోహైన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. లక్ష్మణ్ మాట్లాడుతూ.. 2019లో తెలంగాణలో భాజపా అధికారంలోకి వచ్చి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. అమిత్‌షా మూడురోజుల పర్యటనకు త్వరలో హైదరాబాద్ వస్తారని.. సెప్టెంబరు 17 తెలంగాణ విమోచన దినోత్సవానికి కేంద్రహోం మంత్రి రాజ్‌నాథ్ హాజరవుతారని వెల్లడించారు. అంతకుముందు తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులపై కేంద్ర సహాయమంత్రికి లక్ష్మణ్ వినతిపత్రం ఇచ్చారు.

'విక్టోరియా'లో రాచకొండ కమిషనరేట్

- అనాథల పాఠశాల ఆవరణలో పదెకరాలు పోలీసు శాఖకు
- 11 ఏళ్ల పాటు లీజు పేరిట ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: అనాథ పిల్లలకు విద్యాబుద్ధులు, పారిశ్రామిక శిక్షణ, పునరావాసం కోసం నిజాం నవాబు ట్రస్టుగా ఏర్పాటుచేసిన విక్టోరియా మెమోరియల్ పాఠశాల స్థలంలో పది ఎకరాలను ప్రభుత్వం రాచకొండ పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి కేటాయించింది. విక్టోరియా హోం పరిధిలోని సర్వేనెం.6/7లో దాదాపు రూ.170కోట్ల విలువైన పది ఎకరాలను లీజు ప్రాతిపదికన అప్పగిస్తూ ఎస్సీ సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ స్థలంలో పోలీసు కమిషనరేట్ ప్రధాన కార్యాలయాన్ని నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు. అనాథ పిల్లలకు నిజాం నవాబు ఇచ్చిన ఈ స్థలాన్ని ఇతరత్రా అవసరాలకు కేటాయించకూడదని నిబంధనలు ఉన్నాయి. కానీ, పోలీసుశాఖ తరఫున ఒక అధికారిని ప్రత్యేకంగా నియమించి విక్టోరియా హోం స్థలం లీజుకు వచ్చేలా దస్త్రాన్ని నడిపించినట్లు ఎస్సీ సంక్షేమశాఖలో విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసు కమిషనరేట్‌కు పది ఎకరాలు లీజుకు ఇవ్వాలని ప్రాథమిక నిర్ణయం తీసుకున్న సర్కారు 2017 ఏప్రిల్ 10న మెమో నెం.340 జారీ చేసింది. అధికారికంగా లీజు ఉత్తర్వులిచ్చేందుకు దస్త్రాలను సిద్ధం చేయాలని అందులో పేర్కొంది. లీజు ధరను నిర్ణయించేందుకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నివేదిక పంపించారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ ఇక్కడ గజం భూమి ధర రూ.35వేలుగా ఉందని నివేదిక ఇచ్చారు. పదెకరాలంటే 48,400 గజాలు అవుతోంది. ఇందులో 33శాతం భూమిని రోడ్లు, ఇతరత్రా వినియోగంలో లేనిదిగా లెక్కకట్టారు. మిగిలిన భూమిలో గజానికి ఏడాదికి రూ.35వేల చొప్పున లీజు చెల్లించాలని నివేదిక ఇచ్చారు. ఈ లెక్కన 32428 గజాలకు రూ.35వేల చొప్పున నెలకు రూ.94,58,167 అవుతుందని, ఏడాదికి రూ.11,34,98,000 వస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్సీ సంక్షేమశాఖ ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం 11 ఏళ్లకు లీజును ఆమోదించింది.

తెలంగాణకు భారీ వర్ష సూచన

కొన్ని ప్రాంతాల్లో అతిభారీ వర్షం: వాతావరణ శాఖ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో శుక్రవారం నుంచి నుంచి నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్నాయి. ఒడిశా నుంచి తెలంగాణ మీదుగా ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రం అంతటా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. 18, 19, 20వ తేదీల్లో కొన్ని చోట్ల అతి భారీ వర్షం కురుస్తుందని తెలిపింది. అన్ని జిల్లాలపై వర్షం కురిసే ప్రభావం ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో 12 సెం.మీటర్ల నుంచి 20 సెం.మీటర్ల వరకు కురిసే అవకాశాలు లేకపోలేదని వాతావరణ శాఖ హైదరాబాద్ విభాగం ఇంఛార్జి సంచాలకుడు వైకే రెడ్డి 'ఈనాడు'కు వివరించారు. మరోవైపు గురువారం రాష్ట్రంలో పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. బయ్యారంలో 4 సెం.మీటర్లు, మహబూబాబాద్, బోనకల్‌లలో 3, పాల్వంచ, భీందేవరపల్లి, మణుగూరు, పాలకుర్తి, టేకులపల్లి, మహేశ్వరంలలో 2 సెం.మీటర్లు, ఇల్లందు, కొత్తగూడెం ప్రాంతాల్లో 1 సెం.మీ. వర్షపాతం నమోదయింది.

స్వచ్ఛభారత్ ఉద్యమంలా సాగుతోంది

- ఇందులో ప్రతిఒక్కరూ భాగస్వాములవ్వాలి
- రైల్వే సహాయమంత్రి రాజేన్ గోహైన్

రెజిమెంటల్‌బజార్(హైదరాబాద్), న్యూస్‌టుడే: దేశంలో స్వచ్ఛభారత్ ఉద్యమంలా సాగుతోందని.. ఇందులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని రైల్వేశాఖ సహాయ మంత్రి రాజేన్ గోహైన్ పిలుపునిచ్చారు. గురువారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జరిగిన స్వచ్ఛరైల్.. స్వచ్ఛభారత్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్ కుమార్‌తో కలిసి స్టేషన్ పరిసరాల్లో పర్యటించారు. పదో నెంబరు ప్లాట్‌ఫాంపై శుభ్రం చేసే యంత్రాన్ని ఎక్కి నడిపారు. ఏసీ, స్లీపర్ వెయిటింగ్ హాళ్లు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి


సికింద్రాబాద్‌లో ప్లాట్‌ఫాంను శుభ్రంచేసే యంత్రాన్ని నడుపుతున్న రైల్వే శాఖ సహాయ మంత్రి రాజేన్ గోహైన్. చిత్రంలో దక్షిణమధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్ తదితరులు

మాట్లాడుతూ.. స్వచ్ఛ రైల్వేస్టేషన్లలో రెండో స్థానం సంపాదించుకున్న ఘనత సికింద్రాబాద్‌కు దక్కిందని కొనియాడారు. గతంతో పోల్చుకుంటే రైల్వేలో పరిశుభ్రత బాగా పెరిగిందని.. ఇదంతా కేవలం మోదీ వల్లనే సాధ్యమైందన్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అన్ని రంగాల్లో దేశంలోనే 7వ స్థానంలో ఉందని పేర్కొన్నారు.

సరకు రవాణాను పెంచాలి

ఈనాడు, హైదరాబాద్: వివిధరకాల సరకుల రవాణాతో దక్షిణమధ్య రైల్వే మెరుగైన స్థితిలో ఉందని.. సరకు రవాణాను మరింతగా అధికం చేసి ఆదాయం పెంచుకోవాలని రైల్వేశాఖ సహాయ మంత్రి రాజేన్ గోహైన్ అన్నారు. దక్షిణమధ్యరైల్వే పరిధిలో చేపడుతున్న ప్రాజెక్టులు, జోన్ పనితీరుపై మంత్రి సికింద్రాబాద్‌లోని రైల్‌నిలయంలో గురువారం సమీక్షించారు. సరుకురవాణాను ప్రోత్సహించేందుకు వివిధ పథకాలు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. జోన్ పరిధిలో చేపడుతున్న ముఖ్యమైన ప్రాజెక్టులను సమీక్షించారు. అంతకుముందు జీఎం వినోద్‌కుమార్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జోన్ పనితీరు, సాధించిన విజయాల్ని వివరించారు.

ఉపరాష్ట్రపతి పౌరసన్మానానికి ఘనంగా ఏర్పాట్లు

- సమీక్షలో సీఎస్ ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 21న రాజ్‌భవన్‌లో జరిగే ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పౌరసన్మానానికి ఘనంగా ఏర్పాట్లు చేయాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ అధికారులను ఆదేశించారు. పౌరసన్మాన ఏర్పాట్లపై గురువారం సచివాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు దీనికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతి బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి పౌరసన్మానం నిర్వహించే అవకాశం తెలంగాణకు వచ్చిందని, సీఎం కేసీఆర్ దీనిని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించారని.. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆ రోజు ఉదయం బేగంపేట విమానాశ్రయానికి చేరుకునే వెంకయ్యకు.. గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్, ఇతర ప్రముఖులు ఘనస్వాగతం పలుకుతారని, ఈ సందర్భంగా విమానాశ్రయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం వారు అక్కడి నుంచి నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్లి పౌరసన్మానంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అవసరమైన అలంకరణలు, భద్రత, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, రహదారుల మరమ్మతులు, ప్రచారం పెద్దఎత్తున జరపాలని సీఎస్ ఆదేశించారు.

గవర్నర్‌తో సీఎస్ భేటీ

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ గురువారం గవర్నర్ నరసింహన్‌తో రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. ఈ నెల 21న రాజ్‌భవన్‌లో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడి పౌరసన్మానం ఏర్పాట్ల గురించి ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ పలు సూచనలు చేశారు.

వరంగల్ డీసీసీబీ పాలకవర్గం రద్దు

ప్రభుత్వ ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) పాలకవర్గాన్ని రద్దు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అనేక అభియోగాల నేపథ్యంలో విచారణ కమిటీ నివేదిక ఆధారంగా తెలంగాణ సహకార సంఘాల చట్టం-1964 ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. సహకార శాఖ రిజిస్ట్రార్ ఎం. వీరబ్రహ్మయ్య పేరిట ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వరంగల్ గ్రామీణ కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌కు డీసీసీబీ అధికారిక పరిపాలకునిగా బాధ్యతలు అప్పగించింది. డీసీసీబీ పాలకవర్గంపై పాలకుర్తి ఎమ్మెల్యే దయాకర్‌రావు గత మార్చిలో ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీనిపై సహకార శాఖ రిజిస్ట్రార్ విచారణ జరిపారు. పాలకవర్గం అక్రమాలకు, నిధుల దుర్వినియోగానికి పాల్పడిందని నివేదించారు. కొన్ని నిర్ణయాల వల్ల బ్యాంకుకు తీవ్ర ఆర్థిక నష్టం కలిగిందని పేర్కొన్నారు. నిబంధనల మేరకు చర్య తీసుకోవాలని ప్రభుత్వం సూచించడంతో పాలకవర్గాన్ని రద్దు చేశారు.

25న దేవులపల్లి రామానుజరావు శతజయంతి నిర్వహణకు ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: దేవులపల్లి రామానుజరావు శతజయంతిని ఆగస్టు 25న నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సాంస్కృతికశాఖ కార్యదర్శి అనిత రాజేంద్ర గురువారం ఉత్తర్వులు జారీచేశారు. తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శకునిగా ఉండటంతో పాటు తెలుగుభాషకు, తెలంగాణ సాహిత్యరంగంలో ఆయన కృషి చేశారు.

'నల్ల చట్టాలను రద్దు చేయాలి'

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: నల్ల చట్టాలుగా ఉన్న ఊపా (యూఏపీఏ), పీడీ, ఆర్మ్‌డ్ ఫోర్సెస్ స్పెషల్ పవర్.. తదితరాలను రద్దు చేయాలని తెలంగాణ పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో విప్లవోద్యమ, ప్రజా సంఘాల నేతలు మధు, శాంతారావు, ప్రసాద్‌ల అరెస్టులను ఖండిస్తూ గురువారం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు నేరాలను గుర్తించి, చర్యలు తీసుకోవాలి తప్ప ప్రత్యేక చట్టాలతో ప్రజాహక్కులకు భంగం కలిగించడం దుర్మార్గమన్నారు. మానవ హక్కుల వేదిక అధ్యక్షుడు జీవన్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిన విప్లవ, ప్రజా సంఘాల నేతలను విడుదల చేయాలన్నారు. సభకు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ అధ్యక్షత వహించారు.

ఓబీసీలకూ చౌక వ్యాపార రుణాలు

- గరిష్ఠంగా రూ. 5 కోట్ల ఆర్థికసాయం

ఈనాడు, దిల్లీ: వ్యాపార విస్తరణకు గాను ఎస్సీలకు అందిస్తున్నట్లే చౌక రుణాలను ఓబీసీలకూ మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. 2015 జనవరిలో మోదీ ప్రభుత్వం ఎస్సీ వ్యాపారవేత్తల కోసం నూతన పెట్టుబడుల నిధి(వీసీఎఫ్ఎస్‌సీ) పథకాన్ని ప్రారంభించింది. ఓబీసీలకు కూడా ఇలాంటి నిధిని అమలు చేసే దిశగా కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ చర్యలు ప్రారంభించింది. ఎస్సీలకు ఈ పథకాన్ని అమలుచేసిన మొదట్లో కొద్దిమంది మాత్రమే ముందుకొచ్చారు. అయితే క్రమేపీ దరఖాస్తుదారుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ పథకానికి ఆదరణ పెరిగింది. ఇంతవరకు 71 ప్రతిపాదనలకు సంబంధించి రూ. 265 కోట్ల రుణాలను ప్రభుత్వం అందించింది. ఈ నేపథ్యంలో దీన్ని ఓబీసీలకూ వర్తింపజేస్తే దేశంలో పారిశ్రామిక ప్రగతితోపాటు, ఉపాధి పెరుగుతుందని కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ విశ్వసిస్తోంది. ఈమేరకు పెట్టుబడుల నిధిని విస్తరించి.. ఓబీసీలను అందులో చేర్చాలని ఆర్థిక శాఖను కోరింది. మరోవైపు మార్కెట్ నుంచి మూలధనాన్ని ఎలా పెంచవచ్చో యోచించాలని జాతీయ వెనుకబడిన తరగతుల ఆర్థికాభివృద్ధి సంస్థను కూడా ఆదేశించింది. ఎస్సీల నూతన పెట్టుబడుల నిధి నుంచి దళిత వ్యాపారవేత్తలకు ప్రస్తుతం తక్కువ వడ్డీకి రూ. 15 లక్షల నుంచి రూ. 5 కోట్ల వరకు రుణాలు అందజేస్తున్నారు. తయారీ, రిటైల్, సేవారంగాలకు ఈ రుణాలు కేటాయిస్తారు. ఇదే రీతిలో ఓబీసీలకు చెందిన వ్యాపారవేత్తలకు కూడా రుణాలందించే నిధిని రూపొందించే యోచనలో ఉన్నట్లు సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. సులువైన తిరిగి చెల్లింపు విధానాల ద్వారా వారికీ రూ. 5 కోట్ల వరకు రుణాలందించే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు. రాజకీయంగా కూడా ఇది ప్రాధాన్యం సంతరించుకుంది. మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్ బిల్లును కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు వర్షాకాల సమావేశాల చివరిలో రాజ్యసభలో నిలుపుదల చేశాయి. ఓబీసీల వ్యతిరేకిగా కాంగ్రెస్ విమర్శలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. దేశంలో 52 శాతం ఉన్న వారికి చేరువయ్యేందుకు పెట్టుబడుల నిధిని అమలుచేసేందుకు భాజపా యోచిస్తోంది. కాగా ఇప్పటికే మోదీ ప్రభుత్వం ముద్ర పథకాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో గరిష్ఠంగా రూ. 10 లక్షల వరకే మంజూరు చేస్తారు. ముద్ర పథకం లబ్ధిదారుల్లో 35 శాతం ఓబీసీలు, 20 శాతం ఎస్సీలు, 5 శాతం ఎస్టీలు ఉన్నారు.

ఫొటోగ్రఫీలో 'ఈనాడు'కు పురస్కారాలు

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం నిర్వహించిన పోటీలో 'ఈనాడు'కు పలు పురస్కారాలు లభించాయి. కేటగిరీ-1లో మిషన్ భగీరథ చిత్రానికి కె.శ్రీనివాస్‌కు తృతీయ పురస్కారం, కేటగిరీ-2లో బంగారు తెలంగాణ చిత్రానికి కె.శ్రీనివాస్, రవీందర్‌కు ప్రోత్సాహక బహుమతులు వచ్చాయి. కేటగిరీ-3లో ఉత్తమ వార్తా చిత్రానికి రెండో బహుమతి పి.పద్మావతికి లభించింది. ప్రోత్సాహక బహుమతి ఎం.రమేష్‌ను వరించింది. తెలంగాణ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ నిర్వహించిన పోటీలో ఉత్తమ వార్తా చిత్రం కేటగిరీలో కంది శివప్రసాద్‌కు మొదటి బహుమతి, ఆవుల శ్రీనివాస్‌కు మూడో బహుమతి, శ్రావణ్‌కుమార్‌కు ప్రోత్సాహక బహుమతి వచ్చింది. అభివృద్ధి కేటగిరీలో కుంట్ల శ్రీనివాస్‌కు ప్రోత్సాహక బహుమతి లభించింది. విజేతలకు ఈనెల 19న ఈ పురస్కారాలను అందజేయనున్నారు.

కొత్త 'మెట్రో' అమలు చాలా కష్టం

- ప్రైవేటు భాగస్వాములు ముందుకురారు
- విజయవాడలో లైట్‌మెట్రోకి వెళ్లడం అవివేకం
- విశాఖ మెట్రో మరింత ఆలస్యమయ్యే అవకాశం
- హైదరాబాద్ మెట్రో మొదలుపెడితే నష్టాలే
- అందుకే ఎల్‌అండ్‌టీ వాయిదా వేస్తూ పోతోంది
- 'ఈనాడు'తో మెట్రోమ్యాన్ ఇ.శ్రీధరన్

ఈనాడు - దిల్లీ

కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన కొత్త మెట్రో విధానం కింద కొత్తగా ప్రాజెక్టులు ఆమోదం పొందడం చాలా కష్టమని మెట్రోమాన్ ఇ.శ్రీధరన్ పేర్కొన్నారు. ఆచరణలో దీన్ని అమలు చేయడం కష్టమని వ్యాఖ్యానించారు. మెట్రో రవాణా లాభాలతో కూడుకున్న వ్యాపారం కాదు కాబట్టి ప్రైవేటు సంస్థలు ఇందులో పెట్టుబడులు పెట్టడానికి ముందుకురావన్నారు. కొత్త మెట్రోరైల్ విధానం, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టుల భవిష్యత్తుపై ఆయన 'ఈనాడు'తో మాట్లాడారు. ప్రస్తుతం కొత్త విధానం వచ్చినా విజయవాడ మెట్రోప్రాజెక్టును మాత్రం పాత విధానం ప్రకారమే కొనసాగించడానికి అవకాశం ఉందని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే...

- విశాఖపట్నం మెట్రోపై మాత్రం మళ్లీ కొత్తగా అధ్యయనం చేసి, డీపీఆర్ (సమగ్ర ప్రాజెక్టు నివేదిక) తయారు చేయాల్సి వస్తుంది.. అందుకు కనీసం ఆరేడు నెలల సమయం పడుతుంది.
- కొత్త మెట్రో విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన నేపథ్యంలో విజయవాడ మెట్రోకూ ప్రైవేటు భాగస్వామిని గుర్తించాలని ఒత్తిడి చేసే అవకాశం ఉంటుంది.. ఈ విధానంలో సామాజిక ప్రభావ మదింపు తప్పనిసరి చేసినందున ప్రాజెక్టులు మంజూరు చేయకుండా తప్పించుకోవడానికి ఆ నిబంధన వీలు కల్పిస్తుంది.
- విజయవాడకు మెట్రో స్థానంలో లైట్‌రైల్ టెక్నాలజీ విధానాన్ని తీసుకురావడానికి ఏపీ ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. లైట్‌రైల్ విధానం అంటే ట్రామ్ వే లాగా ఉంటుంది., అటువైపు మళ్లడం అవివేకమే. ఇప్పటికే ఆమోదం పొందిన మెట్రోరైల్ ప్రాజెక్టుకే ఏపీ ప్రభుత్వం కట్టుబడి ఉండాలి. విజయవాడ ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతంలో ఉండటం, చంద్రబాబుకున్న రాజకీయ పలుకుబడి దృష్ట్యా సాధారణ మెట్రో ప్రాజెక్టు అక్కడ చేపట్టడానికి అవకాశం ఉంది. లైట్ రైల్ టెక్నాలజీకి మళ్లితే మాత్రం అందుకు చాలా సమయం పడుతుంది.. వేగంగా అభివృద్ధి చెందుతున్న విజయవాడలాంటి నగరాలకు ఈ విధానం సరిపోదు. లైట్ రైల్ టెక్నాలజీ సామర్థ్యం సాధారణ మెట్రో కంటే 50% తక్కువ ఉంటుంది. పైగా మెట్రోతో పోల్చుకుంటే దాని నిర్మాణానికయ్యే ఖర్చులో తేడా పెద్దగా ఉండదు. ప్రయాణికుల రవాణా సామర్థ్యంలోనూ దాదాపు 50% తేడా ఉంటుంది. మెట్రో ప్రాజెక్టులను వందేళ్లను దృష్టిలో పెట్టుకొని నిర్మిస్తుంటారు. వచ్చే వందేళ్లలో విజయవాడ చాలా పెద్దనగరంగా రూపాంతరం చెందే అవకాశం ఉన్నందున సాధారణ మెట్రోప్రాజెక్టు నిర్మాణం చేపట్టడమే ఉత్తమం. ఈ విషయంలో దిల్లీ మెట్రోను ఆదర్శంగా



తీసుకొని ముందుకెళ్లాలి.

- కొత్త మెట్రో విధానంలో మెట్రోలైన్‌కు అటూ, ఇటూ 5 కి.మీ. దూరం నుంచి అనుసంధాన రవాణా ఏర్పాటు చేయాలని చెప్పడం కూడా లాభదాయకం కాదు. అందుకు ఏర్పాటుచేసే ఫీడర్ బస్సుల కోసం ఎవరు పెట్టుబడి పెట్టాలన్న ప్రశ్న ఉదయిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలే ఆ భారాన్ని భరించాల్సి ఉంటుంది. కొత్త విధానంలో చెప్పిన అంశాలు కాగితాలపై బాగా అనిపించినా వాస్తవంగా అమలు సాధ్యం కాదు. మెట్రో లాభదాయక వ్యాపారం కాదు కాబట్టి వీటిని చేపట్టడానికి ప్రైవేటు పార్టీలెవ్వరూ ముందుకురారు. పెట్టుబడిపై కనీసం 12-15% లాభం ఉంటేనే ప్రైవేటు వ్యక్తులు ముందుకొస్తారు. కానీ మెట్రోలో లాభం గరిష్ఠంగా 1.5నుంచి 2శాతం వరకు మాత్రమే ఉంటుంది. కొత్త విధానంలో ఎకనమిక్ రేట్ ఆఫ్ రిటర్న్ 14% ఉండాలన్న నిబంధనను చేరుకోవడం పెద్దకష్టమేమీ కాదు. ఇదివరకు పెట్టిన పెట్టుబడిపై 8% లాభం ఉండాలన్న నిబంధన ఉండేదని, ఇప్పుడు చెప్పిన ఎనమిక్ రేట్ ఆఫ్ రిటర్న్ ప్రకారం మొత్తం సమాజానికి చేకూరే ప్రయోజనాన్ని రేట్ ఆఫ్ రిటర్న్ కింద పరిగణిస్తారు. మెట్రోప్రాజెక్టు ప్రారంభమైన తర్వాత తగ్గే కాలుష్యం, రోడ్డు ప్రమాదాలన్నింటినీ లెక్కించి విలువ కడతారు.

హైదరాబాద్ మెట్రో మొదలుపెడితే నష్టాలే

హైదరాబాద్ మెట్రో రైల్ ఏమాత్రం లాభదాయకం కాబోదు.. దాని ఆపరేషన్ మొదలుపెట్టిన నాటి నుంచి ఎల్ అండ్ టీ సంస్థ భారీ నష్టాలు మూటగట్టుకోవాల్సి వస్తుంది. అదే సమయంలో బ్యాంకులకు రుణాల చెల్లింపు మొదలుపెట్టాల్సి ఉంటుంది. అందుకే అది ఆపరేషన్స్ ప్రారంభించడానికి జంకుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుకు పలుసార్లు అడ్డంకులు కల్పించిందని అందుకు తగిన నష్టాన్ని చెల్లించాలని ఎల్‌అండ్‌టీ డిమాండ్ చేసే అవకాశం ఉంటుంది. ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. పీపీపీ మోడల్ విజయవంతం కాదనడానికి హైదరాబాద్ మెట్రో ఒక ఉదాహరణ. అక్కడ ప్రాపర్టీ డెవలప్‌మెంట్ కోసం 300 ఎకరాల భూమి ఎల్ అండ్‌టీకి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే ఆస్తుల విలువలు తగ్గడం వల్ల రియల్ ఎస్టేట్ ద్వారా లాభాలు వచ్చే పరిస్థితి కనిపించడంలేదు. అందుకే ప్రాజెక్టు ప్రారంభించిన ఏడేళ్ల తర్వాత కూడా ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రోలో కనీసం ఒక సెక్షన్‌ను కూడా ప్రారంభించడానికి సాహసం చేయడంలేదు. భవిష్యత్తులో అది ఆపరేషన్స్ మొదలుపెట్టే పరిస్థితి లేకపోతే ప్రభుత్వమే ఆ భారాన్ని భరించాల్సి వస్తుంది.

వ్యక్తిగత కారణాలవల్లే రాజీనామా..

ఆంధ్రప్రదేశ్ మెట్రోరైల్ సలహాదారు పదవికి నెలక్రితమే తాను రాజీనామా చేశా. వయోభారం కారణంగా దూరప్రాంతాలకు తరచూ ప్రయాణం చేయలేకపోతున్నందునే రాజీనామా సమర్పించా. పూర్తిగా వ్యక్తిగత కారణాలతోనే ఈ రాజీనామా చేశా. ఇతరత్రా కారణాలేమీ లేవు.



ఊహకందనంతగా..

సాధారణంగా 3 నుంచి 4 అడుగులు మొక్క ఎదగగానే కంద దుంపగా తయారై మొక్క కాలిపోతుంది. కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండల కేంద్రానికి చెందిన లక్ష్మీయశోద ఇంటి పెరట్లో కందమొక్క ఏకంగా 8 అడుగులు పెరిగింది. ఇంటి పెరట్లో చల్లని వాతావరణం, దుంప నుంచి మొక్కవేరు నేలలోకి దిగినపుడు ఇలా మొక్క ఏపుగా పెరుగుతుందని స్థానిక ఉద్యానశాఖ అధికారిణి శ్రీలక్ష్మి చెబుతున్నారు.

– ఈనాడు విజయవాడ

యూకేలో భారతీయ మహిళల నిరసన ప్రదర్శన

లండన్: బ్రిటన్‌లోని అతి పెద్ద భారతీయ మహిళా సంఘం 'ఇండియన్ లేడీస్ ఇన్ ది యూకే'(ఐఎల్‌యుకె) ఇక్కడి వీసా, ఇమ్మిగ్రేషన్ ప్రధాన కార్యాలయం వెలుపల నిరసన ప్రదర్శన నిర్వహించింది. 'డిపెండెంట్ వీసా'ల పేరిట భర్త వెంట ఇక్కడికి వచ్చే ఎందరో భారతీయ మహిళలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని వారు ఆరోపించారు. దీనికి సంబంధించి కొన్ని చట్టపరమైన మార్పులు చేయాలని పిలుపునిచ్చారు. తమ వివాహం రద్దయిపోయిందని పేర్కొంటూ భర్త ఏకపక్షంగా తన భార్యకున్న వీసాను రద్దు చేసే హక్కు భారతీయ మహిళలను దిక్కుతోచని స్థితిలో పడేస్తోందన్నారు. దీంతో, వారు ఎలాంటి హక్కులు... సాయం చేసే వారు లేకుండా....అనాథల్లా రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నెలాఖరుకల్లా 20 కొత్త ఎత్తిపోతల పథకాలు ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: నీటిపారుదల అభివృద్ధి సంస్థ(ఐడీసీ) పరిధిలో ఈ నెలాఖరునాటికి 20 కొత్త ఎత్తిపోతల పథకాలను ప్రారంభించనున్నట్లు సంస్థ ఛైర్మన్ ఈద శంకర్‌రెడ్డి తెలిపారు. గురువారమిక్కడ నిర్వహించిన సమీక్ష సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రావిర్భావం అనంతరం ఐడీసీకి 582 పథకాలు రాగా వాటిలో 404లో పనిచేయకుండా పోయాయన్నారు. వాటిలో 164 పథకాలను రూ.100 కోట్లతో మరమ్మతులు చేపట్టామన్నారు. పనులు నడుస్తున్న 74 కొత్త పథకాలను పూర్తిచేసేందుకు శరవేగంగా పనులు నడుస్తున్నాయన్నారు.

మానసిక వైకల్య మహిళ గర్భస్రావానికి సంరక్షకుల ఆమోదం అవసరం లేదు: సుప్రీం

దిల్లీ: మానసిక వైకల్యం ఉన్న మహిళ గర్భస్రావం చేయించుకోవడానికి సంబంధిత సంరక్షకుల ఆమోదం అవసరమేమీ లేదని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. ఓ మహిళ శారీరక సమగ్రత...అందుకు సంబంధించిన వ్యక్తిగత స్వయం ప్రతిపత్తి అనే మౌలిక భావనకు సముచిత గౌరవాన్ని ఇవ్వడం తప్పనిసరి కాబట్టి మానసిక వైకల్యం ఉన్న మహిళ విషయంలో అలాంటి ఆమోదాలు అవసరం లేదని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో మైనారిటీ తీరిన మహిళ విషయంలో సంరక్షకుల ఆమోదం తప్పనిసరన్న అంశానికి మితిమీరిన ప్రాధాన్యం ఇవ్వరాదని కూడా అభిప్రాయపడింది. స్వల్ప మానసిక వైకల్యం ఉన్న ఓ అనాథ మహిళ 26 వారాల గర్భంతో ఉండగా ఆమెకు గర్భస్రావం చేయడం ఆ మహిళకు ప్రాణాంతకమే అంటూ ఆసుపత్రి నిరాకరించిన కేసులో సుప్రీం కోర్టు ఈ తీర్పు చెప్పింది. ఈ పరిస్థితుల్లో రూ.10 లక్షల పరిహారాన్ని 'బాధిత నష్టపరిహార పథకం' నుంచి అందచేయాలనీ...ఆ మొత్తాన్ని ఆమె పేరు మీదనే ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో వేయాలనీ కోరింది. స్వల్పమానసిక వైకల్యం ఉన్న ఈ అనాథ మహిళ పట్నాలోని ఓ ఫుట్‌పాత్‌పై అత్యాచారానికి గురైంది. శాంతికుటీర్ అనే మహిళా పునరావాస కేంద్రం ఆశ్రయం కల్పించిన తర్వాత అప్పటికే ఆ మహిళ 13 వారాల గర్భిణి అని జనవరిలో నిర్వహించిన వైద్యపరీక్షల్లో తేలింది. గర్భస్రావానికి ఆమె మార్చిలో అంగీకరించింది. అయితే, సంరక్షకుల ఆమోదం అంశంతో రోజులు గడిచాయి. చివరకు 26వారాల గర్భిణిగా ఉన్నప్పుడు గర్భస్రావం ప్రమాదకరం కావడంతో అనుమతి లభించలేదు.

చర్చలతో భూసేకరణ అధికారం ప్రభుత్వానికుంది

- చట్టప్రకారం ఉన్న నమూనాల మేరకే అంగీకారం తీసుకోవాలి
- రైతుల అభ్యంతరాలను సత్వరమే పరిష్కరించాలి
- స్పష్టంచేసిన ఉమ్మడి హైకోర్టు

ఈనాడు - హైదరాబాద్

కొత్త భూసేకరణ సవరణ చట్టం(2017), నిబంధనల ప్రకారం చర్చల ద్వారా భూసేకరణ చేపట్టే అధికారం తెలంగాణ ప్రభుత్వానికి ఉందని గురువారం ఉమ్మడి హైకోర్టు స్పష్టం చేసింది. కానీ, రైతుల అంగీకారం, ఒప్పందాలు సంబంధిత సెక్షన్లలో పేర్కొన్న నమూనాల ప్రకారమే ఉండాలని తేల్చిచెప్పింది. భూసేకరణపై రైతులు వ్యక్తం చేసిన అభ్యంతరాలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించింది. అభ్యంతరాలు పెండింగ్‌లో ఉండగా భూమి స్వాధీన ప్రక్రియ చేపట్టడాన్ని సవాలు చేస్తూ సిద్దిపేట జిల్లా మామిడ్యాలకు చెందిన శ్రీనివాస్ మరో ఆరుగురు రైతులు దాఖలు చేసిన పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిల ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ నిమిత్తం చేపట్టిన భూసేకరణపై ములుగు మండలంలోని మామిడ్యాల, బైలాంపూర్, తానేదార్‌పల్లి, తానేదార్‌పల్లి తండాల్లో రైతుల అభ్యంతరాలను పరిష్కరించకుండానే కలెక్టర్ ఇతర రైతులతో ఒప్పందాలు చేసుకుంటున్నారని చెప్పారు. పర్యావరణ అనుమతుల్లేకుండానే రిజర్వాయర్ పనులు మొదలుపెడుతున్నారన్నారు. కొత్త భూసేకరణ చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం అభ్యంతరాలను పరిష్కరించకుండా భూసేకరణను ఖరారు చేయరాదని, భూమిని స్వాధీనం చేసుకోరాదని తెలిపారు. అడ్వొకేట్ జనరల్ డి.ప్రకాశ్‌రెడ్డి దీంతో విభేదిస్తూ తెలంగాణ ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టానికి సవరణ తీసుకొచ్చి కొత్తగా 30-ఎ సెక్షన్‌ను చేర్చినట్లు చెప్పారు. దీని ప్రకారం అవార్డు విచారణ దశలోనూ అంగీకారంతో భూమిని సేకరించే అధికారం ప్రభుత్వానికి ఉందని చెప్పారు. ఏజీ వాదనతో ధర్మాసనం ఏకీభవించింది.

లాలూపై ఫిర్యాదు నమోదు చేయనున్న ఐటీ శాఖ

దిల్లీ: అక్రమాస్తుల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న లాలూ ప్రసాద్ కుటుంబ సభ్యులు కొందరిపై ఐటీ శాఖ త్వరలో క్రిమినల్ ప్రాసిక్యూషన్ ఫిర్యాదు నమోదు చేయనుంది. బినామీ ఆస్తుల చట్టం కింద ఆయన కుటుంబ సభ్యుల్లో ఆరుగురిపై ఫిర్యాదు దాఖలు చేయనున్నట్లు ఆదాయపు పన్ను శాఖాధికారి ఒకరు వెల్లడించారు. కేసులో భాగంగా లాలూ కుమార్తె మీసా భారతి, అల్లుడు శైలేశ్‌లతో పాటు మరికొందరిని మరోసారి విచారించేందుకు సమన్లు జారీ చేయనున్నట్లు తెలిపారు.

అరబ్‌షేక్‌తో బాలికకు పెళ్లి

- రూ.5 లక్షలు తీసుకొని పెళ్లిచేసేసిన మేనత్త
- పాతబస్తీ నుంచి ఒమన్ వెళ్లాక బాలికకు చిత్రహింసలు
- తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఆలస్యంగా వెలుగులోకి

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: హైదరాబాద్ పాతబస్తీలో అమ్మాయిలు అరబ్‌షేకుల దాష్టీకానికి బలవుతూనే ఉన్నారు. తాజాగా ఓ బాలికను వృద్ధుడైన అరబ్‌షేక్‌కు ఇచ్చి పెళ్లి చేసిన సంఘటన కలకలం రేపుతోంది. దేశం కాని దేశంలో తన కుమార్తె పడుతున్న కష్టాలు తెలుసుకున్న తల్లి ఫలక్‌నుమా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. నవాబ్‌సాబ్‌కుంటకు చెందిన సయ్యద్ అఫ్సర్, సయీదున్నీసా దంపతులకు రౌక్సర్(16), సయ్యద్ ఇమ్రాన్(13) పిల్లలున్నారు. తీగెలకుంటలో నివసించే అఫ్సర్ సోదరి గౌసియాబేగం, ఆమె భర్త సికిందర్, అతని స్నేహితుడు హాజీలు మాయమాటలతో పేదరికంలో మగ్గుతున్న అఫ్సర్ కుటుంబాన్ని మభ్యపెట్టారు. అరబ్‌షేక్‌తో రౌక్సర్‌కు పెళ్లి చేస్తే కష్టాలు తీరతాయని నమ్మించారు. బాలిక తల్లి ఇందుకు అంగీకరించకపోవడంతో గౌసియాబేగం, సికిందర్‌లు బాలికకు దుబాయ్ వీడియోలు చూపించి మభ్యపెట్టారు. బాలికను ఒప్పించి ఒమన్‌కు చెందిన అహ్మద్(65)తో పెళ్లి జరిపించారు. పెళ్లి సమయంలో బాలిక తల్లిదండ్రులకు అరబ్‌షేక్ ఆక్టివా వాహనం, కూలర్, సెల్‌ఫోన్ ఇచ్చాడు. పెళ్లయిన తర్వాత నాలుగు రోజుల పాటు అరబ్‌షేక్ బార్కాస్‌లోని ఓ లాడ్జీలో బాలికతో గడిపాడు. అనంతరం బాలికను సికిందర్, గౌసియాలు మస్కట్‌కు పంపారు. కొద్ది రోజుల తర్వాత బాలికకు తల్లిదండ్రులు ఫోన్ చేయగా.. అరబ్‌షేక్



షేక్‌తో బాలిక

తనను చిత్రహింసలకు గురిచేస్తున్నాడని, తనను ఇంటికి తీసుకెళ్లాలని ఏడుస్తూ చెప్పింది. తమ కూతురిని రప్పించాలని అఫ్సర్ దంపతులు సికిందర్, గౌసియాలను కోరగా వారు తిరస్కరించారు. దీంతో సయీదున్నీసా నేరుగా అరబ్‌షేక్‌కు ఫోన్ చేసి తన కుమార్తెను పంపించమని అడగ్గా.. తాను సికిందర్, గౌసియాలకు రూ.5 లక్షలు ఇచ్చానని, ఆ సొమ్ము తిరిగిస్తే బాలికను పంపిస్తానని చెప్పాడు. సికిందర్, గౌసియాలను నిలదీసిన బాలిక తల్లిదండ్రులు ఫలక్‌నుమా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సికిందర్, గౌసియాబేగం, ఒమన్ దేశస్థుడు అహ్మద్, హాజీలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను రప్పించండి

సుష్మాను కోరిన మేనక

దిల్లీ: అరబ్‌షేక్ చెర నుంచి హైదరాబాద్ బాలికను విడిపించి తల్లిదండ్రులకు వద్దకు చేర్చాలని కేంద్ర మంత్రి మేనకా గాంధీ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్‌ను కోరారు. బాలిక దీనస్థితిపై మీడియాలో కథనాలు రావడంతో మేనక ట్విట్టర్‌లో స్పందించారు. బాలికను హైదరాబాద్‌కు రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని సుష్మా స్వరాజ్‌ను కోరారు. బలవంతపు పెళ్లికి కారకులెవరో గుర్తించాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌కు సూచించారు.

సైన్యానికి యుద్ధ హెలికాప్టర్లు

- తొలిసారిగా అమ్ములపొదిలోకి చేరనున్న అస్త్రాలు
- అమెరికా నుంచి అధునాతన అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు నిర్ణయం
- రక్షణ కొనుగోళ్ల మండలి ఆమోదం

దిల్లీ

భారత సైన్యం మరింత రాటుదేలబోతోంది. తొలిసారిగా తన అమ్ములపొదిలో దాడి హెలికాప్టర్లను సమకూర్చుకోబోతోంది. సైన్యం కోసం అమెరికా నుంచి ఆరు అధునాతన అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన గురువారం ఇక్కడ సమావేశమైన రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) పచ్చజెండా ఊపింది. రూ.4,168 కోట్ల విలువైన ఈ ప్రతిపాదన దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. దీనికితోడు అధునాతన గ్రిగోరివిచ్ శ్రేణి స్టెల్త్ యుద్ధనౌకల రూ.490 కోట్లతో రెండు జోర్యా గ్యాస్ టర్బైన్ ఇంజిన్లను కొనుగోలు చేయడానికి కూడా డీఏసీ ఆమోదం తెలిపింది.

దాడి హెలికాప్టర్లపై అజమాయిషీ కోసం భారత సైన్యానికి, వైమానిక దళానికి మధ్య గత కొన్నేళ్లుగా పోరు నెలకొంది. నేల మీద కదిలే సైన్యానికి గగనతలం నుంచి రక్షణ కల్పించడమే వీటి ప్రధాన ఉద్దేశమని, అందువల్ల అవి తమ వద్దే ఉండాలని సైనిక అధినాయకత్వం వాదించింది. ఈ వాదనను వైమానిక దళం తోసిపుచ్చింది. సైన్యం వద్ద ప్రస్తుతం ఆయుధాల్లేని హెలికాప్టర్లు ఉన్నాయి. వీటిని రవాణా, నిఘా కోసం ఉపయోగిస్తున్నారు. దాడి హెలికాప్టర్లలో భారీగా క్షిపణులు, బాంబులు, భారీ తుపాకులు ఉంటాయి. ప్రస్తుతం వైమానిక దళం వద్ద రష్యా తయారీ ఎంఐ-25/35 దాడి హెలికాప్టర్లు ఉన్నాయి. పాక్షిక సామర్థ్యం కలిగిన ఈ లోహవిహంగాలు పాతబడిపోయాయి. ఈ నేపథ్యంలో మునుపటి యూపీఏ ప్రభుత్వం.. 22 అపాచీ హెలికాప్టర్లను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. అవి వైమానిక దళానికే చెందుతాయని స్పష్టంచేసింది. భవిష్యత్‌లో కొనుగోలు చేసే ఈ శ్రేణి లోహ విహంగాలు మొత్తం సైన్యానికే దక్కుతాయని తేల్చి చెప్పింది.

ఈ ఒప్పందంలో పేర్కొన్న నిబంధనలతోనే మరో 11 అపాచీల కోసం ఆర్డర్ ఇచ్చే హక్కు భారత్‌కు ఉంటుంది. ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ కోసం 11 హెలికాప్టర్లను కొనుగోలు చేయాలని సైన్యం కోరింది. దీనిపై గురువారం జైట్లీ నేతృత్వంలోని డీఏసీ చర్చించింది. వైమానిక దళం, రక్షణ శాఖలోని ఆర్థిక విభాగం అభ్యంతరాల నేపథ్యంలో ఆరు అపాచీలకే ఆమోదం తెలిపింది.

అపాచీ ప్రత్యేకతలు..

ప్రపంచంలోనే అత్యంత శక్తిమంత మైన దాడి హెలికాప్టర్లుగా వీటికి పేరుంది. బోయింగ్ సంస్థ ఉత్పత్తి చేస్తోంది.

అనేక రకాల విధులను నిర్వర్తించగలదు. శత్రు యుద్ధ ట్యాంకులను ధ్వంసం చేయడంలో దిట్ట.



ఈ హెలికాప్టర్.. గరిష్ఠంగా గంటకు 284 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలదు.

సెల్ఫ్-సీలింగ్ ఇంధన వ్యవస్థ ఉంది. ఫలితంగా ఇంధన లీకేజీ ఉండదు.

ఈ హెలికాప్టర్లను అమెరికా అనేక యుద్ధాల్లో విస్తృతంగా ఉపయోగించింది. గ్రీస్, జపాన్, ఇజ్రాయెల్, నెదర్లాండ్స్, సింగపూర్, యూఏఈ వంటి దేశాల అమ్ములపొదిలో ఇవి ఉన్నాయి.

పాతజిల్లాల వారీగానే నియామకాలు

- డీఎస్సీ అభ్యర్థుల డిమాండ్
- కార్యాలయాల ముట్టడి

ఈనాడు, హైదరాబాద్: డీఎస్సీ ప్రకటనను పాత జిల్లాలవారీగానే విడుదల చేయాలని లేదా కొత్త జిల్లాలన్నిటికీ సమన్యాయం చేస్తూ ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, పాఠశాల విద్యాశాఖ కమిషనర్, టీఎస్‌పీఎస్సీ కార్యాలయాలను గురువారం డీఎస్సీ అభ్యర్థులు ముట్టడించారు. అయిదేళ్లుగా 5 లక్షల మంది నిరుద్యోగులు డీఎస్సీ ప్రకటన కోసం నిరీక్షిస్తుండగా కొత్త జిల్లాల వారీగా నియామకాలు చేపడతామని ప్రభుత్వం ప్రకటిస్తూ నిరుద్యోగులకు అన్యాయం చేస్తోందని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం నేతలు రామ్మోహన్‌రెడ్డి, శ్రీనునాయక్, సరస్వతి తదితరులు ఆరోపించారు. రెండు రోజుల క్రితం అటవీశాఖ ఉద్యోగాలకు పాత జిల్లాల ప్రకారం ప్రకటన విడుదల చేశారని, డీఎస్సీలో కూడా అదే విధానాన్ని కొనసాగించాలని కోరారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు, టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ కళాశాలల్లో పనిచేసే ఒప్పంద అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ ప్రభుత్వ కళాశాలల ఒప్పంద అధ్యాపకుల సంఘం ముఖ్యమంత్రిని ఒక ప్రకటనలో కోరింది. అసెంబ్లీలో చట్టం చేసి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని లేకుంటే పంజాబ్, కేరళ, తమిళనాడు రాష్ట్రాల తరహాలో ఉద్యోగ భద్రత కల్పించాలని సంఘం నేతలు రమణారెడ్డి, సురేష్, సయ్యద్ జబె కోరారు. విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ వేతనాలు అందలేదని ఆవేదన వ్యక్తంచేశారు.

ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చిన భద్రత బలగాలు

శ్రీనగర్: కశ్మీర్‌లో ఉగ్రవాదుల వేట కొనసాగుతోంది. బందిపొరా జిల్లాలోని గురెజ్ సెక్టార్‌లో భద్రతా బలగాలు జరిపిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. బుధవారం సాయంత్రం కుందల్వాన్ అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులు సంచరిస్తున్నారన్న సమాచారంతో భద్రతా బలగాలు గాలింపు చేపట్టాయి. గురువారం వారి జాడను పసిగట్టి లొంగిపోవాలని హెచ్చరించినప్పటికీ కాల్పులకు తెగబడడంతో ప్రతిఘటించిన భద్రతా బలగాలు ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టాయి. బందిపొరా జిల్లాలోని వంగిపొరాలో తీవ్రవాదులకు సహకరిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.

పాకిస్థాన్ సైన్యం మరోసారి కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడిచింది. గురువారం నియంత్రణ రేఖ వెంబడి నౌషెరా సెక్టార్ వెంబడి పాక్ జరిపిన కాల్పుల్లో ఆర్మీ జవాను, ఆయన తండ్రి గాయపడ్డారని సైన్యం ఉన్నతాధికారి వెల్లడించారు.

చైనా మాధ్యమాలతో మనల్ని పోల్చుకోలేం

- మన ప్రసార సాధనాలు స్వతంత్రమైనవి
- కేంద్ర సహాయ మంత్రి కిరణ్ రిజిజు

లాలాపేట (హైదరాబాద్), న్యూస్‌టుడే: చైనా, భారత్‌ల ప్రసార మాధ్యమాలను సరిపోల్చలేమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. మన దేశంలో ప్రసార మాధ్యమాలు స్వతంత్రమైనవనీ, నిర్భీతిగా ఏదైనా రాసే స్వేచ్ఛ వాటికి ఉందనీ, కమ్యూనిస్టు దేశమైన చైనాలో మాత్రం మాధ్యమాలన్నీ ప్రభుత్వ విధానానికి అనుగుణంగానే ఉంటాయనీ వివరించారు. తార్నాకలోని ఐఐసీటీ ఆడిటోరియంలో గురువారం జాతీయ సేవా పథకం, నెహ్రూ యువకేంద్ర సంఘటన్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. డోక్లాం ప్రతిష్టంభనపై చైనా మాధ్యమాల్లో వెలువడుతున్న కథనాల గురించి ఒక విద్యార్థి వేసిన ప్రశ్నకు రిజిజు సమాధానమిచ్చారు. చైనాలో సాధారణంగా పత్రికలు ప్రభుత్వానికి అనుకూలంగానే రాస్తాయనీ, అక్కడకు, ఇక్కడకు పరిస్థితుల్లో చాలా తేడా ఉంటుందనీ చెప్పారు. డోక్లాం చిక్కుముడిపై మాట్లాడడానికి మంత్రి నిరాకరించారు. మహిళలపై సైబర్ నేరాలను అరికట్టడానికి సామాజిక మాధ్యమాలపై ఎందుకు నిషేధం విధించకూడదనే ప్రశ్నకు సమాధానమిస్తూ- వ్యక్తిగత స్వేచ్ఛకు ఆటంకం కలగకుండా సహేతుకమైన ఆంక్షలు విధించడం అవసరమేననేది తన అభిప్రాయమన్నారు. జాతీయ భద్రత ముఖ్యమా, గోప్యత ముఖ్యమా అనేది తేలాలని చెప్పారు. విధ్వంసానికి కారణమయ్యే ప్రతిదీ ఉగ్రవాదం కిందికే వస్తుందని అన్నారు. దేశ భద్రతకు ప్రధాని మోదీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడించారు. పొరుగు దేశాలతో సత్సంబంధాలకు కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి సమాధానాలు ఇచ్చారు.

14 పాఠశాలలకు జాతీయ స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని 14 సర్కారు బడులు జాతీయస్థాయి స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలకు ఎంపికయ్యాయి. దేశవ్యాప్తంగా 172 పాఠశాలలు ఎంపికవగా అందులో రాష్ట్రానికి చెందినవి 14 ఉండటం(8శాతం)పై అధికారులు ఆనందం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యం నిర్వహణ, పరిసరాల పరిశుభ్రం, తాగునీరు, విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేందుకు ఉన్న సౌకర్యం తదితర వాటిని పరిగణలోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వం ఈ పురస్కారాలకు ఎంపిక చేసింది. రాష్ట్రస్థాయిలో 40 పాఠశాలలు ఎంపికవగా వాటిని కేంద్ర మానవవనరుల శాఖకు ఇటీవలే సర్వశిక్ష అభియాన్ అధికారులు పంపారు. వాటిల్లో 14 బడులను కేంద్రం జాతీయస్థాయి పురస్కారాలకు ఎంపిక చేసింది. సెప్టెంబరు 1న దిల్లీలో ఈ పురస్కారాలను ప్రదానం చేస్తారు. దీని కింద ప్రశంసాపత్రంతోపాటు రూ.50 వేల నగదు బహుమతిని అందజేస్తారు.

పురస్కారాలకు ఎంపికైన పాఠశాలలివే...

జిల్లా	పాఠశాల
ఖమ్మం	ఆదర్శ పాఠశాల, కారేపల్లి
ఖమ్మం	ఎంపీపీఎస్, మల్లారం
ఖమ్మం	సాంఘిక సంక్షేమ పాఠశాల, సింగారెడ్డి పాలెం
ఖమ్మం	యూపీఎస్, గండగలపాడు
కరీంనగర్	ఆదర్శ పాఠశాల, గంగాధర
కరీంనగర్	యూపీఎస్, కొత్తపల్లి(పీఎన్)
జగిత్యాల	జడ్‌పీహెచ్‌ఎస్, అంబారిపేట
ఆదిలాబాద్	యూపీఎస్, బండల్‌నాగపూర్
మంచిర్యాల	సాంఘిక సంక్షేమ బాలుర, బెల్లంపల్లి
సిద్దిపేట	యూపీఎస్, ఇబ్రహీంపూర్
వికారాబాద్	ప్రాథమిక పాఠశాల, బుద్ధారం
మహబూబ్‌నగర్	ప్రాథమిక పాఠశాల, చౌటగడ్డ తండా
సూర్యాపేట	జడ్‌పీహెచ్‌ఎస్, అనంతారం
భూపాలపల్లి	జీపీహెచ్‌ఎస్, తిమ్మంపేట



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల

ఛాంపియన్



విరాట్‌లో ఆస్ట్రేలియన్ ఉన్నాడు

సిడ్నీ: భారత జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లి గొప్ప ఆటగాడని, అతడి శైలి ఆస్ట్రేలియన్ల శైలి లాగే ఉంటుందని ఆసీస్ మాజీ సారథి మైకేల్ క్లార్క్ అన్నాడు. "విరాట్‌లో ఆస్ట్రేలియన్ కనబడుతున్నాడు" అని క్లార్క్ అన్నాడు. కోహ్లి మైదానంలో అలా ఎలా దూకుడుగా ఉండగలుగుతున్నాడని అడిగినప్పుడు "విరాట్ గొప్ప ఆటగాడు, అతనెప్పుడు మ్యాచ్ గెలవాలనే కసితో ఆడతాడు, అదే అతన్ని దూకుడుగా ఉండేలా చేస్తుంది. అతను మ్యాచ్‌ను చేజార్చుకోవాలనుకోడు" అని అన్నాడు. సెప్టెంబర్‌లో ఆస్ట్రేలియా భారత్‌లో పర్యటించనుంది. ఈ పర్యటనలో ఆసీస్ భారత్‌తో ఐదు వన్డేలు, మూడు టీ20లు ఆడనుంది. సొంతగడ్డపై భారత్‌ను నిలువరించడం ఆసీస్‌కు కష్టమేనని ఆసీస్ మాజీ సారథి అభిప్రాయపడ్డాడు.



ధోని మొదలెట్టాడు

దంబుల్లా: శ్రీలంకతో వన్డే సిరీస్ కోసం ధోని ప్రాక్టీస్ మొదలెట్టాడు. దాదాపు నెల రోజులుగా క్రికెట్ దూరంగా ఉన్న అతను గురువారం దంబుల్లాలో ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నాడు. ఐచ్ఛిక ప్రాక్టీస్ సెషన్‌లో కేదార్ జాదవ్, మనీష్ పాండే, శార్దూల్ ఠాకూర్, యుజ్వేంద్ర చాహల్, బుమ్రాతో కలిసి ధోని మైదానంలో గడిపాడు. ప్రాక్టీస్‌లో భాగంగా బ్యాటింగ్ చేసిన ధోని భారత, స్థానిక లంక బౌలర్లను ఎదుర్కొన్నాడు. మొదట కొంచెం ఇబ్బంది పడ్డా.. తర్వాత పేసర్లు, స్పిన్నర్ల బౌలింగ్‌లో చూడముచ్చటైన షాట్లు కొట్టాడు.

భారత్-శ్రీలంక వన్డే సిరీస్ షెడ్యూల్

తొలి వన్డే: ఆగస్టు 20, దంబుల్లా
రెండో వన్డే: ఆగస్టు 24, పల్లెకెలె
మూడో వన్డే: ఆగస్టు 27, పల్లెకెలె
నాలుగో వన్డే: ఆగస్టు 31, కొలంబో
ఐదో వన్డే: సెప్టెంబర్ 3, కొలంబో
★ ఏకైక టీ20 : సెప్టెంబర్ 6, కొలంబో



విషీ, కాస్పరోవ్‌లకు ఎనిమిదో స్థానం

సెయింట్ లూయిస్: భారత గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ సెయింట్ లూయిస్ చెస్ టోర్నీలో ర్యాపిడ్ విభాగంలో ఎనిమిదో స్థానంలో నిలిచాడు. గురువారం క్వాంగ్ లిమ్ (వియత్నాం)తో డ్రా చేసుకున్న విషీ.. ఆ తర్వాత ఫాబియానొ కరువాన (అమెరికా)తో కూడా పాయింట్లు పంచుకున్నాడు. దీంతో ఒక విజయం, ఐదు డ్రాలతో విషీ ఏడు పాయింట్లతో ఎనిమిదో స్థానం సాధించాడు. చివరి రోజు ఒక గేమ్‌లో ఓడి, ఒకటి నెగ్గిన రష్యా దిగ్గజం గ్యారీ కాస్పరోవ్ కూడా ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. అరోనియన్ (ఆర్మేనియా) విజేతగా నిలిచాడు.

హారిక పరాజయం: అబుదాబి అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్ నాలుగో రౌండ్లో భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక పరాజయం చవిచూసింది. గురువారం జరిగిన గేమ్‌లో ఆమె.. డీక్ డానియల్ చేతిలో ఓటమి పాలైంది. మూడో రౌండ్లో హారిక.. కిరిల్ స్టుపాక్ (బెలారస్)తో 78 ఎత్తుల్లో డ్రా చేసుకుంది. దీంతో ఆమె 2.5 పాయింట్లతో ఉమ్మడిగా మూడో స్థానంలో కొనసాగుతోంది.



ఎన్నో వదులుకున్న నాన్నకు..

దిల్లీ: అది ఓ కార్ల షోరూం. ఓ ఎర్ర ఎస్‌యూవీని చూస్తూ ఓ పెద్దాయన ఎంత బాగుందో అనుకుంటున్నాడు. ఇంతలో షోరూం మేనేజర్ వచ్చి "ఈ కారు మీదే. మీరే దీని యజమాని" అని ఆయనతో అన్నాడు. అప్పుడు చూడాలి ఆయన ముఖాన్ని. ఆ ఆశ్చర్యం, సంతోషం, ఉద్వేగం ఎవరినైనా కదిలిస్తాయి. ఆయన టీమ్‌ఇండియా నయా సంచలన ఆల్‌రౌండర్ హార్దిక పాండ్య తండ్రి హిమాంశు పాండ్య. తన కొడుకే ఈ బహుమతితో ఆశ్చర్యపరిచాడని తెలిశాక.. అతడికి ఎలా కృతజ్ఞతలు తెలపాలో తెలియక మాటల కోసం తడుముకున్నాడు సీనియర్ పాండ్య. కెమెరాలో రికార్డయిన ఆ ఉద్వేగ క్షణాలను ట్విట్టర్లో ఉంచాడు హార్దిక్. "ఆయన ముఖం ఎంత వెలిగిపోయిందో. చాలా సంతోషంగా ఉంది. ఎంతో సంతోషానికి, ఎన్నో మన్ననలకు ఆయన అర్హుడు. ఆయన నా తండ్రి" అని ట్వీట్ చేశాడు. "నా కోసం, కృనాల్ (సోదరుడు) ఆయన ఎన్నో త్యాగాలు చేశాడు. మా కెరీర్ కోసం ఎంతో చేసిన ఆయనకు ఏమిచ్చినా తక్కువే. ఈ చిన్న బహుమతికి ఆయనలో కలిగిన భావోద్వేగం చూసి నాకు కన్నీళ్లొచ్చాయి. నేను అక్కడ లేకున్నా సోదరుడు వైభవ్ పాండ్య నాన్నను ఆశ్చర్యపోయేలా చేశాడు" అని హార్దిక్ చెప్పాడు.

బల్గేరియా టైటిల్ సాధించిన 16 ఏళ్ల కుర్రాడు

భళా లక్ష్యసేన్

దిల్లీ

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ తెరపై మరో భారత కుర్రాడు మెరిశాడు. 16 ఏళ్ల లక్ష్యసేన్ బల్గేరియా ఓపెన్ టైటిల్ సాధించి సత్తా చాటాడు. సీనియర్ విభాగంలో సేన్‌కు ఇది రెండో అంతర్జాతీయ టైటిల్. బల్గేరియా రాజధాని సోఫియాలో జరిగిన టోర్నీ పురుషుల సింగిల్స్ ఫైనల్లో లక్ష్యసేన్ 18-21, 21-12, 21-17తో రెండో సీడ్ దుర్కిన్ జాక్ (క్రొయేషియా)పై గెలిచి టైటిల్ సొంతం చేసుకున్నాడు. తొలి గేమ్ చేజారినా.. పట్టుదలగా పోరాడిన ఈ 16 ఏళ్ల కుర్రాడు.. వరుసగా రెండు గేమ్‌లు గెలిచి విజేతగా నిలిచాడు. 57 నిమిషాల్లో ముగిసిన ఈ పోరులో లక్ష్యసేన్ ఆఖరి గేమ్‌లో కాస్త ప్రతిఘటన ఎదుర్కొన్నా.. కీలక సమయంలో వరుస పాయింట్లు సాధించిన అతను గేమ్‌తో పాటు, మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. సీనియర్ విభాగంలో విదేశీ టోర్నీలో గెలవడం కూడా సేన్‌కు ఇదే తొలిసారి. నిరుడు అతడు ఇండియా ఇంటర్నేషనల్ సిరీస్‌ను సొంతం చేసుకున్నాడు.


కోచ్ సయాలితో లక్ష్యసేన్



దూసుకొస్తున్నాడు

15 ఏళ్లకే జాతీయ సీనియర్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో ప్రవేశం.. ప్రణయ్ లాంటి టాప్ ఆటగాడిపై విజయం.. 16 ఏళ్లకే సీనియర్ విభాగంలో రెండు అంతర్జాతీయ టైటిళ్లు.. ఇవి చాలు లక్ష్యసేన్ సత్తా ఏంటో చెప్పడానికి. జూనియర్ స్థాయి నుంచి సీనియర్ కేటగిరిలో ఆడడమే గొప్ప అనుకుంటే.. టైటిళ్లు సాధించిన సేన్.. భవిష్యత్ ఆశాకిరణంగా కనిపిస్తున్నాడు.

16 ఏళ్ల వయసులో సీనియర్ విభాగంలో రెండు అంతర్జాతీయ టైటిళ్లు గెలవడం లక్ష్యసేన్ ప్రతిభకు నిదర్శనం. ఇందుకోసం అతనెంతో శ్రమించాడు. మాజీ ప్రపంచ ఛాంపియన్ పీటర్ గేడ్ దగ్గర శిక్షణ తీసుకున్నాడు. ఫ్రాన్స్ ఆటగాళ్లతో పాటు పది రోజులు ప్రత్యేకంగా సాధన చేశాడు. కోచ్ విమల్‌కుమార్ ప్రోత్సాహం కూడా లక్ష్యసేన్‌ను ఛాంపియన్‌గా నిలబెట్టింది. బల్గేరియా టోర్నీలో అన్‌సీడెడ్‌గా దిగి అతను ఏకంగా టైటిలే కొట్టేశాడు. ఈ క్రమంలో టాప్ సీడ్ సామ్ పర్సన్స్ (ప్రపంచ 90వ ర్యాంకర్), రెండో సీడ్ దుర్కిన్ జాక్ (ప్రపంచ 102వ ర్యాంకర్) లాంటి తనకన్నా మెరుగైన ర్యాంకర్లను ఓడించాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 167వ స్థానంలో ఉన్న ఈ యువ ఆటగాడు.. ర్యాంకుల్లోనూ గణనీయంగా మెరుగుపడనున్నాడు. ప్రస్తుతం జూనియర్ ప్రపంచ నంబర్‌వన్‌గా ఉన్న లక్ష్యసేన్‌కు సీనియర్ విభాగంలో ఇది రెండో అంతర్జాతీయ టైటిల్. గతేడాది ఇండియా ఇంటర్నేషనల్ సిరీస్ టైటిల్‌ను అతను గెలిచాడు. అంతేకాదు ఈ ఫిబ్రవరిలో జాతీయ సీనియర్ ఛాంపియన్‌షిప్‌లో ఫైనల్‌కు కూడా దూసుకెళ్లాడు. కోచ్ విమల్ కుమార్‌తో పాటు దిగ్గజ షట్లర్ ప్రకాశ్ పదుకొనె.. ఈ యువ ఆటగాడిని తీర్చిదిద్దుతున్నాడు. 2016లో బ్యాంకాక్‌లో జరిగిన ఆసియా జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలవడం లక్ష్యసేన్ కెరీర్‌లో మలుపు. తాజా విజయంతో మరో మెట్టు ఎక్కిన అతను.. ఫిట్‌నెస్ కాపాడుకుని తర్వాత టోర్నీల్లో సత్తా చాటడం పెద్ద సవాల్.

"జూనియర్ అయి ఉండి సీనియర్ స్థాయిలో లక్ష్యసేన్ గెలవడం గొప్ప విషయం. ఫ్రాన్స్ జాతీయ జట్టుతో పాటు శిక్షణ కోసం భారత్ నుంచి ఐదుగురు షట్లర్లను పంపించాం. వారిలో లక్ష్యసేన్ ఒకడు. బల్గేరియా టోర్నీలో టాప్ సీడ్ సామ్‌పై గెలవడం అతని ప్రతిభకు నిదర్శనం. ఈ ఏడాది జాతీయ సీనియర్ ఛాంపియన్‌షిప్‌లో అతను ప్రణయ్‌ను కూడా ఓడించాడు"
– విమల్‌కుమార్

ప్రో కబడ్డీ లీగ్

మిరాజ్ మిలమిల

తలైవాస్‌పై దబాంగ్ విజయం


తలైవాస్ ఆటగాడిని పట్టేసిన దబాంగ్ జట్టు

అహ్మదాబాద్

ప్రో కబడ్డీలో లీగ్ గురువారం రసవత్తరంగా సాగిన పోరులో దబాంగ్ దిల్లీ జట్టు 30-29తో తమిళ్ తలైవాస్‌పై విజయం సాధించింది. ఇరాన్ ద్వయం మిరాజ్ షేక్, అబోల్‌ఫజల్‌లు 20 పాయింట్లతో దిల్లీ దబాంగ్ విజయంలో కీలక పాత్ర పోషించారు. అజయ్ ఠాకూర్ 14 పాయింట్లు సాధించినా తలైవాస్‌ను గెలిపించలేకపోయాడు. తొలి రెండు నిమిషాల్లో రైడ్లతో రెండు జట్లు పాయింట్ల ఖాతా తెరిచాయి. రైడర్లు తేలిగ్గా పాయింట్లు రాబట్టడంతో ఐదు నిమిషాలయ్యే సరికి దిల్లీ 5-2తో ఆధిక్యంలో నిలిచింది. ఐతే డిఫెన్స్ లోపాలు సరిదిద్దుకున్న తలైవాస్ 6-5తో ఆధిక్యం సాధించింది. నువ్వా నేనా అన్నట్లు పోటీపడ్డ జట్లు ఓ దశలో 12-12 సమంగా ఉన్నాయి. 22వ నిమిషంలో సూపర్ టాకిల్‌తో తలైవాస్ 14-12తో నిలిచింది. అజయ్ ఠాకూర్ తన ఐదో రైడ్ పాయింట్‌తో ఆ జట్టు ఆధిక్యాన్ని 15-12కు పెంచాడు. 35వ నిమిషంలో అతడే రెండు పాయింట్లు తేవడంతో తలైవాస్ 27-23తో గెలుపు దిశగా సాగింది. ఐతే 37వ నిమిషంలో మిరాజ్ షేక్ రెండు పాయింట్లతో ఆధిక్యాన్ని.. దిల్లీ 25-27కు తగ్గించింది. అది ఎవరైనా గెలిచే స్థితి. పోరాడిన దిల్లీ.. అంతరాన్ని చివరి నిమిషంలో ఒకటికి తగ్గించింది. మ్యాచ్ ముగియడానికి 40 సెకన్లు కూడా లేని దశలో మిరాజ్ షేక్ అద్భుతమైన సూపర్ రైడ్‌తో దబాంగ్ దిల్లీని 38-28తో ఆధిక్యంలో నిలిపాడు. తర్వాత అజయ్ ఠాకూర్ ఓ రైడ్ పాయింట్ తెచ్చినా.. అది తలైవాస్‌కు సరిపోలేదు. గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్స్, బెంగాల్ వారియర్స్ మధ్య ఉత్కంఠభరితంగా సాగిన మరో మ్యాచ్ 26-26తో టైగా ముగిసింది.

ప్రో కబడ్డీలో ఈనాడు

యూపీ యోధ × యూ ముంబా రాత్రి 8 గంటలకు
బెంగళూరు బుల్స్ × జైపూర్ పింక్ పాంథర్స్ రాత్రి 9 గంటలకు వేదిక: లఖ్‌నవూ **ప్రసారం: స్టార్ స్పోర్ట్స్ 2**

భారత్ కొస మెరుపు

- ఆస్ట్రియాపై 4-3తో విజయం
- ముగిసిన ఐరోపా పర్యటన



అమ్‌స్టెల్వీన్ (నెదర్లాండ్స్): భారత హాకీ జట్టు ఐరోపా పర్యటనను సానుకూలంగా ముగించింది. తన ఆఖరి మ్యాచ్‌లో 4-3 గోల్స్‌తో ఆస్ట్రియాపై విజయం సాధించింది. రమన్‌దీప్ సింగ్ (25వ, 32వ నిమిషాల్లో), చింగ్లేసన సింగ్ (37వ, 60వ)లు చెరో రెండు గోల్స్‌తో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించారు. ఆస్ట్రియా తరఫున ఒలివర్ బైండర్ (14వ), మైకెల్ కార్ఫర్ (53వ), పాట్రిక్ స్కిమిట్ (55వ) తలో గోల్ సాధించారు.

ప్రపంచ నంబర్-4 నెదర్లాండ్స్‌పై వరుసగా రెండు విజయాలు సాధించిన భారత్ ఈ మ్యాచ్‌లోనూ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. చాలా వరకు బంతిని తన నియంత్రణలోనే ఉంచుకుంది. ఐతే ఆస్ట్రియా డిఫెన్స్‌లోకి చొచ్చుకెళ్లడం అంత తేలిక కాలేదు. నిజానికి మొదట ఆధిక్యంలోకి దూసుకెళ్లింది ఆస్ట్రియానే. 14వ నిమిషంలో బైండర్ ఆ జట్టుకు ఆధిక్యాన్నిచ్చాడు. ఐతే 25వ రమన్‌దీప్.. పెనాల్టీ కార్నర్‌ను సద్వినియోగం చేయడంతో భారత్.. స్కోరు సమం చేసింది. విరామం తర్వాత భారత్ బలంగా పుంజుకుంది. 32వ నిమిషంలో రమన్‌దీప్ ఫీల్డ్ గోల్‌తో 2-1 ఆధిక్యంలో నిలిచింది. మధ్యలో మరో పెనాల్టీ కార్నర్ వృథా అయినా 37వ నిమిషంలో చింగ్లేసన పెనాల్టీ కార్నర్ గోల్‌తో భారత్ తన ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. చివరి 15 నిమిషాల్లో 3-1తో భారత్ చాలా మెరుగైన స్థితిలో నిలిచింది. ఐతే పట్టుదలగా ఆడిన ఆస్ట్రియా, 53వ నిమిషంలో కార్ఫర్ గోల్‌తో మ్యాచ్‌ను ఆసక్తికరంగా మార్చింది. ఒక నిమిషం ముందు భారత్ ఓ పెనాల్టీ కార్నర్‌ను వృథా చేసింది. ఆఖర్లో ఉత్కంఠ పెరిగింది. 55వ నిమిషంలో స్కిమిట్ గోల్‌తో స్కోరును ఆస్ట్రియా 3-3తో సమం చేసింది. ఆఖరి నిమిషంలో కూడా అదే స్కోరు ఉండడంతో మ్యాచ్ డ్రాగా ముగియడం ఖాయమనిపించింది. కానీ మరో పది సెకన్లలో ఆట ముగుస్తుందనగా చింగ్లేసన సంచలనాత్మక గోల్‌తో భారత్ విజేతగా నిలిచింది. భారత జట్టు శుక్రవారం స్వదేశం బయల్దేరుతుంది.

రూట్‌కు 13.. అలెస్టర్‌కు 31

- శతకాలతో చెలరేగిన ఇంగ్లాండ్ స్టార్లు
- వెస్టిండీస్‌తో డేనైట్ టెస్టు


రూట్ (118 బ్యాటింగ్)

బర్మింగ్‌హామ్: వెస్టిండీస్‌తో తొలి డేనైట్ టెస్టు మ్యాచ్‌లో ఆతిథ్య ఇంగ్లాండ్ శుభారంభం చేసింది. కెప్టెన్ జో రూట్ (118 బ్యాటింగ్; 156 బంతుల్లో 21×4), అలెస్టర్ కుక్ (100 బ్యాటింగ్; 186 బంతుల్లో 18×4) అజేయ శతకాలు బాదడంతో గురువారం తొలి రోజే భారీ స్కోరుకు బాటలు వేసుకుంది. కడపటి వార్తలు అందే సమయానికి ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 61 ఓవర్లలో 2 వికెట్లకు 246 పరుగులు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్‌కు ఆరంభంలో ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ స్టోన్‌మన్ (8), వెస్ట్‌లె (8) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. 39 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన ఇంగ్లాండ్‌ను కుక్, రూట్ ఆదుకున్నారు. లంచ్ విరామానికి ఇంగ్లాండ్ 108/2తో నిలిచింది. విరామం తర్వాత వీళ్లిద్దరు విండీస్ బౌలర్లను మరింత సులభంగా ఎదుర్కొన్నారు. ఈ క్రమంలోనే రూట్ 139 బంతుల్లో టెస్టుల్లో 13వ సెంచరీని పూర్తి చేసుకోగా, టీ విరామం తర్వాత కుక్ కూడా సెంచరీ మార్కు అందుకున్నాడు. టెస్టుల్లో అతనికిది 31వ శతకం కావడం విశేషం. రూట్‌కు 50 అంతకంటే ఎక్కువ స్కోరు చేయడం వరుసగా 11వసారి.

నాదల్ శుభారంభం



సిన్సినాటి: ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ సొంతం చేసుకోనున్న రఫెల్ నాదల్ సిన్సినాటి మాస్టర్స్ టోర్నీలో శుభారంభం చేశాడు. రెండో రౌండ్లో నాదల్ (స్పెయిన్) 6-3, 6-4తో రిచర్డ్ గాస్కెట్ (ఫ్రాన్స్)ను ఓడించాడు. తొలి రౌండ్లో అతడికి బై లభించింది. వచ్చే వారం ఆండీ ముర్రేను అధిగమించి ర్యాంకింగ్స్‌లో నాదల్ అగ్రస్థానానికి చేరుకోవడం లాంఛనమే. భారత ఆటగాడు రామ్‌కుమార్ రామనాథన్ పోరాటం రెండో రౌండ్లో ముగిసింది. రామ్‌కుమార్ 4-6, 6-2, 4-6తో జేరడ్ డొనాల్డ్‌సన్ (అమెరికా) చేతిలో ఓడిపోయాడు.

సానియా ముందంజ: సిన్సినాటి మాస్టర్స్ టోర్నీ డబుల్స్‌లో సానియా మీర్జా జోడీ క్వార్టర్‌ఫైనల్ చేరుకుంది. ప్రిక్వార్టర్స్‌లో సానియా, పెంగ్ షువాయ్ (చైనా) జోడీ 7-5, 6-4తో జులియా జార్జెస్ (జర్మనీ), ఓల్గా సావ్‌చుక్ (ఉక్రెయిన్)లను ఓడించింది. పురుషుల డబుల్స్‌లో లియాండర్ పేస్, జ్వరెవ్ జోడీ తొలి రౌండ్లోనే నిష్క్రమించింది.



గర్వపడేందుకు 37 కారణాలు

మరుగుజ్జు జట్టుకు సచిన్ అభినందన

ముంబయి: ప్రపంచ మరుగుజ్జు క్రీడల్లో విశేషంగా రాణించిన భారత ఆటగాళ్లను సచిన్ అభినందించాడు. "ప్రపంచ మరుగుజ్జు క్రీడల్లో మన ఆటగాళ్ల అద్భుత ప్రదర్శన చూశాక గర్వపడడానికి 37 కారణాలున్నాయి. వాళ్లు టోర్నీలో 15 బంగారు, 10 రజత, 12 కాంస్య (మొత్తం 37) పతకాలు సాధించారు. వారి అసామాన్యమైన ప్రతిభకు ఇది తార్కాణం" అని సచిన్ ట్వీట్ చేశాడు.

భారత్ తొలి ప్రత్యర్థి ఆస్ట్రేలియా

దుబాయ్: వచ్చే ఏడాది జనవరి 13 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరిగే అండర్-19 ప్రపంచకప్ షెడ్యూలును ఐసీసీ గురువారం ప్రకటించింది. ఆస్ట్రేలియాతో పోరుతో భారత్ టోర్నీలో తన వేటను ఆరంభించనుంది. భారత్.. ఆస్ట్రేలియా, జింబాబ్వే, పపువా న్యూగినియాలతో పాటు గ్రూప్-బిలో ఉంది. టోర్నీ తొలి రోజు గ్రూప్-ఏలో డిఫెండింగ్ ఛాంపియన్ వెస్టిండీస్ ఆతిథ్య న్యూజిలాండ్‌ను ఢీకొంటుంది. మొత్తం 16 జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. ప్రతి గ్రూప్ నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్ లీగ్‌కు అర్హత సాధిస్తాయి. క్వార్టర్‌ఫైనల్స్, సెమీఫైనల్స్, ఫైనల్‌తో పాటు మొత్తం 20 మ్యాచ్‌లను ప్రత్యక్షం ప్రసారం చేస్తారు.



మోసగాణ్ని కాను

లండన్: తన గాయంపై వస్తున్న అనుమానాలకు ఉసేన్ బోల్ట్ సమాధానమిచ్చాడు. తన చివరి 4×100 రిలే రేస్‌ను ఈ దిగ్గజ అథ్లెట్ గాయం కారణంగా పూర్తి చేయలేకపోయిన సంగతి తెలిసిందే. అయితే కొందరు బోల్ట్ గాయంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ వ్యాఖ్యలు చేసారు. ఇవి బోల్ట్‌కు బాధ కలిగించాయి. అందుకే తన గాయానికి సంబంధించిన వైద్య నివేదికలను సామాజిక మాధ్యమాల్లో ఉంచాడు. "గాయం వల్ల రేసు పూర్తి చేయలేకపోయాను. కోలుకోవడానికి మూడు నెలల సమయం పడుతుంది. సాధారణంగా నా వైద్య నివేదికలను వెల్లడించను. కానీ గాయం నిజం కాదంటూ వస్తున్న వదంతులకు ముగింపు పలకాలనే ఇలా చేస్తున్నా. నా అభిమానులను నేనెప్పుడూ మోసం చేయాలని అనుకోలేదు. ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో చివరి సారిగా నా అభిమానుల కోసం పరిగెత్తాను. మీ మద్దతుకు ధన్యవాదాలు. గాయం మానేంత వరకూ విశ్రాంతి తీసుకుని తర్వాతి జీవితానికి స్వాగతం పలుకుతాను" అని బోల్ట్ ట్వీట్ చేశాడు.

రంగుల ఎమ్ఆర్ఐ మరింత ప్రభావవంతం


వాషింగ్టన్: వ్యాధులను గుర్తించడంలో మాగ్నటిక్ రిసోనెన్స్ ఇమేజింగ్ (ఎమ్ఆర్ఐ)ను మరింత ప్రభావవంతంగా మార్చే కొత్త పద్ధతిని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఎమ్ఆర్ఐ చిత్రాల్లో శరీరం లోపలి భాగాలు స్పష్టంగా కనిపించేందుకు రోగి నరాల్లోకి ఓ కాంట్రాస్ట్ ఏజెంట్‌ను ఎక్కిస్తారు. అయితే ఒకేసారి రెండు కాంట్రాస్ట్ ఏజెంట్‌లను ఎక్కించి.. వివరణాత్మకమైన రంగుల చిత్రాలను రూపొందించే కొత్త విధానాన్ని అమెరికాలోని కేస్ వెస్టర్న్ విశ్వవిద్యాలయ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఫలితంగా అవయవాలకు సంబంధించిన భిన్నమైన లక్షణాలు గుర్తించేందుకు అవకాశం ఏర్పడుతుంది. గాడోలినియం, మాంగనీస్‌లను ఇలా కాంట్రాస్ట్ ఏజెంట్లుగా ఉపయోగించుకోవచ్చని పరిశోధకులు పేర్కొన్నారు. వ్యాధికి గురైన కణజాలాన్ని, ఆరోగ్యంగా ఉన్న కణజాలాన్ని గుర్తించేందుకు విడివిడిగా ఇవి పనిచేస్తాయని పరిశోధకులు తెలిపారు.

భూమిపై తొలి జంతువుల గుట్టువీడింది..




మెల్‌బోర్న్: భూమిపై తొలి జంతువులకు సంబంధించిన గుట్టును శాస్త్రవేత్తలు విప్పారు. మధ్య ఆస్ట్రేలియా ప్రాంతంలోని ప్రాచీన అవక్షేప శిలల్ని విశ్లేషించడం ద్వారా ఆస్ట్రేలియా జాతీయ విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) పరిశోధకులు ఈ అంశాన్ని గుర్తించారు. 65 కోట్ల సంవత్సరాల క్రితం ఆల్గే ఉత్థానం నుంచి జంతువుల పరిణామం ప్రారంభమైనట్లు గుర్తించారు. సదరు శిలల్ని పొడిగా మార్చి అందులో నుంచి ప్రాచీన జీవులకు సంబంధించిన అణువుల్ని సేకరించినట్లు పరిశోధకులు జోచెన్ బ్రాక్స్ పేర్కొన్నారు. ఆల్గే పుట్టుక భూమి చరిత్రలో ఆవరణపరమైన విప్లవానికి దారితీసిందన్నారు. ఘనీభవించిన భారీ హిమనీ నదాలు, మంచు ఉష్ణోగ్రతలతో కరగడంతో నదులు పెద్దమొత్తంలో పోషకాల్ని సముద్రంలో కలిపేయడంతో అవి ఆల్గే వ్యాప్తికి తోడ్పడ్డాయనీ, ఇదంతా సంక్లిష్ట ఆవరణ వ్యవస్థ పరిణామానికి అవసరమైన ఆహార అవసరాల్ని తీర్చిందనీ, మానవులు సహా పెద్దస్థాయి జంతువులకూ ఉపయుక్తంగా మారిందని వివరించారు.

వాసనల మధ్య భేదాన్ని గుర్తించలేకపోవడం అల్జీమర్స్‌కు సూచిక



టొరంటో: వివిధ రకాల వాసనల మధ్య భేదాన్ని గుర్తించలేకపోతే అల్జీమర్స్ మొదలైనట్లేనని ఓ అధ్యయనం తెలిపింది. ఉదాహరణకు నిమ్మకాయలు, పెట్రోలు వంటి వాటి నుంచి వచ్చే వాసనల మధ్య భేదాన్ని గుర్తించలేకపోవడం మతిమరుపు సూచిక అని తెలిపింది. అల్జీమర్స్ లక్షణాలు కనిపించడానికి 20 ఏళ్ల ముందే మెదడు ఈ వ్యాధికి గురవుతుంది. సాధారణ వాసనలు గుర్తించే పరీక్ష చేయడం వల్ల వ్యాధిలక్షణాలు బయటపడటానికి ముందే అది ఏస్థాయిలో ఉందో గుర్తించవచ్చని కెనడాలోని మెక్‌గిల్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్త జాన్ బ్రిట్నర్ తెలిపారు. వ్యాధి లక్షణాల ప్రారంభాన్ని ఓ ఐదేళ్లు ఆపగలిగితే ఆ లక్షణాల వ్యాప్తిని, తీవ్రతను యాభైశాతం వరకు తగ్గించవచ్చని ఆయన తెలిపారు. సగటున 63 ఏళ్ల వయసున్న 300 మంది వ్యక్తులపై వివిధ పదార్థాల వాసనలు గుర్తించే పరీక్షలు చేయగా కొందరు గుర్తించలేకపోయారు. వాసనలు గుర్తించలేని వారిలో అల్జీమర్స్ రావడానికి సూచనలున్నాయని గుర్తించడం ఇదే మొదటిసారని విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ విద్యార్థి మారీ ఏలిస్ లాఫిల్లే తెలిపారు.

నొప్పులకు శక్తిమంతమైన నివారిణి



హోస్టన్: నొప్పుల నుంచి ఉపశమనం పొందటానికి ఇప్పటివరకు ఉపయోగిస్తున్న మందుల కంటే శక్తిమంతమైన నొప్పి నివారిణిని అమెరికా శాస్త్రవేత్తలు కనుగొన్నారు. యుకెహెచ్-1114 గా పిలుస్తున్న నొప్పి నివారిణిని గాయపడ్డ ఎలుకలపై ప్రయోగించగా, ఇది నాడీసంబంధిత నొప్పుల నివారణకు సాధారణంగా ఉపయోగించే గాబాపెంటిన్ వలె ప్రభావవంతంగా పనిచేసిందని వారు తెలిపారు. అయితే ఈ సింథటిక్ సమ్మేళనం తక్కువ మోతాదులోనూ, ఎక్కువ కాలం పాటు పనిచేస్తుందని పరిశోధకులు అంటున్నారు. గాబాపెంటిన్ రెండు, మూడు గంటలపాటు పనిచేస్తే ఇది కొన్నిరోజుల పాటు కేవలం ఆరోవంతు పరిమాణంలోనే పనిచేస్తుందని టెక్సాస్ విశ్వవిద్యాలయ సహ అధ్యాపకుడు థియోడోర్ ప్రైస్ తెలిపారు. నాడీ సంబంధిత నొప్పులు లేదా దీర్ఘకాలిక నొప్పులు కేంద్రనాడీవ్యవస్థలోని నాడులు దెబ్బతినడం మూలంగా సంభవిస్తాయి. ఈ నొప్పి నివారిణి కేంద్రీయ నాడీవ్యవస్థ కణాలంతటా వ్యాపించి ఉన్న సిగ్మా 2 గ్రాహకాలను పట్టుకొని ఉంటుంది. ఈ గ్రాహకాన్ని శాస్త్రవేత్తలు 25సంవత్సరాల క్రితమే కనుగొన్నప్పటికీ అది ఎలా పనిచేస్తుందో ఇప్పటివరకు తెలుసుకోలేకపోయారు.

చైనా నుంచి మరిన్ని చొరబాట్లు?

- భారత్‌పై ఒత్తిడి పెంచేందుకు డ్రాగన్ వ్యూహం
- తిప్పికొట్టేందుకు భారత సైన్యం సిద్ధం
- వాస్తవాధీన రేఖ వెంబడి అప్రమత్తత

దిల్లీ

వాస్తవాధీన రేఖ వెంబడి దుర్బల ప్రదేశాల్లో చైనా సైన్యం కొద్దిమేర భారత భూభాగాల్లోకి చొరబడే అవకాశం ఉందని మన బలగాలు అంచనావేస్తున్నాయి. అలాంటి యత్నాలను తిప్పికొట్టేందుకు సిద్ధమవుతున్నాయి. పాంగాంగ్ సరస్సు వద్ద ఇరు దేశాల సైనికులు పరస్పరం రాళ్లు రువ్వుకున్న ఘటన నేపథ్యంలో భారత సైన్యం ఈ మేరకు వ్యూహ రచన చేస్తోంది. బుధవారం పాంగాంగ్ వద్ద రెండు దేశాల బలగాలు పరస్పరం రాళ్లు రువ్వుకోవడంతోపాటు ఇనుప కడ్డీలను ఉపయోగించడంతో ఇరు పక్షాలకు గాయాలైన సంగతి తెలిసిందే. సిక్కిం సెక్టార్‌లోని డోక్లామ్ వద్ద తలెత్తిన సైనిక ప్రతిష్టంభన నేపథ్యంలో రెండు దేశాల నడుమ నెలకొన్న ఉద్రిక్త పరిస్థితికి ఇది దర్పణం పడుతోంది. పాంగాంగ్ సరస్సు.. 13,900 అడుగుల ఎత్తులో ఉంది. టిబెట్ నుంచి భారత్ వరకూ 134 కిలోమీటర్ల పొడవైన పాంగాంగ్ సరస్సులో మూడింట రెండొంతులు చైనా అధీనంలో ఉంది. ఈ సరస్సు ఉత్తర ఒడ్డున ఉన్న 'ఫింగర్-5 నుంచి ఫింగర్-8' మధ్య ప్రాంతంపై ఇరు దేశాల మధ్య వివాదం ఉంది. అక్కడ సాధారణంగా ఇరు దేశాల సైనికులు పరస్పరం తారసపడినప్పుడు.. స్వల్పస్థాయి తోపులాట తర్వాత పరస్పరం బ్యానర్లు ప్రదర్శించుకొని వెనక్కి మళ్లుతారు. ఈసారి మాత్రం రాళ్లు రువ్వుకొని, పరస్పరం గాయపర్చుకున్నారు.

అయినా అప్రమత్తత: పాంగాంగ్ ఘటన తర్వాత రెండు దేశాల బలగాలు బుధవారం సరిహద్దు సిబ్బంది భేటీ (బీపీఎం)ని నిర్వహించాయి. ఉద్రిక్తతలు చల్లార్చేందుకు ప్రయత్నించాలని నిర్ణయించాయి. అయినా భారత సైన్యం అప్రమత్తంగా ఉంది. ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న సిక్కిం సెక్టార్‌లో ఎలాంటి దుస్సాహసానికి చైనా దిగకపోవచ్చని ఉన్నతాధికారులు విశ్లేషిస్తున్నారు. ఆ ప్రాంతంలో భారత బలగాలే మెరుగైన స్థితిలో ఉన్నాయి. అవసరమైతే.. చైనాకు సంబంధించిన సన్నటి చుంబీ లోయను ఆక్రమించేందుకు మన సేనకు అవకాశం ఉంది.

ఒత్తిడి పెంచే వ్యూహం: రెండు దేశాల నడుమ లద్దాఖ్ నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకూ వ్యాపించి ఉన్న 4057 కిలోమీటర్ల వాస్తవాధీన రేఖ వెంబడి స్వల్పస్థాయి చొరబాట్లను పెంచడం ద్వారా భారత్‌పై ఒత్తిడి పెంచాలన్నది చైనా వ్యూహంగా కనిపిస్తోంది. తద్వారా శీతాకాలంలోపే డోక్లామ్ నుంచి భారత బలగాలు ఏకపక్షంగా వైదొలిగేలా చూడాలని భావిస్తోంది. తూర్పు లద్దాఖ్‌లో కానీ తూర్పు అరుణాచల్ ప్రదేశ్‌లో కానీ మధ్య సెక్టార్ (హిమాచల్-ఉత్తరాఖండ్)లోని లిపులేఖ్ పాస్, బారాహోటిలో కానీ చైనా బలగాలు చొరబాటుకు యత్నించవచ్చని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

పూర్తి యుద్ధం ఉండకపోవచ్చు..: డోక్లామ్ ప్రతిష్టంభన ఏర్పడ్డాక.. దక్షిణ టిబెట్‌లోకి భారీగా బలగాలు, ట్యాంకులు, శతఘ్నులను చైనా తరలించింది. అయినా పూర్తిస్థాయి యుద్ధానికి ఈ కమ్యూనిస్టు రాజ్యం ప్రయత్నించకపోవచ్చని భారత రక్షణ శాఖ అంచనావేస్తోంది. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల్లోనూ రెండు దేశాల నడుమ కమ్యూనికేషన్ మార్గాలు సజీవంగా ఉన్నాయి.

హై స్పీడ్ పడవలతో డ్రాగన్‌కు కళ్లెం: కొంత కాలం కిందట వరకూ పాంగాంగ్ సరస్సు వద్ద భారత బలగాల పరిస్థితి బలహీనంగా ఉండేది. పాత గస్తీ పడవలతోనే విధులు నిర్వర్తించాల్సి వచ్చేది. చైనా సైనికుల వద్ద వేగవంతమైన అధునాతన పడవలు ఉన్నాయి. దీంతో పలు సందర్భాల్లో వారు.. మన పడవలను ఢీ కొట్టించి, వాటిని నిర్వీర్యం చేసేవారు. అయితే భారత సైన్యం ఇటీవల 17 అధునాతన హై స్పీడ్ ఇంటర్‌సెప్టర్ పడవలను రంగంలోకి దించింది. దీంతో మన బలగాల గస్తీ సామర్థ్యం మెరుగుపడింది.

ఆ 77 ఐబీ దస్త్రాలనూ బహిరంగ పరచాలి

నేతాజీ కుటుంబసభ్యుల డిమాండ్

కోల్‌కతా: భారత స్వాతంత్ర్య సమరానికి సంబంధించిన చరిత్రలో వక్రీకరణలున్నాయనీ...నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాత్రకు సంబంధించిన వాస్తవాలను సరిగ్గా పేర్కొనలేదనీ...ఈ మేరకు దిద్దుబాట్లను చేయాలంటూ ఆయన కుటుంబసభ్యులు కోరుతున్నారు. నేతాజీ అదృశ్యానికి సంబంధించిన కీలకమైన 77 ఐబీ దస్త్రాలను వెల్లడించాలని వారు డిమాండ్ చేశారు. అంతేకాదు, జస్టిస్.ముఖర్జీ కమిషన్ నివేదికను తిరిగి భారత పార్లమెంటులో ప్రవేశపెట్టాలని కోరారు. 1945 ఆగస్టు 18వ తేదీ తర్వాత నేతాజీకి ఏం జరిగిందనే విషయాన్ని ప్రజలకు తెలియాలని వారు ఉద్ఘాటించారు. స్వాతంత్ర్య పోరాటంలో నేతాజీ, ఆయన సారథ్యంలోని ఇండియన్ నేషనల్ ఆర్మీ(ఐఎన్ఏ) పాత్రను సరిగ్గా భారత చరిత్రలో ప్రతిబింబించేలా చూడాలని ఆయన సమీప బంధువు చంద్రకుమార్ బోస్ కోరారు. ఆయనతో పాటూ నేతాజీ కుటుంబసభ్యులైన అభిజిత్ రాయ్, చిత్రాఘోష్ తదితరులు బుధవారం నాడిక్కడ విలేకరులతో మాట్లాడారు. నేతాజీ అదృశ్యం వెనక ఉన్న మిస్టరీ ఏమిటో వెలుగులోకి తెచ్చే చర్యలు అవసరమని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం వెల్లడించిన కీలక దస్త్రాలన్నిటినీ మరింత క్షుణ్ణంగా పరిశీలించి, సమగ్ర నివేదికను తయారుచేసేందుకు ఉన్నతస్థాయిలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని వారు అభ్యర్థించారు. ఈ నివేదికను పార్లమెంటు ఉభయ సభలకూ సమర్పించాలని కోరారు. 1945లో అదృశ్యమైన నేతాజీ అదే ఏడాది ఆగస్టు 18న తైవాన్‌లోని తైహోకూలో జరిగిన విమాన ప్రమాదంలో మరణించారన్న వాదనలను ఆయన కుటుంబసభ్యులు కొందరు తీవ్రంగా ఖండిస్తున్నారు.

దళిత దంపతులపై దాడి

సాగర్(మధ్యప్రదేశ్): మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లా రేన్వ్జా గ్రామంలో అగ్రకుల కుటుంబానికి చెందిన వ్యక్తులు దళిత మహిళ ముక్కు కోసి, ఆమె భర్తను చితకబాదారు. తమ ఇంటి వద్ద పనిచేయడానికి రావడం లేదని నరేంద్ర సింగ్(32), అతని తండ్రి బాధిత మహిళ భర్తపై తొలుత దాడి చేశారు. భర్తను ఆస్పత్రికి తీసుకెళ్తున్న ఆ మహిళపై కూడా వారు దాడి చేసి ముక్కు తెగ్గోశారు. నిందితులపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

కొడైకెనాల్‌లో ఇరోమ్ షర్మిళ వివాహం



కొడైకెనాల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇరోమ్ షర్మిళ దంపతులు

చెన్నై: మణిపూర్ ఉక్కు మహిళ ఇరోమ్ షర్మిళ తమిళనాడులోని కొడైకెనాల్‌లో గురువారం వివాహం చేసుకున్నారు. బ్రిటీష్ పౌరుడు డెస్మండ్ కౌటిన్‌తో స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆమె పెళ్లి నిరాడంబరంగా జరిగింది. ప్రత్యేక వివాహ చట్టం 1954 ప్రకారం జరిగిన ఈ వివాహానికి ఇరువురి తరఫున బంధువులు ఎవరూ హాజరుకాలేదు. షర్మిల మొబైల్ ఫోనులోనే తన తల్లిదండ్రులను సంప్రదించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ప్రశాంతత కోసం తాను అనేక ప్రాంతాలు వెతికానని.. కొడైకెనాల్‌లో తన అన్వేషణ ముగిసిందన్నారు. స్థానికంగా కొండ ప్రాంతాల్లో ఉన్న గిరిజనుల హక్కుల కోసం పోరాడతానని స్పష్టం చేశారు. దీనిపై స్థానిక సామాజిక కార్యకర్త ఒకరు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీని వల్ల అనేక చట్టపరమైన చిక్కులు ఎదుర్కొంటారని ఆయన అభిప్రాయపడ్డారు. షర్మిళ వివాహానికి అనుమతి ఇవ్వొద్దని ఆయన అభ్యర్థించినా.. స్థానిక సబ్ రిజిస్ట్రార్ ఆ వినతిని తిరస్కరించారు. ప్రత్యేక వివాహ చట్టం కింద జులై 12న ఇరోమ్ షర్మిల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పెళ్లికి దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి నుంచి 30 రోజుల గడువులోగా అభ్యంతరాలు తెలియజేయాలని స్థానిక గిరిజనులను ఆ అధికారి కోరారు. ఈ నేపథ్యంలో స్థానికులు పళని మలై పులియన్, పాలియర్ తదితరులు తమ ఆమోదపత్రాన్ని సబ్ రిజిస్ట్రార్‌కు అందజేశారు. ఇరోమ్ పెళ్లికి తాము మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు.

ఆబ్కారీ ఎస్సైల బదిలీలపై తొలగని సందిగ్ధత

ఈనాడు, హైదరాబాద్: ఆబ్కారీశాఖలో ఎస్సైల బదిలీలపై సందిగ్ధత నెలకొంది. నాలుగేళ్ల తర్వాత ఇటీవల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆ పైస్థాయి అధికారుల బదిలీలను పూర్తిచేసిన సంగతి తెలిసిందే. ఇదే క్రమంలో ఎస్సైలు, కానిస్టేబుళ్ల బదిలీలు కూడా చేపట్టాలని భావించారు. కానీ ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చకపోవడంతో సిబ్బందిలో ఆందోళన వ్యక్తమవుతోంది. అన్ని ప్రభుత్వశాఖల మాదిరిగానే ఆబ్కారీశాఖలోనూ ప్రభుత్వం బదిలీలను నిషేధించిన సంగతి తెలిసిందే. మియాపూర్ భూముల కుంభకోణం నేపథ్యంలో ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే శాఖల్లో బదిలీలు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్, ఆపై స్థాయి అధికారుల బదిలీలకు సంబంధించి జాబితా రూపొందించి ప్రభుత్వానికి పంపినప్పటికీ సాంకేతిక కారణాల వల్ల పక్కనపెట్టారు. ఈలోగా మత్తుమందుల వ్యవహారం తెరపైకి రావడంతో సిద్ధం చేసిన జాబితా ప్రకారం బదిలీలు పూర్తిచేశారు. వీటితో పాటు సీఐల కంటే కిందిస్థాయి అంటే ఎస్సై, కానిస్టేబుళ్ల బదిలీలు కూడా చేయాలని తలపెట్టారు. గత ఆరున్నరేళ్లగా ఆబ్కారీశాఖలో ఎస్సైల బదిలీలు జరగలేదు. సుదీర్ఘకాలం ఒకేచోట పనిచేయడం వల్ల అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దాంతో పాటు మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న వారు. . ఎంతకాలం అక్కడ పనిచేయాలో తెలియక విసిగిపోతున్నారు. ఈవిషయాన్ని అనేక మార్లు అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 400 మంది ఎస్సైలు, 4,500 మంది కానిస్టేబుళ్ల బదిలీలు చేయాలని తలపెట్టారు. కానీ ప్రస్తుతం ఈ ప్రతిపాదన అటకెక్కింది. ఇప్పుడు బదిలీలు జరగకపోతే రాబోయే రోజుల్లో అసలు అవకాశమే ఉండదని, వచ్చే ఏడాది నుంచి ఎన్నికల సందడి మొదలయ్యే అవకాశం ఉండటం వల్ల అవి పూర్తయ్యే వరకు ఎక్కడివారు అక్కడే కొనసాగాల్సి వస్తుందని, బదిలీల ప్రక్రియ పూర్తిచేయాలని సిబ్బంది కోరుతున్నారు.

బాంబు తయారీ వెనుక కుట్రకోణంపై దర్యాప్తు వివరాలు తెలపండి

రాజీవ్ హత్యకేసులో కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీని 1991లో హత్య చేయడానికి వినియోగించిన బాంబు తయారీ వెనుక కుట్ర కోణంపై దర్యాప్తు వివరాలను తెలియ చేయాల్సిందిగా సుప్రీంకోర్టు గురువారం కేంద్రాన్ని ఆదేశించింది. బాంబు తయారీవెనుక కుట్ర కోణంపై సాగుతున్న దర్యాప్తు సరిగా లేదంటూ దోషుల్లో ఒకరైన పెరారివలన్ ఆరోపించిన నేపథ్యంలో జస్టిస్. రంజన్ గొగాయ్ సారథ్యంలోని ధర్మాసనం ఈ మేరకు ఆదేశించింది. పెరారివలన్ తరఫున న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ వాదనలు వినిపించారు. రాజీవ్‌గాంధీని హత్యచేయడానికి థానూ ఉపయోగించిన బెల్ట్-బాంబు తయారీలో వాడిన బ్యాటరీలను పెరారివలన్ సరఫరా చేశారు. ఈ కేసులో పెరారివలన్‌కు పడిన మరణశిక్షను ఆ తర్వాత యావజ్జీవ కారాగారంగా మార్చారు.

వచ్చే నెలలో భారత్‌కు చేరనున్న అమెరికా ముడిచమురు

వాషింగ్టన్: అమెరికా నుంచి తొలిసారిగా రవాణా జరుగుతున్న ముడిచమురు వచ్చే నెలలో భారత్‌కు చేరనుంది. ఇంధన రంగంలో సంబంధాల్ని బలోపేతం చేసుకోవాలని జూన్ 26న జరిగిన సమావేశంలో భారత ప్రధాని నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయించిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. భారత చమురు దిగ్గజ సంస్థలు ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం 40 లక్షలకుపైగా బ్యారెళ్లకు ఆర్డర్లు చేశాయి. అమెరికాలో భారత రాయబారి నవతేజ్ సర్నా సంబంధిత పత్రాలను టెక్సాస్ గవర్నర్ గ్రెగ్ అబాట్‌కు అందజేసిన క్రమంలో అమెరికా నుంచి భారత్‌కు చమురు రవాణా ప్రారంభమైందంటూ వాషింగ్టన్‌లోని భారత దౌత్య కార్యాలయం ట్వీట్ చేసింది. ఇరు దేశాల సహకారంలో కొత్త అవకాశాలకు తెరలేచిందని వ్యాఖ్యానించింది. తొలి విడతగా 100 మిలియన్ డాలర్ల విలువైన 20 లక్షల బ్యారెళ్ల చమురు రవాణా జరుగనుంది. అమెరికా తీరం నుంచి ఈనెల 6 నుంచి 14 మధ్య బయల్దేరిన ముడిచమురు సెప్టెంబర్ చివరి వారంలో ఒడిశాలోని పారదీప్‌కు చేరనుంది. భారత స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్ చేసినప్పుడు తాజా పరిణామాన్ని స్వాగతించినట్లు అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి పేర్కొన్నారు. తమ దేశం విశ్వసనీయమైన, సుదీర్ఘ ఇంధన సరఫరాదారుగా కొనసాగుతుందని ట్రంప్ హామీ ఇచ్చారన్నారు. ఈ పరిణామంతో అమెరికా నుంచి చమురు కొంటున్న ఆసియా దేశాలు దక్షిణకొరియా, జపాన్, చైనాల సరసన భారత్ నిలిచింది. పెట్రోలియం ఎగుమతుల దేశాల సంస్థ ఉత్పత్తుల్ని తగ్గించడం, ధరలు పెంచడం, అత్యధిక సల్ఫర్ శాతం ఉండటం వంటి పరిణామాలతో భారత్ అమెరికా నుంచి చమురు కొనుగోలుకు సిద్ధమైంది. చమురు ఎగుమతులపై 40 ఏళ్లనాటి నిషేధాన్ని మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఎత్తివేసిన తర్వాత సుమారు రెండేళ్లకు భారత్‌కు రవాణా జరుగనుంది.

భాజపా నేత వివాహానికి అరుణాచల్‌ప్రదేశ్ సీఎం

- కేంద్ర సహాయ మంత్రులూ హాజరు

చౌటుప్పల్(గ్రామీణం, న్యూస్‌టుడే: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి చెందిన భాజపా నేత కడగంచి రమేష్ వివాహం గురువారం మహబూబ్‌నగర్ జిల్లా మాడుగులకు చెందిన విజయతో లక్కారం గ్రామంలోని ఎంఆర్‌ఆర్ గార్డెన్‌లో జరిగింది. వరుడు రమేష్ అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్ర భాజపా కార్యనిర్వాహక కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఈ వివాహ వేడుకకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పెమా ఖండూ, కేంద్ర హోం, రైల్వేశాఖ సహాయ మంత్రులు కిరణ్ రిజిజు, రాజేన్ గోహైన్, అరుణాచల్ ప్రదేశ్ ఉపముఖ్యమంత్రి చౌనామైన్, ఆ రాష్ట్ర మంత్రులు కుమార్ వీవీ, అలోసిబాంగ్, మాజీ ముఖ్యమంత్రి గెగాంగ్ అపాంగ్(కాంగ్రెస్), పలువురు ఎమ్మెల్యేలు, అరుణాచల్ భాజపా అధ్యక్షుడు తాఫీర్ గోవా, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్, పార్టీ ఈశాన్య రాష్ట్రాల కార్యనిర్వాహక కార్యదర్శి అజయ్ జమ్‌వాల్ తదితరులు పాల్గొన్నారు. రమేష్.. ఏబీవీపీ, యువమోర్చా, ఆరెస్సెస్‌లో చురుకైన పాత్ర పోషించడంతో అరుణాచల్‌ప్రదేశ్ కార్యనిర్వాహక కార్యదర్శిగా భాజపా నియమించింది.



వధూవరులతో అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిరణ్‌రిజిజు, భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ తదితరులు

చదువుల కోవెల.. సౌకర్యాల్లేక విలవిల!



పేరుకు మాత్రమే అది సక్సెస్ పాఠశాల.. విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదుల ఏర్పాటును మాత్రం అధికారులు విస్మరించారు. దీంతో ఎండకుఎండుతూ.. వానకు తడుస్తూ ప్రస్తుతం వారు పాఠాలు నేర్చుకుంటున్నారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ దుస్థితి నెలకొంది. ప్రస్తుతమిక్కడ 470 మంది విద్యార్థినులు చదువుతున్నారు. తెలుగు మాధ్యమంలో ఎనిమిది తరగతులు, ఇంగ్లిష్ మీడియంలో అయిదు చొప్పున తరగతులను నిర్వహిస్తున్నారు. మొత్తం 7 గదులు మాత్రమే ఉండటంతో.. మిగిలిన తరగతులవారిని పాఠశాల ఆవరణలోనే కూర్చొబెట్టి ఇలా బోధిస్తున్నారు. మరోవైపు, అందుబాటులో ఉన్న తరగతి గదులూ ఇరుకుగా ఉండటంతో విద్యార్థినులు సర్దుకుపోతున్నారు. మరికొందరికి సామగ్రి భద్రపరిచే గదిలోనే పాఠాలు బోధిస్తున్నారు. రెండేళ్ల క్రితమే ఈ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి మంత్రి లక్ష్మారెడ్డి శిలాఫలకం వేసినా.. ఇప్పటివరకు ఒక్క అడుగు ముందుకుపడలేదు.

—ఈనాడు, మహబూబ్‌నగర్

కొనసాగుతున్న వరద ఉద్ధృతి

పట్నా, గువహటి, కోల్‌కతా: బీహార్, అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో వరద ఉద్ధృతి కొనసాగుతోంది. వరదల తాకిడికి గురువారం మరో 74 మంది మృతి చెందారు. బిహార్‌లో తాజాగా 47 మంది మరణించడంతో వరద మృతుల సంఖ్య 119కి చేరింది. పట్టాలపై నీరు ప్రవహిస్తుండటంతో 39 రైళ్లను రద్దు చేసినట్లు తూర్పు మధ్య రైల్వే ప్రకటించింది. అటు పశ్చిమ బెంగాల్లో ఆరు ఉత్తర జిల్లాల్లోని వరదల కారణంగా మరో 17 మంది ప్రాణాలు కోల్పోయారు.

నవంబరు 13న విద్యార్థుల అభ్యాస ఫలితాల అంచనా అధ్యయనం

ప్రకటించిన మానవ వనరుల శాఖ

దిల్లీ: చిన్నారులు ఏఏ తరగతుల్లో ఏం నేర్చుకోగలిగారు...వారి అభ్యాస ఫలితాలపై కేంద్రం భారీ ఎత్తున అధ్యయనానికి మరోసారి సన్నద్ధమైంది. మూడు, అయిదు, ఎనిమిది తరగతుల విద్యార్థులకు నవంబరు 13న ఈ జాతీయ అంచనా అధ్యయనం(ఎన్ఏఎస్) నిర్వహించనున్నట్లు కేంద్ర మానవ వనరులు అభివృద్ధి మంత్రిత్వశాఖ ప్రకటించినట్లు అధికారులు బుధవారం నాడిక్కడ వెల్లడించారు. కేంద్రమానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్‌తో రాష్ట్రాల విద్యాశాఖ కార్యదర్శులు, సంచాలకులు, ఎస్‌సీఈఆర్‌టీ(రాష్ట్ర విద్యా, పరిశోధనా, శిక్షణ మండలి)ప్రతినిధులు, సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు డైరక్టర్ల మధ్య జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు ప్రకటన చేసినట్లు తెలిపారు. కాగా, 2017-18 సంవత్సరంలో దాదాపు 30 లక్షల విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలు, ఫలితాలను అంచనావేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. వివిధ తరగతుల్లో పిల్లలు సరిగ్గా ఏం నేర్చుకోవాలనే అంశంపై అధ్యాపకులు ఒక అవగాహన పెంపొందించుకునేందుకు ఈ సర్వే ఓ సాధనంగా ఉపకరిస్తుంది. విద్యార్థులకు సంబంధించినంతవరకూ ప్రపంచంలోనే ఇది అత్యంత విస్తృతస్థాయి సర్వే కానుంది. ఇప్పటిదాకా కూడా పలు దఫాలుగా నిర్వహించిన సర్వేలో 4.45 లక్షల మంది విద్యార్థుల అభ్యాస ఫలితాలను నమోదు చేసుకున్నారు.

హైకోర్టును ఆశ్రయించిన గ్రానైట్ సంస్థలు

- 28% జీఎస్‌టీ విధింపుపై కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు

ఈనాడు, హైదరాబాద్: గ్రానైట్ సంస్థలపై 28 శాతం వస్తుసేవల పన్ను (జీఎస్‌టీ) విధించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యంలో హైకోర్టు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరిస్తూ.. ప్రతివాదులు ప్రమాణపత్రాలు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఆలోగా పెంచిన పన్ను వసూలుపై తొందరపాటు చర్యలువద్దని పిటిషనర్ల సంస్థలకు స్పష్టం చేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ టి.రజనితో కూడిన ధర్మాసనం గురువారం ఈమేరకు ఆదేశాలు జారీచేసింది. పన్ను పెంపుపై వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన మహేశ్వరి స్టోన్ సప్లయింగ్ కంపెనీతో పాటు మరో రెండు సంస్థలు హైకోర్టు ఆశ్రయించాయి. ఆ సంస్థల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లు నిర్వహిస్తున్న లైమ్‌స్టోన్ వ్యాపారానికి గతంలో 5శాతం పన్ను మాత్రమే విధించే వారని, ఎక్సైజ్, సర్వీసు పన్నులు వర్తించేవి కాదన్నారు. తాజాగా అమల్లోకి వచ్చిన జీఎస్‌టీ వల్ల 28శాతం పన్నుపడుతోందన్నారు. ఈ పన్ను విధింపును చట్ట విరుద్ధమైనదిగా ప్రకటించాలని కోరారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది.

ఆ సొసైటీకి భూముల కేటాయింపుపై వివరాలివ్వండి

- తెలంగాణ సర్కారుకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: ఏపీ హైకోర్టు ఎంప్లాయీస్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీకి భూములు కేటాయించడాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన ధర్మాసనం దీనిపై విచారణ జరిపి.. తెలంగాణసర్కారుతో పాటు ప్రతివాదులుగా ఉన్న వివిధకోపరేటివ్‌హౌసింగ్ సొసైటీలకు నోటీసులు జారీచేసింది. వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించింది. ప్రమాణపత్రాలు దాఖలు చేయాలని స్పష్టంచేస్తూ సెప్టెంబర్ 5కు వాయిదా వేసింది. ఏపీ హైకోర్టు ఎంప్లాయీస్ కోపరేటివ్ సొసైటీకి 2004 జనవరిలో రంగారెడ్డిజిల్లా శేరిలింగంపల్లి మండలం కంచగచ్చిబౌలిలో 39ఎకరాలభూమిని కేటాయించడాన్ని సవాలుచేస్తూ హైదరాబాద్‌కు చెందిన ధన్‌గోపాల్‌రావు ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. 2003 నాటికే సొసైటీ ఉనికిలో లేదన్నారు. విచారణ జరిపిన ధర్మాసనం.. కేటాయింపు ఉత్తర్వులిచ్చి ఇప్పటికే 13ఏళ్లు గడిచినందున ఈ వ్యవహారంపై ప్రభుత్వ వైఖరి తెలుసుకోవాల్సి ఉందని అభిప్రాయపడింది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. L/RN/KAR/48/2015-17 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00